శ్రీనివాస ప్రబంధము

★

రచన :

సరస్వతీపుత్ర

డా॥ పుట్టపర్తి నారాయణాచార్యులు

SRINIVASA PRABANDHAMU - A Classical Poetry by Dr. Puttaparti Narayanacharyulu, Mochampet, Cuddapah.

ద్వితీయ ముద్రణ

జూన్ - 1991

మూల్యము రూ. 50-00

ప్రతులకు :

శ్రీమతి పుట్టపర్తి రాజ్యలక్ష్మి

6/59, గాడిచర్ల రామారావువీధి,

కడప - 516 001

ముద్రణ :

శ్రీరామా ప్రింటర్స్,

ట్రంకురోడ్డు, కడప - 516 001

ము న్నుడి

ఈనాటికి ''శ్రీనివాస ప్రబంధం'' మొదటి భాగం పూర్తయినది. ఇంకా ''రెండవ భాగం'' ప్రింటు కావలసి వుంది. ఈ నడుమ ప్రభుత్వము గ్రంథ ప్రచురణలకు సహాయము నిలిపివేసిందని విన్నాను. మరి ''ఉత్తరార్ధం'' యెప్పుడు గడ్డకు వస్తుందో చెప్పలేను. అన్నీ ఆ పరమేశ్వరుని దివ్య చిత్తానికి వచ్చినపుడే - వచ్చినట్లే జరుగుతాయి; ఈ ''ప్రబంధం'' రచన ప్రారంభించి సుమారు ముప్పై ఏండ్లకు పైగా అయింది. ఏ గ్రంథంగానీ మొదలుపెట్టి దీక్షగా ముగించే అలవాటు నాకులేదు; కొన్ని సంవత్సరాలు కూడా ఆవైపు చూడకుండా వుండడం కద్దు. ఈ ఒక్క విషయంలోనే గాదు, ప్రతి పనిలోనూ నా ప్రవృత్తి యింతే. విపరీతమైన ఉపేక్షాభావం. తీరా నెత్తిపైకి వచ్చినప్పుడే కార్యానికి పూను కోవడం. ఈ ఉపేక్షాభావంతో యెన్ని విషయాల్లోనో నష్టపడినాను. కానీ యీ జీవి ప్రవృత్తి - యింతే. 1939 నుండీ నేను రేడియోలో యిచ్చిన రచనలు - కోకొల్లలు. అయినా నాదగ్గర ఒక్కటీ లేదు. దాని ప్రసక్తి తీరుతూనే-యెక్కడ పారేస్తానోకూడా తెలీదు. పైగా యేవేవో భావాలు. నా జీవితంలో యెంతో మందిని - హిమవచ్ఛిఖరాల వంటి వారిని చూచినాను. వారు పేరూ - ప్రఖ్యాతీ లేకుండాపోయినారు. ''మనదేముందిలే'' అనే భావం నన్నెప్పుడూ పీడిస్తూ వుంటుంది. పైగా - 'లోన లొటారం'గా కీర్తిని అనేక మార్గాలతో కొనుక్కునే వాళ్లను చూచి అసహ్యం. ''వీళ్లకు యేమి రాస్తే యేముందిలే'' - అనే భావం; ఇంకా యెన్నో ...

కొంతకాలం యీ ''శ్రీనివాస ప్రబంధం'' తిరుపతి దేవస్థానంవారి 'సప్త గిరి'లో ప్రచురితమవుతూ వచ్చింది. ఎడిటర్ కె. సుబ్బారావుగారు - నా సోమారి తనంపట్ల యెంతో నిగ్రహం ప్రదర్శిస్తూ 'సప్తగిరి'లో వరుసగా వేసుకునేవారు. కొన్ని మాసాలు సాగింది. ఇంతలో నా దృష్టి యింగ్లీషు పైకి వాలింది. ''హీరో'' అనే ట్రాజిడీ వ్రాసుకున్నాను. సరే - దాన్ని గూర్చి పొగడ్తలు - తెగడ్తలు. ఆ నాటకం ''భవాన్స్ జర్నల్''లో క్రమంగా ప్రచురిస్తామని చెప్పినారు. వాళ్లె ప్పుడు వేసుకుంటారో దేవునికే తెలియాలి. ''సప్తగిరి''లో నా రచన వచ్చే టప్పుడు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ - యెంతో ఓర్పుతో దానిని సరిచూచి

యేవైనా ఛందోదోషాలుంటే సవరించేవాడు. ఆయన మంచి పండితుడు. నాకు బాల్య మిత్రుడు. కానీ ఆ సవరింపులు గూడా యెక్కడో పోయినాయి సమయానికి. నేను మొదట వ్రాసినట్లే ''ప్రింటు'' చేయడం జరిగింది. నాకు మొదటినుంచి ఛందస్సుపైన దృష్టితక్కువ. ధారావేగానికీ రసానికీ - అడ్డువచ్చే చోట - ''ఛందస్సు పోతే - పోనీలెమ్మ' నుకునే భావం నాది. అందులో - యీ 'అఖండ యతి' - పెద్ద చిక్కు. మడుగు కట్టుకొన్న పండితులు దానిని సహింపరు. వారికి 'అప్పకవీయం'-వేదం. భారత కవులే అఖండయతి వాడినారన్నా - వాళ్లు ఒప్పుకోరు. యేవో పాఠభేదాలు సవరించి అవస్థపడుతూ వుంటారు. వాళ్లతో కలహమెందుకు లెమ్మని చాలాచోట్ల 'అఖండ యతులు' సవరించినాను. కొన్నిచోట్ల ''వుంటే వుండనీ'' పొమ్మనుకున్నాను.

ఈ గ్రంథం మొదటిభాగం పూర్తికావడానికి నానా యాతనా పడవలసి వచ్చింది. రచన సాగుతూ వున్నపుడు కుం॥ సౌ॥ నా భార్య పోయింది. ఆమె పోవడం నా జీవితంలో పెద్ద దెబ్బ. రచనకు మనసు అభిముఖంగా లేదు. అయినా వ్రాత సాగవలె. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో కూడా ఒక యోగివలె మనస్సును కుదించుకుని వ్రాయవలసి వచ్చింది. దేవులపల్లి రామానుజరావుగారు యీ గ్రంథాన్ని గడ్డకు తేవడంలో యెన్నో రీతుల ఓర్పును ప్రదర్శిస్తూ వచ్చినారు. ఆయన నా నిరంతర శ్రేయోభిలాషి. ఆయన ఋణాన్ని తీర్చుకోలేను. సాహిత్య అకాడమీలో పనిచేసే 'పాండురంగయ్య' - ప్రెస్సుపని అంతా చూచుకునేవాడు. ఆతని సహకారం, మంచి మనస్సూ - యెన్నటికిన్నీ మరువరానిది. పూర్వజన్మ ఋణానుబంధాలు యింత ఘనిష్ఠంగా వుంటాయేమో ననిపిస్తుంది. ఆ చిరంజీవికి శ్రీనివాసుడు ఆయురారోగ్యములను సంపూర్తిగా యిచ్చుగాక ! ఇంతకంటే యింక నేనేమివ్వగలను ?

ఈ గ్రంథానికి ఆంధ్రప్రదేశ ప్రభుత్వము ద్వార సహాయం చేయించిన శ్రీ భాట్టం శ్రీరామమూర్తి గార్కి నా నమస్కారములు.

ఈ గ్రంథ ముద్రణకు కావలసిన కాగితము అందజేసిన ప్రభుత్వానికి అనేక ధన్యవాదాలు.

ఇంక ''రెండవ భాగం'' శ్రీనివాసుడిచ్చించినపుడు గడ్డకు వస్తుంది.

కడప
13-3-84

పుట్టపర్తి నారాయణాచార్యులు

శ్రీనివాస ప్రబంధము

శా. శ్రీవైయాత్య, మనంపర ద్యుతిలసచ్ఛ్రీవత్స, ముక్త్యాస్తుభ
ప్రావారాయిత కాంచనేత్రము, దయాపాంగమ్ము చక్షుర్ద్వయం
బావేశించునుగాత నా హృదయమం, దాకాల, ప్రత్యుత్సవ
ప్రావీణ్యంబగు వేంకటాచల పరబ్రహ్మంబ నాతంకమై. 1

శా. భూవైకుంఠము, నీదు సద్మము, ప్రభూ!, భూజానియొక్కండు, దా
నే వాపోయెను వేంకటక్షితిభృతి 'న్నేదేను మావేనె'* యం
చావిశ్వాతిగ భక్తిలక్షణముప్రాపై, జీవితంబెల్ల, త్వ
త్సేవాగంధిక మౌనుగాత! మనసక్షీరాబ్ధి పర్యంకికా! 2

సీ. ఏదేవి చిఱునవ్వు లింద్రాదిసుర కిరీ
టమ్ముల రత్నకూటముల మెఱుకు
లేదేవి విహరించు నిందు మందార స
ధ్రీచీన దుగ్ధాబ్ధి వీచులందు
నే సతీభ్రూలతా హేలాళచాలనం
బులు సర్వసృష్టి కో ల్పలయు కొసయు
కాపురం బేరామ కమలాక్ష విపుల వ
క్షస్థలీ నవ కుడుంగమ్మునందు
ఆ మహాలక్ష్మి విష్ణుగాఢానురాగ
భవ్యలాక్షారసాంక సంపన్నచరణ,
ఆయురారోగ్య భాగ్యంబు లవఘళించి
జననివలె నన్వహము మమ్ము మనుచు గాత! 3

---

* "ఏదేను మావేనే:" (నాలాయిర ప్రబంధము)
"స్వామీ ! నీకొండపై దేనినైనను బుట్టింపుము" ని కులశేఖరుడు వాపోయెను. ఆయన రాజు.

శా. ఆ చక్రాయుధమెల్ల నిర్జరకుల వ్యాహార మెవ్వానిధీ
ప్రాచుర్యంబు, హరిప్రియాచరణ సంచారప్రపూతంబు లే
వాచాధ్యక్షు ఫణాసహస్రము, జగద్వంద్యుండనంతుండు, ని
శ్చ్యోత త్క్షౌద్రములైన సూక్తులను మాయుల్లంబు మేల్కొల్పుతన్. 4

శా. ఆగారుత్మతి బ్రహ్మవిద్య, యసురై, యశ్రాంతమున్ బ్రోచుగా
కాగః పంకము, ద్రోచి-యద్గరుదభివ్యాప్త స్ఫుటధ్వాన ఝుం
పాగండూషితవిక్రముల్, విమతు లబ్రహ్మణ్య నిర్ఘోషధా
రాగోపాయిత జీవనుల్, సురగణ క్రవ్యాత్సమీకంబులన్. 5

ఉ. సూత్రవతీ స్తన స్తబక శోభి మృగీమదగంధ ఘుంఘుమ
ఘ్రాత్రము, సర్వదేవ వనితా జనతాధృతి నోసరింప, సా
ర్వత్రిక శౌర్య దృష్టి, మురవైరి పదాబ్జ మధువ్రతంబుగా ।
ఛాత్రము సేయు, సైన్యపతి, భావ సుధా ధుని నోలలార్చెదన్. 6

సీ. ఆమూలతః కంపితాహార్య వింధ్యాద్రి
పివ్యూథ శృంగౌఘ వినిమయములు
కల్లోలమాలికా హల్లీసకాక్రాంత
గగనవీథీ పతద్గ్రహగణములు,
పాతాళ, విధి సౌధ పర్యంత, దశ దిశా
జఠర నిర్భర చక్ర చంక్రమములు
ధృతిహీన రక్షఃపతి స్త్రైణ గర్భజీ
వోత్క్రాంతి కృత రోదనోద్భ్రమములు

గీ. గాచు గావుత! మమ్ము దుఃఖముల యందు
విమతమతి మండలమ్ములు వెగడు పఱచి
మధుమధన దక్షిణావర్త మహిత శంఖ
దోహలోచ్చైఃక్వణనాద కోలాహలములు. 7

ఉ. మేదుర కాంతిసంచయ సమీకృత కోటితటిల్లతమ్ము, హిం
సాదర యక్ష రాక్షస భయానక హుంకృతి, విశ్వసంహతి

క్షోదకశక్తి, కేశవ భుజోపరి మేరుధరాధరమ్ము, కౌ
మోదకి నెంచెదన్, రపసముత్కట కంకణ కింకిణీకమున్. 8

శా. ఆవిర్మండల యద్ధనుర్వదన నిర్యత్తీవ్ర నారాచ చిం
తావిక్షుబ్ధ మహాసుర ప్రతతి నిద్రానిత్య నిస్స్వంబు, శి
క్షావైయాత్యము తోడి భక్తజన రక్షా దక్షమైనట్టి శా
ర్ఙ్గావిష్కారము, శార్ఙ్గమస్మదఘ కృత్యాఽకృత్యముల్ మాల్చుతన్. 9

శా. జ్వాలాజాల జటాల, మాసురవధూ ఖాస్వత్కపోలస్థలీ
హేలాకుంకుమ పత్రభంగ రచనా హేవాకవాల్లభ్య హృ
త్క్ష్వేళాభీలము, మన్మనోంతరమునన్ గ్రీడించుగా కెప్డు, మే
ధాలంకార షడక్షరాత్మక మహాచక్రాత్మకాంతి సాకల్యమై. 10

మ. చరితార్థమ్ము, లుదీత భావము, లుదంచద్భక్తి మాధ్వీక సుం
దరముల్, ద్రావిడ వేదముల్, శ్రుతిసతీ ధమ్మిల్ల శోభావిక
స్వరతాపాది మధుద్విదంఘ్రులను నిచ్చన్బూన్చు ధన్యాత్ములన్
పరులన్ గొల్చెద, దివ్యసూరుల తపః ప్రాగ్భార రోచిష్ణులన్. 11

మ. నరుఁడెవ్వం డొకమాఱు జీవితమున "న్నారాయణా" యంచు ని
ర్భరచక్షుర్జలమై, ఝుటిత్యుదిత రోమాంచమ్ముగాఁ బల్కు, మ
చ్చిరమేత త్పదసీమ కంకితము - దుశ్శ్రీగర్వ దౌష్కుల్య శ
ర్కరిల స్వాంతుల నోలగింతునటె! యీషద్గ్రాస సంసిద్ధికిన్. 12

శా. స్తుత్యంబైన యుదార రామకథ, వాక్శోభాపతీమంజుల
ప్రత్యగ్ర ప్రథమావతారముగ - నేవాఁడర్థిఁ గల్పించె, న
మ్మత్యగ్రేసరు, వామలూరు తనయున్ మాకంద మాధ్వీక సా
తత్యోజ్జృంభిత మాధురీ వచన సంతత్యబ్ధిఁ గీర్తించెదన్. 13

మ. తన కావించిన వాఙ్మయమ్ము వలెనే దా జీవితంబందు నె
వ్వని యభ్యూహకుఁ జిక్కనట్టి మునిరాట్పుట్టాభిషిక్తున్, జగ

జ్జనతాపంమ్యుఁ బరాశరాత్మజుని శశ్వద్భక్తి సేవింతు, ని
ర్జనకైవర్తసుతాకృతప్రణయ పూజాప్రీత దీవ్యజ్జనిన్. 14

చ. ఒకఁడు రసాఽనుకూలనిభనోహసనాథుఁడు, వేరొకండు, భా
వుకరసమూర్తి, యిర్వురవి పోకడలుజ్జ్వలవాఙ్నితంబినీ
ముకురము, లట్టి యిర్వురకుఁ బోలిక వెట్టుట రిక్త, భక్తి పెం
పు కలిమి, కాళిదాస భవభూతులకు న్దలవంచి మ్రొక్కెదన్. 15

శా. ఏ వారిన్ వినుతింతు, సంస్కృతమునందెవ్వారికవ్వారు, గీ
ర్దేవీతత్త్వ మనీషు, లార్ద్రహృదయుల్, దివ్యత్తపోమూర్తు లా
యావైశిష్ట్యములాకళించికొని, భక్తాశీర్బలంబూతఁగాఁ
గావింతున్ కవనంబు, సజ్జనశిరః కల్హార దామంబుగన్. 16

కం. పదములు దోచిన, భావా
స్పదముగఁ బలికినను, నన్నభట్టుల వాణీ
హృదయంబు సంయమన మది,
గుదురదు, అద్దానికేటికోళ్ళర్పింతున్. 17

కం. అలఁతి యలఁతి చనియలఁ గా
హళ సంధించిన వితంబుగా - వెఱవరుల
గ్గలిక మదిమెచ్చు, పలుకుల
వలపించెడు సోమయాజి, బ్రణుతింతు మదిన్. 18

ఉ. ఇంబుగ సత్ప్రథాఽనుగ, మహీన పదావృతి యొక్క పక్ష, ము
ల్లంబుగరంచు మేల్మిచవి లాగుల యర్థము లొక్క రెక్క, భా
వాంబర వీథి విశ్రుత విహారము లుల్లసనంబు మేని, కా
చుంబిత దిగ్వధూముఖయశోనిధి నెంచెద నెర్రనక్కవిన్. 19

శా. పంచాస్త్రేషు పతాక పత్రకతయు, దృప్యత్సృష్ట్యతారుణ్యభృ
త్ప్రంచారామ సితందినీపచతకీ పర్యాప్తకాంతిస్ఫుల్
పంచారించు మహాంధ్రదేశ కవితా ప్రాగల్భ్యము, ల్విఁడెసా
రించున్గావుత మన్మనంబున, రస శ్రీనాథ వాగ్వైఖరుల్. 20

మ. ప్రతి పద్యంబున రాధికా కమన భావస్విన్న విస్మేరముల్
ప్రతి శబ్దంబున ఫుల్లయామున కదంబ వ్రాత సౌరభ్యముల్
వితరచ్ఛర్మము, పోతరాజు కవితావేశంబు దానెట్టిదో !
యతిదీక్ష స్మరవైరికంబగు తపస్యాసిద్ధి యేపాటిదో ! 21

చం. చెలువగు వేంకటేశ్వరుని చిర్నగవుల్ పదబంధమయ్యెనో !
యలఘు పురాణ సూరుల హృదబ్జమధూద్గతి పొర్లిపాటెనో !
ఇలఁ దనరూప రూపయి, వహించిన తీవియ తీవియై; రసో
జ్జ్వలపథమేగు నన్నమయ-భావసరిత్తున కంజలించెదన్. 22

గీ॥ ప్రథిత పంపాసరో గంధవహుని యట్లె
ప్రథిత పంపావసత్కవీశ్వరుల పలుకు,
పూర్వపుణ్యంబు వొంపిరి వోయినపుడె
కూడు—రేనాటినుడి—మెలంకువల పొలుపు. 23

సీ. ఒక కృష్ణరాయఁడా ! యొక రామకృష్ణుఁడా !
యొక్క పెద్దన్నయా ! యుక్కివుండు
రామభూషణ వచోరారజ్యమాన ద్రా
క్షారసంబులకెందుఁ గలదె నవతు !
ముక్కు తిమ్మన ముగ్ధమోహనంబగు కైత
పృష్టిచంద్రమడు మ్రోయించు మురళి
హరశిరశ్చంద్ర రేఖాఽమృతమ్ములజాలు
నిలచెనో ! ధూర్జటి పలుకులందు !

గీ. నతఁడు సార్వపథీన ప్రజ్ఞాఽభిరాముఁ
డతఁడు — నాచన సోమన్న — యందరంద
రే ! తదూర్జిత రమ్యవాగ్గీతులెంచి
యీ మహా మహో మూర్తుల కంజలింతు ! 24

చ. అధిరతిఁ గృష్ణరాయఁడు పదాఽపనతుండయి పట్టి యగ్నిస
న్నిభమగు గోత్రమందుజని, నిండిన పండలు తండ్రి తాత, లా

ప్రభువులదీవెనల్ సనిచి, పట్టిన దైవము శ్రీనివాసుఁడ
విభు పదసారసంబులు గవేషణ సేయుదు వాఙ్మయంబునన్. 25

సీ॥ నా తల్లి భక్తిసామ్రాజ్య జీవిత, సంస్కృ
తాంధ్రభాషా వచనాభిరామ;
నా తండ్రి రసజగన్నాథుండు, నా దృష్టి
నఖిలేశ్వరునకు రూపాంతరమ్ము;
మద్భార్య-వాల్మీకి మాకంద మాధుర్య
రచనా విశేష విశ్రాంత హృదయ;
వైష్ణవాగమ సమభ్యాస సౌగంధ్య ని
ష్ఠాధృష్ణు లుభయవంశములవారు;

గీ. వివిధ వాఙ్మయ చర్వణా వితతకీర్తి,
పరమవైష్ణవ పాదసేవకుఁడ నేను,
శ్రీనివాసప్రబంధ సంసృష్టి సేతు
చారు ఫణితి నారాయణాచార్య సుకవి. 26

కం. చదివినదో! శ్రీపద పురి
చదివించిన గురులు - శాస్త్ర సంగర శూరుల్
మది నిల్పి కొందు, నేత
త్పదములు వైదగ్ధ్యనిత్య పరిమళితంబుల్. 27

ఉ॥ అల్పమునేర్చి, వాఙ్మయ మహాంబుధిఁ గ్రోలినయట్లు, క్రంతలన్
జల్పము లాడుచున్, ఖలుల సంస్తుతి గూడిన వైభవంబులై,
సల్పు దురాగతంబులు, హసంబున గప్పుచునుండు, వంచనా
శిల్పులతోడిదేమి ? యదసీయ కువృత్తు లుపేక్షణీయముల్. 28

మ. జని సాహస్ర కృతానువర్తన రజస్సంబాధ కర్మాఽనుగు
ణ్య నికామ ప్రహితేంద్రియుండనయిన, న్నాస్వాంత వష్టాక్షరీ
మననోదార సుఖానుభూతినితరాం మత్తమ్ము, శేషాద్రి ని
త్య నివాసుండగు శ్రీనివాసుఁ డెఱుఁగున్ తథ్యత్వ మిథ్యాత్వముల్. 29

చ. ఎఱిఁగితి నెంతయో, ధిషణ కెవ్వరునుబ్బర వోవ; దేశముల్
దిరిగితి, మల్లికాసుమ సదృక్షయశంబున, నింతయైన న
న్నెఱుఁగనె లేదు ! నే నెవఁడ ? నీభువికేటికి రాక; యంచు న
న్నెఱుఁగుటకై రచించెద నహీన వచోగతి నాథకావ్యమున్. 30

వ. అని సావధానాంతరంగుండనై. 31

ఉ. గోపసుతా మనోమథన కోమల చారు దృగంత చిత్రస
ల్లాపికి, మోహనాధర విలాస మృదుస్మిత దేవతాంగనా
తాపికి, నిత్యభక్త జనతాఘనతాపనివారి మోక్షసం
ప్రాపికి, యోగిరాణ్మనన పంకజభాసిత భవ్యరూపికిన్. 32

ఉ. స్వామికి, నైక జన్మకృత పాపఫలాఽపహ శాంతి దాంతి ము
ద్భూమికి, శాస్త్రవాఙ్నిచయదూన ప్రపత్తి శరణ్య దీనహృ
ద్ధామికి, దైత్యదానవనికార నివారణ బాహు మండల
స్థేమికి, రాధికాస్తన సుశీతల చందన లేప కామికిన్. 33

ఉ. శీలికి, దివ్యగంధతులసీదళ శోభిత వైజయంతికా
మాలికి, బాహుదండయుగమధ్యలసన్మణి కాంతి మంజరీ
పాళికి, దోర్బలప్రథిత బాణమహాసుర దోస్సహస్రని
ర్మూలికి, రావణాసుర తమోమయలోక మరీచిమాలికిన్. 34

ఉ. హారికి, దివ్యసూరినిగమాఽతిగ రోచక వాగ్ఝరీసుధా
హారికి, నందభూవనవిహారికి, బర్హిణ బర్హ సుందరా
కారికి, దూర కర్షిత వికారికి, మంజుకపర్దభృన్మనో
హారికి, కంసదానవమహాగజ మానమదాపహారికిన్. 35

కం. జగదండతుండునకు, భ
క్త్యగ శిఖర స్థితమునీశ్వరానందునకున్
నిగమాంతదేశిక వచో
నిగమ సమున్నీత మహిమనిర్వేలునకున్. 36

వ. నా విన్నవింపఁ బూను మహా ప్రబంధంబునకుఁ గథాక్రమంబెట్టి దనిన — 37

సీ. కొలువుండె నొకనాఁడు సలిసగర్భుఁడు వేద
చర్చా సముత్సాహశాలి యగుచు ;
బహుజటాభార ధూర్వహముఖుల్ భృగ్వాదు
లవిచలనేత్ర పద్మాఽభిరాము
లంతలోనొక తలం పత్తమిల్లిన నల్వ
శ్రీకర నేమి సృజించి డొల్చె
శతమాఘవత ధనుర్జ్వలిత కాంతుల నేమి
గమియించె సౌర మార్గములు వట్టి

గీ. నిమ్నగం బౌచు వచ్చునన్నేమి సిద్ధ
కామినీ పద జతు రసాక్రాంత సరణు
లందు, ప్రత్యూషభాసవీయమ్ము లైన
తరుణ కిరణ తాటంకితాధ్వమ్ములందు. 38

మ. పయనించెన్ రథనేమిగోత్రభిదురుప్రాసాద రత్నప్రభా
స్మయహారిద్యుతి మండలీ కవచిత స్ఫారాంగమై - విస్మయో
దయవిస్తారిత నేత్ర తామరస గంధర్వాప్సరః కామినీ
చయసాకూత కటాక్ష వీక్షణ విధాశ్యామీకృతప్రాంతమై. 39

సీ. పచ్చిన యానేమి పరసరిత్తులు దాటి
రమణీయ కమలాకరములు దాటి
కాననంబులు దాటి - గగన లక్ష్మి పత్ర
పాత్యంబులగు ఘనాఽఽ వళులు దాటి
యొక యరణ్యానిలో సుఖుకుచుఁ దత్రత్య
ములగు నిమ్నోన్నతంబులకు సంధి
బంధమ్ము వెడలిన - వనజాక్షు భక్తి బం
ధమ్ముచే విరియు కామమ్ముపోలె

గీ. శీర్ణమై పోవుచో - సరసిజభవుఁడు
నేమి విరిసిన కతన - నిన్నెలవు నైమి
శంబనుచుఁ జేసె నప్పుడా శాసనంబు
మనములుప్పొంగఁగా 'తథాస్తు' నిరి మునులు. 40

చ. గతమద మత్సరాదిక వికారులు, ధీరులు - భక్తియోగశా
శ్వతసుఖసాధ లంచిత విచారులు, సంయములెల్ల, నైమిశ
స్థితులయి-వైష్ణవాఽఽగమ విశిష్ట గుణంబులఁ జర్చ సేతు రా
వ్రతతులు, వృక్ష సంతతులు-వారి రసోక్తులఁ బల్లవింపఁగన్. 41

వ॥ మఱియును, శ్రీ సతీ హృదయానురాగంబునుం బోలె సమాశ్రిత మాధవంబై, శారదా నిటలంబు పోల్కిఁ గర్పూర తిలకాంచితంబై, పార్వతీ దేవి వడువున స్థాణు సంగతంబై, మధువైరి రూపంబు డంబున తమాల నీలంబై, బ్రహ్మ విధంబున శారదాశ్రితంబై, శంభు దేహంబునుం బోలె పన్నగాశ్రయంబై, వైకుంఠ నగరంబు వలె న్యగ్రోధ మండితంబై, కైలాసంబునుంబోలె ప్రనృత్త నీలకంఠంబై, భాగవత మహాపురాణంబు కైవడి శుక మధురభాషాపూతనానిచితంబై, రామకథసొంపున నిక్ష్వాకు వంశసంయుతంబై, భారతేతిహాసంబునుం బోలె గాంగేయార్జున ముకుంద సుందరంబై, స్వర్గలోకంబు పోల్కి దేవవల్లభేంద్రాణీ సహితంబై, శ్రీవాసు వక్షస్థలంబు చెలువున చందనాఽలంకృతంబై, సంపన్న గృహంబు భాతి కనకాచితంబై, యజ్ఞ వాటంబునుంబోలె పావకాఽఽశ్రితంబై, కదన రంగంబు పోలిమి బహుశిలీముఖ సంచారంబై, విలాసినీ వక్షస్థలంబు తెఱంగున గోస్తనాఽభిరామంబై, పురుషోత్తము సేవా భాగ్యంబు చందంబున నమృతఫలదంబై యొప్పు నైమిశారణ్యంబున శ్రీ విష్ణు క్షేత్రంబునందు మహామునులు - సకల సుపర్వాంగనమండలీ కోటీ రమణి రింఛోళికా నీరాజిత పదుండును నభయప్రదుండును మర్దిత రాక్షసమదుండును సుజన హృదయైక సదుండును నిర్జిత భుజగ

దుండును ధృతగదుండును నగు హరిం జేరుకొనుటకు నే క్రతువుననేని యజమానుల ఋత్విజులై వ్యవహరింతు రట్టి బహుకర్తృకంబును బహు ప్రాణితృప్తి జనకంబునగు సత్ర సంజ్ఞికంబైన యాగంబొనర్చుచుండి సకల వ్యాఖ్యాన వాసనా వశీకృత హృదయుండగు సూతునింగని యిట్లనిరి. 42

మ. పరమార్థ ప్రవణోపగీత మురజిత్ప్రఖ్యమ్ము తేజమ్ము, దు
స్తర సంసార పరాహతాత్ములకుఁ జైతన్యంబు గల్గింప, ని
ర్ధర పై డిగ్గె పరాశర ప్రథిత సంతానంబుగా, నీకు, త
త్పరిచర్యా ఫల మీ మహాధిషణ, సూతా! పూత ధర్మవ్రతా! 43

శా. పారాశర్య మహా మునీంద్ర చరణవ్యాసంగి యౌ నీకు, బ్రా
హ్మీ రాహస్యము గోచరంబగుట యేమీ! చారు వైకుంఠ వ
క్షోరాజ దుదార హార తులసీ శోభా పరీతాంగి, నీ
చారిత్రంబులు బాడు ముక్తిసతి, యచ్ఛజ్ఞాన చింతామణీ!! 44

చ. హరిభజనంబు లేని గడెయైనను రిత్తకు రిత్త, భక్తి భో
గ రసికుఁడా పరాత్పరుఁడు - కాననివారలు కర్మ నిష్ఫలన్
బరువడిఁ జేసి, తచ్చరణ పంకజముల్ గనలేని వారలై
మరి మరి బుట్టి చచ్చెదరు మందులు కాలభుజంగ దష్టులై. 45

మ. జపయోగంబులు, ధ్యానముల్, క్రతువు లర్చల్, మేటి చర్చల్ కడు
న్నుపవాసంబులు, మంత్ర తంత్రములు, యోగోద్వృత్తులా స్వామి పా
ద పరిష్వంగము నేర, వన్యగుణచింతల్ మాని, యేకాంత భ
క్తి పరాధీనత నిల్చినన్, హరి కటాక్షించున్ దయార్ద్రుఁడై. 46

కం. కాలము దేశము ద్రవ్యము
బోలనిచోఁగర్మ తతులు పొసఁగవు, హృదయై

కాలంబనంబు భక్తి,
శ్రీలలనా విభుని హృదయ సీమలు దాకున్.

సీ. ఏ తలంబున నిందిరేశుని గుణ కీర్త
నంబులు సాఁగు నిత్యంబు నచట,
గంగాది నదులు సాక్షాత్కరించును, జంగ
మములు, ప్రయాగ తీర్థములు సజ్జ
నులు, వారి కనుసన్న మెలఁగు శ్రీవాసుండు
పితృవశంబున నున్న సుతుని పోల్కి-
భక్తుల మహిమంబు భగవంతుఁ డెఱుఁగుండు
యెఱుగంగ వలఁతులే యితర జనులు;

గీ. భక్తకులమౌళి ! నీరాక భవ్యదంబు
హేమగృహమున కొాక పడగెత్తినట్లు
సత్రయాగంబు సాఫల్య సరణి జెంద
శ్రీ మహోహరి చరితముల్ చెప్పవయ్య !

కం. కామించియైన, మదిలోఁ
గామితములు దొఱఁగియైన, కమలాక్ష కథా
ప్రేమ లొనర్చిన వరదుఁడు
గామితములు దీర్చి యొసఁగు కైవల్యంబున్.

శా. వామాక్షీ కుచకుంభ నిర్భర పరిష్వంగక్రియామోద ఝుం
పామైరేయ విఘూర్ణితాత్ము, డితర వ్యాపార నిర్లిప్తుఁడై
కామామ్నాయము వల్లెవేయుగతి, శ్రీకాంతాఽభికాఽగాధ గా
థామాధుర్య పరాయణుండితర సందర్భంబు లాసించునే !

మ. అపనిన్ బొల్చెడు దివ్యదేశములలో సఖ్యర్హితంబుల్, శివో
త్సవ సంధాయకముల్, రమాధవ ప్రతిష్ఠాస్థానముల్ వానికం

టె విశిష్టంబులు, తద్రమాకమనుడా టీకస్మహాభోగుడై
రవితేజంబునకొల్పు దీర్చినవి క్షేత్రంబుల్, స్వయం వ్యక్తముల్. 50

శా. ఆ క్షేత్రంబులలోన, దేనియెడ నత్యంతంబు రాగిల్లి, య
ధ్యక్షించున్ హరి, సర్వసామయిక సేవాసక్త గీర్వాణుడై
వక్ష స్స్ఫుర్కమలాబ్ధిజా సహితుడై, వందారు బ్రహ్మాది భ
క్త క్షేమంకర ప్రకృతి ప్రతిమహాస్తారణ్య కారుణ్యుడై. 51

ఉ. ఎచ్చటఁ జేయు నల్పతపమేనియు శాశ్వతముక్తి లక్ష్మితో
ముచ్చటలాడునో! భువన మోహన రూపము లష్టసిద్ధు ల
భ్యుచ్చలితంబులై యెదురుపొంగులు వోవునా! "మేము, మేము" మ
మ్మిచ్చ దలంపవోయి! కరుణింపు మటంచును సాధకాళికిన్. 52

సీ॥ సర్వతో వికసిత శతపత్ర సదృశ సుం
దర రమావహదివ్య చరణుఁ డగుచు
ఆ పీనవక్షస్థలాలంబ తులసికా
దామ సౌగంధ్యాఽభిరాముఁడగుచు
కరదండ శోభిచక్రవిసారి నిస్తుల
ద్యుతివిచుంబిత దిగ్విభాగుఁడగుచు
చామర గ్రాహిణీ చటుల కంకణ ఝుణ
త్కార విభ్రాంత సుత్రాముఁ డగుచు

గీ. ధర్మమయమూర్తి, మునిజన తర్షకంబు
భూరి కల్యాణ పరిమళోద్గారి కీర్తి,
భక్తకుల నేత్రపీయూష వర్తి యగుచు
నెచటఁ గొలువుండు సతము లక్ష్మీశ్వరుండు. 53

గీ. ఎచటి యర్చావతారంబు నెన్నియేండ్లు
చూచినను తృప్తి వొడమక చూడఁ జూడఁ
గ్రొత్తలై తోచు, నేలిల లత్తమిల్లు
గడియ కొకరీతి, సాత్వత గ్రాహకములు. 54

సీ. ద్రాక్షారసమ్ములు దాడిమీరసముతో
పానంబు సేసిన దాసికన్న
కసటు వోద్రోసి చిక్కని వెన్నెలలు కరో
దరముల ద్రావిన దానికన్న
ఘనరాగ మొకటి వీణెనుబట్టి శ్రవణముల్
దయివాఱఁ గ్రోలిన దానికన్న
నపుడ గ్రొత్తలు జిందునట్టి పీయూషమ్ము
సోనగా నానిన దానికన్న

గీ. నే స్థలంబున వసియించు నిందిరేశ
కథలు - రుచులకు నెలవులై - కర్ణహృదయ
తర్పణం బొనరించు, సూతా! వచింపు
మట్టి క్షేత్రంబు కారుణ్య మవఘళించి. 55

వ. అని యిట్లు మహనీయగుణ మణి గణ కూపారులగు నా పాఱులడిగిన రోమహర్షణ పుత్రుండయి, యుగ్రశ్రవసుండను పేరఁ జెలఁగి, నిఖిల పురాణ వ్యాఖ్యాన ఘంటాపథ ధిషణా సమేతుండగు సూతుండు. 56

చం. వశుఁడుగ మ్రొక్కెదన్, ప్రళయవార్ధి నిలీన ధరాఙ్గనాతోదరీ
వ్యసన రుజానివర్తికి, శుభంకర నిర్మల చారుకీర్తికిన్
భృశమద తుందిలాఙ్గసుర విభేదకఘుర్ఘుర రావ పూర్తికిన్
ప్రశమిత మానవార్తికి, నిరంతర మాదివరాహ మూర్తికిన్.

ఉ. ఏ భగవంతు జిహ్వ జనియించిన వాఙ్మయ గాంగవారి, తా
నీ భువి బాఱెఁ దొల్లి పదునెన్మిది పాయలుగాఁగ, వేదముల్
ప్రాభవ మొప్ప నెవ్వఁడు విభాగ మొనర్చె జగద్ధితమ్ముగా,
నా భవబంధమోచనున కంజలి, సత్యవతీసుతప్రసూతికిన్. 58

కం. నరనారాయణ చరణాం
బురుహములకు మ్రొక్కి; వ్యాసమునిపదభూళీ

పరిణత మతినై దెలిపెద
పరమగ్రంథంబు, దళిత భవబంధంబున్. 59

వ. అని పరమదేవతా పరమ గురు నమస్కారంబు సేసి, క్షణ మాత్ర నిశ్చల సమాధి నిమీలిత నేత్ర పద్ముండును, త్రిరుచ్చారిత గురునామామృత పరితృప్త హృదయ సద్ముండును, పరమానంద పరివర్ధిత పులక పటల కవచిత సర్వాంగుండును నైన సూతుండల్లన నయనయుగంబు దెఱచి యిట్లనియె. 60

సీ. పరమ మంగళమైన ప్రశ్నంబొనర్చితి
రనఘసంయములార! యాత్మ మోద
తుందిలంబైనది, తోయజాక్షుని సత్క
థా సేవ శ్రోతృవక్తలను సమము
గా, బవిత్రులఁ జేయుఁ గాన, విన్పింతును,
వినుఁడు భక్త్యమృతంబు వెల్లి విరియ,
సర్వసిద్ధిదమును, సర్వ సంపద్దాయ
కమును, సర్వైశ్చర్యకరమునైన
గీ. యీ చరిత్రంబుఁ దానెవ్వడేని నియమ
శీలియై పఠియించిన, ప్రీతి - పూర్వ
కృతము లఘములు - నిస్తులోన్నతి లభించు
సర్వ దుఃఖంబులకు నిది శాంతిభూమి. 61

ఉ. ఈ కథనెవ్వఁడేనియు సమీహితభక్తిని నాఱు మాసముల్
చేకొని నిత్యమున్ మనన సేసినచో మదదంతి సంతతి
శ్రీకరమౌను గేహము వశీకృత యౌవత మందహాస లీ
లా కమనీయమై, పద ఝుళంఝుళదద్భుత పారిహార్యమై. 62

శా. దంభాఽపేతుఁడు సాత్త్వికాశియును, సద్ధర్మవ్రతుండౌచు, న
న్యంబున్ నమ్మక యెవ్వఁడే నరుఁడు, నిత్యావర్తి సేవింప, పా
పంబుల్వోయి, నశించు రోగములు; విప్రవ్రాత సత్కార సం
రంభత్రస్తములౌచుఁ బర్వులిడు ఘోరవ్యాపృతుల్ భూతముల్. 63

ఉ. వాసిగ నెవ్వఁడేని యనువాసరమున్ పఠియింప, భక్తిసం
వాసితుఁడైన వానికిని, ప్రాప్తమువో సుకవిత్వసిద్ధి, సం
ధ్యాసమవేత తాండవ కళాతుర శర్వజటాటవీ సము
ద్భాసి నిరంక పంక హిమధామ సుధా మధురార్ద్ర భావమై. 64

మ. అనుమానంబు దొలంచి, యీ చరిత, మత్యాసక్తి, రూపంబు దా
ల్చిన నారాయణు నంశమంచు బహుధా సేవించు భక్తుండు, ని
ర్ధనతాఽవాప్తి దొలంగి మోక్షపదపీఠానుష్కుఁడై, యా చిరం
తన సద్భక్తులతో వసించును వికుంఠంబం దకుంఠక్రియన్. 65

వ. పరమ భాగవతులును, పరమర్షులును, బ్రహ్మాది దేవ సంఘంబును, గోచయంబును, పరమ సాత్వికులైన విప్రులును, బృందావనాది పుణ్య క్షేత్రంబులును, గంగా, చంద్రభాగా, తుంగా, సువర్ణముఖర్యాది నదులును, శ్రీరంగ శ్రీముష్ణ శేషాచల పండరీత్యాది దివ్య క్షేత్రంబులును, విష్ణు భక్తాగ్రేసరుండైన సదాశివుండును. రామ నామామృత భరిత హృదయ సరోజయైన గిరిజయు, స్వస్వరూపంబులు దాల్చి విష్ణురూపంబైన యీ పరమ చరితంబు సేవించుచుందురు. మునులారా ! శేషాఽఽచల సమాశ్రయంబగు శ్వేతవరాహ కల్ప వృత్తాంతంబు నవధరింపు డని యిట్లనియె. 66

సీ. కల్పాది నఖిల సాగరము లుద్రేకించి
        తోయ దిక్కూల ముద్రుజము లగుచు
బాడబానల శిఖా బహుళచ్ఛటచ్ఛటా
        ధ్వానవాచాటీ భవత్సమస్త
ఖపదంబులగుచు రింఖత్సాంద్రకల్లోల
        మాలికా హస్త ప్రచాలనముల
నఖిలర్షులకు గుండె లవియఁగఁ జేయు చు
        న్మత్త తాండవమాడు మాడ్కి మసరు

గీ. గవిసి, కువలయమెల్ల నాక్రమణ సేయు
పద్మనాభుండు పృథుకభావము వహించి
తోయజమ్ముల కాత్మబంధువులు వోని
చక్షువులు మోడ్చి- వటపత్రశాయి యయ్యె. 67

వ. ఇట్లు కరారవిందంబున పదారవిందంబు ముఖారవిందంబున వినివేశించి కొని, మహర్లోకంబున యోగనిద్రాసమారూఢుండైన స్వామికి, యుగ సాహస్రంబు గడచిన, తదనంతరంబ యోగనిద్రసాలించి, సర్వంబునకు ధాతయు, సర్వాత్మకుండును, సర్వశక్తుండునగు సరసిజోదరుండు యథాపురంబు సృష్టింప నూహించి యున్నంత. 68

మ. అనినన్ మౌనులు కౌతుకస్ఫురితర వ్యగ్రాంతరంగుల్ సదా
తన కీర్తిస్తవ గంధగంధిల వచోధన్యుల్, జగన్మాన్యు, శాం
తిని శాంతాత్మని, వాసుదేవ దృఢభక్తిస్నాతు, సూతున్, నిరీ
క్షణమున్ సేయుచు నిట్లు పల్కిరి- సుధాసారానుకారోక్తులన్. 69

కం. ఆగత మనాగతము, ని
చ్చాగతి దెలియంగ వలతి, సర్వోపనిష
ద్భాగోపభోగ్య విధుపద
రాగ సమాఘాత హృదయరాగ నివేశా! 70

గీ. యోగనిద్ర చాలించి సృష్ట్యున్ముఖుండు
నైన పరమాత్మ నిత్యలీలాధ్వనీను
డేమి దలంచె, బ్రహ్మాదుల కేని దుర్వి
భావ్యమైనట్టి హృదయ దర్పణము నందు. 71

శా. ఏ కల్పంబది? యెవ్విధంబు విలయం, బేభంగి గానయ్యె, నా
నాకక్షోణి ధరాంతమైన సృజనం బవ్యాహతోద్వృత్తి నా
శాకాశంబుల నావరించికొను వాస్సందోహమెట్లబ్బె, సూ
తా! కల్యాణమతీ! వచింపు మివియంచన్, మాకు నీ సర్వమున్. 72

వ. అని యడిగిన సమ్మునిపుంగవులం జూచి, 'పక్వ మధురసా మధ్యే
నిర్యన్మసృణ రసఝరీ మాధురీధురీణంబులైన వచన రచనా విశేషం
బుల సూతుండిట్లనియె. 73

ఆ. పరమ మౌనులార! పరమేష్ఠికిని, చతు
ర్యుగ సహస్రమైన నొక్కపగలు,
అంత మాత్రమునన యగు రాత్రి, యాతఁడు
బ్రదుకు దినము లిట్టి వర్ష శతము. 74

మ. దివసాంత్యంబున యందుఁ జండకరు డుద్దీపించి, ప్రత్యగ్రభా
ను వితానంబుల వహ్నిపుంజముల నించున్ భానవీయంబులా
యవమర్దంబుల కీధరిత్రి హృదయం బామూలతోదీర్ణమై
యవనీధ్రాదులు భస్మసాత్కృతములై యస్తంగతాఽశేషమై. 75

గీ. అంత వర్షించు ప్రావృషేణ్యాంబుదములు
కుంభపోతలు గాగను గొన్ని సమలు,
త్రిపుర దాహక్రుధా సముద్దీప్త కాల
కంఠ హుంకార లుంటాక గర్జ లెసఁగి. 76

ఉ. ఆ సమయంబునందు నిగమాత్ములు మౌనులు ధర్మరక్షణా
యాస తపస్సమూర్జితు, లహంతలు, వీడిన దైవరూపు, లీ
వీసరపోయినట్టి పృథివీస్థలి నుజ్జన సేసి, పావని
న్యాస శుభం బొనర్తురు, జనాఖ్యము లోకము నానిశాంతమున్. 77

వ. అట్టి యొక కల్పాది నిశాంతంబున- నిఖిల ప్రపంచ నిత్యలీలావిలాస
రచనా చణ మాయాతూలికా ధరుండును స్థితికరుండును సకల వినాశియు
నగు నారాయణుండు. 78

సీ. సీరంధ్ర పృథురోమ ఘోర రోచిర్మాలి
కావ్యాప్త విశ్వతో గగనుఁడగుచు
రింఖాసముత్ఖాత రింఖ దర్పవతుంగ
భంగకల్పిత వజ్ర పరిధి యగుచు
కఠిన దంష్ట్రాగ్ర జాగ్రద్వహ్ని విశ్వత్వి
నాకి, తార్క్ష్యీయాక నయనుఁ డగుచు
ప్రబలఘుర్ఘురరావ ప్రతినదన్నిజకీర్తి
పటహాయమాన దిగ్భాగుఁ డగుచు

ఆ. నిఖిల ధర్మమూర్తి, నిభృత దయాస్ఫూర్తి
విదళితార్తి, దైత్యమదసమాప్తి
యమరపరిబృఢుండు, ఆదివిష్ణువు వేడ్క
గోలుమసఁగి, యజ్ఞఘోణియయ్యె. 79

ఆ. యజ్ఞఘోణి యైన యాది నారాయణుం
డపుడు వార్ధి జలము లందు జొచ్చి,
ఘోరనినదుఁ డగుచు గోరాడఁ జొచ్చిన
సాగరుండు బిట్టు సంచలించి. 80

శా. వీచీ హస్తము లెత్తి, యుత్కట భయావిర్భూతితో నమ్రుఁడై
నీ చిత్తమ్మున నాపయిన్ కినుక చన్నే స్వామి ! నేనెవ్వఁడన్
నీ చాటూక్తులఁ బల్కు భృత్యుఁడనుగానే ! త్వత్పదాజ్ఞాత సే
వాచంచన్నిజ జీవనుండను, ప్రభూ ! పారుష్యముల్ సెల్లునే. 81

మ. దివిజాధీశ్వరు భోగభాగ్యపదవిన్ దీంద్రించి కైకొంటినో !
హవముల్ సేయఁగ నడ్డగించితినో ! దైత్యశ్రేణి నాలోన దా
చి విరోధించితినో ! జగత్ప్రళయముల్ జీవేశ ! నీయానతో
నపుగానే ! మరి నా విజృంభణము లన్యాయంబులే శ్రీపతీ ! 82

సీ. నిగమాతిగామి యౌ నీ పాద మంజు మం
జీరరావమ్ము వీచికల యందు

తత్తాదృగానందదాయి తావక పదా
రుణ్యంబు నిబిడ విద్రుమములందు
లలిత పన్నఖ బింబ గళిత పార్వణచంద్రి
కలు విశుక్తిక మౌక్తికమ్ములందు
చతురశ్ర శోభినీచరణ భూమిక సర్వ
తఃపుల్ల సరసీజ తతులయందు

గీ. చూచికొని, చూచికొని, చొక్కి చొక్కి హృదయ
మంతయును తావకాంఘ్రియుగాయమాన
మైన నాపైననా ! నీకు నలుక; భక్తి
సరసశృంగార ! మౌనిసంసద్విహార ! 83

కం. నన్ను క్షమింపుము కరుణ వి
పన్నుని; నీ పాదభక్తి భవహరము గదా !
సన్నుత నిగమమయాత్మక
సన్నతమనుజార్తిరోధి ! సౌజన్యనిధీ ! 84

సీ. అని విన్నవించిన, యంభోధి నా స్వామి
యభయ దృష్టులతోడ నాదరించి
రభసంబుమాని, గర్జల నుజ్జగించి, ప్ర
సన్నుఁడై పుష్కర సరణులంటి
జలపూరితంబైన బలిసద్మమునుజేరి
వెదుకంగఁదొడఁగెను విశ్వధాత్రి
వెదుకంగ వెదుకంగ విపులసంతయుఁ జాప
కట్టుగాఁ జేసి, దుర్గర్వవృత్తి

గీ॥ కాచికొని యున్న యొక్కరక్కసుఁడు దృష్టి
గోచరుండయ్యె; వాఁడు దక్షుని కొమార్త
యైన దితికిఁగశ్యపునకు నసురసంధ్య
ప్రభవమొందిన యట్టి పాపముల పొదవు. 85

కం. పేరు హిరణ్యాక్షుఁడు, త్రిద
శారాతులలోన నగ్రసరుఁడు, మహేశ
స్ఫారనిటలాగ్నినిభ దు
ర్వార క్రోధుండు, భయద రణరభసుండున్. 86

శా. వానిన్ జూచి, రణోత్సవంబునకు నాహ్వానించి, గర్జాప్రతి
ధ్వానమ్ముల్ ఫణిలోకమెల్ల నిగుడన్, దంష్ట్రావిటంకాగ్నితే
జో నీరంధ్రములై సరీసృపకుల క్షోణీ ధవోత్తుంగ హ
ర్మ్యాసీకంబులు, తప్తహాటకరుచి ప్రస్తార పర్యాయమై. 87

ఉ. దూటిన నన్నిశాచరుఁడు, తుంగ మహీధర కూట గౌరవో
చ్చాటనముల్, పరాస్తసుర సంఘములైన భుజంబు లూపి, వ
న్యాట వరాట ! రమ్ము ! మదుదంచితవిక్రమ కేళి, బంతిగా
మీటెద నిన్ను, కన్నుగవ మిట్టి పడంగను తోకచుక్కలై. 88

కం. అని మూదలింప కనుఁగవ
జనితంబులుగాఁగఁ దొగదు చాయలు, వీర్య
ప్రణిధులు, క్రుధాట్టహాసము
లను పర్తింపంగ రభసమతి వేలముగన్. 89

గీ. అగ్రముక దూక, నసుర బాహువ్వళించి
నేరుగా దాకె, నాకచరన్మేరువనఁగ,
సరికి సరియైన యాయుద్ధ సరణి, సకల
వార్ధులుడికించి యొక క్రొత్త ప్రళయమయ్యె. 90

ఆ. ఇట్లుఁ గొన్ని యేడు లిందిరాజాని, య
య్యసుర తోడఁ బోరి యాలసింప
రాదటంచు రోషరక్తాస్యుఁ డగుచు, జి
త్తమ్ములో సుదర్శనమ్ముఁ దలఁచె. 91

మ. అరుదెంచెన్మురవైరి చక్రము, సముద్యద్బాహు ఖర్జూ రుజా
త్వరితోదగ్ర నిశాచరాధిప వధూవార్ధిభ్య రాహూానుమూ

ణ రుషాతుందిత హుంకృతి స్వన విభిన్న స్వర్ణకుట్టీర గ
హ్వర సాహస్రము, వాంతపావక శిఖావైచిత్ర్య దిక్చక్రమై. 92

శా. సావిత్ర ద్యుతి, యాత్మనీన శిఖి సంసద్వాంత మంగారమై
ధావించెన్, హరిహేతి, ధావన రయాధ్మాతగ్రహగ్రాహమై
హేవాక స్ఫురదట్టహాస లహరీహేషా దిశావిస్ఫుటి
ద్గ్రీవగ్రావము గాఁ జిరంతన ఋషిగ్రామ స్పృహాలోకమై. 93

కం. ఆ వచ్చిన చక్రము గని
దేవాహిత సూదనుండు దిన్నఁగనగి, లో
కావన దక్షము త్రిజగ
త్పావన దక్షిణకరంబు దాచెన్ బ్రీతిన్. 94

వ. ఇట్లంగీకరించి. 95

ఉ. దానిఁ బ్రయోగమున్ సలిపె దైత్యునిపై, శతకోటి సూర్య బిం
బానుగ కాంతి కంచుకితమైన రథాంగము జూచి, చీకటుల్
బూనిన కన్నుల న్నసుర పూనిక నొక్కట గండరించి వై
శ్వానరు నాల్కవోని గద, భాస్వహకృత్వరి ద్రిప్పి వైచినన్. 93

చ. కహకహ నవ్వి, ఘోరరణ కల్య మతుల్యము హేతి, రాక్షస
ప్రహిత గదాయుధంబు, చిదరల్పొనరించి, మహాగ్రహాగ్రతా
గ్రహిళముగాఁగ వచ్చిన సురవ్రజ శోషణదృక్కటాహ వి
గ్రహుఁడగు యాతుధానుఁడు కరాచుని గైకొని చెంగిలించినన్. 97

కం. అయ్యసి దునిమిన, కన్నులఁ
గ్రయ్యంబడ వహ్నిశిఖలు కానిమ్మనుచున్
చయ్యనమల్ల చలచి, రా
కయ్యమునకు ననియెవాఁడు కలహోత్సుకుడై. 98

శా. కానీరా మనుజాధ ! నీ వగు నహంకారంబుతే పాటివో
నేనున్ జూచెద ! లోకనాయకులతో నీ పంతముల్ సాఁగునే !

మానాతీత విచిత్ర శక్తి, దివిషన్మాన్యుండు, విశ్వాత్ముతో
నా! నీ వైరము తత్ఫలం బడియె కొమ్మజ్ఞానజీవచ్ఛవా! 99

కం. అని పలికి చక్రమసురుని
ఘన భుజయుగ్మమ్ము ద్రుంచి, కంఠబిలంబున్
దునిమిన ధరపైఁ బడె వాఁ
డనుపద హాహారవంబు లాశావధిగన్. 100

మ. దనుజాధీశ శరీరనిర్గళిత రక్తస్తోకముల్, వార్ధిఖం
గనికాయంబుల నెఱ్ఱసేసిన, దిశాకాంతాది నీర్వాణులిం
కనుమానింపఁగ నేల? చచ్చెను హిరణ్యాక్షుండు చక్రక్రుధా
ఘన వైశ్వానర కీలలం దనుచు, రింఖన్మోద సంరంభులై. 101

కం. సదనంబులు వెలువడి, తమ
వదనంబులు సూపి, నేడు బ్రదుకులు గలిగెన్
మద హాలహాల హాలహలమగు
నదయుని తొడ వాసెననుచు నందఱుగూడన్. 102

మ. కరయుగ్మమ్ములు ఫాలసంగతములన్ గావించి, యానంద బా
ష్పరస ప్లావిత నేత్ర పద్మములతోఁ బద్మాక్షుఁ గీర్తించి రి
ట్లురుధారన్, కరకంకణగ్రథిత రత్నార్చిర్ద్యుతిస్తోమ వి
స్తర నీరాజిత వాసుదేవ చరణార్చా నేత్ర పర్వంబుగన్. 103

మ. జయముల్ నీకు, మహావరాహ! దివిషత్సంక్షేమ కృద్బాహ! య
వ్యయ' పంచోపనిషత్స్వరూప' శుభదేహ! లోకమాంగల్య తుం
గ యశస్తుందిల సత్కథారుచిర! రక్షాదృష్టి వీక్షించి, ని
ర్భయులం జేయుము మమ్ము, నైగమవచః పారాతిగప్రాభవా! 104

మ. సవనోద్భాసితవేది తావకప్రశస్త స్ఫీతమౌగాత్ర, మా
హవనీయము: ముఖమ్ము, దర్భగణముల్ వ్యాకోచరోమాళి, సం
స్తవనీయమ్మగు శమ్య దంష్ట్ర, భృశపుచ్ఛం బెన్న యూపమ్ము, య
జ్ఞవరాహా! భవదంఘ్రి సేవనము, సాకల్యమ్ము కర్మాళికిన్. 105

సీ. నీకు వేశంతముల్ నిష్ప్రప చిర తప
స్స్యాయత్త మౌనిహృదంతరములు
నీకు ముస్తా జగ్ధి నీరంధ్రగర్వకా
హళ యాతుధాన సంహననరాశి
నీకు ఖేలావనుల్ నైకశాఖాగ్రంథి
వితత మరధ్వముల్ శ్రుతిచయంబు
నీ కటాక్షమ్ములు నిగ్రహానుగ్రహో
భయతస్సుతీక్ష్ణ కృపాణ శిఖలు

గీ. హలహలిక దోప, కాలిమట్టులనె దివిజ
గర్భిణీ గర్భ పిండముల్ గలంచి యాడు
కూటకిటి! ఘుర్ఘురారావకోటి మూద
లించి మా దుఃఖభరము మాయించు గాక ! 106

మ. ఖలుఁడీరక్కసుడింతమాత్రమునకై గర్వంబుతో, నెంతలెం
తలు సేసెన్, తుటి తెల్లవారె, బ్రదుకిత్థంబౌచు, ధర్మక్రమ
స్థలదధ్వమ్ముల కాయువుల్ గలుగునే! స్వామీ ! భవత్పాదప
ద్మలసమ్బుద్ధుల నిమ్ము, దైత్యవనితా మాంగల్యపాటచ్చరా! 107

గీ. క్రీడగా యోగమాయ నంగీకరించి,
జగములు సృజించి, రక్షించి, సంహరించి
తుపకనాసక్తుఁడుగ మాయఁ ద్రోచునట్టి
ధీలసిత వృత్తి! వేదమూర్తి! నమస్సు! 108

వ. అని యివ్విధంబున, నప్పరమపురుషు నగ్గించి - భుజార్గళ నిరర్గళ ప్రతాపదీపిత నిశాచర రాజవంశ దావానలంబును, బాహ్యాఽబాహ్యాంధకార క్షతఃగపగచంకారధామంబును, లోకాపన్నానకారణంబును, విబుధ దుఃఖహారణంబును, పాపకర్శనంబును, సద్ధర్మ దర్శనంబునగు సుదర్శ నంబు నిట్లని యభినుతించిరి. 109

చ. కదనముఖంబులన్, గహన కానన భూములఁ, నీళులందు, దు
ర్మద పరివీత భూతములు మచ్చరికించెడు వేళ, నుల్లమున్
తొదలు గలంచు వేళఁ దబితో వెస నెవ్వని పేరు మంగళా
స్పదమని యెంత్రు మర్త్యు, లల చక్రము మాకుఁ బ్రసన్నుఁ
డయ్యెడున్. 110

ఉ. పూర్వకృతంబులైన యఘముల్ పయికెత్తి, విశిష్ట సంపదల్
సర్వము లస్తమించి, దివసంబొక యేడుగఁ దోచువేళ, శ్రీ
పూర్వక మే మహామనువు, పూని జపింతురు మర్త్యు, లమ్మహో
ధూర్వహ మంత్రమూర్తి, మది దోచునుగాక! సుదర్శనంబుగన్. 111

చ. ఖలులగు రాక్షసాధములు గ్రమ్మి జగంబులలంచు వేళ, పి
చ్చిల మదులైనవారి బలుసేగి దొలంచెడు దైవమే లయ
జ్వలన సహస్ర రోచిదగు సాహ్యము దద్దయు నమ్మ, భీతివి
హ్వల దనుజాఽళియౌ దళశతారము మమ్మవనం బొనర్చుతన్. 112

శా. ఆయాతార్క మహస్సు లెవ్వని సహస్రాంశంబు, కల్పాంతకా
లాయాత క్రుధయత్ప్రభా శత సహస్రాంశంబు, వైశ్వానరా
ధేయమ్మౌ ద్యుతి యల్లవం, బతఁడు సాధిష్ఠంబుగా మమ్మునా
ప్యాయం బొప్పఁగ బ్రోచునెల్లపుడు బాధాతంకముల్ మాల్చుచున్. 113

మ. జలముల్ వీచిక లన్యముల్ వలెనె భాసంబైన, తత్వస్థితిన్
జలముల్వీచిక లేకమైన గతి, తచ్చక్రంబు, నారాయణుం
డిల భిన్నంబుగఁ దోచినన్ తుదకు దామేకమ్ము, భంగ్యంతర
జ్వాలదర్కాంబక! యో సుదర్శన! మముఁ బాలింపు, నారాయణా! 114

ఆ. అనుచు నిట్లు సురలు వినుతింప, నధ్వరా
త్మకుఁడు కూటపోత్రి, మంత్రమయ మ
హాయుధములు దాల్చి, యనుకంపఁ గల వీక్ష
ణముల తోడ దర్శనం బొసంగె. 115

మ. అతి మందాక్ష వికుంచితాంగియగు భార్యారత్నమున్, వక్షుఁడౌ
పతి, చాటూక్తులతోఁ గరంచి, పరిరంభప్రీతి గావించి, క్రొ
త్రతమిన్ వాతెఱ పంట నొక్కుగతి, గోత్రాదేవి జాహేపరీ
వృత గావించి వరాహమూర్తి, దశన శ్రీసక్త జేసెన్ తగన్. 116

మ. ఒక పాదంబును వాసుకి ప్రముఖ వంశోత్తంస కోటీర కో
టి కలాపాంచిత నూత్నరత్న రుచివాటీ శోభి పాదుండు స
ర్పకులాధ్యక్షుఁడునైన శేషుని శిరోభాగంబునందుంచి, మి
న్నక, మేన్వొంపఁదొడంగె, నంత త్రిజగన్నాథుండు హేలాగతిన్. 117

కం. జనలోక వాసులగు ముని
లనఘా! తొల్లింటివలెనె, యవనీభరమున్
మనుజాది భూతసంతతి
మనుటకునై నిలుపుమనిరి మాధవుతోడన్. 118

ఆ. మౌని వచనములను మన్నించి హరి నిల్పె
భూత ధరణితలము పూర్వమట్లు,
తపముచేత ననఘతరులైన వారి యా
జ్ఞలను మోచువాఁడు గాడె శౌరి. 119

ఉ. భోరున నంత, భేరులు నభోవలభిన్నినదించె, దివ్యమం
దారతరుల్విదిర్చిన వుదార సుగంధ సుమంబు, లభ్రగం
గారస శీకరార్ద్రములు, కమ్మని గాలులు వీచె, నారద
ప్రారభమాణ కూటకిటి వైభవగాన తరంగితంబులై. 120

కం. ఈ కథఁ జదివినచో, సు
శ్రీకులగుదు, రార్ద్రి భక్తి చేతస్కులుగా
నీ కథ జదువ సశోకు ల
శోకులగుదు, రంగనాంగ సురభీకృతులై. 121

చ. అతిఘన కాననౌఘ హరితాంబరమై, రమణీయ పుష్పసం
తతిశుభ భూషయై, వికచ తారకయై, సముదారచంద్రికా
స్మితయయి, రోచనీయ సరసీ శుభగాకృతియై తనర్చె, సు
స్థితయయి, భూతధాత్రి, ఖగశీతలకూజితవాగ్విలాసయై. 121-ఎ

మ. ధరణీ మండల మందునిల్వదలఁచెన్ ధర్మైకదక్షాసమా
దరుఁడై శ్వేతవరాహమూర్తి, కరుణోదారుండు, దా, మానసాం
బురుహం బందున నెంచె నప్పుడు త్రయీ భూతేంద్రియగ్రాము, భా
స్కర వర్ణున్ ఖగలోకరాజు, త్రిజగత్కల్యాణ సంరంభునిన్. 122

కం. తలఁచిన తోడనె వచ్చెను,
పులుగుల యెకిమీఁడు పక్షపుటవాతూలం
బులతోడ, కలశ జలనిధి,
సలలితనవనీత సురభి సంతతివీవన్. 123

ఉ. వచ్చిన కశ్యపాత్మజుని, వాలిక కన్నుల నాదరించి, "రా
వచ్చు"నటంచు బల్కి, పదపద్మ సమీపగుఁగ్రుచ్చి యెత్తి, సం
విచ్చమశీలతాపసనివేదిత చారు వపాఽనుషంగ సం
పచ్చుభదంబులౌ, మృదులభాషలఁబల్కె వరాహమూర్తియున్. 124

శా. నామూర్త్యంతరమందు రేఘునుని, విజ్ఞానాత్ము, లెఖ్ఖాని, వీ
క్షామార్గారుణరేఖ, రాక్షసవధూగండస్థలన్యస్తప
త్రామోదప్రతిరోధి, గోత్రభిదు, భ్రశ్యద్గర్వుఁగావించు, నీ
స్సీమంబెవ్వని విక్రమం, బతని కాశీస్సుల్-ఖగస్వామికిన్. 125

ఆ. ఓయి! వైనతేయ! యీయిలాతలమున
గొలువు సేయ మాకుఁ దలఁపు పుట్టె,
నావికుంఠమునకు నరిగి క్రీడాశైల
మమరఁ దెమ్ము! సేమ మగును బొమ్ము! 126

చ. అనిన "మహా ప్రసాదమ"ని యయ్యరవింద దళాక్షు పాదముల్
కనుఁగవ మ్రొక్కి, ముత్పులక కంచుకితాంగుఁడు, వాలఖిల్య స
న్మునుల తపోవివర్తములు మూర్తములైన మహాఖుజుండు, తా
ననిమిషవీథికిన్నెగసె, నభ్రగణంబులు వెంట నంటఁగన్. 127

సీ. గరుడుండు వోయిన, కమలజాంబకుఁడు, క్రో
డాకారసవన మియ్యవని నెల్ల
కకుబంత కరికరాఽఽకార ఘూత్కారమ్ము
లంఘ్రితలంబుల నాక్రమించి
ఘుర్ఘు రారావ సంక్షుభితనాకుఁడు, గోమ
తీతీరమందు వర్తించికదలి,
దక్షిణంబుగ నేగి-దనుజారిషష్టి యో
జన దూరమందు-ప్రాగ్జలధి పశ్చి
గీ. మంబున, నభంగ భంగక్రమాను లాప
యైన రుక్మవతీ తీర మందు నిలిచె,
యెదఁదలోకాఽఽవనత్వసమీహ బెరసి
కనుల కారుణ్య కల్పవృక్షంబు విరిసి. 128

వ. ఇట్లు సనాతనుండగు భగవంతుండు, సువర్ణముఖరీతీరంబున నిలిచి
వైనతేయాగమనంబు నిరీక్షించుచుండె నంత. 129

ఉ. ఆతత పక్షమారుత రయంబున, నాకస, మాహతానక
స్ఫీతము, ఘూర్ణిలంగ నెగసెన్ ఖగనాథుఁడు దారతారమై
భాతిగ నవ్యథోచ్చరిత పక్షికమై-యనలాంగనా సమ
న్వితము-మంత్రమున్ జదివి నిర్జరులాదలఁ గేలు మోడ్పగన్. 130

ఆ. ఇట్టు లెగసి యెగసి, హృద్య మందాకినీ
వాలుకములనార్తవములు పూవు
లందగించునట్టి నందనారామంబు
దాటి నాకసౌధ తతులు దాటి. 131

గీ. కంఠ ఘంటాపథంబు లోంకారమయము,
లగు ఋషుల సూక్తి కోంకార మాచరించు,
చతుర వదనుండు-బ్రాహ్మీవశం వదుండు
సమయ మొసఁగెడు సత్యలోకము తరించి. 132

మ. అమిత ప్రాభవమూర్తి తార్క్ష్యుడు, వికుంఠాభ్యర్ణ దేశ ప్రవే
శము, భక్త్యుద్గతి సేయుచే తడవు, నిష్ప్రత్యూహమై చొచ్చె, గ
ర్ణములన్ నైగమవాదసారము, నమో నారాయణాయేతి మం
త్రము, దేవర్షి విపంచికా లలిత గానస్వాన సంభిన్నమై. 133

గీ. ఆ పరమ మంత్రమున కాత్మనలరి యలరి,
యెల్లమేనున పరభక్తి యువతళించి
పృథు హిమాచల దేహుండు-వినయభార
శోభితుండయ్యె నీవారశూక మూర్తి. 134

ఉ. అంతటఁగశ్యపాత్మజుఁ డనంత సుఖాత్ముల, మన్మథాతిగ
స్వాంతుల, దాంతులన్, సరసిజాక్ష పదద్వయ మంత్రచింతనా
దంతురితాంగులన్ గనియెఁ దామరసాక్షుల, పీనవక్షులన్
శాంతికృతావతారుల నసజ్జన దూరుల-నిత్యసూరులన్. 135

కం. కని, కైదోయి మొగుడ్చుచు
కను గవలను నంజలించె, గరుడుఁడు, మధుసూ
దన మంత్రైక శరణ్యుల
మనములు నీచోచ్చభావ మలినములగునే. 136

సీ. పైపైని బయనించి పతగేంద్రుఁడతుల ర
త్నమరీచి తుంగ శృంగముల దాని
పంచోపనిషదాత్మ కాంచితాంగముదాని
తపనీయ ధాతుసంతాన కటక

సంవృద్ధ కల్పకక్ష్మాజ సూనామోద
ఘుమ ఘుమ ద్దిక్కుడుంగములదాని
సతత కషాయ కంఠిత కోకిలారవ
స్యందమానాశ్మ వజ్రమ్ముదాని
గీ. దివ్యనారీ స్తనాభోగ దీప్యమాన
మధుర వీణారవా ఘూర్ణమాన, పరస
హస్రశస్తత కందరమైనదాని
నంబుజోదరు క్రీడాచలంబు గనియె. 137

వ. అగ్గిరీంద్రంబు యోజన త్రయవిస్తారంబును, త్రింశద్యోజనాయతంబు నునై హరికి శేషంబునై శేషాకారంబున నున్న, నభస్స్పృక్కూట కోటి ఫణా మండలంబును శైతీయ నద్ధ ఘన గండోపల భీషణకాయంబు నునగు నగ్గిరికి వలగొని, నమస్కరించి-'నారాయణగిరి'యను తన్నా మంబుఁ దలఁచి, సర్వతః పక్ష్మలిత పులక పటల కంచుకితాంగుండై వైనతేయుం డందు విహరించు భగవత్పార్శ్వచరులగు భాగవతుల కు లక్ష్మీధరునాజ్ఞ నివేదించి,తదనుజ్ఞగొని. 138

శా. దానిన్ మూపునదాల్చి-తార్క్ష్యు డెగసెన్ దైతేయ శుద్ధాంతలా
షానిత్యోత్సవ సంపదాహరణ హుంకారంబుతో, పక్షతి
ధ్వానాకర్ణన భీత భీతసుర సంతానంబు, మస్తంబులన్
బూనన్ కైగవ, దేహరుఙ్నవ జపాపూర్ణాఽఖిలాశాంతుఁడై. 139

కం. భూమికి డిగి, కూటకిటి
స్వామిని వీక్షించి భక్తి భరితుఁడు గరుడుం
"డేమి మదల !" యని యడిగిన
శ్రీమహితుని కనులఁ గరుణ చిందులు ద్రొక్కెన్. 140

గీ. తన విహారాచలంబు నీధరణి పైని
గరుడిచేతఁ బెట్టించి యప్పరమపురుషుఁ
డందు వేంచేసె, మానవులందు దనకు
నెసఁగు కరుణకు గోపురం బెత్తినట్లు. 141

సీ. స్వామి పుష్కరిణికిఁ బశ్చిమంబున పుణ్య
కాననమున, చలకాకి పక్ష
ధరవటు స్వాధ్యాయ సురుచిర స్వర శబ్ద
దామ్రేడన క్రియా వ్యగ్రరాజ
కీరముల్గలచోట- భూరిగోవ్రజదుగ్ధ
జంబాలితము ప్రదేశమున యందు,
బర్హిణ బర్హ తల్పాక్రాంత భుజగపో
తకమైన చోట సదాతన ప్ర 142

గీ. శాంత ఋషిగణ దర్భవిష్టర సుగంధ
ఝరపరీవృత విపుల కుంజముల చోట
నొక విమానంబునందు లోకోత్తరముగ
నధివసించెను నుతకీర్తి యజ్ఞపోత్రి !.

చ. ఆదివరాహమంత్ర కవచావృత మానసు, లర్యమప్రభా
పాదిశరీరు, లస్త మితభావ భవోదయు, లూర్జితవ్రతా
హ్లాద పరాయణుల్, నిగమలాలసు, లచ్చట సిద్ధు లింద్రు, సే
వాదృతనిర్జరేశ్వరు, లనాదృత మోక్ష ఫలాభిలాషులై. 143

కం. మధ్యే విమానమున, చ
క్రాద్యాయుధధారియగుచు, కరుణాధారా
స్విద్యన్నయనాబ్జుఁడు, నిర
వద్యగుణుండైన శౌరి వాసము సేసెన్. 144

ఆ. అరుగుదెంచిరప్పు డమరులు, గంధర్వ
లాదిమునులు, వారిజాసనాదు
లామహేశుదొట్టి. శ్రీమతే నారాయ
ణాయ యనుచు, వినయనమితముఖులు. 145

మ. కరయుగ్మంబులు జేర్చి, నాల్గు మొగముల్ గాద్గద్యముంజెందఁగా,
పఱపై పుల్కలుతేగఁగా, నయనముల్ భావాభిరామంబుగా
నరవిందాసనుఁడిట్లు పల్కె, పణన వ్యాపారఖంజ త్రిపా
భరసంలగ్న వచస్సతీశిథిలభాషాభంగులందంబుగన్. 146

కం. తోచిన యట్టులనుందువు,
తోచవు నెమ్మనములందు, దుస్తరమాయా
ప్రాచుర్యము నీ రూపము
నీ చనవులు మాకు, కల్లనిజములు దేవా! 147

సీ. త్రివిధ రూపమ్ములై దీపించు జీవుల
కనుగుణమ్ముగను మోక్షాత్మసుఖము,
సంసారమును, దుఃఖసంతతి యొసఁగెద,
వహరహంబును కర్మలంటి నిన్ను
గొలుచువారల కొడఁగూర్తువు నాకమ్మ
నప్సరోజన విభ్రమాంచితమ్మ,
నన్యనిర్లేపులై యహరహమ్మును నీకు
మనసునప్పనసేయు ఘనమతులకు

గీ. నిన్నెయొసఁగెద, వా నీవు, నిఖిలసౌఖ్య
నిధివి, నీకిలుదెలియక నిన్నువిడచి
కుత్సితసుఖంబులను గోరికొంద్రు జనులు
విరి వదలి-నారకెగఁ బ్రాకు వెఱ్ఱులట్లు. 148

మ. ఖలుఁడై లోకము లాక్రమించికొని-నాక త్రయ్యముల్విఘ్నసం
కులముల్ సేసిన వానిఁగూల్చితివి, రక్షోనాథ వంశాటవీ
జ్వలనోద్దామములైన నీ యతుల రోషస్ఫీత హుంకారముల్
కలకాలంబును మద్ద్విషద్గణగళ గ్రాహంబులై మించుతన్. 149

వ. తదనంతరంబ యుదాత్తానుదాత్త స్వరిత స్వరత్రయ సామరస్య సుంద
రంబుగా స్ఫోటబ్రహ్మాత్మకంబైన వేదపురుషుండిట్లని నుతించె. 150

చ. క్రమమున నీగుణస్తవము గైకొని సేయఁగ, బూని, వాక్ప్రపం
చము శిథిలంబునై, విభవసాగర! యాపయి-''నేతినేతి''వా
దమును సమాశ్రయించితిని, తాదృశరూపుఁడవైన నీపదా
బ్జములు వెలుంగుఁగాత! ననిశంబును మామకమస్త భూషలై. 151

కం. తన కడపలఁ దానెఱుఁగని
ఘనపథము విధాన, లోకకాంతములగు, నీ
గుణవిభవంబులు నీవెఱుఁ
గనివట! పెఱవారలేమిగందురు, శ్రీశా! 152

వ. రుద్రుండిట్లనియె. 153

మ. నను నీయంశమటందురీసురలు-నేనా! త్వత్పదాబ్జాతవం
దనపుణ్యంబున గొంత నేర్చితిని, విన్నాణంబు, లోకత్రయీ
జనతాపైకశరణ్య! యీ సురల యజ్ఞానంబు, నా గౌరవం
బునకుంగారణమయ్యె, యాకొలఁదు లేపుల్గూర్చు నీచింతనల్. 154

మ. ప్రళయాంతుండని, చంద్రచూడుఁడని, యల్పక్లేశ సంపాద్యని
స్తుల కారుణ్యుఁడటంచు, నా ఘనతమెచ్చున్ దేవ సంఘంబు, లే
నలరన్ వానికి, తావకాంఘ్రి యుగ నిత్యానందుఁ డన్నంత, నా
పులకల్ ఫుల్ల కదంబరూపములు, హృత్పూజైక సంప్రీణితా! 155

కం. తావక వైష్ణవ మాయా
ప్రావృతములు దోచుచుండు బహు పథములు, వి
ద్యా విద్యల కవ్వల నీ
సేవా భాగ్యంబు లొసఁగ - సేమము గలుగున్. 156

వ. దేవా ! ప్రవృత్తినివృత్తి రూపంబులగు సర్వ ధర్మంబుల జంజాటంబు కరీరకాననంబు; వానినుండి తొలంగుటయ లెస్స, సర్వధర్మంబులు వర్జించి నిన్ను శరణంబుసొచ్చుట యను పరమ ధర్మంబనుష్ఠించినవాఁడు గృతార్థుండు; ఏనుంగు హజ్జయందు సర్వపాదంబులిముడు వడువున భాగవత ధర్మంబున ధర్మాంతరంబు లంతరితమ్ములు, అట్టి భాగవత ధర్మంబు గృపసేయ వలయునన్నఁ, బదపడి పూతక్రతాయీ నయన కజ్జల కళంకిత సహస్ర నయనుండును ప్రాత స్సరవికసిత పద్మోపమ నిటాలతట ఘటిత శయుండును నగు నింద్రుం డిట్లనియె. 157

శా. ఈ మందార వనాంతరంబుల బెడం, గీయప్సర స్సుందరీ
వ్యామగ్రాహ కుచాఽనుషంగములు, హేవాకంబు, లీనాకభూ
స్వామిత్వంబులు - తావకాధర పరిస్పంద చ్ఛితాంకూర వీ
క్షా మోదంబుల కోటి పాలయిన చక్కన్ బోలునే శ్రీపతీ ! 158

మ. శతయజ్ఞంబుల హావళిం గుడిచి-యీశా ! నేనుగై కొన్నదే
మి? తరుణ్యాతత బాహుబంధములు, దుర్మేధల్, వృథామానముల్
మతి నీయందు లగించి. యొక్కపరి శ్రీమన్నాథ ! యన్పింపదీ
వితతైశ్వర్యము, కన్నుదోయిఁ బొరలై వేధించు దుర్గర్వముల్. 159

మ. శ్రుతిసారంబుల సారమైన చరమ శ్లోకంబుఁ జేపట్టి, స
న్మతి నెల్లప్పుడు మానసంబున, "నమో నారాయణా యే"తి, వ
ర్ణతతిం ద్రిప్పెదు భక్తు పాద రజముల్ - నా శీర్ష మందుండని
మ్ము, తరింతున్ భవ సాగరమ్ము, త్రిజగత్పుణ్య ప్రరోహాకృతీ. 160

వ. పితృదేవత లిట్లనిరి. 161

శా. చండక్రోధి నిశాచరుండు మడిసెన్, సాఁగున్ స్వధాపూతముల్
పిండంబుల్ సతిలోదకంబులు, వృథా వీర్యంబు లౌగాక ! యు
ద్దండత్వంబున నిన్నెదిర్చిన సపత్న వ్రాతముల్ గెల్తురే !
ఖండాఽఖండ వివేచనాతిగ కథా కార్పాస ! నేత్రశ్రుతీ ! 162

వ. సిద్ధు లిట్లని విన్నవించిరి— 163

కం. అణిమాదిక సిద్ధులుమా
గుణములు, తద్విభవములను గొనియె నిశాటుం
డణచితి వాని, నివె మా
ప్రణతులు ఘూత్కార నినద పాటిత కుమతీ ! 164

వ. విద్యాధరు లిట్లు వొగడిరి. 165

కం. సద్య స్సంహృతములు మా
విద్యలు గనకాక్షుచేత, పృతనాహత గ
ర్వోద్యన్నిశిచర ! మా స
ద్విద్యల నొసఁగితివి, బ్రదికితిమి నీ కరుణన్. 166

వ. ఆ పయిని, దుస్సహోఽవహేలన ఖరాభుగ్న హృదయులు, మణిమరీ
చిరింఛోళికా విరహితంబులై నిర్వాపిత దీపంబులగు నిశాంతంబులఁ
బోలిన ఫణా మండలంబులు వంచి, పన్నగ సార్వభౌములిట్లనిరి. 167

శా. చూడారత్న విహీనముల్ తలలు, మాశుద్ధాంతముల్ సుందరీ
గాఢాలింగన వంచితంబులుగ, దీర్ఘ శ్వాసముల్, సెల్లెబో
యేడుల్ వందలు, నేటికిన్ గలిగె, నీ యుద్ధ ప్రతాపంబునన్
వ్రీడాబద్ధ సఖీ సుఖంబులు, ఫణా వీథీమణీ చిహ్నముల్. 168

శా. మా పాతాళము, పన్నగేశ్వర ఫణా మాణిక్య రుక్కాంచుకా
రోపంబై తెలి వెన్నెలల్ మలయు సౌరుల్ నింపు, నీరక్కసుం
డేపాపంబున నాక్రమించెనొ ! తమోహేయంబుగానయ్యె, రా
కా పర్యాయము లింకఁ గాంతు లెసఁగున్ కల్యాణ రమ్యాకృతీ ! 169

వ. వసువులిట్లని స్తుతించిరి. 170

కం. ధర్మాఽ ధర్మంబులు గల
మర్మము నీ మాయ, దేవ ! మాదృశులు ముధా
కర్మపు లేదో దోచిన
ధర్మము బాటింతు, మదియ తథ్యంబనుచున్. 171

సీ. వెలికంటికి నధర్మములు గాఁగఁ దోచి, మీ
మాంసింప పరమ ధర్మములు గొన్ని;
కొన్ని ధర్మమ్ములు గోచరించు సధర్మ
పర్యాయములు బుద్ధి పరిణతులకె;
ఏది కర్మ, యకర్మ మేదంచు వివరింప
కవిగణంబులకును కరము నరిది;
విమలురు 'యేన యాంతి మహర్షయః' యటంచు
పెద్దల మార్గంబు తద్దగొలుతు;

గీ. రా మహర్షులు గూడ నీ యంతరంగ
మంతయును, ద్రవ్వి నట్టివా, రగుదురేమి ?
ద్వంద్వ భావంబులెల్ల తావకము లీల;
నిత్య ! నిర్లేప! భావనోన్నిద్రరూప! 172

శా. నీ లీలామయ సృష్టిలో నెవరి పాండిత్యంబు చెల్లున్ మదా
భీలత్వంబున నేము గొప్పయని, తృప్తింజెందుటేకాక-బా
ధాలుంటాకములైన నీ చరణముల్ ధ్యానించుయోగమ్ము, ని
ర్మాలస్యంబుననైన దీనజనబాష్పాహ్వానలుబ్ధాతిథీ! 173

ఆ. ధర్మమందు లేదు, ధనములపై లేదు,
కామమందు లేదు కాంక్షితంబు;
కర్మవశములగుచు ఘటియించు విఘటించు;
నెపుడుఁజెడని భక్తి నిమ్ము దేవ ! 174

వ. ప్రజాపతులిట్లనిరి. 175

శా. ఎంతేపట్టునఁ బెట్టినన్ వినదు, తానేమేమొగోరున్, నిరా
శాంతర్దాహపరీతమై, భృశవిషాదాక్రాంతమై క్రుంగు, నీ
స్వాంతంబన్నది, యొక్క శాపభరమై వచ్చెన్ జగత్స్వామి! మా
స్వాంతంబెల్లను నీవుగా నిలిచి, యాశాపాశముల్ ద్రుంపవే! 176

ఉ. ఆర్త శరణ్య! కోర్కెలు విషాన్నమువంటివి, సేమమిచ్చునే!
మూర్తములైన పాపములు, మోహనిబద్ధు లెఱింగెరింగి, యా
గర్తములందు జొచ్చెదము-గావుము మమ్మనుకంపతో ముహు
ర్నర్తితకాములన్, బహుతరక్రమకశ్మల లౌల్యధాములన్. 177

చ. అమరులు దొడ్డవారలని, యాశలు లేవని, తాము గోరు కా
మములను దీర్తురంచు, భువి మర్త్యులు మమ్ము ప్రశంససేతు, రీ
యమరులసేఁగి నీకెఱుక, యంతములేని హృదంతరాక్రమ
త్తమములు, దివ్యవారవనితా జనతా లలితానుషంగముల్. 178

వ. గంధర్వులిట్లు విన్నవించిరి. 179

మ. ఇదె వచ్చెన్ పలలాశి, వచ్చెననుచున్ హేలాగతింబల్కినన్
మదులుత్కంపము జెంది, రాగముల సాంకర్యంబునై, మాటలో
బదముల్ దొట్రిల కుప్పఁగూలెదము, యభ్యస్తంబులే క్రొత్తలై
ప్రిదులున్, పల్లవులున్, స్వరావళులు తీరెన్నేడు మా యాపదల్. 180

వ. యక్షులిట్లు వచించిరి. 181

కం. దేవా ! వినయస్విన్నము,
కైవారమునీకు, మమ్ముగాచితివి, దయా
భావంబున, మావెన్నులు
కావలుఁడగు వీనిమోచి కాయలు గాచెన్. 182

వ. వైతాళికులిట్లు నుతియించిరి. 183

కం. పారాఽతిగోర్మి కరుణా
వారాంనిధి ! నిన్ను దడవ వశమా ! వాచా
పారమ్యమ్ములను, నమ
స్కారము, నిఖిలేశ ! భక్తజాలనివేశా ! 184

ఉ. నీ శుభగత్వముల్వొలుక నేరకయుంటిమి, కంతమెత్తి, శ్రీ
వాస! నిశాచరేంద్రునకు వార్తలువెళ్లునొ యంచు, వల్లకీ
యోషలు క్రమరాగముల నుల్లములందె యడంచికొన్న వా
సాసల జావనట్టి బ్రదుకైనది; రాక్షసవంశమర్దనా ! 185

చ. మృదుమధురంబు దక్షిణసమీరము వీచినయంత, నీచతా
స్పద మగు రాక్షసేంద్రుని హజారము చెంతల నిల్చి, మానముల్
సదమదమై, కదుష్ణజల, సంభరితమ్ములు కన్నులై, వగన్
కెవికెదు గొంతులీడ్చి, పఠికింతుము సుమ్ము ! వసంతరాగముల్ ! 186

శా. స్వామీ! రాగములందు గణ్యములు గావా! సారదేశాక్షియున్
సామోదంబగు నాట, యీ యుభయమా జల్పాక కీర్తిస్తుతి
వ్యామిశ్రంబు కళంకితంబయిన, దాహా! యింక యేనోటితో
ప్రేమార్ద్రింబుగఁ బాడ నేర్చెదము;తండ్రీ! నిన్ను సంధ్యాద్వయిన్. 187

ఆ. నేటికైన యసుర నీల్గెను, సేమమై
నది; సురాళి కెల్ల బ్రదుకు గలిగె;
ముదిర దేహ! యింక ముదముతో నీకీర్తి
బాడుకొందుమయ్య ! భయము దలఁగి. 188

వ. కిన్నరులిట్లు భాషించిరి. 183

మ. కలపుంస్కోకిల కాకలీరవ కుహూకారంబులై యామినుల్
సొలపుల్వోయిననేమి ? మాసతులు, తచ్ఛుద్ధాంత సేవా సమా
కలితల్, దుస్తర విప్రయోగభర దుఃఖాగ్నిచ్ఛటా దగ్ధులై
యిలపై నిల్చితి మీదినంబు కొఱకై హేరాళ శౌర్యోద్ధతీ ! 189

వ. మదనుండిట్లనియె. 191

శా. కామాదు ల్బహుళాఘమూలమని వక్కాణింత్రు, కానీ జగ
క్షేమాధారములంచు నీకెఱుక, తత్క్రీడా సమాకృష్టముల్
తామాశించు మహాప్రవృత్తులను భూతవ్రాత మధ్యాత్మవి
ద్యామర్మంబుల పైని యాసలును దేవా ! కామహేలావిధుల్. 192

శా. నీ సంకల్పమె కాముఁ డంచుఁ బొడవై నిల్వన్, మహాసృష్టిలో
వాసించెన్ మధురానుషంగములఁ భావసిద్ధత, ల్నిత్యలీ
లా సమ్మర్దము, లేమి చెప్పుదును; నాలావెల్ల రాత్రించర
ప్రభూ సంకేత వశంవదం బగుచు, చొప్పల్ దప్పె లక్ష్మీపతీ ! 193

ఆ. అతని కెపుడు వలయు, నప్పుడే కామంబు
గలుగవలయు, లేక కలుగ రాదు,
యంత్రమయ్యె బ్రదుకు, హరిహరీ! యింక యీ
పుడమి పైని పట్టువిడుపులేవి! 194

కం. నశియించె నసుర! గర్వో
ల్లసితుండిక, సృష్టిలీల లాస్యము సేయున్
ప్రస్మరకామాదికమై,
వశీకృతేంద్రియ నికాయ భక్తచరితమై. 195

వ. ఆదిమునులిట్లు స్తుతించిరి. 196

సీ. దండంబునీకు నిత్థంభూతతేజో వి
రాజిత దంష్ట్రికరాళవదన!
ప్రణతులు నీకు దుర్వారభ్రూకుటికుటీ
కుటిలేక్షణా వికంకట నిటాల!

సాష్టాంగ మగు నమస్కారమ్ము రుచిజాల
శోభితాస్త్రౌఘ బాహాభిరామ!
యేటికోళ్ళయ్య! వాగీశాది నిష్ణాత
భావనాతీత లీలావతార!

గీ. నతులు నీకు స్వయంభు! ఆమ్నాయసార!
యజ్ఞమయరూప! శమితజీవాభితాప!
మమ్ము గరుణించి యింక సౌమ్యస్వరూప
మొనరగై సేసి, లోకంబులోమవయ్య!! 197

కం. దనుజుండీల్గెను, ధరణీ
వనజాయత నేత్ర, పులకపటలకలితయై
నిను సేవింపఁగ నిలిచిన
దనుకంప రహింపఁ జూడు, మాదివరాహా! 198

మ. నిను త్రైగుణ్యములైన వేదములతో, నేర్వంగనూహించి, తా
లున ధాన్యంబున కాస జేయుగతి, యీలోకంబునోవున్, సమ
ర్పణతాదృక్కులు నిన్నుఁ జేరెదరు నిస్త్రైగుణ్య మార్గంబునన్
ధనదారాదులు నీప్రసాదమను తాత్పర్యంబు పాథేయమై. 199

మ. కులగోత్రంబులు, తేజమున్ శ్రుతము, నక్షుద్రంబు శీలంబు, ని
స్తుల సౌభాగ్యము, లందచందములు నుద్యోగంబులున్ నీపద
మ్ములు చూపింపఁగనేర, వార్ధ్రిహృదులౌ పుణ్యుల్ నిరీక్షింత్రు, ని
ర్మల యోగంబున, ప్రేమబాష్పమయ మాలాధ్యాతనామాంకులై. 200

మ. కడునాచారపరుండనంచు, విమలజ్ఞానాత్మవాదంబు లె
క్కడు పాటించితినంచు గర్వమున నిక్కుల్వోవు భూదేవుఁ డె
న్నఁడు నిన్ జూడఁగలేఁడు; జాతికృతచండాలుండు దర్శించు నీ
యడుగుల్, తీవ్రము భక్తియోగమునఁ దేవా! దీనరక్షామణీ! 201

శా. నీవేతప్ప నితఃపరంబెఱుగ, మున్నిద్రానురాగమ్ము, మా
పైవర్షించుచు, జేయు విన్నపములన్ బాటించి రక్షింపు, మీ
దేవద్రోహి గతించెనింక, గరుణాధీనమ్ము రూపమ్ము వీ
క్షావైశద్యమొనర్ప మమ్ముకృతులన్ గావింపు విశ్వేశ్వరా! 202

మ. స్మితచంద్రాతప, మబ్ధిజాబహుమతశ్రీగంధ సంవాసితం
బతసీనీల శరీర, మూత్తవనమాలా పీనవక్షమ్ము, కుం
చిత కేశంబగు నీస్వరూపమును, మా చేతంబు రంజిల్లి యౌ
వతసాధర్మ్యమునొందఁ, యందముల ప్రోవై యింకఁ జూపింపవే. 203

శా. నీ సౌందర్యముగన్న యప్పుడు-మనోనిర్వాణమై, కామవాం
ఛా సౌరభ్యములావరించి, యబలాసామ్యంబు, నీజ్ఞాన రూ
పాసక్తుల్ వికసించి నష్ట పురుషత్వంబంది, మాజాతి యే
చో! శంకాస్పదమౌను, దీనజనబంధూ! ప్రేమవారాంనిధీ! 204

ఆ. ఉపశమింపవయ్య! యుగ్రరూపంబును
పుణ్యనికరగేహ! భూవరాహ!
తాల్పవయ్యరూపు! తాపాపనోదంబు,
కోపులలర, కోటి కోటి మదన! 205

మ. అతిమాయాశబలాత్మ, లల్పతర ధర్మాఽసక్తు, లైదంసుఖ
ప్రతతాశల్, ఖువిమానవుల్, భవదుదగ్రంబైన రూపంబు స
న్మతిసేవింపఁగ లేరు, వారికి దృగానందంబు సంధిల్ల. సౌ
మ్యతనూభాసితమూర్తివై నిలుము దేవా! లోకముప్పొంగగన్. 206

శా. కామాపేతము, భక్తి సేయవలఁతుల్గా రిద్ధరన్ మర్త్యులు
ద్దామంబుల్ పెనవైచు నాసలు-మనోధామంబులన్నిల్చి, త
త్కామంబుల్ నెరవేర్చి, మందగతిమోక్షాసక్తి గల్పింపు మో
స్వామీ! జీవులు నీ కుటుంబములు గావా! కిన్కసో కొప్పునే!. 207

వ. హవిరాజ్యంబులచేత హవ్యవహుండు పరివర్ధనంబందు తెఱంగున కామంబులు కామంబులక కారణంబులగునని యందువేని దేవా! యేమి సేయంగల వారము! దుర్వారంబులగు కామాదులు మా పట్టునఁబడవు. చిత్తంబునఁగల తెఱంగున నొనర్చి హృదయంబుల నివాతదీపంబుల పగిది నీ ధ్యానంబున నుండునట్లొనర్పుము. కొందఱు వివేకంబున కామాదులు నిర్జించి మర్కటకిశోర న్యాయంబున నిన్నుంజేరెదమందురు. శ్రీనివాసా! అనంతంబగు వైష్ణవమాయ వివేకంబున నిర్జింపఁదలచుట సముద్రంబునకుఁ దూమెత్తుటయ కాదె! తమ యహంకృతిని దన్పుటకు వివేకవాదంబు సేయుటగాక, దాన మాయావిజయంబు శశశృంగంబు; గగనపుష్పంబు; మరీచికా మేఘాడంబరంబు. సర్వదోషాకరుండయ్యును భవచ్చరణారవిందంబుల భక్తిసేయు మానవునకు జంబాలజాతంబగు జలజాతంబునఁ గర్దమం బంటని తెఱంగునఁ గలుషంబులంటవు. సర్వానుభవంబులును నీయందు సమర్పింపఁబడి, స్పర్శవేది సంగమంబునఁ గాంచనత్వమందిన లోహాంతరంబులవలె, శుద్ధంబులగు. కారుణ్య సుధాకర! నీకుఁ గల్పపర్యంతంబు నమోవాకంబులని మరియు నిట్లనిరి. 208

సీ. రాజస తామసారంభ జాలావృతు
లగ్గొఱమాలు యశమును దొరతనంబు
పసిడియుఁగోరి, దెప్పరముగాఁ జిలువాయ
నపు దేవతలఁగొల్చి, యపుడ నిన్ను
మఱచి, సంసారసాగరమున మున్కలై
బవిరె జుట్టెదరు దేవా! యనశ్వ
రంబైన మోక్షసామ్రాజ్యలక్ష్మి మహా
పదవి నీ తంఁపులోనిదియ కాన

గీ. ననఘ! కామంబులొసఁగిన నైన, నీవు
క్రమముగాఁ జూపఁగలవు మోక్షంపు తెరువు
శ్రీసతీ పాద జతురసాశ్లిష్ట హృదయ!
సత్యసార! పంచోపనిషచ్ఛరీర! 209

గీ. సకలవిబుధులు నీకు నంశంబులగుట
దేవతాంతరములను నిందింపఁబోక,
కోర్కెగలిగియున్నైన, లేకున్ననైన
నిన్ను గొలిచెడు మర్త్యుండు నిపుణతముఁడు. 210

సీ. ధ్యానయోగమ్ము కృతమ్మున యందు, య
జ్ఞాదులు త్రేతయం, దతుల భజన
ములు వివిధార్చనమ్ములు ద్వాపరమ్మున
నిన్నుఁ జేఱఁగఁదగు తెన్నులనిరి;
పరమర్షు లఖిల పాపద్రుమంబగు కలిఁ
దావకనామంబు దవిలి సేయు
మనుజుండు మోక్షసామ్రాజ్యాధినేత, హృ
షీకమ్ము లదుపున లేకయుంట

గీ. నట్టిమర్త్యులు దనియ నర్చావతార!
సర్వమాధుర్యముల నివాసంబు నగుచు
దివ్య వైకుంఠధామంబు దీటుగాఁగ
గొలువు దీర్పంగవలయు భూతలమునందు. 211

కం. ఒకపరి నిన్నుం జూచిన,
సుకముల కొల నగుచు మనసు సొక్క నరుఁడు నీ
యకలంక రూప మదిరా-
ధికమత్తుఁడు గావలెన్ సుధీజనసేవ్యా! 212

ఆ. నిన్నుఁ జూచు సతుల కన్నులు, నీ రూప
మునకు వలఁచి కర్ణములను దాకి-
మనసు నీదు వలపె మఱఁగి, భావాద్వైత
మందవలయు మందహాస హృదయ! 213

మ. అని ప్రార్థించిన నంబుజోదరుఁడు హాసాంకూరముల్ నెమ్మొగ
మ్మును గై సేయఁగ, హ స్తము ల్మోగిచి, మిమ్ముంగాదటం చెన్నడై
నను నేఁ బోవఁగ నే ర్తునే? విమల శాంత్యాకార నిష్ఠాతపో
ధనులౌ మౌనుల యాజ్ఞ, మ స్తమున మందారమ్ము మాపాలికిన్. 214

ఆ. ఏము, జగములోము యినులమైనచొ, మమ్మ
నోము విభులు మీర లీ మహత్వ
మీరమాశ్రయత్వ, మీలోకపూజ్యత
భవదపంకచరణ భజన ఫలము. 215

మ. మునులారా! భవదీయ భ క్తినిగళంబుంగట్టి యెచ్చోటికిన్
గానిపో నేర్తురా! నన్ను, నచ్చటనె నాకున్ శ్రీవికుంఠమ్ము, మీ
ప్రణతుల్ నాకు, సుకంబు గూర్చునటు దీవ్య ద్భార్గవీ సౌమ్య చాం
దనికంబైన శరీరమున్ మనసుదన్నన్ లేదు నిక్కంబుగన్. 216

మ. గుణహీనుండను, సర్వభో క్తను, మహా గూఢ ప్రకారుండ, నెం
దున సంవాదములేని వాఁడను, సదా దోషాకరాత్ముండ, ని
య్యణువున్ మీరు మహత్తుగాఁ దలఁచి సేవాస క్తి గాంక్షింపఁ గా
దనఁగా నేర్తునె! వేయి సారులుగ, ధన్యోఽహం, యథార్థంబుగన్. 217

శా. నాపై నాసలు దప్ప, నన్యగతి చింతల్లేని యేకాంత ని
ష్ఠాపూతాత్ముల దివ్యదర్శన మృదు వ్యాహార పారంపరీ
చాపల్యంబునఁగాదె! తాల్చితిమి, యీ సాకార రూపంబు, భ
క్త్యాపూర్ణాత్ములకేను బంటనుట, నేడా! కొ త్త వాక్రువ్వగన్. 218

ఆ. పరమ భ క్తవరుల పాదధూళికిని వే
కారినటులు, వేద పారదృశ్యు
లైన వారి సేయు యాజ్యాహుతులకు, వే
కార నెడఁద యందుఁ గల్లగాదు. 219

మ. మహిమోపేతములైన భక్తపద పద్మవ్రాత ధూళీసము
ద్వహనోత్సాహ శిరస్కుఁ డౌకతన గాదా! మత్పదోద్భూతయై
మహనీయంబయి జాహ్నవీసతి జగన్మాలిన్యముల్ బాచు, న
య్యహికోటీరు శిరస్థలిన్వెలుగు, దివ్యన్నిత్య సౌభాగ్యయై. 220

వ. మీ యానతి నవశ్యంబ బాటింతునని పలికి, యప్పరమపురుషుండు, బ్రహ్మాది దేవతలఁ గాంచి యిట్లనియె. 221

సీ. ఇది వేంకటాచలం బిది వికుంఠంబున
కెట్లు తూచిన చిన్న మెత్తు హెచ్చు,
ఇది తపంబులగని ఇది నా శరీరంబు
కైవల్యమునకును గట్టి లంకె,
ఇది సర్వ తీర్థాళి కీడితాశ్రయము, ల
క్ష్మీ కరంబైనట్టి సిద్ధిభూమి,
ఇది ప్రేమ భక్తుల కిలువాసి, తత్పదా
ర్పణ భాగ్యనిచుళిత ప్రతిపదంబు

గీ. వాస మొనరింతు నిందు శాశ్వతముగాఁగ
భావము గఱంచు నట్టి యర్చావతార
మూని సద్భక్తకులముల యుల్లములఁ బ్ర
మోద మిగురింప, కాఱమే పులకరింప. 222

శా. ఈ నాక్షేత్రమునందు, నల్పతపమున్ హేలాగతిన్ జేసినన్
నానాసిద్ధులు 'మేము-మేమ'-నుచు జెంతం జేరు, కారుణ్య ల
క్ష్మీ నిత్యోత్సవ! మిమ్మహాతలమునన్ కించిత్సదాచార ని
ష్ఠా నైశ్చల్యము నాను వాడు గను, దుస్సాధంబు గైవల్యమున్. 223

సీ. లేవడిలోఁ గ్రుంగు జీవనంబగు వారి
పాలికి పెరటి కల్పంబ నగుచు,
నతివేల విప్రయోగాకుల హృదయ కై
తల్యంబు గూర్చు బాంధవుఁడనగుచు,

ప్రారబ్ధవార్ధి సంభవ హాలాహలగదా
వ్యథలు ద్రావఁగ మహేశ్వరుఁడ నగుచు,
ససి దొఱంగిన యభీష్టములు పుష్పించితా
వులునింప నామని ప్రొద్దునగుచు,

గీ. పాప సంగతి దప్ప నెవ్వరికి నెట్లు
వలయునో యట్లు కోర్కులగ్గలము గురిసి
శ్రీనివాసుండు సద్భక్త సేవకుండు
నాఁగ, నిలచెద నిమ్మహానగమునందు. 224

కం. శ్రీభూమీ సహితము, వర
దాభయహస్తంబు-రత్నహాటక ముకుట
ప్రాభాతిక కాంతికమగు
నా భద్రము తనువు-వీక్షణంబులు తనుపున్. 225

వ. మన్మూర్త్యంతరంబులగు బ్రహ్మవాదుల పలుకులు పరమసత్యంబులగు గాక! యని పలికి నిగమాఽనూహ్యంబును, భక్తగుహ్యంబునునగు యజ్ఞపోత్రి మాయావతారం బంతర్హితంబైన, బ్రహ్మాదిదేవతలు విస్మృమర పులకవిసర సమ్ముద్రిత సంహననులు భక్తిబాష్పకర్దమిత వదనులునయి, సమౌనికంబుగా నద్దిక్కునకు నమస్కారంబు లాచరించి, పెన్నిధి గోల్పడిన పేదల విధంబున, పెద్దయుఁ జింతించు హృదయంబుల తమతమ నివేశంబులకుం జనిరని చెప్పిన సత్రయాగ దీక్షితులైన మహర్షులిట్లనిరి. 226

శా. ధీరోత్తంసులు, శేముషీపరిణతుల్, తృష్ణావిహీనాత్మ, లా
త్మారాముల్, మదిఁగోర్కెలేకయును, నిత్యంబే జగన్నాథు చిం
తారామంబుల విశ్రమింతురో! తదీయస్వచ్ఛ చారిత్ర గం
గారోధస్విని నోలలాడుటలకన్నఁ హెచ్చు మేలున్నదే! 227

కం. అనుభవము దీరినంతన
మనమున వెగటౌను, లోకమమతలు, సేవిం
చినకొలఁది గ్రొత్తచవులై
యనుపమహర్షంబుఁ గూర్చు హరిచరితంబుల్. 228

మ. హరిఁ జింతింపక, కర్మగౌరవములందాసక్తి భావించి త
త్పరులై, కుత్సిత కర్మతంత్రముల చార్వాకంబు గావించు, న
న్నరులేనాటికినైన, కర్మజ మహంకారంబు బోఁదట్టి, దు
స్తర సంసారము దాటనేర్తురె! ఫలాఽఽశాకృష్టచేతస్కులై. 229

ఆ. కర్మతంత్రములను గలయంత నడపుచుఁ
గట్టువడక మనసు గట్టివఱచి
తనువు, జీవనమ్ము, దైవార్పణము సేసి
బ్రదుకువాఁడు మేలుపడెడువాఁడు. 230

కం. హరిగుణ కథనము బ్రదుకై
హరిభక్తుల చెలిమి మంత్రమై విభుమాయా
పరవశతలేని నీస్థితి
యరుదుగదా! సూత! సంవిదర్చిరుపేతా! 231

సీ. వైవస్వతంబు మన్వంతరంబున పూర్వ
కృతయుగంబున దేవఋషులు గొల్వ
కొలువున్న దైత్యభిత్కులిశ దంష్ట్రాదంతు
రితముఖాబ్జమువాని, వితతనయన
ములనుండి దొఱఁగు వెన్నెలవాని, కైతవ
కిటిరూపముననున్న హరినిఁ జూచి
సాగరాంబరధరా జలజాతనేత్రి, త
ద్దయు భక్తిదెందంబు దందడిల్ల

గీ. అష్టమీ చంద్రతుల్య ఫాలాంతరమున
కలువ మొగడలు వోని చేతులు మొగిడ్చి
కొదమచూపులఁ గోర్కెలు కొనలుసాఁగ
పలికె నిట్లు విపంచికాతులిత వాణి. 232

కం. నాతోనఁ గలిసి తిరిగెదు,
చేతము జిగిరింపఁజేతు, శీతలమృదువా
క్స్రోతముల, తెలిసినట్టులె
యై తెలియదు నీదు జాడ యఖిలాండపతీ! 233

చ. ఒక పరి బాహుబంధమున నొత్తికరంగెదు జీవితంబె కా
నిక యయినట్టులీ యెదకు, నిస్తుల భావతరంగ డోలికా
నికరపరీతమూర్తి! గమనించిన వేరొకసారి క్రొత్తలై
సుకముల కచ్చు, నా మొకము సూడవు, నిత్యవియోగి వైఖరిన్. 234

ఆ. ప్రభువ! హితులెవ్వ, రహితులెవ్వారు నీకు,
నిత్యలీలాధ్వనీన నిర్నిద్రమతికి!
కలుగు జీవుల శార్యక్షములుగఁ జేసి
యటమటంబుగ, గల్లలాడుటలెగాని. 235

కం. దేవా! యేమంత్రంబున
భావించిన నిన్ను, కోర్కె పండగ బ్రదుకే
నీవై రక్షించెదవో!
కావల మగు మాయ మనసు గప్పక యుండన్. 236

శా. ఆ మంత్రం బుపదేశమిమ్ము, రసవద్వ్యాహార! వర్తింప నే
నేమమ్మో, సెలవిమ్ము; సమ్మతముగా నిష్ఠింతు నన్నంత, మ
ల్లీ మాలాయిత మందహాసలహరీ లీలాధర స్యంది వా
చా మోదమ్మున మాధవుండనియె, నేత్రాలోలరమ్యంబుగన్. 237

సీ. ఈ వెఱుంగని మంత్ర మేమున్నయది, జర
 త్కలహంసనాద మేఖల ! జగమ్ము
సేమమ్ము గోరి వాంఛించుచే గాక యె
 నను వచించెదవిను, మనుపమాంగి !
సంకర్షణుఁడు ఋషి, ఛందంబు పంక్తి, దే
 వత నేన, శ్రీంబీజ పరివృతమ్ము,
కరుణాళులైన సద్గురు నుపదేశమ్ము
 పసిడికి వలపైన భాతిసుమ్ము !

గీ. ప్రథమ దివసంబునందు నేపాటి జపమొ !
యట్ల నెరవేర్ప వలయు నిత్యమ్ము, నాల్గు
లక్ష లైనంత మనువు, ప్రత్యక్ష సిద్ధి
శుక కలాలాప ! వినయ భాసుర కలాప ! 238

శా. స్వాహాకాంతుని, యందు సర్పియుతమౌ క్షౌద్రమ్ము, శీతాంశురే
ఖాహంకార నికారగోధి ! రసపద్యాపాయసాన్నంబుతో
నాహోవుట్టఁగ వ్రేల్పఁగా వలయు, ఘోణాప్యాయ సౌగంధ్య ధా
రేహల్లోహల భృంగ ఝుంకృతులు దా మేపారి త్రోపాడగన్. 239

ఆ. వినుము ధ్యానప్రకారంబు విద్రుమాంభ
నఖరదచ్ఛద శయపదాంతర ! మనమ్ము
శాణమిది, బాహ్యవాసనా శతసహస్ర
వైరి హంవీర మస్త విదారణమ్ము. 240

సీ. కూర్మ పృష్ఠమ్ముపైఁగొమరొందు కాకోద
 రస్వామి శరదబ్జరమ్యమూర్తి,
పఱపైన తత్ఫణాప్రాసాదములపైని
 ప్రతప్త రత్నాంశుక ప్రావరణము

శాతమన్యవ ధను స్స్ఫర్ధి రత్నప్రభా
సరసిలో నొక సహస్రచ్ఛదమ్ము
దాని కర్ణిక పైని, తారుణ్య లావణ్య
ఖురళికాయిత మహాక్రోడమూర్తి

గీ. బ్రహ్మ విద్యా సముల్లాస పరమ మౌని
పృథు జటా కూట నిరత సంస్పృష్టపదుఁడు
హతనిశాట ప్రతాప ధారానుషంగ
రంజిత మనోజ్ఞ చరణోదరమ్ము వాఁడు. 241

శా. భావింపన్వలె, నవ్వరాహమయ వేదాధ్యాసితున్ స్ఫాటిక
శ్రీవైయాత్యజయిష్ణు, హృద్యతర మూర్తి స్ఫూర్తి, రాజీవరా
జీవాక్షున్, కలశాబ్ధి జాతమణి రాశీభూతకోటీర కాం
త్యావిష్కారుని, సద్దయామృత పరీపాకాయితోద్యక్షునిన్. 242

సీ. బాహా చతుష్కంబు పరిపంథి శైల మ
స్తక కూట వజ్ర పాతాయితమ్ము,
నొక కరమ్మున చక్రము, కఠోరధర్మ లుం
టాకదైతేయ కంఠచ్ఛిదమ్ము
హస్తాంతరమ్మునం దత్యబ్జగౌర సుం
దర పాంచజన్య ముద్ధురనినాద
యభయ హస్తం, బర్పితాత్మీయ తనుమనో
ధన భక్త రక్షణా తత్పరంబు

గీ. పద్మ మొకచేత, మకరంద పారణా ప
రాయణ భ్రమరీ మంజు లాలపనము
పాటలీ పరివాది దీవ్యద్ధిరణ్య
రక్త పీతాంబరమ్ము గాత్రమున యందు. 243

కం. పాటల మణి గణకాంత్యు
చ్ఛాటిత సంధ్యాంబరముగ కాయంబై, వా
చాటోప పంచబాణ
జ్యాటంకృతి రక్త మాల్య చందన యుతమై. 244

గీ. నిన్ను వామోరువునయందు నెమ్మిదాల్చి
వెలయుచుండెడు నన్ను భావింపవలయు
నూటయెన్మిది మాత్ర కేనాటికేని
లోటు గారాదు జపసంఖ్య, లోలనేత్రి ! 245

సీ. ఓంకార బీజ సంయుక్తంబు తొలుదొల్త
నాపై నమశ్శబ్ద రోపితమ్ము,
పరుస చతుర్థీ విభక్తికమ్మగు వరా
హమ్ము, శ్రీవర్ణికాధ్యాసితమ్ము;
ధరణి శబ్దంబునుద్ధరణ వర్ణమ్ము చే
సమసితమ్ము, చతుర్థి సంశ్రితమ్ము,
వహ్నిజాయాంతమ్ము, వాసిలోత్పల వర్ణ
లోక కల్యాణ కృత్యైకరాక్షి !
గీ. మను తనూరూపమిది, జగన్మాన్య చరిత్ర !
యాశ్రితాచారులై దీని నహరహమ్ము
జపము గావించు వారి వాంఛా ప్రపూర్తి
వెలది! మంచాన గట్టిన వేల్పుగిడ్డి ! 246

చ. కృతయుగమందు దీని జపియించెను ధర్ముడు నిత్యనిష్ఠుఁడై,
శతధృతిచేత దాఁ బడసి, చారుముఖీ ! తుదినన్నుగాంచి,తా
నతులికధర్మనిర్వహణమై మతియుండ వరంబుగాంచి,యు
న్నతిగనె వేదవాడుల, ననామయ ధర్మ కరంబితర్థియై. 247

కం. దుర్వాస శ్శాపానిల
నిర్వాపిత నాకరాజ్య నిశ్శ్రీకుండై
పూర్వమున తురాసాహుఁ డ
ఖర్వవ్రతనిష్ఠ, దీనిఁగడఁగి జపించెన్. 248

మ. విధియుక్తమ్ముగ మంత్రవర్ణములతో వేల్చెన్ బృహద్భానుఁ, న
య్యదనన్ నాదగు దర్శనంబగుచు, రోషావిష్టమౌనీంద్ర శా
పదశాసాదిత దుఃఖముల్ దలఁగి-స్వర్వాసంబు సిద్ధించె, కా
మద కల్పాగ పరంపరారచితభూమశ్రీ సదాలోకమై. 249

సీ. కద్రూ మహాదేవి గణనీయ పుత్రుండు
తారాద్రితులితావదాత మూర్తి,
పన్నగకుల సార్వభౌమతాస్థితిశాలి
కాకోదరాయశః కతకఫలము,
బ్రహ్మాండ భాండధూర్వహ ఫణామండలుం
డమలదుగ్ధాబ్ధి విహారశీలి,
మత్తనూశశ్వదర్చాత్త గౌరవశోభి
జటిలభాష్యగ్రంథ శాబ్దికుండు,

గీ. శేషుఁడఖిల ప్రపంచ విశేష శాలి
కశ్యపులనుండి యీ మనుక్రమమెఱింగి
యోలి సాధించి-యీ శేషశైలమగుచు,
నన్ను సేవించుచున్నాఁడు, సన్నుతాంగి ! 250

కం. ఐశ్వర్య విధాయకమిది
నశ్వరమైశ్వర్యమనుచు, ననుదలఁచెడు యో
గీశ్వరులకు మోక్షద మిది
విశ్వక్షేమంకరంబు, విమలేందుముఖీ ! 251

చ. అని వచియించి, దీన భవదర్థితమౌ విషయంబు విప్పి చె
ప్పినమటులయ్యె గాదె ! యని పిన్నని నవ్వున సూతుఁడన్న, న
మ్మునిగణమెల్ల హర్షజలపూరిత నిశ్చలనేత్ర పద్మమ
య్యెను, భృశసుందరంబుగ సమీహిత 'మౌన'-సమోదముద్రతోన్. 252

ఆ. మరల పలికిరి మునులు, ధీమహితవృత్తి
స్వామి పుష్కరిణికి నెందు సవతులే ద
టంచు విందుము; తన్మహిమానువర్ణ
నమ్ము గావింపగదవె ! ప్రియమ్ముగాఁగ. 253

గీ. ఆలకించి వారి యభ్యర్థనమ్ము, సు
క్షేత్రమందు విత్తు, కృషికువంటి
యాత్మతృప్తి, బొదలి, యానందమున బొంది
శోభనాక్షరముగ సూతుఁడనియె. 254

సీ. మునులార! వినిపింతు వినుఁడు శ్రీస్వామిపు
ష్కరిణి సామాన్యకాసార మనుచుఁ
దలపోయుటెగ్గు, తజ్జలము లప్రాకృతం
బులు, వికుంఠంబున జలజనయనుఁ
డనుభవించినయవి, యబ్జజాచరణలా
క్షాధరాకబరికా కల్పకుసుమ
పరిగంధిలమ్ములు; పాపాపనోదకం
బైనయా సరసి విహంగవిభుఁడు

గీ. శేషశైలంబుతోఁ బ్రతిష్ఠించె ధరణి,
ముక్తిసీమంతినీ మనోమోహకంబు,
ముకురమైనట్టి తత్తీర్థమునకు జోడు
నెమకి చూచిన విశ్వవిశ్వమున లేదు. 255

గీ. అంఘ్రిజంబైన గంగ సర్వాఘములకు
వేఱువిత్తట! స్వామి శరీరమెల్ల
నంటఁగా నోలలాడిన యట్టి సరసి
యేనముల గ్రొచ్చి శుభముల నిచ్చుటరుదె ! 256

సీ. అమృతరసస్యంది యైన యష్టాక్షరీ
మంత్రంబు కన్న సన్మనువులేదు,
వైకుంఠుఁ దృప్తిఁగొల్పఁగ నవ్యతులసికా
ర్పణకంటె భిన్నమర్చనము లేదు,
సకలేశు భక్తుఁడౌటకు హృదయోపహా
రము కంటె వేఱుమార్గమ్ము లేదు,
జ్ఞానోదయమునకు సజ్జనాశ్రయణమ్ము
కంటెను పెఱ యొడికంబు లేదు,

గీ. పరమపదమివ్వ దేవతా పరిబృఢుండు
వాసుదేవుని కన్న దైవమ్ము లేదు,
యైహికంబులఁ దీర్ప నియ్యవనియందు
స్వామిసరమున కన్న నాశ్రయము లేదు. 257

సీ. అతివేల యవ్వనాంధ్యము గ్రమ్మ, గురుతల్ప
మున శయించిన యట్టి చెనటిపుట్టు,
నమ్మియిచ్చిన హిరణ్యమ్ము గాఁజేసిన
పాపభాక్కులలోన ప్రథమ జనుఁడు,
స్వైరిణీ సురభి నిశ్వాసవాసిత సురా
పాన జంబాలిక వర్తనుండు,
గరదుండు, పుడమిపైఁ దిరుగు దేవతయైన
నిసుఁగు జంపిన దయా నిస్స్వహృదయు,

గీ. డింక తక్కిన దుశ్శీలు రెవ్వరేని
మనసు తీవ్రపశ్చాత్తాపమునను వ్రేల్చి
దలఁగడగికొన్న, కలుషముల్దలఁగి పోవు,
దండధరతీవ్ర బాధా విధాయకములు. 258

శా. స్నానంబుత్తమ, మద్ది కానిదయినన్ సంస్పర్శ, తత్కష్టమున్
బూనన్నేరనివాడు దర్శనమునన్ బొందున్ మహాభద్రముల్
పానంబుత్తమ, మద్ది కానిదయినన్, భక్త్యార్ద్రచిత్తంబునన్
ధ్యానింపన్ దొరకొన్న వానికగు నుత్తాలంబు లిష్టార్థముల్. 259

గీ. ఎఱుఁగనేరరు బ్రహ్మాదు, లింద్రవర ఫ
ణీంద్ర వీంద్రులు దెలియరు, నిగమపురుష,
డెఱుఁగునో లేదొ! పరశివుండెఱుఁగు సగము
స్వామిపుష్కరిణీస్నాన జనితఫలము. 260

కం. దేవాదుల కంటెను ఘను
లా విమలసరోఽవగాహులై తన్నామ
శ్రీవాసితవదనులుగా
నావాసమొనర్చు జనము లభ్యర్ణమునన్. 261

వ. తచ్ఛైలస్వరూపంబును, స్వామి పుష్కరిణీ దివ్యానుభావంబును మాయా మలీమసులగు మానవుల చర్మచక్షువుల కగోచరంబులైనను, భక్త్యను గుణంబుగ ఫలంబులొసఁగి, రక్షించు నిది నిశ్చయ్యత్యూహంబు. 262

సీ. దేవతాంతరముల భావింప కబ్జాక్షు
నకుఁ గూర్చునట్టి సాత్త్వికము భక్తి
పరదైవమైన సద్గురుని పాదమ్ములు
భావింప నేర్చిన ప్రాభవమ్ము

హరితనువైనట్టి హరివాసరంబున
తులసీ జలముగ్రోలు దొడ్డ తపసు
నడయాడు నారాయణ స్వరూపులు, భాగ
వతులఁ నర్చించు కేవలము శాంతి

గీ. యెంత దుర్లభమో, భక్తి యివతళించి
స్వామిసరమునఁ జేయు నాప్లావనమ్ము
నంతదుర్లభ మట్టి భాగ్యంబువాఁడు
క్షోణితలమున మఱుజన్మ లేనివాఁడు॥ 263

సీ. కంజాక్ష పాదయుగ్మ ప్రీతి తేనెగా
కమ్మతావుల సరోజమ్ములగుచు
నాయికాభక్తి ప్రసన్నని కంటి తళుకుగా
వగలువోయెడు మీలబలగ మగుచు
నాదసుధాసక్తి నలువు ఝుంకృతిగాఁగ
ప్రహరి జుట్టెడు బంభరమ్ములగుచు
నైగమభక్తి సిందూరు మై తెలుపుగా
నింబైన రాజహంసంబులగుచు

గీ. మఱియు, దక్కన జలగరుత్మచ్ఛరీర
ములను ధరియించి, వేమాఱు పులకరించి.
స్వామిపుష్కరిణీవాస పరతమింత్రు
నిత్యసూరులు మాధవోన్నిద్రమతులు. 264

గీ. తారకాసుర హంత పాతకమువలన
ముక్తుఁడై పోయె, నీ తీర్థమునను గ్రుంకి;
కామితంబులఁ గూర్చుటేగాదు, స్వామి
పుష్కరిణి భక్తియుతులకు, మోక్షదాత్రి. 265

శా. ప్రాయశ్చిత్తములిందొనర్చిన, విధి వ్యత్యస్తముల్గానివై
యాయుర్భాగ్యము లిచ్చి- మానవుల సర్వాఘంబు బోకార్చు, నా
మ్నాయాభ్యాస మనోజ్ఞనిస్వన గళన్మాధ్వీక మృద్వీకమై
స్వాయద్వేంకటశైల దర్శనము లిచ్చాపూర్తి భక్తాళికిన్. 266

వ. నైమిత్తికంబులు స్వామిసరస్తటంబునఁ గావించిన యంగవైకల్యంబు లంటవు; ఇయ్యనుభవంబింద్రాదిష్టంబు. బహుభాషణంబు లేల? చతుర్వర్గవివశీకృత హృదయులకును, నిగమచోదిత క్రియాకలాప వికలాపీకృతలగు నంగనాజనంబులకును, సాంగంబుఁ గర్మంబు నిర్వహింపనేరని యశక్తులకును, వేంకటాచలాశ్రయణంబు మించిన గతిలేదు; ఇది శిలాక్షరంబు. 267

మ. అనినన్ మౌనులు సూతుతో ననిరి, దేవాధీశుఁడీభూతధా
త్రినిఁ బ్రేమంబున నుద్ధరించి, యటనే దివ్యన్మహాభోగుఁడై
తను బ్రహ్మాదులు గొల్వ నిల్చెనా! పరంధామంబు వేంచేసెనో!
ఘనుడా యజ్ఞవరాహమూర్తి కత, సాకల్యంబు విన్పింపవే! 268

కం. పరమర్షుల కోరిక విని
పరమార్థాంభోధి, దివ్యపారాశర్య
స్ఫురదురు కరుణాచుళుకితుఁ
డరుదారఁగ సూతుఁడనియె నమృత ఫణితులన్. 269

వ. మునులారా! శ్వేతవరాహ రూపంబు ధరించి, హిరణ్యాక్షభుజావష్టంభంబు నిర్జించి, కమలాక్షుండు వాని వధించిన వృత్తాంతంబు మున్ను చెప్పిన యది కాదె! పంచవర్ణి రహస్యంబగు పతగేంద్రుండు వైకుంఠంబునుండి క్రీడాచలంబుఁదెచ్చిన యదియు మీకు విదితంబు. 270

శా. ఆ శైలంబున యజ్ఞపోత్రి వరదుండై, దివ్యసారూప్య ల
క్ష్మీశోభాకర వత్సదేశమణిరుక్మిమ్మిరితాశాంతుఁడై
ప్రాశస్త్యంబున నుండు; నిత్యకరుణాపారంగతాత్ముండు, లి
ప్సాఽఽసేవాఽఽగత దేవతావిభుఁడు, కల్పాంతంబు సీమంబుగన్. 271

కం. అపుడపుడు దోచు భక్తుల
కపలాపములేక తోచినప్పుడు వరముల్
గృపసేయు నవ్విలాసము
లపురూపములైన కవిత లాద్యర్షులకున్. 272

గీ. కల్పకల్పంబునందు నీ కరణి ధరణి
నుద్ధరించును సౌకర్య బద్ధతనుఁడు
నతఁడు సితపోత్రియగుటఁ గల్పాహ్వయమ్ము
గలిగెఁబో శ్వేతవరాహ కల్పమనుచు. 273

ఆ. అసురగణము పుడమి నలయించి నప్పుడు
సాధు విసర హృద్విషాద మపుడు;
ధర్మమునకు బ్రదుకు దడకట్టులైనప్పు
డవని దుఃఖదిగ్ధయైన యపుడు. 274

కం. నరదేవాది శరీరము
లఱుదార ధరించి వచ్చు; నభవుఁడుధర్మే
తరులను బరిమారిచి, భా
సురముగ ధర్మంబునిలిపి, సుజనులఁబ్రోచున్. 275

కం. శరణార్థుల రక్షింపను
దురితమతులఁజంప, పుడమి తొదలు దొలంపన్,
హరియెత్తిన యవతరములు
నరులకు లెక్కింప నగునె, నైకవిధమ్ముల్. 276

కం. వనజజునకు దక్షుండను
తనయుండు, మహాతపః ప్రతాపావజిత
ప్రణుత ప్రజాపతిత్వ
ప్రణష్టధిషణా వివేకపథుఁ డొకఁడుండెన్. 277

సీ. అతనికి పదునార్వు రాత్మజాతలు, నవ్య
తారుణ్య లావణ్య ధననిసర్గ
రమణీయ లాభిజాత్యమువారు; వారిలోఁ
బదుమువ్వురను జెట్టఁబట్టె ధర్మ
పురుషుండు నిర్జముఖుఁడై నవహ్ని స్వా
హాసతీ హృదయ ప్రియంకరుండు;
పితృదైవతములొక్క వెలఁదిగైకొనిరి, ప్రి
యమ్మగు ఋజువర్తనమ్ము దాని;

గీ. తనయలందరిలోనఁ దద్దయును పేర్మి
గల సతీదేవి యభవునంఘ్రులను జేర్చె
దక్షుఁడొక తెల్విమెఱపు వితాన దోచి,
ధన్యమైనట్టి యారగ్వధమ్ము వోలె!. 278

చ. అతిశయతామరోత్తమ మహత్త్వముకల్మి సమస్తలోకస
న్నుతి గనినట్టి ధర్మునకు నుత్తమశీలకు మూర్తిదేవికిన్
సుతుఁడయి యుద్భవించె మధుసూదనుఁడొక్కఁడ, రెండురూపులై
ప్రతత తపస్సమాత్త విభవమ్ము జగమ్ముల బోధసేయఁగన్. 279

కం. నరనారాయణులన ని
ర్వురు-జగములకాదిఋషులు-పురుహూతయశ
స్స్ఫురణాధాయక చాప
స్ఫురద్విశిఖ రాత్రిచరనిషూదనసారుల్. 280

సీ. వారి పుట్టినవేళ పవనుండు, హవ్యగం
ధవహుండు మందమందమ్ము వీచె
సలిలధౌతములైన చక్కటి నష్ట ది
దిక్కులు తొల్లిలేనట్టి తెలివిసెందె

పలుకుదుంధుభుల సంవాదిగా దివినుండి
సురపొన్న విరుల దొంతరలు రాలె
నిర్ఝరీసందోహ నృత్తోత్సవములతో
గాంధర్వగమక భంగములు విరిసె

గీ. కదలి నీరంబులను ప్రాతకచ్ఛువదలె
నదులు నడకల క్రొత్తయందములు వోనె
నరుల మదులు సమాధిమగ్నమ్ములట్టు
లొక మహానందవార్థిలో నోలలాడె. 281

క. అత్తరి బ్రహ్మాదులు లో
కోత్తరుఁడగు వాసుదేవు నూనిన భక్తిన్
చిత్తమ్ములు పొంగార వి
యత్తలమున నుండి పలికి రభినుతిపరులై. 282

ఆ. నీకు మంగళమ్ము, నిఖిలైక సాధన !
నీకు నేటికోళ్లు ! నిత్యకీర్తి !
నీ పదాంబుజముల నిలుచుగావుత ! మాదు
మదియుఁ జూపు వజ్రమదికినట్లు. 283

కం. సత్యవ్రతుని, త్రిసత్యుని,
సత్యపరుని, సత్యయోని, సత్యనిహితు, ని
న్నత్యంతము సేవింతుము
సత్యమునకు సత్యమైన చతురాత్మకునిన్. 284

కం. ఋతమునకు సత్యమునకును
గతి నీవ ! అనాదినిధన ! కాపురుషులకు
న్నతి దూరగుడవు ! భక్తి
వ్రతులకు జుట్టమవు, వేదవిద్యాతిగతీ ! 285

సీ. కార్యరూపంబైన కల జగంబునకు, జ
న్మస్థాన సన్నిధానములు నీవ!
సదనుగ్రహము నీవ! సంవృతంబైన నీ
మాయచే మోహితాత్మకులు బ్రహ్మ
విష్ణు శివాదులు వేర్వేరటందు రం
తర్యామి! నీకు భిన్నంబు లేదు;
నెఱుకనేర్చినవార లేకచిత్తమ్ముతో
నిఖిలరూపమ్ములు నీవ యనుచు -

గీ. నీ యనుగ్రహమునఁ జేసి, త్రోయరాని
మాయ బోద్రోసి, సంసార మమతఁ దలఁగి,
యందికొందురు శాశ్వతానందపదవి,
శివకర చరిత్ర! మోక్షలక్ష్మీకళత్ర! 286

ఉ. స్థావరజంగమాత్మక విధా పురులోక శమమ్ముగోరి-యి
చ్ఛావిధి నీవదాల్చెదవు; సత్త్వగుణమ్మునఁజేసి, భక్త సౌ
ఖ్యావహముల్ ఖలవ్రజ నికార కరంబులు రూపముల్, జగ
జ్జీవులభంగి, నిన్ను దరిజేరుదురె! దుస్తర జన్మకర్మముల్. 287

ఉ. అంబుజనాభ! లోకములకన్నిటికిన్ తొలిదైన నీ స్వరూ
పంబు, సమాధి నిష్ఠమగు భావబలంబున, కట్టి-నీ పదా
బ్జంబను పోతసాహ్యమునుబట్టి-తరింత్రు వివేకశాలు, ర
ల్పంబగు పూన్కి సంసరణ వార్ధిని, కామము గోష్పదంబుగన్. 288

సీ. నీవారలైనట్టి, నియతేంద్రియులు, భవ
త్పదనావ సంసారవార్ధి దాటి;
భూతసంతతియందుఁ బూర్ణసౌహృదులౌట
పెఱవారు దరియించు తెరువు దలఁచి
దరికి బంధించి పోదురు; తత్సరణినూని
యన్యులు సంసారమధిగమింత్రు;

కొఱమాలు నెఱుకలై గొందఱు నీపేరు
దలఁపఁగ నొల్లరు దెలిసియైన;

గీ. నీవుసదనుగ్రహుండవు! నిత్య జాగ
రూకుఁడవు! భక్తరక్షణ శ్రీకమతివి,
పొగులు జీవుఁడహంకార నిగడితుండు
శాశ్వతానంద వితరణ శ్రద్ధధాన. 289

చ. మనసులఁదాము ముక్తులను మల్లరమై-నినుగీటువుచ్చుదా
నన-నవిశుద్ధబుద్ధులయి-నమ్మికలేని యవస్థితిన్, పరా
కున, బహుయత్నసంచితము గోల్పడి-జ్ఞానసుఖమ్ము, క్రమ్మరిం
చినగతి-వెండి సంసృతినిశీథిని జొత్తురు గొందరల్పులై. 290

కం. తావకపద చింతనమున
నీవారై నెగడునట్టి నిపుణులు, భవదీ
యావార్యకరుణ, విఘ్న
ద్రిపీత భయులగుచు నుత్తరించెదరీశా!. 291

వ. అనన్య శరణ్య! అవిబోధ్యభావ! చిదానంద! గోవింద! సృష్టంబైన లోకంబు స్థితికాలంబున - శుద్ధసత్వ మయంబును, విశుద్ధంబుననగు, గాత్రంబు గృపసేసి శ్రేయస్కరంబు కర్మ ఫలంబు బ్రసాదింతు, వట్టి నీ జగన్మోహనంబగు శరీరం బెఱుకగలవారు వేదక్రియా యాగ తపస్సమాధులచేతఁ బూజింతురు. అన్యులు స్వాంతర్గత హేమ ప్రకాశక మణికరండికను బోలి, త్రిగుణాత్మక ప్రకృతి విలక్షణ శుద్ధద్రవ్యంబగుట నాత్మస్వరూపాఽతిరోధాయకంబును దేవమనుష్యాది భేదాఽభిమాన నివర్తకంబునగు నీ మూర్తి దరిసించియు నితరసజాతీయంబని భావింతురు. వీఱడులుగాక నీ దివ్యమంగళ విగ్రహంబు శుద్ధసత్వంబు గాదేని - యజ్ఞాన భేదాపమార్జనంబగునే! గుణావచ్ఛిన్నంబులగు ప్రకాశంబుల నీవూహింపఁబడుదువు. దేన-దేని-యను యనుమానంబుల గుణ ప్రకారంబుల నిన్నభ్యూహింతురు. తావకంబులగు గుణ జన్మ కర్మ నామ రూపంబు లితర సజాతీయంబులుగ ననిరూపణీయంబులు;

వేదక్రియలయందు గర్మనిష్ఠులు ప్రస్తుతాగ్నీంద్రాది నామరూప సజాతీయంబుగ 'నంగాన్యన్యాదేవతా' యను శ్రుతివచనంబున నిన్నుపాసించి నను నది యర్థవాద మాత్రంబకాక పరమార్థంబగునే! దేవా! నీకు సదాతనంబు నమస్కారంబని-యిట్లనిరి. 292

సీ. శ్రవణచిత్తగ్రాహి సర్వతః పీయూష
కళికలై నట్టినీకతలు వినుచు
వ్యర్థాభిమాన జల్పాకుండుగాక పా
డుచు నిన్ను సద్భక్తి నిచుళితముగ
విషయాంతరమ్ముల విడువక చిత్తమ్ము,
ధ్యానించుచును నిగమాధ్వరీతి
తనతోడివారల తత్పరత్వమ్మున
ముంచుచు హరికథామోద జలధి, 293

గీ. సకల కర్మలందు సర్వేశ్వరుని నిన్ను
తరచి తరచి మేనుమఱచువాఁడు
నిన్నుదప్ప నన్య మెన్నని జీవుండు
భవము దలఁగి మేలుపడెడువాఁడు.

మ. నరనారాయణు లప్డు వారలనమంద్రప్రీతి మన్నించి, భా
గ్యరమా విష్కృతి యంచుఁ దాప్రతిపదన్యాసంబునం దుర్వారా
సరసీజాక్షి గగుర్ప, ధీరముని సంసచ్చారు జూటావళీ
పరిత స్తోరణమాలికా విలసిత ప్రాంతమ్ములన్ బోవుచున్. 294

మ. కనక ప్రస్తర ప్రస్రవజ్ఝర మృదంగధ్వాన నృత్యన్మయూ
ర నికాయంబులదాని; ధాతుబహు వర్ణవ్రాత సంఛాదితా
భ్ర నభోవర్త్మముదాని, సర్వఋతు సేవ్యప్రస్థమౌ గంధమా
దనమున్ జేరిరి, సత్తపంబున జగద్భద్రంబుఁ బండింపగన్. 295

కం. సతి యనహంకారంబున
పతుల కదా! సతులకెల్ల భాగ్యంబనుచున్

నుత పదఁ బరిచర్యావిధి
పతిత శరణ్యుండు భూతపతి లోఁగొనియెన్. 296

ఆ. పెద్దకాలంబు గడచె, నావిర్భవింప
లేదొక నిసుంగు, సతికిని లేదు శాంతి,
యింపుగా సుతు మొగము వీక్షింపలేని
పొలఁతి మనుగడ సకలంబు పొల్లకాదె. 297

మ. జననీ స్తన్యము లాను వేడుక రసస్యందంబుగా నవ్వు నూ
తన జాతప్రియ దంశనంబులగు ద్విత్రిత్రిత దంతమ్ములన్
స్తనముల్ నొక్క, నభీష్టమైన వెత సీత్కారంబు గావించు, న
వ్వనజాతాక్షికి లోకమెల్ల ప్రణయ ప్రస్థాన మాత్రంబగున్. 298

ఆ. చెప్పలేదు సకియ ! శివునకుఁ దనకోర్కె
తెలిసికొనఁడు ధవుఁడు ధీలసితుఁడు
గడచె కాలమిట్లుగా దక్షపుత్రికా
చిత్తగూఢ వేదనాత్తభరము. 299

సీ. అంత జతుర్ముఖుం డమరలోకము నందు
సత్రయాగము బూని సలుపుచున్న
సకలామరులు దిదృక్షామతు ల్వేంచేసి
రఖిల మౌనులు హుతాయత్త మతులు
సకల ప్రజాపతుల్ సవలోప జాగరూ
కేక్షణుల్వారితో నిద్ధ తేజు
డైన దక్షుఁడు వచ్చె, నతని సమాజంబు
లేచి ప్రత్యుత్థాన మాచరించె
గీ. లేవనట్టి వారిర్వురే - యా విధాత
తనయ వీక్షా సహస్రపత్రాయితాక్షుఁ,
దష్టతనువుల లోకమ్ము లావరించి
యఖిల శర్మంబు లొడఁగూర్చునట్టి హరుఁడు. 300

కం. చనుదెంచిన యాదక్షుఁడు
జనకుని పాదములు దాకి, సకలామరపూ
జనములు గ్రహించి, లేవని
వనజారిశిరోధిఁ గోపవక్రిమఁ జూచెన్. 301

గీ. కర్మజటిలాటవీ నిత్య గాహమాన
బుద్ధియై భేద దృష్టితోఁ బొనుఁగు పడెడు
దక్షునకు నర్థమగునె ! వేదప్రణీత
పణిత ఫణితి విదూర వైభవుఁడు శివుఁడు. 302

చ. మహితధర ప్రకంపన తమోమయమూర్తి, ప్రజాపతిత్వదు
స్సహదురహంకృతి గ్రసితసార వివేకుఁడు దక్షుఁడంత, ని
గ్రహము దొఱంగి హాలహల కల్పము శాపమొసంగె, మౌనిహృ
ద్వహునకు చంద్రశేఖరునకున్న విభావిత చిత్తవృత్తికిన్. 303

ఆ. భస్మకంకాలముల బిత్రృవణములందు
పీఁగువెత్తికి- మఖహవిర్భాగ మటవె !
ప్రమథపతికింక యా గౌరవమ్ము లేదు
పలికి తీయాన సేకొన వలయు మీరు. 304

కం. దక్షుండిట్లని సభన
ధ్యక్షించిన తంద్రిడివంకవైనను జూడక
గాంక్షింపక క్రోధైకస
మీక్షావదనుండు తనదు నిమ్ములఁ జేరెన్. 305

సీ. అతని పోయిన తోన నా సభనున్న దే
వర్షులు, సకలామరాధ్యుఁడైన
హరునకుఁగలుషితుండై దక్షు చేసిన
చెయిదమ్ము కడివుచ్చు చెట్టయనిరి,
నందీశ్వరుండు దక్షునకుఁబ్రతిశాపంబు
నిచ్చె, నా శాపమ్ము చిచ్చులంటి

భృగుఁడు-క్రోధావేశ నిగడితుండై, భవ
వ్రతధారులకును శాపమ్మొవట్టె

గీ. సత్రయాగమ్ము-క్రోధరసాయితమ్ము
గా-శివుఁడు విమనస్కుఁడై కదలిపోయె;
యాగ విధియేమొ! సాఁగె, సహస్ర వర్ష
ములు హుతద్రవ్య శోభనానలయుతమ్ము ! 306

కం. అల్లునిపై మచ్చరమున
మల్లడిగొను దక్షుఁడభవు మన్నింపక,గ
ర్వోల్లసితుఁడరుద్రకముగ
కల్లరియాగమ్ము సేయఁగాఁ దలపోసెన్. 307

ఆ. అభవు గర్హించి,వాజపేయమ్ము సలిపి,
యల బృహస్పతి సవనంబు సలుప వేడి
సురల మౌనుల రావించె నూడుదలఁచి
విమల శశధరజూటు రావింప లేదు. 308

చం. అతులతపః ప్రభావమున నందరికంటెను దొడ్డయైన-స
ద్వ్రతతి సమాదరించెడు వివేకమునన్ గడుచిన్నవాఁడు, సం
హృతమతి నోరిక్రొవ్వనను నెవ్వరినేగతిఁదిట్టునో, యటఁ
చలిభయమంది చేరిరి దివౌకసులున్మనిలోకసత్తముల్. 309

ఆ. హరుఁడు దక్కఁదక్కినల్లుండ్రు-జన్నంబుఁ
జూడవచ్చి రతుల శోభలొప్ప;
వారి సతులమేని పసిడిసొమ్ములు-యజ్ఞ
వాటమునకుఁగ్రొత్తవన్నెగూర్చె. 310

ఉ. అందరిలోనఁ బ్రాయమున యందుఁ గనిష్ఠయెగాని, సద్గుణా
శిందమ వంగడంబు ఫలియించిన పుణ్యము చిన్నిబిడ్డ, రా

నందున, దెందమం దతిశయంబుగ గందుచుఁ గుందిఁ కుంది యా
నందము డిందె-యెంచు నిజనందన-దక్షపురంధ్రి సారెకున్. 311

తరువోజ : పతి సవిధంబునఁ బరిచర్యలందు
అతివేలముగ ముగ్గి, యభవుని సతియు
వితతంబుగా యజ్ఞవిధి సల్పుచున్న
పితఁ దన్నుఁ బిల్వఁ బంపిన, బోనా! నేను.

''మతియింత దొలఁగెనే! మాలిమి, యనుచు
మనసెల్ల దుఃఖ ధూమ్రంబుగా - నాత్మ
పతి ముఖమ్మున యందఁ బరపిన దృష్టి
వసివాళ్లు వాడుచు వర్తించుచుండె.'' 312

ఉ. అంత నభోంగణంబు, సవనార్థము బోయెడు నభ్రచారి దు
ర్దాంత విమానయాన బహుధానినదంబుల, యజ్ఞ వర్ణనా
త్యంత విసారి ఘోషముల, నా సతిదేవిమనంబు పెంపు-వి
భ్రాంతము సేసె,దైవగతి పట్టున మానుషమెత్తి వచ్చునే! 313

కం, తలనెత్తి చూచె సతి ది
క్కుల కూలంకషముగాఁగఁ గొమరారు దివి
షుల వనితల తొడవులవగు
మలయుచు నున్నట్టి మణుల మంజడి వన్నెల్. 314

ఆ. వానిఁ జూచినంత వనజాక్షికిని-తాల్మి
నిలువలేదు, మగని వలను సూచి-
నేను వోదుననియె, నిల్వరింపఁడు, సర్వ
మెఱిఁగియైన- చంద్రధరుఁడు శివుఁడు. 315

కం. వచ్చిన సతితో దక్షుఁడు
ముచ్చట లాడినది లేదు-మొగమటు వెట్టెన్
వచ్చినది దోసమని-తా
ముచ్చిరి సతిదేవి లోన మునుకుచు నుండెన్. 316

సీ. అంతనరుద్రాకమైన జన్నంబు, న
నాహ్వాన రూపమైనట్టి డీథ
హృదయంబు గాల్చిన నెసగు కోపంబు, వ
హ్నిగరేగి, కాయంబు నెగడి కాల్ప,
మఱు జన్మకైనను-హరుడ ధవుండంచు
సతిదేవి భస్మసాత్కృతిగనయ్యె;
వార్త సేరినయంత-వచ్చిన ప్రమథగ
ణంబులు-నడచు జన్నంబు సెఱచి,

గీ. మౌనులను దోల, ధాత యీశానువెలిచి
మేషముఖుఁజేసె దక్షు, నామృడుని కరుణ,
దక్షు డజ్ఞాన వికటబంధంబు దలఁగి
పరమ శివ పాదసేవనా పరతఁగనియె. 317

మ. సతి-యాత్మీయ శరీరమున్డొఱఁగి-యీశానార్పిత ప్రేమ పూ
రిత చిత్తంబయి-వేఱు జన్మమున తండ్రిన్నాగ భావించె ప
ర్వత మూర్ధన్యుని, దేవతాత్ము, భవశశ్వత్పాద పద్మార్చనా
ప్రథిత ప్రాభవు, శీతశైలము, మునీంద్రవ్యూహ సంసేవ్యమున్. 318

మ. పరమాత్మీయసతీవియోగభర విధ్వస్తాత్ముఁడై-శాంతి డె
ప్పరమై-శంభుఁడు-హైమశైలశిఖర ప్రాంతాటవీతుంగ గ
హ్వరముల్ మార్వ్రులుకంగ 'యోసి! యెటవే! వామాక్షి! నీ నాథునిన్
మొఱగన్బోలునె!' యంచు వావిడుచున్-మోహంబు నిర్వేలమై. 319

సీ. రమణీయ పారిభద్రక పల్లవమ్ములు
వనజాక్షి చరణమ్ములనుచుఁ బట్టు
చిరి బిల్వ పుష్పమంజరులు సీమంతినీ
కుచయుగంబని కొనగోట నంటు
శ్యామాలతా పరిస్పందమ్ము గని-వచ్చి
నావచే! యని యమందమ్ము బాఱు

అలుక పెంపున వాగులై నావటే ! యంచు
　　బరువంబుబారు నిర్ఝరుల నిలుచు

ఆ. పూలపొదల నిలుచుఁ బోలించికొని- సతీ
దేవి తిన్ననైన తీగెనవ్వ,
లెంతచెనటి దక్షుఁడీ దంపతుల విడ
దీసెననుచు మౌను లీసడింప. 320

కం. వచ్చె వసంతము తరువుల
హెచ్చెం జిగి, యప్సరో గృహీతవిపంచీ
ముచ్చంచల తంత్రీవద
నోచ్చయ హిందోళరాగ మొలికెన్ వనులన్. 321

లయగ్రాహి. కమ్మని సుమమ్ములను బమ్మిన పరాగములు
　　గ్రమ్మికొని తావులను దమ్ముకొని మాకం
దమ్ముల వినూత్నకిసలమ్ములను పమ్మిన పి
　　కమ్ముల కుహూరవము ముమ్మరములోనై
చెమ్మగలవాగుల జలమ్ములను లోగొనుచు
　　నెమ్మి పురు లిమ్ముల పథమ్ములకు నడ్డై
యమ్మునులకైన హృదయమ్ములు గగుర్పొడువ
　　సొమ్మసిలఁజేయు పవనమ్ము లెల వీచెన్. 322

కం. చిలుకలి వసంతరాగం
బెలసినదే దిశల విరహి హృదయమ్ముల న
గ్గలమై చీకటి- నేత్రాం
చలములఁ గన్నీటి సోన జలజల రాలెన్. 323

ఆ. ఆ వసంతమందు నతివేల విరహసం
తప్తుఁడైన శివుఁడు- తాల్మి వట్టి,
అల్లలాడు మనసు నాకట్టి చిర సమా
ధిస్థుఁ డయ్యె, విరతి తీడిరించి. 324

ఆ. అరచియఱచి- యడవులన్నిటఁ జుట్టె, ని
న్నట; విరాళి యెడఁద నగ్గలించి
నేఁడు చలన మేది నిడు తపంబును వట్టె;
విభుల మనసు దెలియు వెరవు లేవి? 325

ఉ. అప్పుడు తారకాసురుఁడహర్పతి తేజుఁడు బ్రహ్మఁగూర్చి, తెన్
దెప్పలుగాఁగనై తప, ముదీర్ణవరంబులు సెంది, రక్కసుల్
దొప్పలు దొరలై కొలువ, ద్రుఘ్ణుచు నాకమునద్ద, శౌర్యముత్
పిప్పిగనైన యింద్రునకు బీరపుఁ బొత్తము నల్లవారిసన్. 326

గీ. ఇంకనెట్లమ్మ! యనుచు-దేవేజ్యుఁడైన
నాంగిరసుఁ బిల్వఁ బంచి, మంత్రాంగమాడ
బ్రహ్మవరమింతసేసె, తారకునిఁ గూల్చు
పన్నుగడ నాతఁడే పన్నవలయుననియె. 327

సీ. అపుడు తారకుతోడ నమునయ సామవా
దములాడి, సపది యుద్ధమ్ము నిలిపి
సాంగిరసమ్ముగా, శతధృతి దరిసించి
తారకు విక్రమ దావ వహ్ని
తెఱఁగెఱిఁగించి, "నిర్జరసేన-కలనికి
నడపించి గెలుచుసేనాని, భవుఁడు
తానేమొ! హృత్సమిద్ధవ్రతనిష్ఠుఁడై
దేవదారు ద్రుమాధీనుఁడయ్యె;
గీ. యింక మాకేడుగడ యెవ్వ! రింత లేసి
వరముఁలొసఁగితి వే యుపాయంబుఁదలఁచి"
నాకనాయకు నేత్రసహస్రమందు
బాధదుఃఖాగ్ని తప్త బాష్పముల ఝురులు. 328

కం. పరమేష్ఠి పలికె-హిమభూ
ధరమునకున్ బుత్రియగుచు-ధవళాక్షి పురం

దర! సతి బెరుగుచు నున్నది,
పురహర గార్హస్థ్య ధర్మపూర్తికి గాఁగన్. 329

కం. వారిర్వురకు జనించు కు
మారుఁడు తారకునిఁ జంపు; మతి మసలక నీ
హారక్షర చూడ గిరిజా
ప్రారజ్యత్ప్రణయ భరము బండింపవలెన్. 330

ఆ. నారదుండు శ్లోఘ్యు-నగనాథుతోఁ దెల్పి
నూలు కొల్పవలయు, మేలిబిడ్డ
తొంటిమేని తెఱఁగు-తోడ్తోడ-వినిపించి
పొలఁతి హరుని గూర్పఁ దలఁపుమనుచు. 331

కం. మారుని రావించుచు స
త్కారము గావించి శంభు కడిఁది తపంబున్
దొరగిలఁ జేసి, మది శృం
గారము వెలయింప నీవు ఘటియింపవలెన్. 332

గీ. ఇదియ మార్గంబు సూ రాక్షసేంద్రు జంప
ననినఁ బనివినె నముచిసూదనుఁడు బ్రీతి;
అబ్జభవు నానఁబూని-దేవర్షివరుఁడు
హిమమహీధర తుంగ శృంగములఁ జేరె. 333

ఉ. వచ్చెడు మౌనిఁ జూచి-హిమవంతుఁడు దానెదురేగి - స్వాగతం
బిచ్చి కృతార్ఘ్య పాద్యముల నెద్ద నిగుర్పఁగఁజేసి, ప్రశ్రయం
బచ్చు పడఁగ దివ్యవనితాభరణంబగు మేన-తోడన
త్యుచ్చశిరంబు వంచి-నిగమోదితరీతి నమస్కరించినన్. 334

ఆ. వారి వెన్క నిలిచి-మారుకోదండమ్ము
వఁటిమేను వంచి-పర్వతేంద్ర

తనయ పుచ్చడీకతన మొక్క యందమై
ముద్దువుట్టు భంగి మ్రొక్కుటయును. 335

ఆ. మాఱుమొక్కి కనులఁదోరమై యానంద
జలముల్ఁదొలుక మేనఁ బులకలొదవ
ననియె దేవఋషి "యభ్యర్హితుఁడవైతి.
మేలు వచ్చెసుమ్ము! శైల రాజ!" 336

సీ. ఎవరనుకొంటి వీ యింద్రనీలచ్ఛవి
కరువునఁ బోసిన కమలనయన
దక్షయజ్ఞమ్ములో దనువు దొఱంగిన
పరమ పతివ్రతా ప్రథమగణ్య
దాక్షాయణీ దేవి, తరుణేందుధరు కొమ్మ,
న్యాసంబుగానున్న యట్టి దుహిత.
మృదున కొప్పింపక తడసేయ వచ్చునే
వేగిరంపడుమని విప్పి సెప్పి

ఆ. నారదుండు వోయె, నారాయణామృత
స్రావి మహతిగీత ఝురుల దడిసి
శైలకటక శష్క సాలంబు లెల్లెడ
వింతలొలుకఁ బల్లవించి పూచి. 337

కం. దేవఋషి వోవ గిరిజా
దేవిని దోడ్కొంచుఁ బోయె ధృతి యొక పోడవై
వావిరి తపమ్ము వట్టెనొ!
నా వెలసెను శంభు కడకు నగపతి కడకన్. 338

ఉ. ఆ సమయంబు నంద, నియమాజగవంబున నెక్కుడించి య
భ్యాస తుషారశైల విపినాంతర పాదప పల్లవ ప్రసూ
నాసవ రామణీయకము లాదృతిఁ జూచుచునున్న శాంభము
ద్రా సముపేతు, సీశుఁగని - వ్రాల్చిన కన్నుల నంజలించినన్. 339

గీ. కరుణ బొడసూపు చూపులఁ గాంచె శివుఁడు
గాంచుటయె శుభ శకునంబుగాఁ దలంచి
యాత్మ పుత్రిక సేవకై యనుమతించి
పాలనము సేయ వలెననె శైలరాజు. 340

మ. భ్రుకుటీచాలన మాత్ర సమ్మతముగాఁ బొంగారు కారుణ్యమై
సకలాధారుఁ డనుగ్రహించిన-ముహుస్సమ్మోద రోమాంచిత
ప్రకట శ్రీకుఁడు పుత్రికావదన తృప్తన్యస్త దృక్చంద్రగో
శికలన్ జూచినఁదన్వి చిత్త మివతాళించెన్ మనోజ్ఞంబుగన్. 341

సీ. ఎలదేటిగము లెంగిలింపకమున్న కా
నల నుండి బలి పుష్పములను దెచ్చి
కామధేను కరీష కామనీయకముగా
వేదాత్మకుండుండు వేది యలకి
దివిజ గంగాబ్జగంధిల జలమ్ములు పొగ
దపు ఘల్లులల నేమమపుడు దెచ్చి
సహజారుణములైన శయపుటమ్ముల ఖేద
మనక దర్భలు గిల్లి యలసరించి 342

గీ. తచ్ఛిరశ్చంద్ర పాద శైత్యములను
నప్పుదప్పుడు చెమటల నార్చికొనుచు
పర్వతేంద్రుని పుత్రి యీశ్వరుని మదికి
నెక్క నుపచారముల నెలయించుచుండె.

తరువోజ : కనుదమ్ములను మోడ్చె కాలకాలుండు
ఘనతపస్యా సమాకర్షిత బుద్ధి
యనుపమ మృదులాంగి యద్రిజ! సేవ
లనునయించుచు నుండె నాసక్త బుద్ధి
వనములలో సుమాభరణముల్నింపు
వాసంత మధురిమల్వచ్చి పోయినవి,
మనము సంశ్లేష సమ్మర్దమ్ము గోరు
షలికారు లెన్నియో మరలిపోయినవి. 343

శా. నాకాధీశుఁడు బిల్వనంపె, జగతీ నాట్యక్రియా పోషకా
స్తోక ప్రాభవు, నిర్నిబంధన ధను స్సూనాస్త్రు, సౌందర్య సీ
మాకల్పున్, యువతీ పద ద్వయ సమర్చాసక్త మౌనీంద్ర జూ
టీ కోటీరు-మనోజ్ఞ రక్తిమ-సమాటీకత్పదున్ మన్మథున్. 344.

సీ. ప్రసవ చాపమ్ముతోఁ బ్రతివచ్చు బొమలతో
నంసమ్ముపై రతి యత్త మిల్ల
మాకంద పల్లవ ప్రమదిమమ్ము బోలి పి
కమ్ములు మృదుపంచమమ్ము వలుక
మీనకేతన సమున్మేషమ్ము మించు క
న్నులడాలు గాణిక్యములు గమింప
మృదు గంధవాహ సన్నిధికి నింపులు నింపు
వాసంత వికచ పుష్పములు గ్రాల

గీ. తాను జొచ్చిన కతన వృత్రహుని నగరి
యందములు గ్రొత్తఁదెర తీసినట్లు దోప
దర్పకుఁడు సర్వ సృష్టి చైతన్యమూర్తి
నాకవిభు ముంగిట 'హసా' దటంచు నిలచె. 345

కం. మదనునిఁ గని వేఁగన్నులు
ముదమై రమ్మంచు జీరి ముక్తాఫలభా
స్వదనూన విష్టరంబున
సదయతఁ గూర్చుండబెట్టి శతమఖుఁ డంతన్. 346

గీ. అచ్చరల చెక్కుటద్దమ్ములవఘళించు
నాగపర్ణమ్ములను - నందనద్రుపూగ
ములను ఘనసార మృగమదమ్ముల సుగంధి
తమ్మ తాంబూల మిచ్చి చేతమ్ము నాచి. 347

గీ. కరతలము హస్తతలమునఁ గదియఁ జేర్చి
నయన సాహస్రమును మనోన్మథనుఁడైన

మదనుపై నుంచి - యనురాగ మదుకఁ జూచి
యనియె చల్లగ దేవవేశ్యాధికుండు. 348

సీ. ఓయీ ! సురాసురా ప్యాయి విక్రమ ! శీత
లాస్త్రనిగూఢ విశ్వాతిశాయి
చిత్ర వైశ్వానర ! సేయంగ గలవారు
విలుకాండ్రు రెందరో గలరు జగతి
తారెల్ల వస్తుద్విధాకరణక్షముల్
రెంటి నొక్కటి సేయురీతి లేదు,
ద్వైతమ్మునకును నద్వైతమ్ము నీది, యి
క్షుధనుస్సు చేయందికొన్న యంత;

గీ. తారకుని మాల్చుకొఱకునై తరుణచంద్ర
భరణు పార్వతితోడ గూర్పంగ వలయు,
వారి పుట్టిన యిసుఁగు దేవతలయందు
వీతభయ సమ్మదమ్ములు విత్తుగాని. 349

ఉ. పొమ్మన, కాలదష్టుఁడయి, మోమున గర్వము చెంగలింప-హ
స్తమ్ములు మోడ్చి మన్మథుఁడు-చారుపికీశుక ముఖ్యమూల సై
న్యమ్ములు గొల్వఁ జేరె తుహినాచల భూములు, వెంటనంటి ప్రే
మమ్మున, రా, రతీసతి, సుమాశపుఁ జూపుల నందగింపుచున్. 350

చ. మదనుఁడు చేయి వీచిన, సమంచితగర్వ సిరస్తబుద్ధి, తా
నొదవిన జృంభణంబుల వనోత్కరముల్ గమిచెన్ మధుండు, పా
ర్షదులు సమీరణాదులు హసాచని గొల్వఁగ, శాంత మౌని హృ
త్సదనములందు తాల్మి యవసాదితమై వెఱ యగ్గలింపగన్. 351

చ. కలకలకంఠ సుస్వర వికస్వరముల్ దిశలయ్యె, షట్పదా
కులవిపినంబు లార్ద్రమధుకుల్యాల తోడివ యయ్యె, పుష్ప ని
ర్గళిత రజోఽవగుంఠిత ముఖమ్ము నభస్సతికయ్యె, సంచర
న్మలయ సమీరసౌరభ విమర్దములయ్యె, ధరిత్రికయ్యెడన్. 352

ఉ. సంచిత సర్వవైభవ తుషారమహీధ్ర వసత్సురాంగనా
కుంచిత నేత్రగోళములకున్ మదిలో మదరాగముల్, సమ
ర్పించె మధూకముల్ విపినవీథులఁ బెల్లుగఁ బుష్పితంబులై
సంచులెరింగి వల్లభులు సౌరత లీలల నోలలార్పగన్. 353

సీ. సంఘర్షమునఁబోలె సర్వతస్స్మితంబు
లగుచు సంసక్త శాఖాగ్రములను,
గ్రథితమ్ములను బోని కానన ద్రుమముల
నలవోకఁ దిరిగె మందానిలుండు;
పతితముల్, వృంతసంస్థితములు, పతమాన
ములు, ప్రసవంబులఁ జెలఁగియాడు
చాకొమ్మ లీకొమ్మ లల్లార్చి తమపట్లు
సడలి, పునః ప్రాప్తినడమ, భృంగ
గీ. ములు పొనర్చెడు ఝుంకృతు లలమికొనుచు
దేవవేశ్యా శయాంతరా దీప్యమాన
వల్లకీచ్యుత పంచమా వర్జ్యమాన
నవవసంత రాగస్వరోన్మథితుఁడగుచు. 354

చ. అతిశయితాన్య పుష్పనిచయంబులు గోగులుబూచె, తత్ప్రభా
వితతులనీసడించినటు, వెక్కసమై వికసిల్లె, కింశుక
ప్రతతులు, రెంటనున్ హృదయరాసము వాసనలేదు, మాధ్వీ సం
పతిలదు, భృంగ సంతతులు వచ్చునె! యొత్తిలి మెత్తురే జనుల్. 355

ఉ. అప్పుడు వచ్చె మన్మథుని యాజన జాణముఁబోని గౌరి, కన్
రెప్పల సిగ్గులై, పొటమరించిన ప్రేమపు నిగ్గులై మనం
బప్పవనాశనాభరణు నంఘ్రినమస్యకు, తత్తనూరుచుల్
గుప్పున గప్పినం తన కకుప్పులు సంపగిచాయ లీనఁగన్. 356

సీ. సితసిందువార రాజీవ రాజితసుమా
భరణాంగి, కుచభరోద్వహన క్లిశ్య

మాన మధ్యంబుతో, మధురస్మితమ్ముగా
నిల్చి, యూర్పులగాడ్పులొలసి షట్ప
దమ్ములు మధురాధరమ్ము డాసిన, హస్త
పంకజమ్మునఁ దోనఁ బాపికొనుచు,
ప్రత్యగ్రసుమములా ప్రమథేశ్వరుని పాద
ములఁ నించి, రోమాంచలులితదేహ, 357

గీ. అభవు పాదాభివందనం బాచరింప
చారుదర్శనఁ జూచి- యీషత్ప్రకంప
మానహృదయుండు- కట్టెట్టియైన కనుల
గాననము సర్వ దిక్కులఁ గలయఁ జూచె.

ఉ. చూచిన యంత, పుష్పితమశోకము క్రిందఁ శ్రవోవతంస మౌ
ర్వీచరణంబుగా, నలవరించిన బాణముగాగ, చంద్రరే
ఖాంచిత మౌళి లక్ష్యముగనై, ద్రుహిణాది మనోవిజేత, దృ
గ్గోచరుఁడయ్యె. మన్మథుఁడకుంఠిత దర్పపరిచ్ఛదంబుగన్. 358

శా. వానిన్ గాంచి, నితాంత రోషమున, భ్రూ భంగంబు, సర్పాధిపో
చ్ఛ్వాన శ్వాస కరాళజిహ్మముగ-సోత్ప్రాస సహాసంబుతో
దై-నైటాల విశాలనేత్రకుహర ప్రాంతోత్థితాగ్నిచ్ఛటా
ధ్వానంబుల్, సకలామరవ్రజ మనోభ్రాష్టంబులై పర్విననన్. 359

సీ. ఆ వహ్నులందు పారావత పక్ష స
ధ్రీచీన భస్మమై తీఱె మరుఁడు,
వృంతంబు నుండి జారిన శిరీషముపోలె
రతి మూర్ఛితాత్మయై వ్రాలె ధరణి.
చిక్కచిక్కని యట్టి జీవి యదృష్టంబు
వలెఁ గనుచాటయ్యె ప్రమథ భర్త.
ఒక మేళకర్తలో నున్నట్టి జన్యంబు
లెల్ల నదించినట్లేడ్చె సురభి,
గీ. గౌరి తనదైన సౌభాగ్య గౌరవంబు,

వఱదఁ బోయిన యట్లు డెప్పరము గలఁగె,
ధరణిధరరాజు, కర్తవ్యతా విమూఢుఁ
డాత్మనందన నింటి చాయలకు నడపె.

వ. దుస్సహ దుఃఖ దూనయైన రతీదేవి, పతితోడిద లోకంబని, శరీర విసర్జన వ్యవసాయయైన, నాకాశవాణి "-యోసి సురూప సుందరి! నీచేయు సాహసం బుడుగుము, కాలంబు శుభోదర్కంబై యున్నయది, యాది దంపతుల కల్యాణంబు దొట్టి మీ యాలుమగల పునస్సమాగమ పున విర్విచిత్ర విక్రమ విజృంభణంబు లారంభమగు"నని యూరడించిన నాయకయు మరణ వ్యవసాయంబు నుజ్జగించి పరమశివ దార సంగ్రహా శానీరంబులం జేసి జీవితాలవాలంబు దడపుచు, దివసంబులు వేగించు చున్నంత. 361

చం. తనదగు రూప సంపద వితావితలై, జగదేక ధన్వికా
ముని గుణనిక్వణమ్ము రతిముంగిట భస్మపురాశియై, జగ
జ్జనని తుషారశైలసుత చాల నలంగి యలంగి, యా త్రిలో
చనున వరింతునంచు, సహసా వినిబద్ధ వినిశ్చయంబునన్. 362

సీ. లలితాంగి రత్నభూషలపైని ప్రేమమ్ము
వర్జించి మెయి బూనె వల్కలములు,
చారుకుంతల పరిష్కారంబు విడనాడి
మడిమలంటగ బెంచె నిడుద జడలు,
రశనాకలాప సంరంభంబు వదలించి
కటిఁబూన్చె దర్భకర్కశము మౌంజి,
చందనాద్యంగ చర్చలు మాని ప్రన్నని
తనువుపై మెత్తించె ధవళభూతి,

గీ. వృషకకుద్రేఖ నిరసించు వ్రేకనైన
చనుగవకు నేర్చె పులితోలు సంగడంబు
పాశుపత దివ్యదీక్షచే పట్టి గౌరి
హరుని యెదదాకు కోరిక లగ్గలించి. 363

సీ. మండు వేసవులందు మగువ, పంచాగ్ని మ
ధ్యంబున యందు నిధ్యాన మూని
వర్షర్తు జటిల వార్వాహధారా సిపా
తమ్ముల యందు చేతమ్ము గట్టి
హేమంత వాత్యల నిందీవరాక్షి, పు
క్కిటి బంటినీటిలో దిటవునాని
కాలకంధర వాహ గర్జా ఝణత్కార
శరదంబులందు నిబ్బరము పట్టి
గీ. దుష్కరంబైన తపము తోడ్తోడ బెంచె
నా తుషారాద్రి శతవృద్ధులైన మునులు;
యిట్టి కష్టంపు తపము మే మెన్నఁ డేని
కన్న విన్నది లేదంచుఁ గళవళింప. 364

వ. ఇట్లు దుస్సహతపంబున న్జేసి, భూయో మనోహరతరమైన పార్వతీదేవి సవిధంబున కొక్కనాఁడు రక్తాశోక పటలంబులంబోని జటాభారంబు వాడు వచన సంపన్నుండొక్క వటు వలవోక వోలె నరుదెంచి కృతాతిథ్యుండై సేదదేరి ప్రస్తావనోచితంబుగా నిట్లనియె 365

గీ. ఎట్టి కట్టడి కోర్కెకై యిట్టి తపము
పట్టితివి! చారు రూప సంపన్నమూర్తి!
పద్మ కింజల్క సుప్రభా భాసమాన
మీ శరీరమ్ము నీకేమి యెగ్గొనర్చె! 366

చ. హిమధర రాజపుత్రివని యింత లసంతల వింటి, నిట్టి నీ
కమరని కోర్కెయేది! మదనాశుగ మోహనగాత్రి! చారుప
క్ష్మములగు నీదు కన్నులకుఁ గజ్జల సంగతి బోలుఁగాని హే
యముగ విభూతి మెత్తుటలె! యౌర! దురన్వయ మింత సెల్లునే! 367

కం. అను పల్కుల విని పార్వతి,
కనుసన్న యొనర్ప-యొక్క గాడలిచెలి, యా

తని, జూచి పలికె, వీణా
క్వణనంబులు వోని సరస వాగ్వైఖరులన్. 368

సీ. వినవయ్య వర్ణి ! యీ యనుపమాంగి, మహేశ్వ
రునకునై చిత్త మర్పణము సేసి,
తద్దయుఁ బూనె నీ తపము, దేవేంద్రాదు
లకు నసంప్రాప్య మీలలన మనసు,
దప్పిగూరిన వారి దాహంబు బోకార్ప
జలములె గాక యాజ్యంబు హితవా !
ఆ మహేశునకునై యతివ సేయని వ్రత
మ్ములును పట్టనివి నిష్ఠలును లేవు,

గీ. నీవు దయగలవేని యీ నిటలనేత్రు
కైవస మొనర్చుకొనెడి మార్గంబు సెపుమ !
యోయి ! యీ శైల శిలలును నుల్లమగల
కరగి, గాంగ జలమ్ములోఁగలిసె చూడు ! 369

చ. సెలవుల నవ్వి విప్రుఁడనె, చెల్లరె! యీ దృశమైన రూపమా
యొలికిని బూసికొను నోగుల వానికిఁ గట్టఁబెట్టుటే !
చెలువకుఁ దోచకున్నఁ బరిశీలన సేయరె ! కన్నతల్లి దం
డ్రులయిన, కన్నవానికినిఁ ద్రోయుట వెట్టికిఁ గన్నయట్టులే ! 370

చ. అరయఁగ మల్లికాకుసుమ మర్కముపైఁ బడినట్లుగాదె ! యి
ప్పరమ మనోహరాంగి శివుపై మదినుంచుట; వెర్రి యింత దు
స్తరమయియుండునే ! జన దృశా పరిపేయము రూపమిచ్చి, సం
బరపడినట్టి యవ్వెడగు పద్మజు నెల్లిద మింత సేయునే! 371

గీ. చాలు, చాలింపుమింక వాచా విభవము,
లేచెఁ బార్వతి, క్రోధవీచీ చలాచ
లములు దృక్కులి, చంద్రకళాధరుండు
కట్టెదుట నంతలోన సాక్షాత్కరించె. 287

ఉ. పోవకు, పోవకే! కనులఁబూనిన కెంపులదాన! త్వత్తప
స్యావిధి నన్నుఁగొన్నయది బంటుగ, నీ యమృతాయమాన వీ
క్షా వినివేశ తర్పితముగా నొనరింపు మేను; హర్షసం
ప్లావితులైన దుఃఖిత సుపర్వుల నెమ్మదులూరడిల్లఁగన్. 373

ఉ. వారిజపత్రనేత్ర! యెల్ల పతివత్నులకున్ భవదీయనామ మొ
ప్పారెడు మంత్రమై చెలఁగు నట్లుగ నన్ను బరిగ్రహింపవే!
పారమహంస్య మార్గమును బట్టిన మౌనులు శీర్షకీలితాం
భోరుహ హస్తు, లోమ్మనుచుఁ బుష్టితహృత్తనులం జలింపగన్. 374

వ. అంతఁ బార్వతీదేవి యనురాగమేదుర కలశాబ్ధి వీచికాపరంపరలన్ బోని కటాక్ష వీక్షణంబులఁ గాలకంధరు నానందస్నపితుఁ గావించి - "పర వత్యస్మి పితరం ప్రత్యేహి"- యని మందాక్ష మందాక్షరంబుగాఁ బలికి- చెలిక త్తియలతో నిర్గమించిన. 355

గీ. తగునిది యటంచు - హిమధామధామ మౌళి
సర్వతస్స్రుత మదజలాసారకరి క
పోలకషణోచ్చల ద్దుగ్ధ పూర పారి
భద్రకద్రుమ నీరంధ్ర వనములందు. 376

కం. తిరుగుచు హర్యక్షపదాం
తరగళితారక్త నేత్ర తర్పణ ముక్తా
పరివారదంతురిత మొక
యురుతర పాషాణ విష్టరోపస్థితుఁడై. 377

మ. తలఁచెన్ చంద్రకళాధరుండపుడు, నిత్యశ్రీకులన్, సత్తపో
జ్వలనామ్రేడిత భాస్కరోదయుల, నిష్ఠాపూతులన్, పార్వతీ
నలినాక్షీకర మంగళగ్రహణ సన్మానంబు సేకూర్చి, త
న్నెలమిన్ దేర్చెడు పెద్దలంచు మది దా నిచ్ఛించి సప్తర్షులన్. 378

గీ. వారితోన నాహ్వానించె భవ్యమూర్తి
నయ్యరుంధతి, భర్గుఁ, డయ్యతివ వచ్చు
దారులందున వనదేవతలు - తదంఘ్రి
ధూళికై యహమహమికఁ ద్రోపులాడ. 379

కం. వచ్చు నరుంధతిగని, హ
ర్షోచ్ఛలితములైన కనుల, నుడు రాజధరుం
డచ్చపు భక్తిని శీర్షం
బచ్చెరువుగ వంచెఁ బులక లాగు బ్బగనై. 380

సీ. రావమ్మ ! మూర్త్యం తరమ్మైన నిభృతత
పోనిష్ఠ ! యవ్వశిష్ఠానపేత
పరమ మాంగల్య సంపద్ధోగిని! యోయరుం
ధతి! కాలకర్మ సంధాన కరణి !
ఆర్ద్రి కటాక్షమ్ము - లపగత విఘ్నని
ఘ్నమ్ముగా - నా పైని నెమ్మి నిలిపి
నన్, గృహ మేధీయ, నైక ధర్మ క్రియా
శీలపూర్ణునిగాఁగఁ జేయవమ్మ !

గీ. శివుని యా పల్కులాలకించిన, యరుంధ
తీదృగంత మనుగ్రహాధీన మయ్యె !
అపుడు, తనువున నాత్మలో నవఘళించె
ప్రమథ యూథాధిపతికి గార్హస్థ్య దీప్తి. 381

గీ. అయ్యరుంధతికరుణయే యఖిలమునుల
మానసములందు నిభృత సమ్మతిగనయ్యె!
అవ్వసిష్ఠుని నేత్రాంతమందు దక్క
నబ్జగంధి యాశయమున కడ్డుగలదె. 382

వ. అప్పుడప్పరమర్షులరుంధతీ సమేతులై, తుషారశైల నృపధానియైన యోషధిప్రస్థపురంబున కరుదెంచి, కృతాతిథ్యులై, మహీధ్రకుల మాణిక్యంబున కిట్లనిరి. 383

ఉ. ఎవ్వఁడు సర్వభూతములకేలిక, యెవ్వని దాస్యభావ మం
దివ్విబుధుల్ వహించెద రహీనసుఖాప్తి, యతండు, త్వద్యశం
బెవ్వరికంటె బెద్దగ వహింపఁగ నీసుతఁగోరె, శంకరుం
డెవ్విధినెంతువో! తనయనిత్తువొ! భాగ్యము తూలవుత్తువో. 384

సీ. ఆ వచనంబుల కద్రి హర్షోచ్ఛ్వాన
నేత్రుఁడై పలికె మన్నియత తపము
ఫలియించి నేడుగా భవుఁడు మత్తనయా స
మర్పితమతియయ్యె, యడ్డుగలదె!
పార్వతీదేవి తత్పతి పదాబ్జాత ని
ధ్యాన తపోనిష్ఠ నలసినదియు-
కొమరిత-తాఁబంచికొనుగాత! దేహార్ధ
మఖిలదైవత నమస్కార్హ యగుచు,

గీ. శంకరుఁడు గోరువాఁ డట, సప్తఋషులు
పెద్దలట! యయ్యరుంధతి ప్రీతితోడ,
నొసఁగు దీవెనలట! యిందు కోహటించి,
యఱ్ఱుద్రిప్ప దుషారాద్రి వెఱ్ఱివాడె. 385

వ. సర్వసుపర్వాణ మస్తక మణిమకుట రోచిర్వితాన నీరాజిత పదుండగు శర్వు కరుణానిచుళితంబులు క్షణంబు లర్థవంతంబులగుగాక! యెయి దుఁడెయిదుండని యద్రికుల సార్వభౌముండు, సప్రశ్చయప్రణామంబుగఁ దత్తరింపఁ గృతాతిథ్యులైన మహర్షులు శివుని సవిధంబున సన్నిధిసేసి యమృతాక్షరంబులు జిలికిన. 386

సీ. కలువదంబులు చాల కనువిందులయ్యె, పు
ష్పములతో ఘ్రాణతర్పణము లగుచు
కలయఁజల్లినయట్టి గంధసారద్రవ
మ్ములతోడ రథ్యలుచెలువు మిగిలె,
పులుగడిగిన ముత్తెముల ముగ్గులై నభో
గ్రాహిసౌధములు పార్వణములయ్యె!
సీమంతినీ వపు స్సీమ భూషారుచి
వ్రజ, మింద్రచాపవిభ్రమము లయ్యె,
గీ. గరుడగంధర్వకిన్నర ఖచరయక్ష
కామినీకంఠములు కరగత విపంచి
కా గమకచాతురీ దేశికమ్ములయ్యె
పొల్పెసఁగు నోషధీప్రస్థపురమునందు. 387

మ. వరుసన్ దీర్చిరి దేవకాంతలుచిత వ్యాహారసౌరభ్య భా
సురగండస్థల లీనకైతకశిఖా సుస్మేరలై, మన్మథో
ద్ధరణంబైన ప్రసాధనంబు, దివిజప్రత్యర్థియౌ తారకా
శరదుర్గర్వభుజాపహార నిబిడాశాజ్యోతులై నేత్రముల్. 388

సీ. శచిదేవి సవరించె చరణాబ్జముల యందు
శర్వహృత్పర్శి లాక్షారసంబు
వహ్నిజాయ గదించె పార్ష్ణిదేశమ్మున
వివిధ విభ్రమముల పెండెరమ్ము
వరుణాని గూర్చె నూపురములు స్మరజర
త్కలహంస నాదశంకాప్రదములు,
వాగ్దేవి, కటిసీమపై నిల్పె మేఖల
కల మణితంబుల చెలిమికత్తె.

గీ. కలశసంభవురాణి చెంగావిదైన
యంగదట్టంబు గట్టించె-య య్యరుంధ
తీ తరుణి స్వచ్ఛ ముక్తావదాత వర దు
కూలమొక్కటి జేర్చించె కోర్కె మెరసి. 389

సీ. తమణికి, కర్ణపూరమ్మనే పువు లెట్ట
గండయుక్కాంతి సంక్రాంతమదియు;
లలితేందుముఖికి, గజ్జలమేది వెట్టిన
నిస్తులాపాంగ పరాస్త మదియు
కలికికి, మించు ముక్కర యేది వెట్టిన
దంతరోచిశ్ఛటా ధౌతమదియు -
యింతికి, వేనలి నేసొమ్మువెట్టిన
కచబంధనీలిమోత్క్రాంతమదియు;
గీ. ఇంక నెట్లమ్మ ! యని యప్సరేందుముఖులు
తత్తఱంపడఁగా నరుంధతి విలోల
శాతశార వీక్షణములె చాలు హరుని
యుల్ల మగలింపగా నూరకుండుఁడనియె. 390

గీ. హర్షమిది, దుఃఖమనెడు వ్యాఖ్యానములకు
నవ్వలివియైన యశ్రువు లతులగుచు,
జనని మేనక ముద్దుకూతునకు దీర్చె
లలిత చందన కల్యాణ తిలక రేఖ. 391

కం. కులదేవతలకు మొక్కిడి,
వలగొని ముత్తైదువులకు, పరితః పరివా
ర లలిత మందస్మిత సం
కులమై, కల్యాణమునకుఁ గొమరగు చవికెన్. 392

ఆ. వేచియుండె గౌరి, విశ్వైక భర్త సు
ధాకరాంక మౌళి రాక కొఱ క
నేకవర్ష విరహ నీరంధ్ర కళ్మల
క్షాళనోత్సుకములు కన్నులగుచు. 393

మధ్యాక్కర. వేంచేసె ప్రమథాధిపుండు, విమలయోగవ్రతమౌని
సంచయ హృదయసంగతుఁడు, సకలలోకాశ్రయైశ్వర్య
సంచాలకుండైన దాను, సతత వైరాగ్యైక రిక్థు,
డంచిత కరుణా విశాల హారినేత్రద్వయీయుతుఁడు. 394

మధ్యా. భస్మాంగ రాగంబు మేన, పరిణతచంద్రికామూర్తి
విస్మేరములు శీర్షమందు, విమలామృతాబ్ధి తరంగ
విస్మయములు కటాక్షములు, విశదతనూమ్యతు లొచు
సస్మితుండయి వచ్చె- స్వామి- సర్వజ్ఞుండు శంకరుఁడు. 395

మధ్యా. బుస్సుమంచనెడి సర్పములు, పుట్టుగు గొనములు మాని
నిస్సర త్కాంతిపుంజములు నిర్నిమేషములు చూపులయి,
నిస్సారసంసారమలము - నిర్విశేషముగఁ బోకార్చు
దుస్సాధ చిత్రవర్తనుఁడు - తోతెంచె కరుణతో స్వామి. 396

కం. స్వామి నెదుర్కొనె శైల
స్వామి, మదేభంబునెక్కి, బలవద్వృషభ
స్వామి. గజస్వామి కృత
వ్యామిశ్రిత రవములబ్ధులందు నదింపన్. 397

వ. ఇట్లెదుర్కొని తుషార మహీధ్రుండు పరశ్శతభావ సందోహ తరళీకృత లోచనయైన మేనాదేవి ప్రత్నరత్న శబలితంబులగు పసిండి పాత్రంబుల తత్తన్మణీగణ ప్రతిఫలనంబుల పరిణతలాక్షాతంతు పాటలంబులు, వికచకువలయ ప్రభాశ్యామాయ మానంబులు, ఆమత్తకోకిలలోచన ద్యుతి గళ గ్రాహి నీలపాటలంబులు, నళినీదళ హరితంబులు, స్ఫీతసింధు వార్ధ

కుసుమ మంజరీ విభ్రమంబులు-ప్రతిముహుస్స్పృష్ట శతక్రతు చాపశతంబు
లైన, జలంబులు వోయ సురా సురాశా కామ దుఘంబులైన పదంబులు
గడిగి. 398

ఆ. తజ్జలంబు మస్తతటమున బ్రోక్షించి
కొనియె శైలరాజు, కూర్మిగృహిణి
కైనఁగాచికొనక, తానెంతవాడైన
స్వార్థమునకు గ్రిందివాఁడు దేహి. 399

కం. మేనాదేవియు శివని
ధ్యాన పరాభూత లౌకికాశయయై, యా
శానుండల్లుఁడు "చాలున
నూనం"బని జలము దాల్చెనొగి, మస్తమునన్. 400

శా. కన్యాదాన మొనర్చె, దైవతమనః కాంక్షా బుభుక్షా నివ
ర్తి న్యాసంబుగ-శైలరాజు, మహిత శ్రీకంఠవీక్షావళీ
విన్యాసంబులు, భావితారక భుజా విక్రాంతిలుంటాక పు
త్రాన్యాలభ్య విహార హారి కథలు ద్వ్యద్రీతి చిత్రింపఁగన్. 401

గీ. భవుఁడు వోసె దలంబ్రాలు పర్వతేంద్రు
దుహితపై కరకంజముల్ దోయిలించి
పరులకెన్నఁడు దోయిలింపని కరములు
మొగిడెనట ! పౌలికై - మరుపూన్కిఁగాదె. 402

చం. శిరమునఁబోసె నక్షతలు శీతలచంద్ర కిరీటుకై సుధా
ధర వికస త్స్మితంబుగ, నతస్ఫురదాయతలోచనాంతవి
స్ఫురిత కటాక్షపాతముగ, ముగ్ధ కుచోపరి రోచమాన సుం
దరతర రోమ హర్షముగ, దా, సితవారిజ నేత్ర యత్తఱిన్. 403

సీ. చెట్ట వట్టించిరి శివ పార్వతుల నిఱు
వైపుల నున్నట్టి పద్మముఖులు
గూర్చుండఁ బెట్టిరి కూర్మి దంపతులను
వరహేమ మయమైన భద్ర పీఠి
అఖిల సురాసురాభ్యర్చ్య యారంజోతి
యగ్నుల విహరించె నధికనిష్ఠ
పద్మాసనుండు సప్తర్షులు వలికిరి
భృశసుందరంబుగా ఋగ్వితతులు.

గీ. యగ్ని వేల్చిరి శివుఁడున య్యాదిశక్తి
హోమధూమసమాఘ్రాణనోత్సవముల
త్రిః ప్రదక్షిణముల నొనర్చిరి మహాత్ము
లెయ్యెడల శాస్త్ర విధులకు నెడయువారె. 404

వ. ధ్రువ దర్శనాంతంబు వివాహంబుసెల్లె; సమాప్త పాణిగ్రహణ మహోత్స
వులైన భవానీ భర్గులు పద్మాక్షునకును పద్మాసనునకును నమస్క
రించిరి. ఆర్ద్రాక్షతారోపణంబును, సమ్యఙ్నిర్వర్తితంబయ్యె, నంత.
405

సీ. అమృతాంశుమండ లాధ్యాహారమైన ప
ద్మాతపత్రముఁ బట్టె నబ్ధితనయ
రసదిగ్ధకైవార రచనము ల్సేసె, పే
శలబంధముగ వచస్సరసిజాక్షి
నందీశ్వరుని మర్దళాందోళనమ్ముల
జతగూర్చి యాడె నచ్చరల గుంపు
క్రమకంకణ ఝుణత్కారమ్ముగా సీవి
ధులు వేసె దేవకాంతల చయంబు

గీ. అఖిల విబుధులు నిటల విన్యస్త హస్త
పద్ములై వేడికొనిరి, నిర్వాణ దీప
మైన జగతికి, తేజః ప్రదానమునకు;
పంచశర విక్రముని పునః ప్రభావమునకు. 406

శా. కానిం దంచనుమోదనంబు సలిపెన్ కామారి, పుండ్రేక్షు చా
పానీతంబులు శింజితంబులు బెడంగై గ్రమ్మె నాలోన, కా
మానుక్రాంతముగాని శర్వు హృదయం బయ్యద్రిజావాలుకో
చ్చానంబుల్, జఘనంబులంటఁ దలఁచెన్ శోభోపగూఢంబుగన్. 407

గీ. ఆ వివాహమైనంతన నఖిలసురలు
ఋషులు వోయిరి భవుని యాశిషములంది;
చాప శర రోపణముల విశ్రాంతి లేని
భావజన్ముండు మదనుండు వోవలేదు. 408

చ. గిరితనయా మహేశ్వరులు క్రీడ్లరుకన్ హృదయేప్సితంబు, లు
ద్ధురతర సౌరతక్రియలఁ ద్రోసిరి, ప్రేమ, దివానిశీథముల్
సురసరి దూర్మిలన్, కుసుమ సుందర శయ్యల, గంధసార భా
సుర తనుచర్చలన్, కిసవిశోభి నికుంజనికేతనమ్ములన్. 409

మధ్యాక్కఱ. పార్వతీ పరమేశ మదన పరవశతావృత్తి జెల్లె
యోర్వంగ రాక బెక్కేడు, ఋద్రిక్తులై సురలెల్ల
శర్వుని భంగింప నెంచి, శతధృతి తోడన గూడి,
పర్వెత్తి రత్తాల సాల పంక్తి తుషారాద్రి గుఱిచి. 410

సీ. చాలింపుమో దేవ! సంరంభ వృత్తి, తా
రకు తీవ్ర విక్రమాక్రమత జేసి,
నిఖిలామరుల శౌర్య నిర్నిద్రతలును ని
ద్రాణమ్ము లయ్యె, సౌర ప్రశస్తి

శోభా దరిద్రాణ శోచనీయం బయ్యె,
 తదవైన దేవ సంతతులె లేరు;
ఆది దంపతులు మీవైన సర్వ ప్రవృ
 త్తులు లోక సంరక్ష వలసి కాదె.

గీ. అనుచుఁ బ్రార్థించు దివిజుల నాలకించి
వీర్యమున్విడె భవుఁడు, తద్వీర్య మవని
దాల్చి భరియింప నోపక దహను జొన్పె
నతఁడశక్తుండయై, గంగయందు వదలె. 411

వ. ఆయమయుఁ దద్వీర్యంబు భరియింప నోపక, హైమవత పాదంబున వదలె నందుదితుఁడైన కుమారునకుఁ గృత్తికలు స్తన్యం బొసంగి, రిట్లు ద్భుదితుండైన కుమారుండు, స్కందుండు - గాంగేయుండు - శరవణ భవుండను పేరులఁ జెలంగి. 412

కం. హిమభూధర తనయా ప్రే
మమయా శీర్వాద నిచిత మస్తకుఁడై, దే
వ మృధోపద్రవ వారణ
కమనీయాశా ప్రరోహకరుఁడై బెరిగెన్. 413

సీ. వాహనం బది శిఖావలము చంచత్ప్రభా
 జాల రాక్షసదృఙ్మీలనమ్ము,
పంపు సేసెడునట్టి బలగమ్ము ముప్పది
 మూఁడు కోటులు దేవ ముఖ్య గణము
భార్య నిస్సీమలావణ్య దుగ్ధాబ్ధిలో
 ధృతి జనియించిన దేవసేన,
అభిలాసురులు గుంపులై తీంద్రదాకినఁ
 దరిమి పోరెడు నట్టి బరవసమ్ము,

గీ. కాలకంధరు చిచ్చఱ కన్ను, రూప
ము ధరించెనో నా నొప్పు మొక్కలుండు
ధీరహుంకార శంఖ ఘాంకార భృశ వి
శసిత కర్బురవక్షుండు శరవణుండు. 414

మ. ఒక వాడిందుధరుండు పార్వతియు లోకోన్మేష సంరక్షణా
ది కథాలాప మొనర్చుచున్ త్రిజగతీ తీవ్రవ్యథాపాది తా
రక దౌష్ట్యంబులు నుల్లమందెనసి, తత్ప్రాగల్భ్యముల్ కూలద్రో
యక పోరాదని నిశ్చయించుకొని కార్యవ్యగ్ర చిత్తంబులన్. 415

సీ. హైమవతీ చక్షురానంద వర్ధనుం
డతి వేల శౌర్య బాహాభిరాము,
డాదేవసేనా ప్రియంకర వర్తనుం
డా సురగర్వ విత్రాసనుండు,
సకల దైవత దిదృక్షా పూర్తి తారక
గర్వభృన్మస్త విఖండనుండు,
తెండా కుమారకుఁ బొండంచు, రుద్రాను
చరుల నాజ్ఞాపించె శర్వుడంత,
గీ. వారువోయి నిదేశ మర్పణము సేయ
చారు బర్హిణబర్హ విష్వక్ప్రవృత్త
భాస్సముద్దీప్త వాహన ప్రస్థితుండు
దరిసె కొమరుండు తాత పాదముల దోయి. 416

కం. వచ్చిన కొమరుని గన్నులు
విచ్చిన వెన్నెలలుగాఁగ వెసమూర్కొని, తా
నచ్చటి యొక యాసనమున
మచ్చికఁ గూర్చుండఁజేసి మదనారి యనెన్. 417

చం. చిరముగ బ్రహ్మకున్దపము సేసి, గడించి వరంబులప్పురం
దరముఖ నిర్జరౌఘములఁ దావెడలించె దివంబు, నప్సర
స్తరుణుల రూపసంపద మదావళమై గలచె, న్నపక్రియా
నిరతుఁడు, తత్స్మయం బవగణించుట తాల్మికి దోసమే యగున్. 418

సీ. ముని వాటములు జొచ్చి మునికన్యకా వయో
గంగ భంగించు, దుర్గర్వ మెనసి
యజ్ఞమ్ములను గ్రమ్మి యాయజూకుల గ్రుమ్మి
చదువుల నెల్లఁ గశ్మల మొనర్చు
పట్టణంబులు గాసి పక్కణంబులు సేసి
వనరెడు ప్రజఁ బకాపకల నవ్వ
మూర్ధాభిషిక్తుల మొగి దెచ్చి తన యింటఁ
బడిగాపులను జేసి బడలు వఱచు

గీ. వాని దుశ్చేష్టితమ్ము లెప్పాటఁ జెప్ప
నైన గీర్దేవతకు శక్తి యసదు సుమ్మ,
తద్విజృంభణమున వసుధాపురంధ్రి
సర్వతోబాష్పపూరవిశ్లథిత యయ్యె!. 420

కం. ఆ తారకుతోఁ బోరఁగ,
లాతులు వెఱచెదరు, నీవ లావరివి, జగ
జ్జేతృ నిశాచర కంత ని
పాతన మొనరించి జయము బడయఁగ వలయున్. 420

వ. నీవన్న నీవాక్కఁండవ తారకాసుర నిహంతవనుట గాదు, గావనుటయు నయథార్థంబ; దేవేంద్రాదులైన మాబలంబులన్నియు నీ యందర్పించి నను తారక నిషూదనంబునకు జాలనివియ; వాని వరంబులప్పాటివి! నీకు సర్వేశ్వరుండైన నారాయణుండు దోడై యస్త్రంబులొసంగి, నిన్నావేశించిన దారకహననంబు సాధ్యం బట్లుగానినాడు శశశాబశృంగం బన్న, నవ్వచనంబు లాకర్ణించి-విస్మయ విస్ఫారిత నేత్రుండై స్కందుం డిట్లనియె. 421

కం. నిన్న, జగన్నేతనుగా
మన్నించెద రఖిల ఋషిసమాజము, నీక
త్యున్నతుఁడు గలఁడొ! తద్విధ
మెన్నఁగనెట్టిదొ! యనుగ్రహింపుము దేవా ! 422

మ. అనినన్ లోచనముల్ ముదశ్రుభర ధన్యం మన్యముల్ గాఁగ, గ్ర
మ్మిన ఘర్మంబు సమాధిసౌఖ్య గమికర్మీభూతమై, జాలుగ
ట్టిన రోమాంచముతోడి దేహమయి, కుంఠీభూతమై వృత్తి, చి
ద్ఘనుఁడై, శంభుడు గొంతసేపు నళినాంతర్లీన భృంగమ్ముగన్. 423

గీ. కడపి నేత్రంబు లెలవిచ్చి గాఢహర్ష
తరళితుండు ధ్యానను సంధానపూర్వ
కంబుగా, దోయిలించి-గద్గదిక దొలఁచి
హితమితమ్ముగఁ గొమరునకిట్టు లనియె. 424

సీ. ఎప్పటిదీ సృష్టి, యెట్లుగా నేర్పడె
 నను విచికిత్స, యనాది, యెంద
రెందరో! బుద్ధినూహించిరి; తేలిన
 దేమి? పరస్పర హేళనము,
బుద్ధ్యతీతమ్మని బోధించు నిగమమ్ము,
 భావింపబుద్ధియుఁ బరిమితమ్మె,
నలువుగా 'యన్నయేన విరుధ్యతే' యంచుఁ
 దెలిసియుఁ దెలియరు, తెలివిమాలి

గీ. భ్రమలకుఁ దొలంగి బిట్టు చార్వాకములను
వదలి, ఋషుల ఋతంభరా ప్రజ్ఞ వట్టి
సాఁగువాడు సత్యంబును గ్రహించు
గానివాఁ డవివేక కింకరుఁడు, జడుఁడు. 425

వ. వేదచోదితంబై, సనాతన పరమర్షి నిధ్యాన సాధితంబై, త్రికాలజ్ఞాన సాధన పాథేయంబైన పరమ సత్యంబు వివరించెద నాకర్ణింపుము—మహదహంకార తన్మాత్ర సంయుతుండై, షోడశ కళా సహితుండై పంచ మహా భూత భాసితుండై, సర్వాతిశాయియైన పురుషుండ సృష్టికి ప్రాక్పరంబుల నున్నవాడు; తదుభయంబుల నాతండు వీత కర్మియై యాఖ్యాతి మాత్రుండు; అప్పురుషుండ నారాయణుం, డతండ సకలావతారంబులకు మొదలగని. 426

చం. కరచరణాదు లాతనికి గల్గుననంత సహస్రముల్, మణీ
స్ఫురిత హిరణ్యగణ్య నవభూషణ రాజి యసంఖ్య, మమ్మహా
పురుషుఁడు వార్ధి మధ్యమున బూనిన సత్వ గుణంబుతోడఁ దా
బరగును యోగసుప్తుఁడు, నివాతవినిశ్చల దీపరూపమై. 427

గీ. అప్పు డాతని యెడఁదలో నావహిల్లు
'యేక ఏవ బహుస్యాం అనేకధా' య
టన్న సంకల్ప మపుడ, నాభ్యంబు పద్మ
మొదవు, దానిలో నుద్భవం బొందు నజుఁడు. 428

వ. ఇట్టి బ్రహ్మోదయంబు లనేకంబు, లే తత్క్రియా కలాపంబును పాద్మ కల్పంబని వక్కాణింతురు; పాద్మంబ గాదు, యుగాది పరమాణ్వంతం బగు సమస్త సృష్టియు నిట్టిద; పరమర్షుల వాక్యంబు లవ్యవహితుండవై వినుము. 429

"యదిదం దృశ్యతే కించి, త్భున స్థావర జంగమం
పునస్సంక్షిప్యతే సర్వం, జగత్ప్రాప్తే యుగక్షయే.
"యతుర్తా వృతులింగాని, నానారూపాణి పర్యయే
దృశ్యంతే తాని తాన్యేవ, యథా భావా యుగాదిషు"
"ఏవమేత దనాద్యంతం, భూత సంహార కారకం
అనాదినిధనం లోకే, చక్రవత్పరివర్తతే".

మధ్యాక్కర. ఒక్కపొద్మంబున ధాత యురుక్రము నాభియందున్న
యక్కమలంబున బుట్టి యాత్మజని స్థానమునకు,
నిక్కంపు మొదలేది ! యదియు, నిశ్చప్రచంబుగా నెద్ది
యెక్కటి బొడగందు నంచు నెడదలో సాహసంబూని. 480

కం. మునిఁగి మునిఁగి మునిఁగియు, న
వ్వనజబిసంబునకుఁదుదియు బ్రాప్తింపక యే
దిన మతియై, శూన్యవిలో
చనముల దిక్కులను జూచు సమయము నందున్. 431

మ. జలమధ్యంబున నుండి దోచెనొక నిస్వానంబు, తారంగ వీ
ణల నిక్వాణము వోలె, పద్మజని కర్ణాభ్యర్ణమై, కాదివ
ర్ణలసచ్ఛోడశ, మేకవింశ, మొడ గూర్వన్ భాస్వదర్థంబు, ని
శ్చల సచ్చిన్మయ వాసుదేవ హృదయాబ్జాతంబు రాహస్యమై. 432

సీ. అమ్మహావాక్యంబు నర్థితోఁ బలికిన
దెవ్వరటంచు దానెల్ల కడల
వీక్షించి తెలియక వినవచ్చినట్టి య
వ్వాక్యంబు దన్ను దపంబునందు
నియమించు నదియకా నిశ్చయించి, యలింగ
మును, నభోలింగమ్ము పూర్ణ, మైశ్వ
రంబును నన్యనిరాసంబు నమ్మహా
భూతమ్మునకు భక్తి పులకితాంగు

గీ. డగుచు సాష్టాంగ వందనం బాచరించి
తత్కృపకు లోనఁ గరఁగుచుఁ దపములోనఁ
బరమ సత్యంబు దెలియు భావమ్ము పట్టి
ఆదికవియైన యయ్యంబుజాసనుండు. 433

ఉ. పూనికతో నుపాధులు సమూలముగాఁ దెగగోసి, యింద్రియా
ధానమొనర్చి, చిత్తమున, తద్ధృదయంబును ప్రాణమందు, త
త్ప్రాణమపానమందును లయంబొనరించి, యతించి, మృత్వధి
ష్ఠానము దైవమందు ననుషక్తమొనర్చి యపాన మిమ్ములన్. 434

సీ. పంచభూతములకుఁ బ్రాపైన దేహంబు
నందు మృత్యువుగూర్చి, ఆత్మకెపుడు
మరణంబులేదన్న సరణి విభావించి
యద్దాని త్రితత్వంబునందుఁ జేర్చి
త్రితత్వమేకత్వరీతి నిబద్ధమైన య
విద్యతోగూర్చి యవిద్య జీవు
నందు లయించి, యవ్యయము కూటస్థంబు
నైన బ్రహ్మంబున నాత్మగలిపి

గీ. వేయి దివ్యవర్షంబులు విశ్వస్రష్ట
మందగించుట లేని సమాధి వట్టె
గాలి బొలయని యట్టి యేకాంతమందు
లెస్స దీపించునట్టి తిల్లికయుఁ బోలె. 435

వ. అట్లు దివ్యసహస్ర వర్షంబులు జితానిలాత్మ్మండు విజితోభయేంద్రియుం
డునై యాదికవి సమాధి వట్టినఁ బరమ పురుషుఁడాతనిని(గరుణించి,
పొడసూపిన. 436

సీ. గుణములొండొంటితోఁ గూడక యెచ్చోట
శుద్ధ సత్వమ దివ్య శోభ నెఱపు,
బ్రహ్మాదిసకల విత్రాసకంబగు కాల
విక్రమంబెచ్చోట విన్నఁబోవు,

అపరాజితములు మాయాదేవి విభ్రమ
స్ఫురణంబులెచ్చోట మరుజలంబు
నెచ్చోటఁదలసూప నెవ్వారినైన ద్రి
ప్పులఁ బెట్టఁగల భయమ్మునకు భయము.

గీ. అపునరావృత్తి మార్గంబు, సకలదేవ
తాగణస్తుత్య, మఖల తేజోగుణమ్ము,
అక్షియుగముల నాశ్చర్య మగ్గలింప
గాంచె వైకుంఠపురము నక్కమలజుండు. 487

సీ. శ్యామావదాతులు, శతపత్ర నేత్రులు
ప్రస్ఫురన్మకుట చిరత్న రత్న
కాంతిచ్ఛటాపూర కల్పిత పరివేష
లాజానులంబి బాహా చతుష్ట
యాభిరాములు, గదా ద్యాయుధాధృష్యుల
య్యును సత్వగుణము పెంపునను జేసి
యభిగమ్యు, లెదలపై నాస్వాదనీయ పే
శల గంధమాల్య చర్చావిశోభు

గీ. లతుల సారూప్య మోక్ష సౌఖ్యాతిరేక
మై గగుర్పాటు తోడి దేహములవారు
విష్ణు పార్శ్వానుచరులు, తద్విమల చరణ
తలములకు వందనము సల్పె నలినభవుఁడు. 488

వ. అచ్చోట సునంద నందాది స్వపార్షదముఖ్య పరిసేవితుండును భృత్య ప్రసాదాఽభిముఖ ముఖుండును, ప్రసన్న హాసారుణ లోచనుండును కిరీటకుండల గ్రైవేయక పీతాంబరాది శోభితుండును ప్రకృతి, పురుష మహదహంకార రూపంబులు నేకాదశేంద్రియ మహాభూతంబులు పంచ తన్మాత్రలు మొదలైన శక్తులు దన్నుగొలువ, స్వేతరాలభ్య విభవంబులు

దన్ను సేవింప స్వానందమాత్ర రమమాణుండైన నారాయణుండు దర్శనం బొసఁగిన, తద్దర్శనాహ్లాద పరిప్లుతాంతరుండు, ప్రేమభరాశ్రు లోచనుండు, హృష్టతనుఁడునైన కమలోద్భవుండు పారమహంస్య మార్గానుగమ్యమానంబులగు తచ్చరణ పద్మంబులకు నమస్కరించి నిలిచిన, ప్రీత మనస్కుండై పరమపురుషుం డిట్లనియె. 439

ఆట. అనఘ ! మెచ్చువచ్చె, నతివేలమగు నిష్ఠఁ
దలఁపు నిలిపి నన్ను వలిచి కొంటి;
కూటయోగు లెంతగొూదగొన్నదుస్తోషుఁ
డైనవాని వేద్యుఁడైన వాని. 440

సీ. సకలశ్రేయః పరిశ్రమమును, మద్దర్శ
నాఽవధికమ్ము, నట్లౌట, వరము
గోరుము! నీ కొడగూర్చెదఁ గొదలేక
తావక వైకుంఠ దర్శనమ్ము
మన్మనీషితము! నామాట లోనన గదా!
చిరధృతమ్ము తపమ్ము సెల్లె నీకు
తపము నా హృదయంబు, తపమున కేనాత్మ,
తపము లేనిది పరాత్పరుఁడు లేఁడు.

గీ. తపముననె సృష్టి జేతుఁ నా తపముతోన
రక్షణ మొనర్తు బోకార్తు రమ్యశీలి;
అతిశయంబైన తపమున యంద, నా స
మస్తమడకంబు పరమ మర్మమ్ము సుమ్ము. 441

అ. అనిన నబ్జయోని యక్షిగోళంబు లా
నంద బాష్ప పూర తుందిలమ్ము
లగుచు దేహమెల్ల నతిశయ ప్రశ్రయ
మగుచు పలికెఁ జిన్మయాత్ము గుఱిచి. 442

శా. స్వామీ! నీవ సమస్త భూతముల హృత్పద్మంబులందుండి త
త్కామాది ప్రతిబోధకంబులగు సంకల్పంబులన్ గూర్తు, వి
చ్ఛా మాత్రంబులు లోక సంహృతు లవస్థానంబులున్నీకు, దే
వా! మాఁ బోంట్లకుఁ జిక్కి చిక్కనివి నీ యానంద ఖేలా విధుల్. 443

కం. హృదయముల లోననున్నను
హృదయమ్ములలోని కసటులెంతయు నిన్నున్
గదియవట! నీ రహస్యం
బిదియని వ్రాక్కువ్వ వలఁతు లెవరు పరేశా! 444

వ. సర్వభూత హృదయ గుహాఽవస్థితుండవై యప్రతిహతంబైన సత్వ విషయక జ్ఞానం బునన్జేసి సకల భూత చికీర్షితం బెరిగెదవు, కర్మాది హేతుక రూప రహితుండవైన నీ స్థూల సూక్ష్మ రూపంబుల నెఱింగెడి నెఱుక దయ సేయుము. ఆత్మ మాయా యోగంబున, నానా శక్త్యుప బృహితంబైన సమస్త విశ్వంబును, ననన్యాధీన స్వాత్మసత్తాకుండవై వివిధ రూపంబుల సృజించి పాలించి యుపసంహరింతువు. ఊర్ణనాభి తంతుజాలంబుల పటాకారంబు సృజించి, స్థాపించి యుపసంహరించు నట్టిది నీ తెఱఁగు; త్వదనుకంపావిశేషంబున లోక సృజనంబు నందహం కారంబు నన్నావేశింపకుండుగ్నాత. సకల భూత శరణ్య! శ్రీనివాస! నీకుఁ గల్పాంతంబు నమస్కారంబు, నన్ననుగ్రహింపుమని వేడినఁ గరుణార్ద్రీభూతంబులైన కటాక్షంబుల విలోకించి పరేశుండిట్లనియె. 445

సీ. అమల విజ్ఞాన సమన్వితంబై, శరీ
రాదివిలక్షణం బాత్మ యనెడు,
నెఱుక యెప్పుడు గూడ దొఱఁగని భక్తి రూ
పజ్ఞాన సంపదఁ బడయఁ గలవు,
మదనుగ్రహంబున, మానితసృష్టి కా
ర్యము రజస్సంబద్ధమైన నిన్ను
గర్వంబు బొరయ ద కల్మష భక్తి వ
ర్మితుఁడవై సతము వర్తించు కతన!

గీ. మత్స్వరూప స్వభావ కర్మములనైన
సకల రాహస్యములు నీకు శయకుశేశ
యాంతర స్థిత బదరంబులగును గాత!
క్లేశముల నేదుమింక నాశీక జన్మ! 446

శ్లో. అహమే వాసమే వోఽగ్రే నాఽన్యద్యత్సద సత్పరం
పశ్చాదహం యదేతచ్చ, యోఽవశిష్యేత సోస్మ్యహం.

''ఋతేఽర్థం యత్ప్రతీయేత, న ప్రతీయేత చాత్మని
తద్విద్యాదాత్మనోమాయాం, యథా భాసో యథాతమః''
''యథా మహాంతి భూతేషు భూతేషూచ్చావచేష్వను,
ప్రవిష్టాన్యప్రవిష్టాని, తథా తేషు నతేష్వహం''
''ఏతావదేవ జిజ్ఞాస్యం, తత్వ జిజ్ఞాసు నాత్మనః,
అన్వయ వ్యతిరేకాభ్యాం, యత్స్యా త్సర్వత్ర సర్వదా''

వ. సృష్టికిఁ బూర్వంబునఁ గేవలుండనై యున్నది నేన; స్థూల సూక్ష్మంబులు తత్కారణంబైన ప్రధానంబు నాయంద విలీనంబులు; సృష్ట్యవసానంబున నేన పీతకర్మంతనై యుండుదు; దృశ్యమానంబైన విశ్వంబును నన్నకా దలఁపుము. అనాద్యంతుండ న ద్వితీయుండ నైన నేను పరిపూర్ణుండను. మాయా స్వభావంబు వివరింతు నాలకింపు మర్థంబులేకయ దోఁచి క్రమ్మఱఁ దోపక మానున దియ మదీయ మాయా విశేషంబు; శుక్తిర జతభ్రాంతి యుదాహరణంబు; లేని యర్థంబుఁ గన్పించుటకు నున్నది గన్పడకుండుటకు, ద్విచంద్రాదికంబును, తమఃప్రభావంబును దృష్టాంతం బులు; భౌతికంబులైన ఘటపటాదులందు మహాభూతంబులు. తత్సృష్ట్య నంతరంబునఁ బ్రవిష్టంబులైనట్లుండు-కాని ఘటాదుల సృష్టికిఁ బూర్వం బునఁ గారణంబులై యుండుటన్జేసి యప్రవిష్టంబులు. నాయునికియునట్టిద; ఘటాది గత మహా భూతంబులకు ఘటపట చ్ఛేదన దహన క్లేదనాదులు ప్రాప్తింపనట్లు, నన్నును భూతగత వికారాదు లంటవు. అన్వయ వ్యతి రేకంబుల యద్వస్తువు, సర్వత్ర, సర్వథావ్యవస్థితం బదియ పరబ్రహ్మం

బని యెఱుంగుము; కారణత్వంబున సంబంధంబన్వయంబు. నిఖిలహేయ ప్రత్యనీక కల్యాణైక తానతాసత్వంబున స్వేతర సమస్త వస్తు భేదంబ వ్యతిరేకంబు. ఇదియ పరమ రహస్యంబైన యర్థంబు; సర్వోత్కృష్టం బేకాగ్ర చిత్తంబున మననం బొనర్పుము. సృష్టి కాలంబున నిన్నహంకారంబు గ్రసింప కుండెడినని పల్కి, పరమ పురుషుండు వైకుంఠంబు తోడన యంతర్హితుండైన. 447

గీ. చిత్తమానంద రసమునఁ జొత్తిలంగ
నాదిమూర్తి తిరోహితుండైన దిశకు
నౌదలను వంచి వందనం బాచరించి
తదుపదిష్టంబుఁ బలుమాఱుఁ దలఁచి తలఁచి. 448

కం. మనన ప్రభావమునఁ దొఱ
గిన యజ్ఞానమునఁ జేసి కీడ్పడిన యహం
తను, పద్మభవుఁడు నిత్య
ప్రణిహితమతి నీ చరాచరములు సృజించెన్. 449

సీ. అని వచించిన శర్వు, డవహితుఁడై యున్న
కుక్కుట ధ్వజు గూర్చి - కూర్మిఁ బలికె,
నాకళించితివొ యీ యర్థంబు, బహ్మాదు
లైనట్టి సర్వుల మతని చేతి
బ్రమాని బొమ్మలము; తారకు నీవు బోకార్చు
టయు, వానిదైన యిష్టంబ సుమ్ము.
తపము సేయఁగఁ బొమ్ము; తద్దయాపూర సు
స్నాన సర్వాజయ్య శక్తి గలిగి
గీ. రమ్ము ! వత్స ! యటన్న దపమ్మొనర్ప,
దగిన క్షేత్రంబు నానతీ దగునటన్న
నిత్య తారక నిధ్యాన నిచుళితములు -
యక్షు లఱమోడ్చి పలికె హిమాద్రి పుత్రి. 450

మ. అతి సర్వంబగు విక్రమంబున హిరణ్యాక్షుండు విశ్వంభరా
సతికిన్ గీడొనరింప, రాక్షస భుజాసంరంభమున్ మాన్పి, దై
వత రక్షాకరుఁడైన శౌరిముని సంసద్భక్తి చక్షుశ్శ్రీ వః
పతి శైలంబున నున్నవాఁడు, బహుధా ప్రత్యక్ష రూపంబుగన్. 451

గీ. శేషశైలమందుఁ జేయు నల్పతపంబె
యఖిల సిద్ధికరమటంచు భవుఁడు
దెలియఁడేమి; విష్ణు దివ్యతత్వజ్ఞాత
లందు నగ్రసరుఁడు హరుఁడుగాడె ? 451

కం. బొమ్మచటికి, తారకనిధ
నమ్మ భవత్కృతము, దేవా నారీవీణా
సమ్మోదగాన హేవా
కమ్మయి, దిక్కులకునెల్లఁ గలయఁగఁ బాఱున్. 452

చం. హిమనగ రాజపుత్రి పలు కేర్పడ విన్న హరుండు మేరు శృం
గ మహిత మౌ జటాభరము కంపన మొందఁగ శీర్ష మార్చి, ని
క్కమ వచియించె, వైష్ణవ శిఖాభరణంబు భవాని, శేష శై
లమునకుఁ బొమ్ము, పోవుటయ, లబ్ధి సుమీ! భవ దీహకంచనెన్.
453

సీ. శైల రాజారోహ సరణి విన్మ కుమార !
చరణ సంస్పర్శ మాసరపు టఘము,
అఖిల సురాసురాభ్యర్చ్యుండు శేషుండు
తన మహాభోగంబు తత మహీధ్ర
ముగఁ జేసి జగముల పున్నెమై నిలిచిన
వాసుదేవునకు నర్పణము సేసి
సేవించుచున్నాఁడు, చేతుల జానూరు
వులచేతఁ బయనంబు సలుపవలయు,

గీ. మౌనులు వసింతు రచట ద్రుమవ్రజమ్ము,
వారి నిష్ఫలమాన్చు జల్పములు దగవు,
నృహరి చరణ పీఠమ్ముగా హృదయమగుచు
నరుగవలె నుమ్ము వైకుంఠ నంతికమ్ము. 454

గీ. అచట గలదు క్రీడాసరం, బబ్జనాభ
చిద్ఘన శరీర సంగమ శ్రీవిరాజి
తమ్ము, తత్తటమున నల్పు, తప మనంత
ఫలదమది యాశ్రయమ్ము గావలె కుమార ! 455

కం. పొమ్మని శిరసునఁ జేయిడి
నెమ్మి దొలుక హరుఁడు వల్క, నిశ్చలమగు చి
త్తమ్మున కన్నుల, గుహునకు
నమ్మురహరు మూర్తి మెదలినట్టులె యుండెన్. 456

కం. కదలె విశాఖుఁడు, పుష్కర
పదవీ స్పృక్శిఖర నిచయ బహుగైరిక రు
క్సదనమునకు, శౌరిదయా
స్పద మృగ గణమునకు, శేషశైలంబునకున్. 457

శా. దూరంబందునఁదోచె సాత్వత మన స్తోషంబు, శ్రుత్యంగనా
చా రూద్భ్రంహిత కేశవేశ సుమన స్సందోహ సౌగంధ్య ఝుం
పా రారాజ దుదార మాధవ పదాబ్జన్యాస ధన్యాసికం
బారాధ్యంబు భుజంగ పుంగవుని భోగాయామ, మద్రీంద్రమై. 458

సీ. పరగు నెవ్వని ఫణా పంక్తులు శౌరి సం
చారంబులకు చంద్ర శాలలగుచు
పొలుచు నెవ్వని ముఖమ్ములు భాష్య ఫక్కికా
మాధ్వీక మొలుకు పద్మమ్ము లగుచు

ప్రాలు నెవ్వని చూపు వరదమై వాసుదే
వుని తత్వమర్థించు మునులపైని
అలరు నెవ్వని సఖ్య మమృ తాహరణ భుజా
స్ఫాలన గరు డాఽభి కాంక్ష్య మగుచు.

గీ. నెవని చరణో పధానంబు నిచ్చ గాఁగ
కన్యకలు పతింవరలు దీక్షగ భజింతు;
రట్టి సర్వాధినాథున కంజలించె
నయనములు మోడ్చిదేవసేనాప్రియుండు. 459

సీ. కలితాబ్ధి పుత్రి వీక్షణపంక్తి జలరూప
ములు దాల్చి యొక్కెడఁ బొలిచెనొక్కొ!
పతిత పావన పరాత్పర దయాపూరంబు
లమలిన కాసార మయ్యె నొక్కొ!
నారద వల్లకీ నాద మాధుర్యంబు
లొలికి రసాత్మత నొందె నొక్కొ!
సేవాసమాయాత శివ శిర శ్చంద్రచం
ద్రికలు తీర్థంబుగా నిలిచె నొక్కొ!

గీ. యనఁగ నచ్ఛజలంబుల నడరి, ముక్తి
వనిత దన మోము జూచు దర్పణము బోలు
కపటకిటి దేహ సంగభాగ్యంబు గలుగు
ప్రహదముగని హర్షపులకితుఁ డయ్యె గుహుఁడు. 460

సీ. ఝుంకారములు లేవె? నమధికద్వాయ పునః
పునరావృతికి నోచికొనవు గాక
వికసనంబులు లేవె! విశ్వేశచరణ సం
స్పర్శనంబులకు నొప్పదవు గాక,

సలిలముల్లేవె, ఈశ్వర శిరః ప్రోక్షణ
    క్షణ యోగయోగ్య ముల్గావు గాక
అంచలులేవె! దుగ్ధాబ్ధికన్యా హస్త
    తలలాలనములకై దగవు గాక

గీ. యేటి షట్పదముల గుంపు! లేటి సార
సవ్రజము! లేటి జలము! లే చాయనైన
కలకలాప కాదంబములు! వెఱంగు
పొందుపడు భక్తి, గరములు మోడ్చె గుహుఁడు. 461

ఉ. ఆ సరసీతటంబున జితానిలుఁడై రిపుషట్కలేశ మ
భ్యాశము జెందనీక, హృదయాబ్జము నందఖిలేశు సర్వభూ
తాశయవాసు వార్షికనవాంబుద నీల శరీరు, యోగి హృ
ద్వాసు వికుంఠు నిల్పికొని భాసురతీవ్ర సమాధి నిష్ఠుఁడై. 462

కం. ఉన్న గుహుని జూచుచు వెఱ
గొన్న యవియవోలె, ఘస్రకూటమురేలున్
తిన్నని సడి యెయ్యెడ ను
త్పన్నముగానీక శీఘ్రతమముగ నడచెన్. 463

సీ. తిరిగె కుమ్మరిసారె కరణిగా ఋతుసంచ
    యమ్ములు నిభృత వేగమ్ములగుచు
అవగుంఠనములోని యతివనవ్వులువోలెఁ
    దెలియక ముందె వెన్నెలలు దొలఁగె,
శంపాలతా వికాసమువోలెఁ బుష్పోద్గ
    మమ్మును తద్వికాసమ్ము గడచి,
ప్రఘత లేనట్టి దర్పంబట్టు "లివియె!" య
    న్నంతలో సేకములత్త మిల్లె

గీ. ఎవరు జూచిరి, కాలంబు లింద్ర ముఖ్య
సురగణములందు తారకాసుర వినాశ
మునకునై యెల్లరును షడాననుని తపము
లొదిగి ఫలియించుటకు, గాచియున్నవారు. 464

ఉ. ఈ విధిఁ గొన్ని వత్సరము లేగిన, తారకు దౌష్ట్యముల్, మునీం
ద్రావలిసేగి, యగ్నిజ సమాహితమైన సమాధి నిష్ఠ, గౌ
రీవిభు కాంక్షితం, బలవరింపగ, దర్శనమివ్వనెంచె లో
కావన కర్మఠుండు, నిగమాత్ముఁడు బర్హిణమౌళి వాజికిన్. 465

సీ. దూన దేవేంద్రాది మానసంబులు హతా
త్సంతోషమున బాలిశమ్ము లయ్యె
నాకభూగహన కల్పాగమ్ము లున్నట్టు
లుండి పుష్పోద్గమం బొలుకఁబోసె,
మునిజన సంకల్పములు లేక, తన్మాన
సమ్ములు సామగానమ్ము వాడె,
తాకుటకన్న ముందఱ యప్సరోవల్ల
కులు గుహ జయగీతికలను వినిచె,

గీ. గగన గంగాప్రవాహ దీర్ఘమ్ము, తొండ
మెత్తి బృంహితమొనరించె నింద్రదంతి
యఖిల జీవౌఘ సౌఖ్యశాయనికమైన
శౌరి సాక్షాత్కరించెడి సమయమందు. 466

వ. తదవసరంబున చతుర్ముఖ ముఖాబ్జాత నిస్సరన్మాధ్వీక సదృశవచః పటల సతతార్ద్రీకృత పాదమూలుండును, భక్తలోలుండును, శంఖచక్ర తామర తోమరాది సకల సులక్షణలక్షిత నిత్యప్రహ్వీభూత శ్రుత్యంగనా రల్లక బాహ్లీక సంసర్గశోణాయిత పాదకమలుండును, విగతమలుండును,

తారాగౌరవ ముక్తా చకచకద్యుతి, విధుమండల లావణ్య తిరస్కారిన ఖరముకురుండును, ప్రావృడ్డినాంతకజ్జల, మాయా దృశాంతకజ్జల, శుష్యత్ క్షయాంతకజ్జల, ధిక్కరణ న్యక్కరణ ఫూత్కరణ నీరంధ్రచికురుండును, కరికరాకార కరభనిభోరు మండల స్పర్శి వైజయంతికా వాసనాయాత మధుపకుల ఝుంకార సారణీ తృణీకృతమహతీ మధురతర తంత్రీ నినాదుండును, జరత్కలహంసకంఠ కేంకార హుంకార హుంకారి మధుర మంజీర నినదుండును, త్రైలోక్య యౌవత మనోమోహన శృంఖలాకలాప ఖచిత మణిగణ చంద్రకిత కటిమండలుండును, ప్రతిముహుః కుణుకుణు క్వణత్కింకిణీ నిక్వాణదయితా బ్రాహ్మీ శయ కుశేశయ పీఠానిక్వణ కృతతాపుండును. నిర్లేపుండును, శ్రీనివాస వక్షస్స్థల ముక్తావళ్యేకావళీ శతయష్టికాది హారనిచిత వజ్రేంద్రనీల సంపర్క యుగపదా కల్పిత రాత్రిందివుండును, స్వచరణ జనిత దివిజగంగాభరణ జటాటవీ ప్రకటీకృత నిజభక్తిభవుండును, లంబమాన తులసిమాలా నిర్మాల్య సేకరణ పరస్పర సమ్మర్ద ప్రతీక్షమాణ సనాద్యాది మునిగణుండును, వంచిత త్రిగుణుండును, కర్ణశష్కుల్యప్రాకృత మకరకుండలాకార నిత్యముక్త శశ్వత్ప్రార్థనాకర్ణన శోణాధరబింబ ప్రతిభాసి శరచ్చంద్ర చంద్రికా మధురస్మితుండును, ప్రపత్తిధర్మావలంబి భాగవత హృదయకుహర గతుండును, సకల పురుష మనోమోహన వదనమండలుండును, స్వానంద పరిపూర్ణ నిశ్చల సమాధి నిష్ఠానిష్ఠిత దేవర్షి హృదయ శ్రీత్వాపాది గండస్థల సరళ్లావణ్య పూరుండును, దీర్ఘనాసుండును, పీతవాసుండును, కారుణాబ్ధి తరంగాయితలలిత విలోకుండును, విశాలనిటల శ్రీకుండును, విభవచరమ సీమాయిత కిరీటుండును, మూర్తిమత్సర్వప్రాధనికుండును, కరస్పర్శ సంభావిత శంఖచక్రుండు నగు పుండరీకాక్షుండు దర్శనం బొసంగిన. 467

ఉ. కనుగవ విప్పి, తేజములు కర్ణపుటీ మిళదక్షిగోళభా
జనముల కెక్కుడై, జడుని చందమునన్ నిలుచున్న మాతృకా
తనయునిపై ననుగ్రహ సుధారస వర్షణ మాచరింప, న
ల్లన దలనెత్తిచూచె, నవిలంఘ్య పరాక్రము నాదివిష్ణువున్. 468

ఉ. చూచి పునఃపునారచిత సుందర కుట్మలితాబ్జహస్తుఁడై
లేచి ముదంబుతో నివకళింపగఁ జేతము, బుల్కలెల్లెడన్
బూచిన దేహమై భువనపోషణశీలు విలోకనప్రభా
మేచక వీచికాచయ సమృద్ధి నితాంతవినీలు జేయుచున్. 469

ఉ. తారకుఁడన్నలాశి వరదర్పమునన్ జెలరేగి, లోకము
ల్గారియ వెట్టుచుండ నవుగాదన జాలర యొక్కరైన, జం
భారి దురాసదంబయిన యస్త్రము వజ్రముగూడ వాని బా
హారభటిన్ మరల్పనసదయ్యె; జగత్త్రియదుఃఖ లుంతనా. 470

ఉ. ఎన్నఁడు నెట్టి భూతమున కించుక నొవ్వియొనర్పలేని శాం
త్యున్నతు లెండసీతువుల కోర్చి-వనమ్ముల గందమూలజ
గ్ధిన్నినుగొల్పు దాపసులు, దీన మలీమస వక్త్రులట్టి యా
పన్నుల బ్రోవకుంట దగవా! పగవారి నుపేక్ష సేయుటే. 471

ఉ. మానితవిధ్యనుష్ఠిత సమగ్రశతాధ్వర గణ్యపుణ్య సం
ధానముగాదె నాకజనతా విభుతా చిరలబ్ధి! యట్టిదే
మైనది! తారకాసురుని యంఘ్రులకున్నుపధాన మయ్యెఁ ద
చ్ఛ్రీనిచయంబు. వైదిక విశిష్ట ఫలంబులకింత యెగ్గటే!. 472

ఉ. కట్టడికాల నిర్ణయము ఋద్ధికినోర్వక, యింద్రుడున్ దిశా
పట్టముగాగనై యడవిపట్టుల దాల్చిన గోపవేషమై
గుట్టుగ నున్నవాడు, వెతగుందెడు నాతనికన్నులందు నే
పట్టునలేదు తీఱుగడ బాధనిరంతర బాష్పవృష్టికిన్. 473

ఉ. కావరమగ్గలింప కొటికాడు, మరుత్తరుణీసకజ్జల
స్రావి కదుష్ణబాష్పములు సాంద్రమషీరసమై, మహేంద్రు నై
రావతదంత కుంతముల వ్రాసె, "నిరస్తము దేవగర్వ"మం
చా వివరంబులన్నుడుచ నంజెదరెవ్వరు, రాక్షసాంతకా! 474

ఉ. పోలఁగయజ్ఞభాగములు పూర్వసుపర్వులమైన మాకు నీ
బాలివి గావా! రాక్షసుల వంశము లామరవైద్యులంతయున్
బోలవా! యంచుఁ దారకుఁడు మున్యుటజంబులఁజొచ్చి, తద్ధవి
ర్జాలము లాక్రమించు రభసంబున, రోషతరంగితాస్యుఁడై. 475

ఉ. "ఎవ్వని పాలికిన్ పడెదవే! పదనెక్కిన నీదు జవ్వనం
బెవ్వనిగోచిపాత నెలయించునొ! రమ్మ"ని మౌనికన్యలన్
గ్రొవ్వునఁబట్టి మానములుగ్రొచ్చి విదీనతబాలు! బాలు, జౌ
జవ్వనఁ జంపు నిష్కృప, నిశాచరునుల్లపుభంగి యెట్టిదో. 476

ఉ. క్రమ్మిన హోమధూమములు గౌసెనలై, పరిధూమ్రవర్ణ వృ
క్షమ్ములు గల్గి, మౌనిగణ కంఠవినిస్సృత భవ్యసామగా
నమ్ములతోడి యాశ్రమవనమ్ములు, లేఁబొలవల్పుగాలులై
చిమ్మెదునల్లలై-దుడుకు సేతకుఁ బారములేదె శ్రీహరీ. 477

మ. అనినన్నాస్యము జేవురింపఁగ, నభస్యాంభోదగర్జాశతం
బను మేయమ్ముగ మాధవుండనియె వత్సా! తారకుండాకృతాం
తుని దంష్ట్రాక్రకచంబులన్నలిగిపోఁ దోతెంచె కాలమ్ము, స
న్మునిబాష్పమ్ములె దెచ్చె, వాని నిధనంబు న్నప్రధృష్యంబుగన్. 478

మ. పరమప్రాప్యము నన్నకాఁదలచి, మత్పాదైకసేవారతిన్
పరదైవంబులఁ గొల్వఁబోక-సుతకాంతాముఖ్య సర్వంబు, మ
త్కరుణాధీన మొనర్చు భక్తునకు నే దాసుండ, యవ్వాని యు
స్సురుమంచూర్చెదునూర్పు మామకము హృత్క్షోభంబు త్రిః కృత్వమై. 479

మ. వరదానోద్ధతుఁడైన తారకుఁడు దేవవ్రాతమున్ గట్టి దె
ప్పరముల్ సేయుటతోన నాగకయ, మత్ప్రాణంబులౌ మౌనిహృ
త్సరసీజంబుల నెన్నడే గలఁచెనో-తద్వేళనే, వాని పీ
వరమౌ దిష్టము మూరిబోయినది నిర్వాతప్రదీపంబుగన్. 480

మ. బలవచ్ఛాత్రవకంఠలుంఠనభుజాప్రౌఢి ప్రియంభావుకా!
బలవిద్విణ్ముఖ దైవతవ్యథలు దీర్పన్ దేవసేనానివై
యలఘుప్రాభవమొప్పఁ బొమ్ము, నిరవద్యంబైన శౌర్యమ్ము తెం
పలమున్, మౌనుల నిండుదీవెనలు తోడై త్రోవఁగల్పింపగన్. 481

శా. ఆవేశించును మత్సుదర్శనము, కాలాఖ్యమ్ము తేజమ్ము, వీ
క్షావిశ్రాణిత రాక్షసవ్రజ జయోత్కంఠా గళగ్రాహమై
నీ వేలాయుధమందు, శాశ్వతసుధానీకాశ సత్కీర్తి నీ
పై వర్షించును, సౌర యౌవత కరాబ్జస్విన్న వీణారుతుల్. 482

ఉ. పొమ్ము! జగత్రయీ సుకృత భూతపరాక్రమ! తారకప్రతా
పమ్ముగలించి దేహపరిభాసికిణౌఘ విభూషణంబులన్
రమ్ము! సమీకశౌర్య రచనా నికషంబు, మహేంద్రరాజ్యవం
ద్యమ్మగు వాహినీ పతి పదమ్ము తిరమ్ముగ నీకుఁగట్టితిన్. 483

సీ. అట్లుగా వచియించి యంతర్హితుండయ్యె
వేదనిశ్వాసుండు విశ్వభర్త,
షాణ్మాతురుఁడు భక్తి సంపుటితాశయుం
డయి బోయెఁ గద్రూజకటకు గుఱిచి,
కంజనాభుని యనుగ్రహమాలకించి శం
భుండు నీరంధ్రముత్పులకితుండు
యాతుధానుని వధోద్యమము దివస్పతి
శ్రవణంబులను సుధారసము జిలికె,

గీ. ధవళదరహాస నాక సౌధములనుండి
సప్తపాథోధి లహరిజా స్ఫాలనములు
సౌరకరిబృంహిత ప్రతిచ్ఛందములుగ
నసురహృద్భేది, యుద్ధతూర్యములు మొరసె. 484

ఉ. దిగ్గజకర్ణముల్ వగులు తీండ్రలుగాఁ, గులశైలగర్భముల్
దిగ్గురనంగ, నా శరసతీ జఠరస్థ శిశూత్కరంబులున్
మ్రగ్గగ, నిండినట్టి సురరాజ ధణంధణభేరికాధ్వనిన్
ఖగ్గునమండెఁ దారకుఁడు బాహుబలంబు నదల్చినట్టులై. 485

శా. ఏమేమీ! సురలే! రణంబునకు దామేతెంచు టే రాక్షస
గ్రామణ్యుత్కట శస్త్ర ఖడ్గహతులింకన్ మానెనో-మానవో
ఈమై భేరులు నోరు విప్పుటలె! గానీ, వారి శౌండీర్య మే
దో, మా కన్నులతోన జూచెదము మేదో మాంస రమ్యంబుగన్. 486

ఉ. అమ్మఘ వుండు మొన్నట గదా! కదనంబున నోడి చీకటుల్
గ్రమ్మిన కన్నులై బిరుదు రౌతులతోఁ బడఁ బాఱె, నింతలోఁ
గొమ్ములు వచ్చెనో! తెగువ గూడెనొ! యీపరి నింకనెప్డు బా
పమ్మరి వోయకుండ, మగపాడి నడంచెద భీకరంబుగన్. 487

మ. అని చిత్తంబున నెంచి రాక్షస విభుండాస్థానమై, యుద్ధవా
ర్త నెఱింగించి, దళాధినాథులకు నుత్సాహంబు గల్పించి, ఘో
రన వ్రేయించెను భేరికాచయము లుగ్రంపశ్య శైలాటవీ
ప్రణదచ్చాంభవ నందికేశ గళగర్జా వృష్టు లెగ్గించుచున్. 488

కం. చలిమల కుత్తరమున బెం
పలరెడు మైదానమందు నసురవరులతో
కలనున కెదురునడువు మని
పలలాశి సురేశ్వరునకు వార్తలు బుచ్చెన్. 489

సీ. అమరగంధేభ కుంభాసాదితమ్ములు
వలుద ముత్తెములు జల్లులుగఁ బోసి,
సకల రత్నాకర సంపాదితమ్ములు
జాతి రత్నములు, పుంజములు వోసి,

ప్రత్యగ్ర వికచ పౌరందరా రామ పు
ష్పమ్ములు కుప్పలు గ్రుమ్మరించి
వైకుంఠ పద పద్మభవము గంగాజలం
జలరించు వెన్నెల యట్లు బోసి

గీ. శీర్షమునయందు, వీరాభిషేక మొనర
చేసి, రఖిలామరులు మహాసేనునకు, సు
రేశ్వరుఁడు వెల్లగొడుగు గ్రహించి నిలువ
సౌరగురుపూత నైగ మోచ్చారమందు. 490

సీ. మందరాచల మహాకందరోపమ గండ
ముల నుండి, దాన మేరులుగఁ జాఱ
తత్సీధురసము తద్దయుఁ గ్రోలి, కలుగుండ్ల
దొరయు భృంగములు బిట్టు రొదసేయ
నేత్ర గహ్వరములు నిగిడించు చూపు, శా
త్రవ సైన్యములకుఁ గృత్యలను బంప
తత కుధాస్తీర్ణ పుంభిత రత్నచిత్ర కాం
తులు నెండనీడలై బలిసికొనఁగ

గీ. బృంహితమ్ములు ప్రతివీరబృంద నిబిడ
వీర్య విశ్వాసములకుఁ జపేటములుగ;
ధీర మందరగతిఁ జరన్మేరువులుగ
నతుల దంతావళముల సైన్యములు గదలె. 491

సీ. ఖురపుటాహతి నేల గోడివడంగఁ ద
త్ఖుర జనితాగ్ని దిక్కులకు దన్న
హేషాస్వనంబు మిన్నిఱియింపఁ దధ్వని
తక్కునెలుంగు నుద్దవిడి మ్రింగ

గమన వేగమ్ము, దూరము దాపు - దాపుదూ
 రముగాఁగ, నొక్క క్షణమున సేయ
అరుగు దారికి నడ్డమైన కొండలు ప్రవస్సి
 నిముసాన నేల మట్టములుగాఁగ

గీ. పొలసిననె శత్రువీరుని యలికభూమి
గొరిజలను మోపఁగల బరాబరము గల్గు
యశ్వ సైన్యంబు నడచె, దిగంతదంతి
దంత నీకాశ విగ్రహాదర్శ కాంతి. 492

సీ. తలపైని వీరకేదారంపు బాగచుం
 గులు, గాలి సోకుల కలలునింప
వీరపాణపుటెట్లు విరిసి, కన్నులు శాత్ర
 వులపైని కంగారములు విదిర్ప
శయముల ఖడ్గ సంచయములు ప్రళయరు
 ద్రుని వీరహాసమ్ము ననుకరింప
నెఱికగట్టిన కాసెచెఱఁగులు, గమ్యసం
 భ్రమముతో నీలి కోలము ఘటింప

గీ. బిరుదు నడకలు శమనుపెండెరపు నినద
ములకు సైదోడులై భయమ్ములు వెలార్ప
నెల్ల వార్ధులు బెండెరలెత్తినట్టు
లవని యద్రుపఁ బదాలి సైన్యములు నడచె. 493

మ. ప్రళయోగ్నుల్ విదలించుఁ గన్నుగవతో, రక్షస్సమూహంబులే
వలనన్ గొల్వఁగ, బాహుసాలముల నొప్పన్ గాఢరోమాంచముత్
కలనన్ ఖర్జువు దీర్ప, గాంతునను నౌత్కంఠ్యమ్ము వక్త్రమ్ము పైఁ
జెలఁగన్ వచ్చెను దారకుండు, భృశరాశీభూతశౌర్యంబుగన్. 494

మ. తరుణార్కాంశు విభానిభుండయిన మందారుండు, తత్తారకా
సురు పుత్రుండరుదెంచె జూపులనె దిస్ఫుల్వారఁగా నవ్వుచున్
"పరుషైరావత దంతకుంతముల నాస్ఫాలించు యోగమ్ము సే
కుఱెఁబో నేటికి !'' ధన్యుఁడై తినను నిక్కల్ సారె వాక్రుచ్చుచున్. 495

చ. బరవసమొప్పఁగా నడచె బల్మి మగండగు కాలనేమి, యు
ద్ధురతర పాదఘట్టనలతో ఫణిరాజఫణా సహస్రముల్
భరపడఁ గేలఁ దాల్చిన విభాపరివేషగదాయు ధంబు చి
చ్చుఱ కను గల్గు శంకరు భుజాసముదగ్రతఁ గ్రేణిసేయఁగన్. 496

ఉ. ఆతనితోడనే నడచె నద్భుత శౌర్యుఁడు కేతుమాలి, సూ
ర్యాతప రక్తచాందనికమైన శరీరము చూడ్కికెంతయున్
బ్రాతిగఁ దోప, వింధ్యకు హరప్రతిమాన విశాలవక్త్రి ని
ర్యాత కహా, కహా, ద్రివిజరాజబలంబును మూదలింపఁగన్. 497

సీ. ఉగ్రదంష్ట్రిండు, శౌర్యోద్రేకమున వాఁడు
శమనునైననుబట్టి చఱచువాఁడు
దుర్వారు, డాహవ దుర్వార శస్త్రిండు
కాలాహి నెదురింపఁ గలుగువాఁడు
ఆరణి, శాత్రవాహంకార హుంకారి
కల్పాంత హేళి విక్రమమువాఁడు
కడిమి గల్గు సహస్ర కవచుండు, దోఃఖర్జు
వాపంగ వెక్కసమైనవాఁడు

గీ. మరియు సేయంగఁ గల దొర లురుములట్టి
హుంకృతులతోడ నడచిరి యుద్ధభూమి
కఖిలనక్తంచరులు, "నేటికయ్యె కలను
దీని దప్పింపరాదెట్టులైన" ననుచు. 498

చం. ఇటు మఘవుండు, భక్తి పరిహిండితమౌ మదితోడ, సర్వసం
కటహరు, నిందిరారమణు, గర్వదురాపు నలంఘ్య విక్రమో
త్కటు, వరధర్మరక్షణ విధాపరతంత్రు, జగన్నియామకున్,
నిటలమువంచి మ్రొక్కి, పదనీరజసంగ పవిత్రితాంగుఁడై. 499

చం. అతుఁడతపో విభూతిసుర లందరికంటెను మిన్న. సర్వశా
స్త్రతతికిఁ బట్టుగొమ్మ, హిమధామకలాపు నియట్ల లోక సం
స్తుతుఁడగు పద్మజా రమణు చొప్పెలెఱింగిన తత్త్వవేత్త గీ
ష్పతి, దగనాతనిన్ దెలచె వాసవుఁడర్హములైన పూజలన్. 500

సీ. తను గొల్చువారి కెంతటి వరంబైన, డె
    ప్పరమైన నొసఁగెడు బ్రహ్మ గెలిచి,
ఆశుతోషుండన్న యశము సార్థకముగా
    నసురునైనను బ్రోచు హరున కెఱఁగి,
సర్వ సన్నుతభోగిశయు మ్రొక్కుగైకొను
    సప్తర్షులకును మస్తమ్ము వంచి,
ముగురమ్మలకు మూలభూత, జగద్ధాత్రి
    యాదిశక్తిని గూర్చి యంజలించి,
గీ. తక్కువగల సనాతన ముని తల్లజులకు
తలను వంచి యాశీర్వాదములు గ్రహించి,
భిదురమును బట్టి దేవతా విభుఁడు వెడలె,
నమర కరికుధా స్తరణంబు నధివసించి. 501

చ. అలఁదిన వీరచందనము లందము లై పొలుపొంఱ, మూపులున్
దలకడ వంగ-నాలమున దార్కొని నేన జయింతు రాక్షసా
వలినని పంతమాడుచు నభశ్చరు లింద్రుని వెంట-వార్ధిపీ
చుల వలె బైనమైరి, కరశోభిత హేతి భయంకరాకృతిన్. 502

ఉ. ఫాలము లెఱ్ఱవాఱ, రుష బర్వుచు, జాచిన పోతు రౌతు పె
న్నాలుకలై కటాక్షములు నల్దిశలన్ ప్రసరింప, బాహువుల్
గ్రాలను దీర్ఘ ఖడ్గవులు, కంటికి బెక్కస మౌచు నష్ట ది
క్పాలురు మూదలించిరి, వికస్వర ఘోర తరాట్టహాసులై. 503

సీ. మిగులు కన్నుల వారు, బిగువు చూపుల వారు
తలపైని కొమ్ములు గలుగు వారు,
నిట్ట దంష్ట్రల వారు, తొట్ట వాతెఱ వారు
నిడుపాటి ప్రేవు జందెముల వారు,
ముప్వంకలగు కంఠముల వారు, పీనుంగు
గమి గూర్చి కొన్న నెట్టెముల వారు
మాంస వసాగంధ మలిన దేహమువారు
కహక హార్భటులు పిక్కటిలువారు
గీ. పునుక తమ్మంటులై-మేన బూసి కొన్న
బూదియై-గజకృత్తులు పుట్టములయి-
ప్రమథ నాథులు ప్రథిత శౌర్యముల వారు
నడచిరా బాహులేయుని యడుగులఁ బడి. 504

శా. నీలక్ష్మాభృదమేయ దేహుడు, దృశానిష్ఠ్యూత వహ్నిచ్ఛటా
భీలుం, డాగళ పీతకశ్య ఘన కుంభీభూత తుందుండు, ధా
రాలాలా జలకుత్సి తాస్యుఁడు రుదంష్ట్రాస్యూత వృక్ష్యుండు, త్వ
క్చీరుండై యల వీరభద్రుఁ డరుదెంచెన్ ఖండనోత్సాహియై. 505

కం. ఇరువాగులు నిటు హిమభూ
ధర పరిసరములను జేరి తతవా ర్ధులు బెం
దెర లెత్తిన గతి, శత్రుల
నెరగొను చెప్పుడని యఱ్ఱు లెత్తుచు నుండన్. 506

కం. కరములు పీచిన, తోదన
శరజన్ముఁడు నసురపతియు, శమన కహ కహ
స్ఫురణము లై, సర్వభయం
కరణ ములై-యుద్ధవాద్య గణములు మొరసెన్. 507

కం. కరిని కరి, భటుని భటుడు
న్న రదంబరదంబు, నశ్వ మశ్వమ్మనుఁ బ్రగ
చ్ఛల దాకిన, సకలదిశా
కరణంబులు-బెగడి యఱచు పగిదిగ నుండెన్. 508

సీ. వంద దర్గిన యట్లు పలలంబు గుప్పలై
తెప్పలై యుండె, భీతిదము లగుచు
వానకాలపు చేర్ల వలెఁ బాఱె ర క్త ర
క్తంబులు, కదనంపు గట్టులొరసి-
హ స్త్యశ్వములవైన యట్టలు దేలెఁ బ
ర్వతము లై, ఖండిత బాహు లూరు
వులు, శీర్షములు, పదమ్ములు కటిస్థలములు
జల జంతువుల వితమ్ములు వెలార్చె

గీ. కంఠ దఘ్నమ్మయిన మాంస కర్దమమున
నడచు గాల్బలములకు నెక్కుడు భరంబు
లయ్యె, నస్త్రంబు లెదిరి కల్లార్చుట యును;
పోరు, జంత్రంబులా డెడు పోల్కి నుండె, 509

సీ. ఎలనీటి బొండలంబు లు బోలు పుఱ్ఱెల
జూఱఁగా, మెదడులు జుఱ్ఱి జుఱ్ఱి,
కుల్యమ్ములందు గీల్కొన్న యామి షమును
మునిపండ్ల నుబ్బు ప్రబ్బులుగఁ బీకి,

సెలవుల, నీగతుట్టెలు మూగి, నెతెవెట్ట
బండబూతుల బడ బాఅదోలి,
బొజ్జపై జొల్లు ముంపులుగఁ జేతులనున్న
గరుసుల తోన దెప్పరము జిమ్మి -

గీ. పలు తెఱంగుల భోజనంబుల చవులకు
బిట్టుగా కంద చెక్కిళ్లు గొట్టి కొట్టి
క్రందుగా - భూతచయము ప్రేక్షణములొలికి -
హలహలిక తోడ దిక్కుల నాది కొనియె. 510

కం. ఆక్రందుకయ్యమున, ని
ర్వక్ర పరాక్రముఁడు, యక్షపతి, ఘన కోపో
పక్రముఁడై - ప్రసరఁత్కో
ధక్రముఁడైనట్టి యుగదంష్ట్రిని దాకెన్. 511

ఉ. తాకిన దానవేశుఁడు వదావద ఘోరతరాట్టహాసుఁ డు
ద్రేకము రూపమై - యరుగుతెంచితె! యెన్ని దినంబులయ్యె, నీ
పీక నెదిర్చి యంచుఁ బరివేషితఖడ్గుఁడు-డగ్గరింప-కో
పాకృతి గన్నులై -''మడిసితంచ''డడిదంబును వీచి వైచినన్. 512

కం. ఆ యడిదమ్మున నడుమన
పాయలుగా నఱికి - తెగువఁ బై కొని, నిలు మో
యీ ! యక్షరాజ ! యిదె కౌ
క్షేయకమని - రక్కసుఁడు గెరలుచు విసరెన్. 513

శా. ఆకౌక్షేయక మంత్యకాలశమన వ్యాత్తాననంబై దనున్
దాకన్ వచ్చిన, చేతి మెల్పునన, దర్గ్రాహంబు గావించి-కై
కో ! కౌక్షేయక మంచు-దానిన వలతోర్కపంబుతో-వీచినన్;
దాకెన్ వక్షము ఖడ్గమా శరసి రక్తం బొల్క రౌద్రంబుగన్. 514

సీ. ఆయూకుతోఁ గోప మగ్గలించిన యుగ్ర
దంష్ట్రుండు గాలదండంబులోని,
గద నెత్తికొని రాఁగ, ఖిదురపాణి కుబేరు
నకు నడ్డమై నిల్వ, నల్ల జేరు
కొన్న వక్త్రంబుతోఁ దిన్నఁగ నగి, గద
వీచి వైచిన, దాని ఖిదురమునన
వ్రయ్యలు వడఁ జేసి, వాని మస్తమ్ముపై
గొట్టిన, తోడన నెట్టవిసి క
గీ. నుంగవలు మిట్టి పడఁగ నేనుంగు వలెనె
వాడువడె, లోన కాళికా వ్రజము గవిసి
ఎఱచి యెల్లను భాగంబు లేర్పఱించి
కొలఁది మీరంగఁ దినె, రుచుల్దలఁచి తలఁచి. 515

ఉ. భూరితరా భ్రవిభ్రమము బొల్పెసలారెడు గంధహస్తి ఘీం
కారము, లాత్మ హుంకృతులు కర్ణపుటంబుల వ్రయ్యఁ జేయ, దో
స్సారము లుగ్గడించికొను సర్వ సుపర్వుల కంతరేగి, దు
ర్వారుఁడు-వారణాఽఽతిగ దురాసదశౌర్య వివర్ధమానుఁడై. 516

ఉ. వాని నెదిర్చె, పాశి, దిగిభ స్వృహ మాల్చెడు సింహగర్జనా
ధ్వాన మొనర్చి, వాడు వికటాట్ట హసంబున డాసి, మృత్యుదే
వీని శితాక్షి వీక్షణము వెన్నడిబుట్టిన కుంతమెత్తి, "ప్రా
ణానిల మింతతోసరి"-యటంచు భృశంబుగ నూచి వైచినన్. 517

కం. దానిని ఖడ్గంబునఁ గఱిఁ
బూనుచుఁ దుత్తుమురు సేసి, పొంగెడు నీ మై
దీన సపాటము పొమ్మని
దానవుపై వేసె, పాశి, దన కుంతమ్మున్. 581

ఆ. దాని చేత నొడిచి, దైత్యుండు-కహ కహ
స్వనము తోడ విఱిచి పాఱ వైచి
యోరి ! చూతు నీదు బీరపుఁ బొత్తమ్ము
గట్టి తనమటంచుఁ గనలు వొడమి. 519

కం. గదబూన్చి వ్రేయ జెక్కలు
గదిరిన వింధ్యమ్ము వోలె కనువ్రేగౌ నా
గద జూచి, వరుణుఁ డ దరున
బదరుచు నవ్వానిఁబాసి, వడి, బడబాఱెన్. 520

గీ. "బ్రదికితివి పొమ్మ"టంచు దుర్వారుఁ డెదుటఁ
జూపు మేరకు నున్న- నుచ్చ్వాన గంధ
సౌర కరి సైన్యములపైకిఁ జౌకళించె
ఘనగదా దండమండితోగ్ర క్రముండు. 521

సీ. అహిప నిశ్వాసవాత్యా దురత్యయ సదా
గతి శౌర్యము నెదిర్చెఁ గాలనేమి,
వికిర వహ్ని ప్రభా వీక్షణుండై నట్టి
కృష్ణవర్త్మనదల్చె కేతుమాలి,
శమనుఁ డీకొనె సహస్ర కవచుండురు గదా,
కంకణోన్మత్త ప్రేంఖణము వాని,
నీ శాను న వహేల నెమరించెఁ జిరుఁడు కుం
త ప్రభూతే రమ్మదముల వాని

గీ. సరికి సరిబోరు విక్రమాచరణములు, వి
సర్ప దాయుధనికరాభి సరణములు, ది
శా చపేట హుంకార ప్రసరణములు, అ
భూత పూర్వమై, యుద్ధమ్ము పొలుపు మిగిలె. 522

చం. ''పువు పువునంటి గంధములు మోసెడు మన్మథు నూడిగంపు వా
డవు, బవరంపు త్రోవకు బడాయికివచ్చితి, యుద్ధమన్నచో-
నవకపు దావు లమ్ముటలె! నా కరవాలము!'' కాలనేమి నే
త్ర వికటహాస రక్తిమము గ్రమ్మిన వక్త్రము భీకరంబుగన్. 523

కం. సరసర వచ్చిన, వాత్యా
చరణమ్ముల, వానిక త్తి, చక్షుష్పథ గో
చరణములు దవ్వులకును బా
హిరముగ జిమ్మిన, భృశోవి వృద్ధ క్రుధుఁడై. 524

గీ. కుంతమునుఁ బూచివైచిన, ఘోరనినద
మై, యదియు నెద గాడిన, న త్తమిల్లె,
వాయు వప్పుడు - శంఖనిస్వనము తోడ-
కాలనేమి నెదిర్చె కంకాలధరుఁడు. 525

సీ. ప్రత్నరత్నోదార- భాశ్చయమ్ములు నభః
ప్రాంగణమ్ములను జంద్రకము లీన,
ఔపకర్ణిక లోచ నాజ్ఞాత వీక్షణ
దీధితుల్దిశలఁ జెందిరము బూయ,
శతమన్యు రూప ముద్రితమైన పెండార
మెలరారు పొగరు వెన్నెలలు వోయ,
చేతఁబట్టిన బల్లెమా తామ్ర వజ్రరిం
ఛోళిచే మార్తురచూపు గప్ప,

గీ. పొగడపూవుల తావులు బుక్కిలించు
మదజలాసా రములయు, సామజము నెక్కి
తారకుఁడు దేవ హృదయ విదారకుండు-
కలన సురలకు మిత్తిగాఁ గానఁబడియె. 526

ఉ. ఏదిశఁ దారకుండు బొరయుంచెనొ దృష్టి, విపన్న చిత్తులై -
యాదిశ నుజ్జగించి వెసనన్యము జేరెడు వారలడ్డినన్
బాద గలంగ శౌర్యములు, "భ్రాతలమయ్య!'' యటంచుఁబోవు వా
రై, దివిజుల్ గలంగి, రెదురై నడవంగను దేఱిచూడ నున్. 527

సీ. యమధర్మరాజు కాయము గాయము లొనర్చి
గద బట్టి విఱచి మొగాన విసరి-
సప్తజిహ్వుని రసజ్ఞలు బట్టి తిగిచి- గ్రు
డ్లురుగా - గద్దించి యవుల ద్రోసి
వాని పాశముతోన వరుణుని కోలగ
గ్గెర గట్టి, మగటిమి గించపఱచి,
యక్షేశు బీరమ్మున దలించి-యాయుధ
మ్ములు మాల్చి, యీఱతాఱలు వచించి,

గీ. శశ్వదుత్తాలఘనభుజాస్ఫాలన, ప్ర
భూతనిర్ఘోష సర్వప్రభు శ్రవఃక
టాహబాధిర్యకృదనీక దోహలుండు
దిరిగెఁదారకుఁ డలవోకఁదిరిగినట్లు. 528

ఉ. అప్పుడు వీరభద్రుఁడు-భయానక హుంకృతి తోడఁగన్నులన్
జిప్పిలు కోపమై దఱియఁ జిర్నగ వొప్పఁగ-''బచ్చి చర్మముల్
దొప్పలు దొరలున్నయవి తొడ్డి సరాసరిఁబొమ్ము తారకుం
డిప్పలఁమాసికే! బెదరుటే!'' యని మాటికిఁ గేరడింపుచున్. 529

కం. చేరంగ వచ్చి, యూరులు
భేరులుగాఁగొట్టి నడుము ప్రీల్చెదనని పొం
గారు భుజంబుల బట్టె న
పార భుజాశక్తి, వీరభద్రుఁడు దూలెన్. 530

మ. వరసంపాదితమైన శక్తియది, తత్పారంబు ముట్టంగనె
వ్వరికిన్ బోలద! సర్వ నిర్జరులు సెప్పన్ జూప నిర్వీర్యులై
శిరముల్ వంచుచునిల్వ, దైత్యవిభు ''డిస్సీ! పొందు మీ యాంద్ర యం
బరముల్ గట్టుడ''టంచు గేలినడపెన్ బల్మారుఁ గర్వాంధుడై. 531

కం. తారకు నాటోపమ్మును
వారింపఁగ నెంచి-గుహుఁడు-బహువిధ శస్త్రా
గారీకృత దేహమ్ము, మ
యూరమ్మును, వానివలన సురవడి దరిమెన్. 532

చం. ''అనుసవమున్ సురేశ్వరుని యాత్మను దావదహంబువోలెఁబె
ల్చన నొరియించు నాత్మభుజ సారము, చంద్రకిరీటు కెంపు చూ
పునకును వెగ్గలంబు తుదిఁబోరన బాలుఁడు మూదలించుదే!''
దనికిన కోపమై, సురతక్కువతెల్వికి నీసడింపులై. 533

ఆ. పలికెఁదారకుండు-భాషణామ్రేడన
ధ్వనులతోడ, తుహినపర్వతంబు
గచ్చువిచ్చుగాఁగ కంధిగర్భంబులు
కుతిల పడి వడంక గుహునిగాంచి. 534

ఉ. ఓతల మాసు పీడని శిశూ! సకలామరశౌర్య ధైర్యముల్
నీతలవేగెనే! కదనసీరధి నీదెడు పాటివానివా!
ఏతులనిన్ను నిట్టులెలయించిన వారలలోన నొక్కరున్
త్రాతలులేరు, ''వట్టి శపథానకు మంగలకత్తి మ్రింగుటే.'' 535

ఉ. పొమ్ము హిమాద్రిరమ్యవనభూసుమశయ్యల, నప్సర స్సతీ
సమ్మద మందహాస విలసత్స్నపనమ్ములఁ దత్పయోధరా
గ్రమ్ములు గూర్కి, లెస్సగ సుఖమ్ములఁ గ్రోలుము! యుద్ధకౌశలం
బుమ్మగిలంగనిమ్ము వయసున్నదిలే! కదనంబులాడగన్. 536

శా. ఆ మాటల్ చెవిలోనఁగూర్పక యనన్య ప్రాప్య విక్రాంతిరే
ఖామధ్యందిన భాస్కరుండు గుహుడాః కారిద్యుతిన్ వైచినన్
వ్యామగ్రాహ్యము దాని జూచి యవురా! బాహాబలంబంచు, శ్లా
ఘామృద్వీకములైన మాటలనె, దత్ఖడ్గంబు ఖండించినన్. 537

కం. తారకునిఁ జూచి, కనుగెం
పారఁగ ముద్గరమువేసె నపహాస్యరస
స్ఫారతరలోచనుఁడు, దు
ర్వారకరాహతులలోన, వాఁడదిదునిమెన్. 538

సీ. గదనుప్రయోగింప, గదతోనవాడు, ద
ద్ఘోరాయుధమ్ము దిక్కులకుఁ బంచె
భిండివాలము వైవ-భిండివాలముతోన
నస్త్రమొనర్చె నయ్యాయుధమ్ము
పరిఘనె త్తెడులోనఁ బరిఘతోనన, దాని
తుటుమొనరించి తుత్తుటుమొనర్చె
పరశువుంబూన్చిన, పారశ్వధప్రఘా
తములనే దాని రూపమునడంచె

గీ. ఏదివైచినదానిన యెత్తి నఱకు
చీమగుట్టినమాత్రంబు చేవజెడఁడు
తారకాసురుగాఢ యుద్ధప్రశస్తి
దేవసేనాని కొలఁదికిఁ దీవ్రమయ్యె. 539

శా. దేవా ! నీవ వధింపు మీ ఖలు మదాంధీభూతచేతస్కు మా
ప్రావీణ్యంబులు వీనికోర్తల కస్త్రాప్యయంబులయ్యెన్, జగ
జ్జీవంజీవ సుధాంశు రూపములు నీశ్రీపాదముల్ గుంతమం
దావేశించును గాక ! దుర్జనతమోవ్యాప్తిన్ నివారించుచున్. 540

కం. అని వైకుంఠుని పదములు
మనమున భావించి శివకుమారుఁడు నానా
మణికృత విచిత్ర రోచి
ర్గణ మగు వేలాయుధమ్ము కరముల గొనియెన్. 541

శా. ఆ వేలాయుధ దర్శనంబునన, దైత్యస్వామికిన్ గన్నులన్
ప్రోవై జీకటు, లుల్లమంతయు నతః పూర్వాఽనభిజ్ఞాత భీ
త్యావిర్భూతి నిరోధ దూరమయి, యభ్యాశస్ఫురన్మృత్యు దే
వీ వక్త్రోదర నిర్గళత్క హకహావేశంబు తోరంబునై. 542

సీ. తన సిరామండలంబును గంపతొడుగన్న
యోజనెవ్వరో ! నీడ్చు చున్నయట్లు,
ఈయింటిలోనుండ నింక నేనని జీవు
డెచ్చోటికో వలసెత్తి నట్లు,
తన భుజా బలము కృతఘ్నమై, నగవు సా
రించి పైపయి వెక్కిరించినట్లు
తన సతీసుతబంధుతతి పర్యదంచనం
బు, కుసీదమును దీరి పోయినట్లు

గీ. ఆత్మకృతములు పాపపుణ్యములు వెన్నె
లై, తమోనిచయంబులై, యగ్రభూమి
పొలయుచున్నట్లు - రాక్షస భూవిభుండు-
తానెవరో ! తానెఱుంగక తడవులాడె ! 543

సీ. అభిసన్నమునుల శాపాక్షరంబులు - హరి
దశ్వరోచులు రూపమైనయట్లు
ఇంతుల యీలువు లెత్తిపోసిన బాష్ప
ములు గరకట్టుచుఁ బొలసినట్లు

శంకర సూనుండు - సాధించినట్టి - తీ
ప్రవతపంబు మైమయి వచ్చినట్లు
హరి విగ్రహంబ నాద్యంత ధర్మమ్ము, కి
న్కవహించి - కుంతమై గదలినట్లు

గీ. వచ్చె వచ్చె వేలాయుధం బచ్చలమున
బహు మణీగణ రోచిః ప్రవాహలీన
భూత జాతంబు, సర్వతశ్శా తమూర్తి
కహకహారావ గళిత దిగ్గగనమగుచు. 544

కం. ఎప్పుడు వచ్చెనొ కుంతం
బప్పుడె పోయినది ప్రాణ, మసురుని దేహం
బప్పురుహూతుని విభవము
విక్కటమై, భయద సమరవీథిన్ బడియెన్. 545

గీ. కాలనేమ్యాది రక్కసుల్ గలను దొఱగి
పోయి రార్తనాదమ్ములు ముమ్మరముగ
''నింతలో నేమియయ్యె దేవేంద్రునుదుటు
కలిమి జెఱతుములే!'' యంచు వలికికొనుచు. 546

శా. రంభాద్యాయతలోచనా రసిక ముద్రా ప్రక్రియా నర్తనా
రంభమ్ముల్ చెలరేగె వాసవసుధర్మా మధ్య దేశమ్మునన్
ఆంభః కేళి నితంబినీ కుచతటాస్ఫాల స్వనద్భంగ సం
రంభమ్ముల్ వలె, యక్ష మర్దల రవప్రాకట్యముల్ చెల్లఁగన్. 547

శా. మంథానాద్రి హిమాద్రి చిక్కణ దరీప్రాంతమ్ములన్ వల్లకీ
సంధానమ్ముల తోడ బాడిరి దృషత్సం సద్ద్రవీభూత ని
ర్బంధంబుల్ విడి మోదమాన హృద యాబ్జంబుల్ ప్రపుల్లంబులై
గంధర్వుల్, మృదు తానమానముగ రాగంబుల్ పిసాళింపఁగన్. 548

చ. గళితభయుండు వాసవుఁడు గన్నుఁగవన్ విజయోత్సవంపు రే
ఖలు దొరకాద వామపవ క్రమమణీగణ కాంతికంచుకో
జ్జ్వలమగు పెండెరంబున నిశాచరు రూపము సంఘటించి, పెం
పలరఁగఁ జుట్టె, నాకనలినాయతలోచన లుండు మేరలన్. 549

చ. పొలుపుగ హోమ ధూమములు మూగి విధూమములైన యట్టి ప్రా
కుల నయనోత్స వంబు లొడఁగూర్చె, దపస్వుల యాశ్రమంబు, లి
మ్ముల హరిణీ కదంబములు ముగ్ధ మనోహర మౌని కన్యకా
వళి నయనమ్ములన్ సవతు వచ్చెడు కన్నుల, గ్రేళ్ళు దాటగన్. 550

సీ. కండ కన్నుల తోఁడఁ గలసిన భ్రుకుటిమం
డలము చీకటుల తండంబు జిమ్మ
వక్త్రికటాహ జిహ్వా జ్వాలికలు నుద్ధ
తమ్ములై గగనోదరమ్ము గ్రుమ్మ-
కరటి తుండాభ భీకరదంష్ట్రికా ద్యుతి
చ్ఛట లిరమ్మదపు నిశ్చలత దెలుప
దీర్ఘాంత్ర కృతము జందెము ప్రేతరక్త మాం
సావిష్టమై హృదయమ్ము గలఁప

గీ. తారకాసుర వధ జనితమ్ము బ్రహ్మ-
హత్య ఘోరమ్ముగా నభమావరించి
బాహులేయుని వెనువెంట బడియె వికృత
కహకహారావ విధుత దిక్చక్రమగుచు. 551

కం. ఏయస్త్రంబును దొడిగిన
నాయస్త్రము నపుడ మ్రింగు నలవోకఁగ నిం
కేయుట కేమున్నది యని
పాయక వెంటఁ బడు వికట వక్త్రింబగుచున్. 552

సీ. వనములలోఁ బోవ, వనములఁ దనకన్నఁ
దొలుతనఁ దోచి చెక్కిలిని గొట్టు
పర్వతాంతరములఁ బఱువెత్త, పర్వత
స్థలముల దనసీడ వలెనె యంటు
నిలుచున్నఁ దానును నిలుచుండి, యిపుడేది
విక్రమంబనుచును వెక్కిరించు
అలసికూర్చున్న, దానలయిక లేక, లే
లెమ్మని లేకితాళికలు వేయు,

గీ. చెదరగొట్టు, హసించుఁ గవ్వించు నదటు
హుంకరించు, బూతులుదిట్టు శంకవదలి.
అందరును దేవతలె, గానియట్టు లైరి
బ్రహ్మహత్యా విజృంభణావసరమందు. 553

గీ. గుహుడు నిర్వేల బాష్ప సంపిహితమూర్తి
యార్తి రోదనాద్రవిత గుహావ్రజుండు
"శ్రీనివాసాయ; యవిదిత చేష్టితాయ;
పాహి నమ!" యంచు శేషపర్వతము జేరె, 554

శా. స్వామీ! తావకమైన యాజ్ఞ గొనియే సంరబ్ధచిత్తుండనై
యామోదించితి - నాహవంబునకు, నా యస్త్రాధిరూఢుండవై
యా మర్త్యాళిని సంహరించితివి. నన్నంటెన్ మహాబ్రహ్మ హ
త్యామాలిన్యము; యేమి వింతయిది దేవా ? జ్ఞానచింతామణీ ! 555

శా. నా యస్త్రంబులు సర్వముల్ వితలుగా నన్నావరించెన్ మహా
కాయంబియ్యది, నేరరెవ్వరును నీ కారుణ్యమేదప్ప నా
యీ యాపత్తు దొలంప; శక్తుఁడవునీవే "కాదుపొమ్మ" - న్న నిం
కే యయ్యల్లల రుద్ధరింప; శివవాణీశాది సంసేవితా. 556

సీ. ప్రళయంబు ముందు, సంవర్తంబు పిఱుఁదను
భాసిల్లుచున్న కేవలుఁడవీవ,
లోకతంత్రంబు నాభీకమలంబును
గన్నట్టి లోకరక్షకుఁడవీవ
యా పద్మమున యంద, నజుడవై జూపట్టి
వివిధసృష్టులొనర్చు విభుడవీవ
అన్నిలోకంబులయందును బహిర బహిః ప్ర
పూర్ణుఁడవైన విభూతివీవ

గీ. తనరు నీ సృష్టికి న్నుపాదానకార
ణంబును - నిమిత్తకారణం బంబుజాక్ష
నీవు దప్ప నన్యములేదు, "నీవు నీవ
గాక యుండని" దివ్య యోగమ్ము నీది. 557

మ. ప్రళయాం భస్సుల నిద్రదాల్చెదవు, దివ్యన్మూర్తి! సర్వాధిరా
ట్పుల కోదంచిత చారుభోగ తలిమంబున్ త్వత్పదాబ్జాత పే
శల సౌగంధ్యము లావరించి కొన, నిచ్ఛాజ్ఞాన శక్తుల్ త్వదీ
యలసద్రూపముగా నవిద్య భవదీ యాజ్ఞప్తికై నిల్వఁగన్. 558

సీ. కాలంబు ప్రేరేచి కలఁగిన సత్వాది
గుణములకును క్షోభ మొనరఁ జేసి
తద్ధేతువున మహత్తత్వంబు గల్గించి
గలిగించి మరి యహంకా రతత్వ
మద్దాని త్రివి ధభిదావృత్తి, సంసార
మును సృజింతువు నాకభూములందు
సాత్వికాహంకార సంసక్తులౌ నింద్రి
యాభిమానులు నిర్జరౌఘమెల్ల

గీ. ప్రాకృతము వైకృతంబన బరగు సృష్టి
నీ విలాసంబు నాద్యంత, మీవిధంబు
నెఱుఁగు వారలు కాలకంధరహిరణ్య
గర్భముఖ్యులు నీ భక్తగణము వారు; 559

వ. అఖిలహేయ ప్రత్యనీక కల్యాణ గుణంబుల కాశ్రయుండవై యుండు టయ - నిర్గుణత్వంబని గొందరందురు; గుణంబుల కనాశ్రయత్వంబు నిర్గుణత్వంబని కొందఱు వేఱుభంగి భావింతురు. రెంట నవద్యత్వంబు లేదు. దారువులందగ్నివలె సగుణ స్వరూపాంతర్హితంబు నిర్గుణంబు; నిర్గుణ బహిరావిష్కారంబు సగుణంబు; నీ శక్తి యిట్టిదని మితివెట్టుట "సముద్రంబున కేతమెత్తుట"; జయజయ; దేవ దేవ! శ్రీనివాస ! భక్తావన పరాయణ ! నీ వొసంగిన సేనానిత్వంబుకన్న నీ పాదపరాగంబుగాఁ గరుణించిన ధన్యతముండనై యుండుదు. రజోగుణాశ్రయంబగు నధికారంబు నంటగట్టితివి. దేవా ! దీన-కర్తవ్యా కర్తవ్యంబులు నీయవియ; నేను నిమిత్తమాత్రుండ, గరుడగంధర్వ సిద్ధవిద్యాధర కిన్నరకింపురుష లహంపూర్వికా పూర్వ హల్లీసక కలశోదధితరంగ భంగీ న్యక్కార్యాణంబులగు భక్తి విశేషంబుల నీయర్చావతార కోమల శ్రీపాదకిసలయంబుల సేవింతురు. వారి సేవల ననుగ్రహింపవు. నిష్కామ భక్తుల పత్ర పుష్పఫలంబుల కాసగొందువు. విచిత్రప్రవృత్తి నీది, స్వామీ ! నన్ను మన్నించి యీ యవగ్రహంబు దొలఁగింపుము, త్వత్పాద భక్తి ప్రసాదంబనుగ్రహింపుమని ప్రార్థించిన యనంతరంబ. 560

శా. బాహ్యాబాహ్య తమోవిదారణ విధాబంహిష్ఠ, ముచ్ఛృంఖలా
నూ హ్యక్రౌర్య నిశాచరవ్రజ వధోద్యోగాధ్వనీనంబు, ని
స్సాహ్య ప్రాభవ, మేగుదెంచె లఘయత్సావిత్ర రోచిస్సు ని
ర్గాహ్యం బట్టిగ వక్త్రవాంత దహన గ్రామాతిభీమంబుగన్. 561

శా. ఆ సౌదర్శన తేజమున్గని, దరవ్యాహారమై, కాయిక
వ్యాసంగంబులు మాని, పెన్వణఁకు గప్పన్ కెవ్వుమంచార్చి, త
ద్ధాసాంగార శిఖాలవంబుననె దగ్ధంబయ్యె రక్షస్సు, తా
రాసందోహ విహారహారి విబుధవ్రాతంబు గేల్మోద్వగన్. 562

కం. అప్పుడు కృతజ్ఞతా భర
మప్పికొనన్ మనసు; దేహమాద్యంతముగా
ముప్పిరిగొను పులకచయం
బొప్పెడి విరులగుచు, తారకోన్మథనుఁడనెన్. 563

కం. తావక కరుణాపాంగము
చే విగళితమయ్యె నాదు సేగి జగద్ర
క్షా వైయాత్యపరాయిణ
భావిలసన్మూర్తి! నీకు ప్రణతులగు హరీ!. 564

దండకము. నమో బ్రహ్మణే! దివ్యరూపాయ, సాఽపాయభక్తాక్షిగోళ స్రవ ద్బాష్ప వీక్షాక్షణోద్భిన్న కారుణ్య తారుణ్య రేఖాసముద్భిన్న తాపాయ, నిర్భిన్నపాపాయ!, నిర్వేలకోపాయ! జ్వాలా జ్వలన్మూర్తయే ! ఘోర సంవర్త హుంకారభాంకార భ్రీశ్యన్మహాండాయ, తేజస్వినే, మృత్యు మృత్యుస్వరూపాయ, సంకర్షణాయ! స్ఫురత్కోప గండూషిత ప్రాయ రక్షస్సమూహాయ, యోగాయనాసక్త హృద్గేహదీపాయ, గోపాయ సవ్యగ్ర చిత్తాయ, నిత్యానుసంధాన దీక్షావిశిష్ట వ్రతోపాసకానాం నరాణా, మసంఖ్యోద్భవప్రాప్త. దౌర్గత్యసంపాదకానాం మహాపాప్మనాం, సంని హంత్రే! మహాచక్రరాజాయ ! క్ష్మాం బీజయుక్తాయ; దివ్యాస్త్రహస్తాయ! ఓం విష్ణవే! దివ్యరోచిష్ణవే! సాధుభ్రాజిష్ణవే! ధృష్ణవేవైరిషు! స్వామినే! దుర్గ్రహోచ్చామినే! గాంగేయదామినే! మోక్షకృన్నామినే! యజ్ఞియా యామినే! పాపకృద్ధామినే! నారసింహాయ! నైకారవర్ధిష్ణవే! నైక శీర్షాక్షి బాహ్వంస పాదాయ! రౌద్రావతారాయ! జ్వాలాప్రచండాయ! మత్పా లినే! చక్రరాజాయ నమస్తే నమస్తే నమః. 565

కం. అని ప్రస్తుతించి- వినయా
వనతుండగు గుహునివైపు, వనజజముఖ ది
వ్యని షేవ్యములగు చూపుల
నెనయించుచుఁ జక్రరాజమిట్లు వచించెన్. 566

గీ. అమరసేనాని! పొమ్ము! నీవైన యెల్ల
యాయుధమ్ములనే ప్రొద్దుసన్మదీయ
శక్తి, యవహితమైయుండు సర్వకాల
విజయలక్ష్మి స్వయంగ్రాహ విలసితుఁడవు. 567

కం. ఆ మాటల హర్షము ని
స్సీమంబయి-కరపుటములు సేర్చెను గుహుఁడా
శ్రీమహిత సహస్రారము
కామిత మొదగూర్చి కన్నుఁగవచాటయ్యెన్. 568

వ. అని యిట్లు వచియించి, తులితోక్షధ్వజసూతుండైన సూతుండు పర
మార్థ ప్రవీణులైన మహర్షులం జూచి మునులారా! దీనమీయర్థితంబు
దేటపడియెన్గాదె ! కుమార స్వామికి 'స్వామి' యనుపేరు నామైకదేశం,
బతని తపంబునం జేసియ 'స్వామితీర్థం' బను నభిధానంబయ్యెననిన
విని, మహర్షులింకను దన్మాహాత్మ్యంబు వినవలఁతు మెఱిఁగింపవే
యన్న వికసిత నేత్ర హృదయుండలు సూతుండిట్లనియె! 569

సీ. పాండవాన్వయము సర్వ వినాశ మొనరింప
కలశీసుతసుతుండు దలఁచి కడఁక
బ్రహ్మశిరోనామబాణంబు సంధింప
నది యుపపాండవ హతి నొనర్చి
యుత్తరాగర్భంబు నుత్తరింపఁగఁబూన
హరి చక్రహస్తుఁడై యందు జొచ్చి
యస్త్రంబునకుఁబాపి యర్భకుబ్రదికించె
నతఁడ పరీక్షిత్తుఁడను నృపుండు

గీ. గర్భమున గన్నయట్టి శ్రీకాంతురూప
మిదియొ! యిదియొ! యటంచుఁ దానెల్ల భూత
గణములందు బ్రతీక్షించు కతన నాతఁ
డయ్యె నన్వర్థ నామధేయమ్ము వాఁడు. 570

గీ. విష్ణుచేత రాతుండయి విష్ణురాత
నామమునఁ బొల్చె-నఖిలసన్మాన్య కీర్తి!
పూర్వపురుషుల పాలనంబునకు మెఱుఁగు
వెట్టినట్లుగ ధర్మసంవృద్ధిఁబెనిచి. 571

సీ. అతివృష్ట్యనావృష్టు లలమక నిత్యసం
పన్నమై భువి నేత్రపర్వమయ్యె,
వర్షలోపభయమ్ము వాపి భూప్రజ జాతి
ధర్మమ్ము ననఁ జాలు ధనము వడసె,
అపమార్గమున బ్రాప్తమౌ కీర్తి ధనగౌర
వమ్ములు ప్రజకు త్యాజ్యమ్ములయ్యె,
నృపదండమాఖ్యాతే, విపులధర్మంబు కా
ర్యాఽకార్య బోధకంబై చెలంగె,

గీ. అష్టదిక్పాలకుల యంశమైన నృపుడు
చార చక్షు ష్కుఁడౌచు విచారచక్షు
లైన యెడ నెట్టు లుండునో యవని, యుండె
నట్లె సౌభద్రసుతుని రాజ్యమ్మునందు, 572

కం. ఆతఁడిరావతి, నుత్తరు
కూతును గేహినిగఁబడసి- కొనకొని-ధర్మా
పేతమ్ము గాని శర్మో
పేతుండై సుతులనందె విశ్వ విజయులన్. 573

చం. ఒకపరి యా ధరాధిపతి యుద్ధవిడిన్ ప్రజలన్ గలంచు, వ
న్యక మృగబాధ మాన్పుటకు- నాత్తశరాసనుఁడై పరాక్రమా
ధికతయ, తోడరా నడువ-దిక్కులు బూరల బూరటిల్లగా
వికవిక గేరుచున్ గదలె వెంట బుళింద కిరాత సైన్యముల్. 574

సీ. ప్రవదసృక్పూర ఖైరవము విక్లబచర
ద్వీపి దీర్ఘ బృహిత దీర్ణబిలము
త్రాసధావన్మృగాదన వాలదండ ప్ర
హతి పాతితా క్రంలిహద్రుమమ్ము
చకితైణ సందోహ శాతశార కటాక్ష
వీచీ పరిస్తోమ పిహిత తలము
శితశిలీముఖపాత జృంభిత వదన పం
చాస్య దంష్ట్రాద్యుతి వ్యాప్తదిక్క
గీ. మర్దజగ్ధ మధూద్భ్రమ దచ్ఛభల్ల
ఘుర్ఘుర ధ్వాన ఘూర్ణిత కోటర ప్ర
సుప్త గోనస విశ్వాస సూదితఖగ
వారముగ నయ్యె నపుడు, తద్వనచయమ్ము! 575

శా. ఆ కోలాహల మందు సైన్యములు వేఱై-తాన యొక్కండుగా
బోకై- భూపతి తీవ్ర దాహమున నూర్పుల్ గ్రమ్మగా నొక్కచో
స్రుకుల్ హోమఘృత ప్రధూమములుగా రాజిల్ల, మున్యాశ్రమం
బో! కన్గొందును గాక! యంచు దరిసెన్నుల్లంబు తోషిల్లగన్. 576

ఆ. ఆశ్రమంబు విజన, మందొక్కచో శమీ
కుండు - ఘనకప ర్దమండితుండు
మనసు లీనమై సమాధిలో బాహ్యమౌ
స్మృతికిఁ దప్పి యుండె దృషప మట్లు. 577

కం. ఓ పరమ మౌని! పాండు
క్ష్మాపాలుర బిడ్డడన్, తృషా భృశ బాధా
వ్యాపన్నుఁడ, పానీయము
తాపోపశమంబుగాఁగ దయసేయఁగదే! 578

కం. ఆ పలుకులు తీవ్ర సమా
ధ్యాపూరిత హృదయుఁడైన యా ముని చెవులన్
బ్రాపింపనె లే, దపు డవ
నీపతి దూపగొని తదపనీత నయుండై. 579

ఆ. ఇది మృషా సమాధి, యీ క్షాత్ర బంధుతో
నేమి యనుచు మమ్ము నీసడించి,
కనులు మూసికొన్న గతిగాఁగ నయ్యెడు
నని తలంచి కోపమగ్గలించి. 580

సీ. అచ్చోట నొక మృతంబైన సర్పముగని
పూనిక వింటి కొప్పునను దెచ్చి
యా శమీకుని కంఠమందుంచి - హస్తినా
వతి కేగె, తనదైన బలముతోడ
ధర్మ సంస్థితిదన్ని, ధరణి బాలించెడు
రాజటె! పాండవ ప్రవర వంశ
మటె; గర్భమున యంద యంబుజాక్షుని దయఁ
బడసిన భాగ్యవంతుఁడటె; యెన్ని

గీ. యున్న నేమాయె! సర్పంబు నొల్లఁ బోయెఁ
గాల మాహాత్మ్యమున, దేవ గణములైన
కాలకింకరులే! కాలకాలుఁడైన
యూర్జితుఁడు, పుండరీకాక్షుఁడొకఁడు దక్క. 581

వ. అప్పుడు సమీపాశ్రమ వర్తులైన మునికుమారులు యాదృచ్ఛికంబుగా-
శమీకు నాశ్రమంబునకుంజని, తదాశ్రమ సమీపంబున బోవుచున్న
రాజునొ్బడఁగని, మృతసర్పంబు శమీకు కంఠంబున వైచిన వాడతండకా
శంకించి - వానిచెయిదం బంతల నింతల గ్రీడించుచున్న శమీకసు
తుండైన శృంగి కెఱింగించిన. 582

కం. అతులిత నియమ విశేషా
న్వీత తీవ్రతపః ప్రభావ వీతభయవిసా
రిత గమన మ్మగు శృంగ్య
ప్రతిహత కోపాగ్ని యపుడ భగ్గున మండెన్. 583

ఉ. రాజయినంత మాత్రమున రక్షకులెవ్వరు లేరటంచు, నీ
యోజ దురాగతమ్ములకు నుల్లముసేర్చుటె! ధర్మరక్ష కుం
డా జగదీశ్వరుండు దురహంకృతు లూరకసైచుటే! తప
శ్శ్రీజనిత ప్రభావములు "చెల్లని గవ్వలె!" రాచవానికిన్. 584

చం. ధనములు సాల గల్గిన ని కాంత సుఖమ్ములతో నిశాంతముల్
కనులకు వ్రేకనై యలరుఁగాక! నితంబవతీ మదోత్థ హా
సనిచయ తుందిలమ్ములయి, శాంతులమై కనుమూసి కొన్న మా
మనసుల కెల్లగించు నపమార్గము లేటికి? రాచవానికిన్. 585

కం. ఆడము పరనిందలు, చవి
జూడ మధర్మములు, బాహ్యసుఖములకై, తా
రాడము, చెట్టు చేమల
గూడు గుడువ నైన నోచికొనమో! మేమున్. 586

ఆ. బలము గలదటంచు, పామును మెడఁజుట్టి
పోయె రాచవాఁడు, పోవనిండు
కాఱుచిచ్చు వోలెఁ గవిసెడు మాతపః
ప్రాభవమ్ము లేదా! స్వామి లేఁడా!, 587

చం. అని వచియించియప్పుడ దృశాగ్నుల దిక్కులు గాల, దేవత
ల్జనితభయుల్వడంక - విచలత్కుటి లాలకుఁడౌచు, పజ్జల
న్దనరెడు కౌశికీనది నుదార జలంబులు వార్చి, సంచల
ద్ఘన భృకుటీ వికారములు తక్షక భోగవిచాలనంబులై. 588

ఉ. ధారుణి రాజ్యసంపద మదంబున, నాశ్రమమందు జొచ్చి ధి
క్కార మొనర్చి మజ్జనకు కంఠమునన్, మృతసర్ప దేహమున్
వారకవైచి పోయిన నృపాలకులాధముఁ డుగ్ర తక్షక
స్ఫారవిషాగ్ని దగ్ధుఁడగు, పన్నగ నేడవ వాసరంబునన్. 589

క. అని శపియించి, చిరక్రో
ధనుఁడగు నా శృంగి తండ్రి దరిసి, కడున్ రో
దన మొనరించిన - నారో
దనము శమీకునకు, ధ్యానదశ దలఁగింపన్. 590

ఆ. కనులు దెఱచి చూచి - కంఠంబు నందున్న
ఫణిశవంబుదీసి పాఱవైచి,
యేలనేడ్తువనుచు నెలమి బుత్రుని పృచ్ఛ
సేసి- యుత్తరంబు సెందకునికి. 591

వ. అంతర్ధ్యానంబున సకలంబునెఱిఁగి కొమరుం జూచి యిట్లనియె. 592

ఉ. ఆది నరేంద్రమార్గుఁడయి యన్వహమున్ బ్రజఁదండ్రి వోలె నే
యాధిని జెందనీక, సుఖమారయు వాఁడగు విష్ణురాతు, క
ట్టా' ధృతిమాలి శాపదహ నార్చుల కగ్గముసేసి, తన్యదు
స్సాధ తపంబు, శాపఫలసంగతికే!, శమమింతఁ జెల్లదే! 593

క. అని పదరి, గౌర ముఖుఁడను
దన శిష్యునిఁ జూచి రాజుదరిసి, తనయు వె
ట్టిన శాపము, తద్దుష్ఫల
మనివార్యంబగుట, సెప్పుమని పుత్తెంచెన్. 594

శా. ఆ వార్తల్ విని రాజు, మానసము ఖేదాగారమై, శృంగిశా
పావిష్కారము మేలుసేసినది, నా యజ్ఞాన నిర్వాపణం
బై, విశ్వాత్ముని పాదపద్మయుగ మందావిష్ట చిత్తంబుతో
జావై, మోక్షసుఖంబు గందునని శశ్వన్నిశ్చయాత్ముండునై. 595

కం. మానవ భోగంబులు, గీ
ర్వాణుల భోగములు నీటిపై వ్రాలని, యా
భూనాథుండు రెంటను దన
మానసమును దగుల నీక మసలకద్రిప్పెన్. 596

మ. సకలోపాసిత పద్మజాకరయుగా సంగంబు, పక్షీంద్రశీ
ర్షకలాపత్వము గన్నయట్టి మురజిచ్చార్వంఘ్రులన్ బుట్టి, శో
క కలాపంబుల దోషముల్ దొలంచు గంగావాహినింజేరె వా
రక భూజాని, మరిష్యమాణుం డగుచున్ ప్రాయోపవేశంబునన్. 597

గీ. విష్ణురాతుని ప్రాయోపవేశ దీక్ష
విన్న మౌనులు భక్తి సంపన్నులైన
యా ధరాధిపు వీక్షించు టనఘమైన
తపముగా నెంచి వచ్చిరా తలము గుఱిచి. 598

సీ. అత్రి విశ్వామిత్ర మైత్రేయ భృగు వశి
ష్ఠ పరాశర వ్యాస కపిల కణ్వ
కశ్యప భరద్వాజ గౌతమ దేవల
చ్యవన పరశురామ సత్యవహ్ని
పర్వత నారద ప్రముఖులు బ్రహ్మర్షి
దేవర్షి రాజర్షి దివ్యతనులు
కాండర్షు లరుణాది గణము, నానాగోత్ర
సంజాతులైనట్టి సంయములును

గీ. శిష్యులు ప్రశిష్యులును దమ్ముఁ జేరి కొలువ
నరుగుదెంచిరి వారి కత్యంత భక్తి,
నెదురు నడచి, పూజలు ఘటియించి మ్రొక్కి
తనకుఁ దగిలిన శాపవిధమ్ము సెప్పి. 599

ఉ. ఇంబుగ సప్త వాసరము లేవిధి సల్పిన, మోక్షరూప సౌ
ఖ్యంబు ఘటించు-మీరలు మహామహులెన్నిక సేయఁదట్టి మా
ర్గంబున బోదు, మీరలు పరాత్పరు నంశములట్టి మీకుఁ దె
ల్లంబులుగాని సద్విధి కలాపములుండునె ! యెట్లు సూచినన్'' 600

మ. భుజగాధీశు విషానలంబులు ననున్ బో కార్చునంచేను హృ
ద్రుజ శోకించుటలేదు, జీవులకు మృత్యుప్రాప్తి సిద్ధంబు, కా
యజముల్ జన్మ జరా వినాశములు, మాయాతీత గోవింద పా
దజలేజ స్పృహ, యెవ్విధిన్ గలుగు తాత్పర్యంబునం జెప్పరే! 601

కం. అపుడు మహర్షులు పలికిరి
అపురూపము నీదు జన్మ, హరి నీపైఁ దాఁ
గృపఁ జూపును, లేదిందున
నపలాపంబు; తథ్యమగు పలుకనుచున్. 602

ఉ. అప్పుడు దైవయోగమున నచ్చటికిం జనుదెంచె దేజముల్
గప్పఁగ నా కసంబు నచలాతలమున్, తొగరైన పెంజడల్
గప్పిన దేహమై, నయనకంజములన్ హరిసన్నిధానమై
చిప్పిలు మోక్షసౌఖ్యమయి, శ్రీ శుకుఁడా నృపుభాగధేయమై. 603

కం. వచ్చిన శుకునకు నెదురుగ
వచ్చిరి మునులెల్ల పాండువంశ తిలకుఁడా
వచ్చిన శుకు నతి వినయము
లచ్చుపడన్నిలిచి విషయ మభ్యర్థించెన్. 604

ఉ. ఆ శుకయోగి భూమిపతిఁ నార్ద్రముగాఁ బరికించి పల్కె, యో
యీ ! శుభనాముఁడైన జగదీశ్వరు రూపము, భక్తియోగని
ష్ఠాసువులైన జీవులకు నాశ్రయణీయము, వ్యాసభారతీ
భూషిత మైన భాగవతమున్ విను మద్దియ గూర్చు సర్వమున్. 605

సీ. ప్రోజ్ఝిత కైతవంబును-పరమంబు-ని
ర్మత్సరులైనట్టి మానవులకు
వేద్యంబు వాస్తవం బాద్యరూపము సమ
స్త శుభంబు లొడగూర్చి, తాపములను
దెగఁజూచు వస్తువు దీననున్నది - వ్యాస
భట్టారకుని తపఃఫలము భాగ
వతపాన మున్నచో వలయునే దక్కుసా
ధనములు ! నవి గతార్థములు - దీన.
గీ. వాఙ్మయంబైన విష్ణురూపంబు - దీని
దవిలి వినుచుండువారి శ్రోత్రముల వెంట
హృదయమును జెంది, వదలి యెయ్యెడకుఁబోక
యందఁగొలువుండు ప్రేమనిష్యంద మూర్తి!. 606

చ. వలదు హృషీకమర్దనము, వావిరి నాకలి నీరువట్టులన్
వలదు దపింప, క్రూరమృగ పర్వత భూముల, నెండవానలన్
నలఁగుట దుఃఖలబ్ధి, శ్రవణంబుననే బహుజన్మపాతకా
వళి నలఁచున్; ముకుంద పదపద్మ మధువ్రత చిత్త ! భూపతీ! 607

వ. ఇదియును సర్గంబు, విసర్గంబు, స్థానంబు, పోషణంబు, నూతులు, మన్వంతరంబులు, నీశానుచరితంబులు, నిరోధంబు, ముక్తి, యాశ్రయంబులను దశలక్షణంబుల నొప్పియుండు. దశమ విశుద్ధ్యర్థంబు దక్కిన తొమ్మిదింటి నిర్వచనంబు-భూత మాత్రేంద్రియ ధీజన్మంబు సర్గంబు, పురుషాధిష్ఠితంబైన గుణవైషమ్యంబునం జేసి, బ్రహ్మకృతంబైన సమస్తసృష్టి విసర్గంబు, లోకద్రోహులఁబరిమార్చి జగమ్ములు

నిల్పిన వైకుంఠుని విజయంబ స్థానంబు, పోషణంబు దదనుగ్రహంబు, కర్మవాసన లూతులు, పరమ పురుషానుగ్రహలబ్ధి లోకపాలక విభూతి నందిన వారి ధర్మంబులు విస్తరించి పలుకుట మన్వంతరంబు హరి వియు దదనువర్తులవియు కథలు నానాఖ్యానోప బృంహితంబులుగా వివరించుట యీశాను కథనంబు, ఆత్మశక్తులతోడ భగవదను శయన విశేషవర్ణనంబు నిరోధంబు, అన్యథా రూపంబువదలి స్వరూప వ్యవస్థితి, ముక్తి యుత్పత్తిస్థితిలయంబు లెందణఁగుచుఁ బ్రకాశించు చుండు నదియ యాశ్రయం; బిది బ్రహ్మశబ్దవాచ్యంబు, నరేంద్రా! దీనినిట్లనుభవింపనే పూర్వాంగంబుల వివరణంబు. సావధానుండవై వినుమన్న సకల ఋషిపటలంబును పరీక్షిత్తును - భాగవత కథావగాహ తత్పర చిత్తులై కాలంబు గడపుచున్నంత. 607

ఆ. తక్షకుఁడు శమీక తనయ ప్రచో
దితుఁడు, దివస కర సదృక్ష తేజు.
పరమ భాగవతుని, పాండవేయునిఁ గాటు
వేయఁదలఁచి యెదరు వేచియుండె. 608

సీ. అంత సప్తమ దినం బాసన్న మగుడు, వృ
ద్ధ బ్రహ్మ భూమికాధారి యగుచు
బోవు వాఁడెదుర ద్రిపుండ్రాంక భస్మ సం
శోభితనిటలు - విశుద్ధ చారు
పీనాంగు, పృథు జటావృతి బద్ధ మస్తకు
నింపుగా జట గుణియించికొనుచుఁ
జనుచున్న వాని, నొక్కని భూసురుంగని
భట్టార! యెందు నీ పయన మనిన,

ఆ. తక్షకుండు నేఁడు తన విషంబునఁ జేసి
రాజుఁ జంపు నట్టె! యోజ నతని
చావకుండ నాదు శక్తి సంజీవితు
గా నొనర్తు; విద్య కడక మెఱసి. 609

ఆ. దానఁ జేసి యమిత ధనము సంప్రాప్తించు
కీర్తి గలుగు, ప్రజల కార్తి దలఁగు,
ధర్మ్మవునకు నాపదయు, దప్పు; నట్టి సే
తయ; మదీయ శక్తి కయిన ఫలము; 611

మ. అనినన్ గన్నుల నవ్వి, తక్షకుఁడు, నీ యత్నంబు సిద్ధించునే!
ఘన దంభోళికినైన దప్పి బ్రదకంగా వచ్చు, గానీ, మదీ
యనితాంతోగ్ర విషానల ప్రహతికౌనా! యెందు నవ్యాప్తి; దీ
నను నీ యుద్యమ మూత నీరు; చనుమా! నామాట మన్నించుచున్. 612

కం. నీ మంత్ర తంత్రములు, చిఱు
పాములపైఁ బరగనోపు పశుపతి ఫాలా
క్షామేయ వహ్ని, మద్విష
మీ మెయి మంత్రములఁ జిక్కి యిఱుచన్నబడునే! 613

సీ. క్రమ్మరిచను మట్టు, గాదేని - నీవ చూ
డఁగ విటప వ్యాప్త గగన మైన
యివ్వటవృక్షంబు నెసగి మద్గరళ ప్ర
హతి జేసి, భస్మసాత్కృత మొనర్తు,
శక్తుండ వౌదేని! సంజీవిత మొనర్పు,
తావక మంత్ర తంత్రముల కతన
ననవుడు - నట్లకాకని కశ్యపుడు ద
క్షకుఁడు న్యగ్రోధంబు గఱచినంత

ఆ. నమ్మహా విషాగ్ని, నాకాశలేహి స
హస్ర శాఖికాచయమ్ముతోడ
భస్మమయ్యె తరువు; పాఱుఁడా భస్మంబు
నెల్ల ద్రోసి యొక్క యెడకుఁ జేర్చి. 614

కం. తన మంత్ర శక్తి బ్రదికిం
చిన, నచ్చెరువైన యట్టి చిత్తంబున, నా
తని తద్వ్యవసాయపరా
యణతా పరివృత్తి పొంచె, ఫణిపతి వలికెన్. 615

సీ. ఇయ్యనోకహ మట్ల యెలమితోఁ బాండవ
వంశవర్ధను మృతి బాపఁదలఁతు
వది పొసంగునె! రుషావ్యథిత శాపాక్షర
వ్యపగతాయుష్యుండు బ్రదుక గలఁడె!
ధర్మవటుందు వా, ధర్మంబు రక్షింప
నోపఁగా జనమేజయుండు లేడె!
అర్థింతువో! సంశయగ్రస్త మగు కీర్తి!
పురుషకారము దైవమునకు మీదె?
గీ. వాని యిచ్చు ధనంబున కేను మడుగు
లైన ధనములు గొమ్మ! నా యందు, వలవ
దుడుగు! మన్న-నా కశ్యపుఁడురలఁబాఱు
చిత్తమై బహురిక్థ కాంక్షితము రేగి. 616

కం. ధనము గొని మరలిచనె, నా
తని పోయిన వలను జూచి తక్షకుఁడు కనుం
గొనల వికసించు నగవుల
నొనరెన్ గార్యం బటంచు నూఱట పడుచున్. 617

కం. ఇరువురు నాగకుమారులఁ
గరమర్థిన్ బిలిచి మీరు కపట వటువులై
పరమ స్పృహణీయులు గం
ధరుచిర వన్యద్రుమనేత్ర తర్పణ సుమముల్. 618

కం. స్వాదుఫలంబులు పర్ణద
ళోదరముల బెట్టికొంచు నొగి జని, యాశీ
ర్వాదపురస్సరముగ నా
భూధవునకు నిచ్చునది, ప్రభూతయశునకున్. 619

వ. అని యొడంబఱచి పుచ్చి వారల తోన నదృశ్యరూపుండయివచ్చిన. 620

చం. అతుల విపంచికారవము నట్లు-శ్రుతుల్వదియింపుచున్ దృగా
ర్ద్రితలు ఘటించు రూపముల బ్రహ్మకుమారులఁజూచి చారుసు
స్మిత యుతుఁడై ధరావిభుఁడు మేవడి చూపుల నాదరించి, స్వ
ర్పతి విభవుండు సే కొనియె వారలుదెచ్చిన వానినన్నిటిన్. 621

కం. వారికి సత్కారంబులఁ
గూరిచి, వారేగినంత గోరిఁదదానీ
తారణ్యక సుమగంధము
లేరీతివో! యంచు నాస కించుక సేర్పన్. 622

కం. నల్లని సన్నని క్రిమియై
యల్లన గనిపించి - యావకారక్తంబై
మల్లడిగొని పామై, కురు
తల్లజు తీక్ష్ణముగఁ గఱచి తక్షకుఁడరిగెన్. 623

గీ. బాదరాయణి చేసిన బోధ వజ్ర
కవచమై తన జ్ఞాన రక్షణ మొనేర్ప,
తక్షకుని చెయ్దమునకు సంతాప లేశ
మైన బొందఁడు భూపుఁ డేకాంత భక్తి. 624

కం. నారాయణ పదయుగళీ
నీరంధ్రనివిష్ట హృదయ నీరేజుఁడు భూ
మీరమణుం, డానందధు
వారాంనిధియైన విష్ణు పదమును జేరెన్. 625

సీ. అర్థమ్ముతోడఁ గశ్యపుఁడు గేహముఁ జేర
ధర్మదేవత గన్న తనయఁ బోని,
ధవళాక్షి, చారుస్మితగ్రసిష్ఠ కపోల
సౌహిత్య భూయో మనోహరాంగి
యెదురు వచ్చిన యింతి - యేమయ్యెఁ దక్షకుం
దవమతితో వెన్క కరిగె నొక్కె,
విదిత ధర్ముండైన విష్ణురాతుఁడు సుఖం
బున వాడె! వాని యిచ్చినవొ! యివ్వె!
గీ. ధర్మసంపాదితంబైన ధనముతో, గృ
హమ్ము చెల్వారు శారదాభ్రమ్మువోలి
నేడు సార్థకములు, మీదు నిష్ఠ, యధ్య
యనము, యజనమ్ము, యాజనం బమల చరిత!. 626

మ. మనుమార్గుండగు విష్ణురాతుఁడు జగన్మాన్యుండు, తత్ప్రాణి ర
క్షణ కృత్స్నంబగు ధర్మరక్షణ, మరుత్సంసేవ్యుడౌ విష్ణు నె
మ్మన మాహ్లాదము నొందు దీన, మన దాంపత్యంబు నేడర్థ భా
జనమయ్యెన్, పితృదేవతల్మనకు, నాశాసింత్రు మాంగల్యముల్. 627

గీ. అని పలుకు ధర్మగేహిని యాస్య మందు
తెలి నగవు లెక్కవచ్చెడు కొలఁడి-కశ్య
పుని మొగమ్మున జీకటుల్మసరుకొనియె
కొంత కొసరును హృదయమ్ము గోలుపుచ్చె. 628

కం. తనకును దక్షకునకు జరి
గిన సంభాషణము దెల్పి, కృతమగు దోషం
బునకుఁ దడఁబడుచు - దెచ్చిన
ధనమా సర్పకులు చేత దత్తంబనియెన్. 629

ఆ. అన్నయంత వదన మశ్రుపూరమ్ములై
యీ ధనమ్ము లఘగృహీత కలుషి
తములు, వీనఁ బోషితము లైన దేహమ్ము
లఘములకు నిషద్య లనుచు బదరి. 630

గీ. వాని నావల జల్లించి, వనరుహాస్య
యింటిలోనికిఁ బోయె, భర్తృకృతమైన
యఘముచే దూషితంబైన యాత్మముఖము,
కర్మసాక్షికిఁ జూప బెగ్గడిలినట్లు. 631

సీ. ఇంటిలో భాషింప దెలనాగ, దానయి
పల్కరించిన వెడపల్కు వలుకు,
తనకుఁ గన్పడ రపత్యములు, దానెదురైన
మొగము దప్పించి - యోరగను బోదు,
రధ్యయనంబునకై రారు - శిష్యులు
వచ్చిన గురుశిష్య భంగిలేదు,
బంధువుల్బల్కరింపరు, దన్నుజూచి, చి
త్యగ్ని జూచినయట్లు దరలిపోదు

గీ. రార్ద్రమిత్రులు మౌనముద్రానివహితులు
తీరి కసిబట్టినట్లయ్యె యూరునూరె!
విసిగి, కశ్యపు, డోకంబు విడచి-యేక
తంబ, లక్ష్యమ్ములేని పథమ్మువట్టె. 632

కం. ఏదేశమ్మున కేగిన
నాదేశమ్మునకు ముందరై యఘమేగున్
చీదరగాని యెదరపక్ష
ష్టాదర తత్రత్య జనము లతనిన్ జూడన్. 633

10)

కం. అన్నమిడరు గృహిణులు, జల
మున్నడిగినఁ బోయ, రడవి పొలములు గూడన్
తన్నుగని యేవమై మొగ
మున్నటు ద్రిప్పికొని యున్నపొలుపున దోచెన్. 684

సీ. అమ్మెయి బహుభంగులగు సిలుంగులతోడ
కళ్యపుఁ దడవిమార్గములఁ బట్టి
పోవుచు, నొక్కెడ భూరుహంబులనీడ
తమదు పోతముల పాల్గ్రోవ, విశ్ర
మించుచు కెలఁకుల సంచరించెడు క్రూర
సత్వమ్ములను కీస సరకుగొనని
హరిణీకదంబమ్ము నభివీక్షసేసి, యుం
దులనెవ్వరో దపస్వులు వసింతు

గీ. రనుకొనుచుఁ జొచ్చి ముందట నహిమధామ
కిరణములు భువిడిగ్గిన కరణి, తేజ
మొలుకుచు జరించు బ్రహ్మచారులను గాంచి
వినయ మతులు వదనంబు ననుగమించి. 685

కం. కులపతులున్నారె! యఘా
కులచేతస్కులకు, శాంతిగొలుపు దయాశీ
తల చక్షుష్కులు, తత్పద
ములు సేవింపంగ సమయములె! యని యడుగన్. 686

ఆ. ఒక్కబ్రహ్మచారి యుఱుకుచుఁ బోయి శా
కల్యమునికిఁ జెప్ప, కలిమికాస
పడుచు, పాండువంశభవు నుపేక్షించిన
వాఁడు-కసటుఁబారి బడినవాఁడు. 687

మధ్యాక్కఅ. అనుకొనుచునె వచ్చినట్టి యార్యుని శాకల్యుగాంచి
ప్రణతులు సల్పి దవ్వులన, బాష్పపూరమ్ములై-తనువు
తన దీనగాథనువిన్చి-తగినట్టి నిష్కృతి వేడ-
మనము గరంగిన మౌని, మఱుమాట పలికె దానిట్లు. 638

కం. కలదోయీ ! పాపమ్ముల
సలీల బోకార్చు శేషశైలము-కరుణా
వలయిత శ్రీవాస పదా
బ్జలలిత నిక్షేప సుభగవన నిచయంబై. 639

గీ. అచ్చట స్వామిసరమున్నయది గుహుండు
తొల్లి తారక వధ సముద్భూత మఘము
దులిచికొనెనందుఁ బెను తపంబులను బట్టి
పొమ్ము ! నీపాపమట వినాశమ్ము నొందు! 640

గీ. దాన తావక దుష్కీర్తి దలఁగు, మరల
యజన యాజనపరుఁడవై యైహికమ్ము
పై మనసు మాలి, యాపరాత్పరుని గొలిచి
తిరిగి రానట్టి మోక్షంపు తెరువుగనుము. 641

కం. అన-కశ్యపుండు శాక
ల్యుని పదములకెరఁగి-హర్షలోలాక్షుఁడు ద
క్షిణదిక్కునఁగల భుజగా
ధినాథశైలంబు గురిచి-దిగదిగ నడచెన్. 642

వ. బహుళసన్తాప దూయమానుండైన కశ్యపుండుఁ గతిపయ ప్రయాణంబులఁ బృదాకు శేఖర పర్వతంబు డగ్గరి - సముచిత విధానంబుల నప్పర్వతారోహణం బొనర్చి-ముందట. 643

సీ. ఇమ్మల వల్లకీ హృద్యతంత్రీనినా
దమ్ముల మధుపగీతముల దాని
పద్మవనీ రజః పాళీపిశంగిళ
వచ్చోదు శీతలవారి దాని
ఛదగుచ్ఛ నిహిత శీర్ష శ్వేత గరుదుదం
చత్కూల నేత్రసేచనము దాని
శ్రీవాస చర్చిత శ్రీఖండ సాధు గం
ధాసంగ గంధవహమ్ము దాని

గీ. దర్శనమ్మననే సమస్తమ్ము లఘము
లణచుదాని-బర్హిర్ముఖాభ్యర్చితమ్ము
కశ్యపుఁడు గాంచి-పులక సంక్రాంత దేహుఁ,
డద్వయానంద హృత హృదయాబ్జుఁడయ్యె. 644

శా. తత్తీరంబున వాసుదేవమయ చింతాతంతువుల్నేయుచే
చిత్తంబై, తపమూనె బాడబుఁడు-లక్ష్మీజాని రూపంబుతోఁ
దత్తాదృ గ్రుచి కన్నులందు నిలిచెన్, దారెన్ కృతాఘంబులు
తృప్తింజెందని యట్లె, భూమిజన జిహ్వావర్తి దుష్క్రియన్. 645

కం. అని యీగతి సూతుఁడు ముని
జనములకున్ జెప్ప, వారు, జనితానంద
ప్రణిహిత మతులై యింకను
జను వచియింపనన-నతఁడు సదమల ఫణితిన్. 646

వ. ఇట్లారంభించె. 647

సీ. అశ్రాంత విశ్రాణ నాసార మేఘమ్ము
నిగమ మార్గైకాధ్వనీన బుద్ధి,
చాపగర్జా సముత్సారిత శత్రుండు-
మిత్రాబ్జినీ సమున్మేష హేళి,

బ్రహ్మ తత్వజ్ఞ చర్చా సముల్లాసుండు
ధర్మసాధన పరధర్మ విహృతి,
హిమధామ వంశమహిమధామ సద్గుణుం
దన్యకాంతోపగూహన విముఖుఁడు

గీ. యజ్ఞశాలల హవ్యమై, యవని ప్రజల
వదనముల యందు హర్షమై-వనరుహాక్షు
లందుఁ బావిత్ర్యమై-కీర్తి యలరువాఁడు-
డందుఁడన్ రాజు, దళిత దుర్ణయమువాఁడు. 648

వ. అతఁడనేక కాలంబు ధర్మోత్తరంబుగాఁ బాలించి - వార్ధక్యంబు గర్జే జపంబైన, నిజపుత్రు ధర్మగుప్తు రాజ్యంబున నిలిపి - తానడవుల కేగిన. 649

మ. చతురంభోధి పరీతమైన దన రాజ్యంబన్య దుర్భేద్య వి
శ్రుత విక్రాంతియె తోడుగా-జనమనస్తోషంబు గావించుచున్
పితృ రాజ్యమ్మునకన్న మిన్నయని పృథ్వీవాసు లెగ్గింప, మా
నితుఁడై యేలెను, ధర్మగుప్తుడు, హిమానీ స్వచ్ఛ సత్కీర్తియై. 650

కం. అతఁడొకపరి వేటకునై
మతి యుత్సాహింప, బిరుదు మగలై, వ్యాధ
ప్రతతులు వెన్నడిరా,న
ప్రతిమ పరాక్రముఁడు గహన వనముల కరిగెన్. 651

కం. కరి కిరి కాసర చమరీ
శరభాదుల వజ్రసార శరములతో-గ్ర
చ్ఛలఁ జంపుచు నృపుడు వనీ
పరిసరముల జఘనిఁ వంటపట్టులు సేసెన్. 652

సీ. ఖండిత తుండ వేదండంబులయు, జర్జ
రిత వక్త్ర శార్దూల వితతులయు, వి
దారిత జఠర భూదారంబులయు, కృత్త
చరణ పంచాస్య విసరములయు, వి
పాటిత లోచనభల్లంబులయు, హింసి
తములైన హరిణ సంతానములయు,
నులివునఁ జేసి ప్రాంత లసద్దరీ గహ్వ
రమ్ములు శబ్దమయమ్ము గాఁగ-

గీ. కాలకంధరు చిచ్చఱకంటి సెగల
నలుగుల నిమిడ్చికొన్న తూపులు నిగిడ్చి-
యడవి మృగముల యాయువులణచె, ప్రాణి
మారణము పాపహేతువన్మాట మఱచి. 653

కం. తా మొసఁగ లేరు ప్రాణము
తామొసఁగిన యట్లె, ప్రాణితతి వధియింపన్
గామింతురు, నరు, లఘములు
బాములు గడుపునను మాట పట్టనివారై. 654

గీ. అప్పుడాఖేటమున జిక్కి యపనిపుండు
పోయెదూరమ్ము, పరివారమునకుఁ దలఁగి
పశ్చిమాశాస్వయంగ్రాహ భాగ్యమునకు
నజ్జునెత్తి పరీడుచుండె నబ్జహితుఁడు. 655

కం. తన పరివారము దొఱఁగిన
మనికితమను, నీరుపట్టు- మనము గలంపన్
జనవిభుఁడు జలాశయమొన
రనౌ యొక్కెడననుచు నడవి రోయుచు నుండెన్. 656

మ. ఘనదంతావళ గండమండల మదాక్రాంతిన్ కషాయంబులై
వనజాతౌఘ వినిస్సరద్బహు రజోవ్యాప్తిన్ పిశంగంబులై
రణదుత్కంఠ మరాళ కాంస్యరవధారా చక్రనిస్వాన సే
చనముల్గల్గిన వారితోడిదగు కాసారంబు గన్పించినన్. 657

కం. జలిమాని, సేదదీరి, వి
మలసలిల స్నానముదిత మానసుఁడై, పే
శలకింశుక ఘృణి, మిహిరున
కెలమిన్నపుడు సాంధ్యమైన కృత్యము దీర్చెన్. 658

కం. పారావత పద పాటల
మై, రవిబింబంబు, పశ్చిమాద్రి శిఖర కో
టీరము పై, వెలుగొందును-
దారము కట్టెర్ర రత్నమై భాసించెన్. 659

గీ. దిశలనెడు గట్టివాల్సతుల్, తివిరి, కుంకు
మమ్ము, కుప్పలుగాఁ బేర్చి- యమ్ముచున్న
వారనగ, దాసనపుఁగాంతి బేరజమ్ము
లాడు, జరఠార్కఘృణులు సాంధ్యములు గ్రమ్మె; 660

సీ. సరసులలోని యచ్చములైన పుండరీ
కములను నిందీవరములు సేసి
ప్రోషిత పతికలౌ యోషిన్మణుల నిరం
జన నేత్రములకు, సాంజనత సేసి
సంగమోత్కర్షాభిసారికాతతి, కయ
త్నప్రాప్త కుంజసంతతులు సేసి
అర్ధాపరాధ కాంతారక్త యువత దృ
జ్నికరంపు నీల భూమికలు సేసి

గీ. రజతగిరి తాండవారంభ రభసశూల
హేతికటి బద్ధమగు ద్వీపకృత్తి కాంతి
యెల్లెడల బర్వెనోయన, నింద్రనీల
రాజి సంస్పర్ధి ఘనతిమిరములు గ్రమ్మె. 661

కం. ఆ తిమిరంబుల భూపుం
డుత్తలపడి-యా ప్రభాత ముసురుల బ్రోవన్
హత్తునొ ! యొకతెఱు వనుచు, బృ
హత్తరు వొకదాని గాంచి-యపగతభయుడై. 662

ఆ. దానియొక్క శాఖపైనుండె, దైవమ్ము
పైని భారమూది, ప్రజ్ఞలుడిగి,
పురుషకారమునకు బొత్తుదప్పినచోట
దైవమొకడె, దేర్చు నావగాడె !. 663

సీ. అప్పుడచ్చటికొక యచ్ఛభల్లంబు భ
యార్తమై జనుదెంచె, నతికఠోర
ఘుర్ఘురధ్వనుల కకుప్పుల భేదించి
కొనుచు, నద్దాని వెన్కనె దరుముచు
హర్యక్ష మొక్కటి, యతివేల రక్తిమల్
గ్రక్కుకన్నులది, దంష్ట్రావిటంక-
ధవళరోచిచ్ఛటా దళితాంధకారంబు
నది, ఘోరభాంకార మృదితశైల
గీ. కందరమ్ములు, నద్దానిఖరనఖరవి
దారణంబులదప్పికోదలచి, ఋక్ష
మూఢశాఖా సహాయతామేడితాంధ
కారమైనట్టి యొక్క మహీరుహంబు. 664

వ. పొదఁ గాంచి, దానినెక్కిన. 665

ఆ. ధర్మగుప్తుఁడందె తానుండి, యెలుఁగు, త
చ్ఛాఖినెక్కి వచ్చుచాయఁ గాంచి
ప్రాణములకు నెగ్గువాటిల్లెఁ దప్పించి
కొనఁగ మార్గమేది; యని తలంచి! 666

ఆ. క్రింద జూచినంతఁ గీనాశకేతనం
బట్టి వాల, మల్లనార్చికొనుఁచు
నున్నసింగ, మంతనొడలెల్లఁ జెమ్మట
లై, వడంకుపుట్టి యడలె వాఁడు; 667

క. అప్పుడవ్వానింగాంచి, యా ఋక్షంబు మనుష్య భాషణంబుల నిట్లనియె, నయ్యా! యూరడిల్లుము, ప్రాణభయంబు వలవదు. పైన నన్నునుఁ గ్రింద హర్యక్షంబును సూచి యెట్లును నుసురులు వోవునని నిశ్చయించి, యడలుచున్న వాఁడవు. నేను నీకుఁ గీడొనరింపను. సమాన దుఃఖుల మైన మనకుఁ బరస్పర సహాయంబునఁ బ్రాణంబు లోమికొనుట లగ్గు, కాన నానిర్ణయంబు వినుమని యిట్లనియె; 668

గీ. పూర్వరాత్రంబునందు, నీవు సుఖనిద్రఁ
బడయవయ్య! నా కురువుపబర్హణంబు
సేసికొని, నిద్రగట్టి రక్షింతు నిన్ను
బ్రమసి, మైకమ్ములోఁ దూఁగి పడకయుండ. 669

గీ. అపరరాత్రంబునందు నన్నట్లు గాఁగ
రక్షణ మొనర్పవలె నీవు, రాత్రి గడచు
నంతలో, వేచి, వేచి హర్యక్షమొండు
కడకుఁజను, నన్యజంతువు దడవికొనుచు; 670

వ. అనవుడు, "నట్లకాక!" యని ధర్మగుప్తుండొడంబడి నిదురించిన, ఋక్షంబు విలోకించి మనుజభాషల సింగం బిట్లనియె. 671

క. నినుఁ దటిమికొంచువచ్చితిఁ
జెనకఁగ రాకుండ నీవు చెట్టెక్కితి, నా
ఘనవిక్రమంబు, నీచిలు
పని యొక చాతుర్యమునన పనికిఁ దొలంగెన్. 672

ఆ. దానిగూర్చి నేను దల్లడంపడ, నీవు
బ్రదుకు ముచితమైన భంగి, గాని
వీనిఁ గాఁతునంచు కదుఱుగొంటివి
యోయి! ఋక్షరాజ! యుచితమగునె! 673

క. నీ వారణ్యకమవు, నే
నీవలెనే యడవిమనికి, నియతము మనమై
త్రీవిభవము, వీఁడెవ్వఁడు
జావడమున నీదు మెడకు సంప్రాప్తించెన్. 674

గీ. వానిఁ బడనూకు మాకలి దాఁనదీఱి
సలిలములు గ్రోలి, పోదు నావలచినెడకు
నీవు ముదమున జుంటితేనియలు గ్రోలి
యూరటను జెందు, పొమ్ము నీయున్నయెడకు 675

సీ. ఆ మాటలకు ఋక్షమనె, లెస్సఁబండించి
తివిలెమ్ము ధర్మంబు దీర్ఘతేజ!
యాకలిగొంటవై యాడెదు నీ పల్కు-
లనుసరింపఁగఁ బాటివౌనా! పలికి
బొంకెడివాఁడెన్ని పోఁకల ధర్మంబు
సాధింపనాయిటి దూదిగాక
ఫలమున్నె! ధర్మసర్వస్వంబు సత్యంబు
దానిమించిన యట్టి తపము లేదు.

ఆ॥ అదియుఁగాక, దీనుఁడై, శరణన్నవా
నినిను పేక్షసేఁత, మనసుగల్గి
నట్టి మార్గమగునె! యన్యస్థలంబుల
వెదకికొనుము, పసియు, పీగుతీరు. 676

క. అని పీడఁగఁ బల్కినఁ బ
న్నిన యనువు ఫలింపకునికి, నిర్వేదము నె
మ్మనమై సెలవులు నాకుచు
ననఁగిన యాశలయి, సింగమట్లన యుండెన్. 677

ఆ. అంత నర్ధరాత్ర మగుడు, దానమ్మహీ
పతిని నిదురలేపి, వాని కురువు
పైని గూర్కినదియు భల్లంబు,
ధర్మ మెడలఁ దనుచుఁ దద్దనమ్మి. 678

వ. అప్పుడు సింగంబు మొగం బెగయించి, ధర్మగుప్తుం జూచి యిట్లనియె; 679

ఆ. పిచ్చివాఁడ ! యేటి పిరు పీకు లియ్యది,
రాత్రి యెల్ల జాగరంబు సేఁత !
దానిఁ దొలఁచికొనుచుఁ దనివి దీఱఁగ నిద్ర
బొమ్ము; నేనుఁబోదు నిమ్ము వదలి. 680

క. జాతికృతమైన యెఱ యిది,
నీతియె ! మాకు న్దొలింప ! నిక్కముతత్త
జ్ఞాతి కృతమైన కూడు, సు
ధాతిగమను మాట, నేటిదా ! తలఁపోయన్. 681

గీ. తెల్లవాఱిన, నీ యచ్చ భల్లముబుసు
పోఁకకైనను, నినుఁ జీల్పఁ బోదటంచు
గట్టి మాటేమి ! సంశయగ్రస్తమైన
తెరువు హితము ! యసంశయంబురునా ! చెపుమ! 6-2

వ. అని పలికిన ధర్మగుప్తుఁడు, కర్తవ్యాకర్తవ్య విచారంబు దలఁగి, యెలుంగుఁ బడఁ ద్రోసిన, దైవంబునన్జేసి యది వృక్ష శాఖా సహాయం బునఁ గ్రిందఁబడక యనోకహంబు పైకి లంఘించి, యయ్యపశదుం గాంచి. 683

క. తగునిది, తగదని వగవక
వగ మాటలు నమ్మి, ధర్మపథము దొలంపన్
దెగఁబడితి, కృతఘ్నత మిగు
లఁగఁ బాపము గలదె! యెట్టులన్ బరికింపన్. 684

వ. నీ సర్వంబును నాకు విదితంబు; నీవు ధర్మగుప్తుండను మహారాజవు; వేట నెపంబున సిలుఁగులన్బడితి వీఁక, నా వృత్తాంతంబు వినుము. 685

చ. భృగుఋషి వంశమందు జనియించి, శ్రుతుల్పఠియించి, హవ్యముల్
దగియెడుభంగిఁ, బావకునిఁ దన్పుచువేల్చి, సమాధినిష్ఠితం
బగు తపమూది. యాశ్రమికులందరు నిట్టిరె! వర్ణులంచు మె
చ్చగ వసియించితిన్, భృగుయశమ్మును ముమ్మడి సేయు తీరునన్. 686

సీ. ధాన్యకాష్ఠుండను నభిధాన, మొకనాఁడు
కొండికతనమున, గురుకులంబు
నందు, సహాధ్యాయి నపహాస్య మొనరింప
ఘుర్ఘురించుచు నెల్గు గొడ్డునట్లుఁ
దరసిన, వాఁడవంధ్య ప్రకోపుఁడు, ఋక్ష
మవు గమ్మటంచు, నెమ్మనము గలఁగి
శపియించెఁ బరిహాస జల్పనంబుల కింత
గినియుటే! యీ నిష్కృతిని వచింపు

గీ. మంటి, భద్రకుఁడను ధనదానుచరుఁడు
సింగమై యంటి, నిన్ను జంపంగవచ్చు,
వాఁడు, దత్పూర్వభవము నీ వలనఁ దెలిసి
శాపమును బాయు, నీకద్ది శాపముక్తి. 687

ఆ. పొమ్ము, ఋక్షజన్మమునఁ గూడఁ బూర్వభ
వమ్ము, మఱపురాని పగిది, వరము
నిచ్చితిని, కడింది యీరసంబును సైపు
మనఁగ, మాఱుదిట్ట మనసుమాలి; 688

వ. చరియించుచుండుదు. మచ్ఛాప విముక్తి కాలంబును దాపురించినయది; యనుచు మఱల నొకపరి ధర్మగుప్తుని కృతఘ్నతా భరంబు మనంబున బెరసిన రూక్షంబునఁ జూచి; 689

క. తగుదగదని చూడక, న
మ్మిగమాల్చి, కృతఘ్నతకును మేకొంటివి, పెం
పగలఁగనున్మత్తుఁడవై
సుగలముఁదొఱగిఁ పుడమి ప్రహరిజుట్టుము, కుమతీ ! 690

ఆ. అనుచుఁ గ్రిందనున్న హర్యక్షమును గాంచి
పలికె నిట్టు లోయి ! భద్రకా ! సు
ఖంబె ! కామవశతఁ గన్నులు గానక
యెట్టి భంగపాటు నెత్తికొంటి ! 691

సీ. తలఁతువో ! ధనదు ప్రక్కల నిల్చి మనవులు
గావించునప్పటి గౌరవంబు,
మతినిఁ బారాడదో ! మహితమౌ నలకాపు
రీప్రత్నరత్న నిర్మిత పథంబు;
కన్నులఁ గట్టునో ! కామాంధయక్షలీ
లావతీ కుచకోకతాలనంబు
జ్ఞప్తికిరాదో ! తుషారపర్వతదరీ
ప్రాంతసంగీతక ప్రాభవమ్ము

గీ. యెంతపని సేసె గౌతముం డిట్టలంపుఁ
గోపమున, సౌఖ్యమైరేయ గూహితుని, వ
నంపు మెకముగఁజేసె, యేనాటికైన
వ్రతుల యుల్లంబు గలఁచిన బ్రదుకు గలదె. 692

క. నీకున్ శాపము గల్గిన
యాకారణ మేదొ! విందువా! ఘననిష్ఠా
శ్రీకుని, గౌతము నెఱుఁగుదు
వేకద! యమరాధిపాదివినుత పదాబ్జున్. 693

గీ. ఆ ఋషి యొకప్డు దర్భలుదేర, నడవి
కేగ, నుటజంబుఁ జొచ్చితి, విందుముఖుల
తోడ, మైరేయపానమత్తుఁడవు, వలపు
రజ్జులాడుచు, బాధనిర్లజ్జితుఁడవు. 694

క. తలమొల నెఱుఁగక దిరుగుచు
వలువదొఱఁగి గ్రామ్యభండ భాషలతో, నిం
తుల బెదరించుచు, బెనుజం
గిలి వెలిచెడు గోవునట్లు గేరుచునున్నన్. 695

ఆ. గౌతముండు వచ్చి, కన్నులఁ గావియై
యోరి! శంఠ! త్రావి యొడలు మఱచి
యాశ్రమంబు సొచ్చి, యాగడం బొనరింతు
వా! మదంబు గన్నులడ్డెనొక్కొ. 696

క. "పొమ్ము! దురాచారుఁడ! సిం
గమ్మగ బడియుండు మెఱచి గఱచుచు" నని తీ
వ్రమ్ముగ శపియించిన, మాం
ద్యమ్ము దలఁగి, కాళ్లవ్రేళ్ల నంటుచు వేడన్. 697

ఆ. పొమ్ము! ఋష్యమొకటి, పూర్వ భవంబు నీ
కెఱుక పరచు, నప్పుడిందు శాప
మిర్వరకు నటంచు, నెఱిఁగించె నిప్పుడు
చెప్పవోయి! నీవు సింగమగుదొ! 698

సీ. ఆ వాక్యములు వీనులందుఁజొచ్చుటయె, గౌ
సెనయట్లు, సింగంపు తనువు నూడ్చి,
కనకద్రవంబు పెన్గర కట్టినట్టు, లు
జ్జ్వలమైన రూపమ్ము, కళలు దొలఁకు
నౌపకర్ణికములు నంబకమ్ములు, జాను
వులనంటు దీర్ఘబాహులును, దివ్య
మాల్యమ్ములును, మణీమయ భూషలును, నధ
రమ్ముపై, మందస్మితమ్ము దనర

గీ. భద్రుఁడను పేరితోడి, రైపతికిఁ బార్శ్వ
చరుఁడుగాఁ దోచి, ఋషికి మస్తమ్ము వంచి
తుహినగిరి కేగె యక్షుండు, తోన, ధ్యాన
కాష్ఠునకు, ఋక్షకాయ నిర్గతియుఁ గలిగె. 699

ఉ. ఆ ఋషి యాశ్రమంబునకు నైచనె, శాప విమోక్షముడ్గగన్
నేరఁడు ధర్మగుప్తుఁ డపనీతమ యైనటుబుద్ధి; యెట్టి ప్ర
జ్ఞారణియైన, దుర్విధినికామ విజృంభణవేళ, సత్ప్రమాం
గారము నీనునే! పురుషకారము దైవము డీలు వుచ్చునే! 700

క. మఱునిముసమందుఁ దలయే
రురవడిగాఁ గ్రమ్మెఁ బైత్యముద్రేకించెన్
గఱవయ్యె నిదుర పలుమరు
నొఱవలుగా మాటలాడ నుల్లము రేచెన్. 701

సీ. ఎవ్వరితోడనో! యెలుఁగెత్తి మాటాడు
తనలోనె తాను వాదమ్మొనర్చు;
తొలుసేఁతలీలగాఁ దోచునో తన యవి
వేకమ్ము దలపోసి బిట్టు నేడ్చు;

ఋషి ఋషమై యున్న విషయంబు మెదలునో
క్రూర నిస్స్వనముగా ఘుర్ఘురించు
సింగంపు నూసు భాసించునో నేన భ
ద్రకుఁడంచు రిత్తపెత్తనము సూపు

గీ. గాఢ ధూళీకరంచిత గాత్రయష్టి,
జటిల కైశ్యుండు, పైత్యనిశారనేత్రుఁ
డపగతాహారుఁడున్మాదచపల వృత్తి
ఋషిదుషావిషదష్ట తాదృశుఁడు నృపుఁడు. 702

వ. అతఁడయ్యడవి వెంట లన్దిరుగుచు, నొక్కనాఁడు రాజధానికేతెంచిన, నంతకుముందఱ భూపాలు నెల్లకడల రోసి, తెలుంగు గానక, శాంతిక పౌష్టిక క్రియల సేయించుచున్నవారు. పురోహి తామాత్యాదులు, ధర్మ గుప్తుఁ డున్మత్తుండై యుంట దెలిసి, వెరపు మెయి నౌషధీయంబులు నడపి, కడగానక, రేవాతీరంబునఁ దపస్యా నిష్ఠుండయిన నందున కెఱింగించిన, నాతండు, కొమరుందోడ్కొని, జైమిని దరిసించిన నమ్మౌని కొండొక విచారించి, ధ్యానంబునన్జేసి, గతంబెఱింగి, నందున కిట్లనియె. 703

ఆ. జనప! కుపిత మౌని శాప ఫలంబుగా
వచ్చె నెడరు, దీనిఁ బాపికొనెడి
యనువునైనఁ జెప్పెఁడామౌని! దైవసే
వయ దలంప దీనిఁ బాచు తెరువు. 704

గీ. తన పయః పానమున సర్వదైవతముల
హృత్తృషలఁదీర్చు సౌరమాహేయివోలె;
తన పయఃపానమున మర్త్యతలిని దన్పు
వాసిగల దొడ్డతటిని సువర్ణముఖరి. 705

శా. తత్తీరంబున వేంకటాచల మహీధ్రంబుండు, నానాఝరీ
ప్రోత్తాలాంబు తరంగ సంఘటిత సద్యో మర్దలధ్వాన, ము
న్నృత్తోద్రిక్త శిఖావల వ్రజసమున్మీల ద్భృశోత్సాహ నృ
త్యత్తాదృద్భుజగీ తమావలన వీక్షామోద తార్క్ష్యంబుగన్. 706

గీ. అందునొక్క సరంబుండు నబ్జనాభ
పదపరాగ పరాహత పాతకంబు;
కమల వనవాసినీయావకప్రదీప్త
మృదుపదార్పణ భాగ్య సమ్మృదితజలము; 707

సీ. మునుపు హిరణ్యాక్షుఁడను నొక్కరక్కసుం
దతివేలగర్వమై, యవనిఁ జాప
కట్టుగాఁజేసి, చక్కనఁగొంచుఁబో, కూట
కిటియౌచు, వాని నెక్కటి వధించి
యా రూపముననె గల్పాంతమ్ము వఱకు, స
న్నిధి సేయవలయు నా నెలవునందె
నను వేదవాదుల యానతి మన్నించి.
యచ్చటనున్న వాఁడబ్ధిశాయి

గీ. లచ్చితోపాటు, వారు జలమ్ములాడు
శస్తసరమది, యచ్చటి స్నానమాత్ర
మఖిల పాపగజమ్ముల కంకుశమ్మ
నధిప! నా ప్రహదమే శరణ్యంబు మీకు. 708

క. పొమ్మన్న, నందనృపుఁడతి
సమ్మోదము నొంది, యాత్మజాతునితో, ది
వ్యమ్మును, హతగుహకృతపా
పమ్మనునైనట్టి సరముపజ్జలఁ జేరెన్. 709

సీ. అనుసవ మర్త్యముండద్రి నెక్కకమున్న
స్వామి సరమ్మున జలకమాడి
పద్మాసనాసీనపరత, యా మధ్యాహ్న
మష్టాక్షరజపధ్యానములని
మధ్యాహ్న విశ్రాంతి, మాధవతలా వి
హిత సత్పురాణ సంహితలు సదివి,
పశ్చిమసంధ్య, జపముదీర్చి, స్వామి స
న్నిధిసేసికొనిమది, నిట్టుగడపి

గీ. నందుఁ డాత్మ జోన్మాదప్రణాశమునకు
సేవలొనరింపఁ గ్రమముగాఁ జిత్తశాంతి
గలిగి, ధర్మగుప్తుండును కమలనయన
పాద పద్మాఽనుచింతనాభ్యాసియయ్యె; 710

క. స్నాన జపంబులతో, మది
నూనిన గదవో, వివేకహృత దుర్నయుఁడై
మానితుఁడు ధర్మగుప్తుం
డానతవైరియయి, సర్వమవని భరించెన్. 711

గీ. అనుచు వచియించి సూతుఁడయ్యమల ఋషుల
వదనములయందతృప్త భావమ్ము జూచి
యింకనుజెప్పుమను కోర్కెనెంచి, మరల
ననియెఁ బలుకుల మధురిమ లావటించి. 712

మ. బహునిష్ఠామయ నిత్యజీవనుఁడు, విద్వన్మండలీ కౌతుకా
వహ కీర్తిధ్వజుఁడప్రతిగ్రహ సుసంపన్నాత్మ తేజుండు, స
ద్గృహిణీసాహ్య నివర్తితాఽతిథి గణాతిథ్యుండు, కౌలీనతా
గ్రహి, దానుండెను యజ్ఞదత్తుఁడను విప్రశ్రేష్ఠుఁడోజస్వియై. 713

సీ. తొలిరాజు లిడ్డభూములనుండి ముక్కారు
బండి, యింటికి వచ్చు పసిడి పంట,
యమృత సేచనములౌ నంభా రవంబుల
నోకంబునందుఁ గుండోధ్ని చయము
శాస్త్ర చర్చాసముత్సాహంబుతో, వచ్చి
పోయెడు దోషజ్ఞ భూసురాళి,
యింటిలోనన భుజియించి, యా సంధ్యమ్ము
నిగమముల్వలుకు వర్ణివ్రజమ్ము

గీ. అడపదడప దర్శనమున కంచు వచ్చు
ప్రాంత సంపన్నగణము, గేహంపు లక్ష్మి
కూర్మి యిల్లాలి యోర్మిని గొలువ, యజ్ఞ
దత్తునిగృహమ్ము, సమ్మోద దామకమ్ము. 714

క. వాఁడనపత్యుం, డిదిమది
గాడిన దుఃఖంబు గాఁగ, ఘనన్నైగమ ప
ద్యేడిత మార్గము విడి, తృ
ష్ణాడితుఁడై, కొలఁది దేవతల వెంటఁబడెన్. 715

సీ. పసుపుఁ గుంకుమము లప్పలు వెట్టుచును, సుంకు
లమ్మది, నింబచ్ఛదమ్ము గఱఁచు
శ్రవణకఠోర చర్మపు వాద్యములది, మా
రెమ్మ గాంచిన, సంభ్రమమ్ము వడును;
విన్ను కెంపుదయింపకున్న ముందఱ, బుడు
బుక్కల వానికి మ్రోల నిలుచు
గృహదైవతమ్ము లిట్టింకు లింకఁగఁబోయి
యక్కదేవతలకు మ్రొక్కులిడును

గీ. తనయుఁడొక్కఁడు గావలెనని యెడు వెఱ్ఱి
యవధి లేనిదై, దిగఁజార్చె యజ్ఞదత్తుఁ
గాను మెంతటి నరుడైన, గట్టిలమ్ము
నట్టులోనరింపఁ బూలమ్మినట్టి వీథి; 716

క. గాలముగ కాని కడుదు
ష్కాలము ప్రాప్తించి, తెగని కడగండ్లకునై
బాలుఁడు గలిగెను, "సుమతీ!"
చాలనరులు గొన్న తండ్రి శాబకుఁ బిలిచెన్. 717

ఆ. వంశకరుఁడు పుట్టె, వంశమ్ము గుమ్మడి
పాదువలెనె, దిశలఁ బట్టునంచు
యజ్ఞదత్తుఁడబ్ధి యట్టులై పొంగె, న
య్యొడ్డ పాపఁ గాంచినప్పుడెల్ల; 718

గీ. పరమపురుషుని యిచ్ఛాఒను వర్తనమునఁ
బ్రాప్తమైనది, సుకములఁ బంచుఁగాని
కసురు బండించినట్లట్లు గాని యది, వి
మోహకమ్మయి, తుది దుఃఖములనె బెంచు: 719

క. చిలువాయనంపు వేల్పుల
చెలిమి భయంకరము, సుకము జిందినయటులే
గలిగించు నపథ్యము, వి
హ్వలమతి గావించి, వాని వంశమె జెఱచున్. 720

ఆ. అల్పమునన గోప, మల్పంబునన దయ
యిచ్చెనేని వరము పిచ్చపాటి;
యలుపమైన దేవతల తోడి సాంగత్య
మెల్ల తెఱఁగులందు, భిల్లమైత్రి. 721

సీ. ఈఁత నేర్వఁగఁబోయి, యెండ్రి బొక్కలఁజేయి
వెట్టి, యేకటఁగాళ్లు బీకి మెసవు
బడిశంబుబూని, చేపలు వట్టి, పెఱలువం
టలు వండ నుబ్బి లొట్టలుగ దినును;
కాకి యెంగిలిజేసి, కాపు దండించు బె
ల్లము, బాగు బాగంచు నమిలిమ్రింగు;
చత్వరవాసినీ చర్విత వీటి, హ
స్తము సాఁచి, భోగించి జొౌరుగొట్టు

గీ. సంత జవ్వన మమ్మిన సాని, కఱచి
నట్టి మైరేయమాను, భాగ్యంబుగాఁగ
సర్వ గుణకులాలంకార చక్రవర్తి
సుమతి, యా యజ్ఞదత్తు పాపములు కెరలి; 722

ఆ. కోళ్లగుంపుఁ బెంచుఁ గుక్కలఁ బెంచు, పా
రావతములఁ బెంచు, రక్తితోడ;
పుచ్ఛడీకతనముఁ బోబెట్టి, దీమము
ల్బెంచు, వేటకాండ్ర సంచుగట్టి; 723

చ. పులియుఁడు, బూచిగాఁడనుచు, మోములమోమును జేర్చి, తట్టుజో
గిలముల, మాంసభేదముల కీడులుఁ మేళ్లను జర్చసేయు. వే
టలఁబడి, తెంపుసేసి యొకటన్ గఱుకుట్లను దానె గాల్చు, వెం
గలియయి, లుబ్ధకుల్ బవిరెగట్టి భుజింపుచు బాగులెన్నఁగన్. 724

సీ. ఒక్కవై తంసిక యువతి చన్నులజంట
నొదిగి, కాలము బుచ్చునొక్కనాఁడు
ఒక నాపితునియింటి సకియ వాతెఱఁ జీకి
యొసపరియై యుండు నొక్కనాఁడు

ఒక్క నిర్లేజకు నుగ్మలి, చల్లని
యూరుపుల్లుంబించు నొక్కనాఁడు
ఒక తంతువాయుని యువిద యెంగిలి తమ్మ
నుబ్బి, సేవించెడు నొక్కనాఁడు

గీ. బాల విధవా శిథిల పరిష్వంగములును
కలలములు దివామైథునమ్ములును వాని
నిత్య కృత్యమ్ము లయ్యె, తత్రత్య జనము
లయ్యొ! యా యజ్ఞదత్తుఁడంచడలుచుండ. 725

క. ఆసవుసలై, గుసగుసలై
విస్మరములు కొడుకు సేయు, వేడ్కలు, విద్యా
లసితుఁడు, ముక్తాఉధార్మిక
విషయుండగు, యజ్ఞదత్తు వీనుల కెక్కెన్. 726

ఆ. అగ్గి ముట్టికొన్న యట్టులై, కొడుకు మొ
గమ్మె జూడలేదు, కన్న తండ్రి
కుటిల దుఃఖభరము పుటపాకమైనది,
యన్నమును జలంబు నాసగొనఁడు; 727

గీ. ఆగమికమైన మార్గంబనాదరించి,
యల్ప దేవతా సేవనం బాశ్రయించి
బల్మిఁ బండించి కొన్న యిప్పొలసుండు
కొడుకు, నా జీవితంపు రూపడచు దుడుకు; 728

క. అనుకొన్న తండ్రి, యా దిన
మునసుండియు నన్నమింతముట్టఁడు, శ్రీవా
సుని పాద తీర్థమును విడి
కొనఁడు జలము, బ్రదుకు పైని కూర్మి దొలంచెన్. 729

క. భర్తకుఁ జెప్పఁగ లేక, య
నార్తవ కుసుమంబు నట్టు లగ్రాహ్యుండౌ
ధూర్తుఁడు కొడుకును గనలే
కార్తికి నగ్గమయి, తల్లి యార్భాటించెన్. 780

ఉ. వారములోనఁ జచ్చె ననివారితహృద్గదుఁడై నతండ్రి, దు
ర్వారము శోకమై, యుసురు బాసిన దామఱునాఁడె తల్లి, దు
ష్పారములైన యౌవనపుఁ బొంగులు గన్నులు గప్పి, కొడుక్క, దా
నేరఁడు కంటి చెమ్మకును, నిష్ఠురతాభరమెంత యున్నదో ! 781

క. తెఱచిన వాకిలియై, త
స్కర విట కౌక్కుటిక, జారకాంతామైరే
య రసంబులకు, సుమతి మం
దిరము, పరేతాగ్నివోలెఁ దీండ్రఁగ వెలిఁగెన్. 782

సీ. వారనారీ విట వ్రజమిథోజాత దు
ర్వ్యవహార జార ధర్మాసనంబు
కృకవాకుకుల సాంయుగీన నిర్ణయ విధో
ద్ధత శస్త్ర సంపాత ధర్మదార
ఎడ పొందుతో, బుద్ధి పెడతలయై, యిల్లు
గదలిన దానికేకాంత గృహము
చౌర్యాపహృతధన సంచయ భాగ ని
శ్చయ ప్రాడ్వివాక చర్చా నిషద్య

గీ. అక్ష ధూర్త వ్రజమ్మున కాశ్రయమ్ము
నీచ శైలూష విహగ వనీరుహమ్ము
వారుణీ మాంస వితరణప్రపప, పరాస్త
బుద్ధియైన యా బ్రాహ్మణబ్రువుని గృహము. 783

ఉ. ఏ కథఁ జూడనప్పులయి యింకె ధనంబులు, వాదవాద నం
బూ కృతమయ్యె రోవెలఁది పొందులు దూరములయ్యె, వాఁడచీ
కాకయి, రొమ్ము పెక్కువలు గల్గిన బాలవితంతు వొక్కతెన్
జేకొని, దూరదేశములు జేరె, నపత్రప నక్కళింపుచున్. 784

ఆ. వాఁడు మగఁడు దాను భార్యగాఁ గొన్నాళ్ల
నాటకంబు లాడె నాతి, ధర్మ
బలములేని వారి బాంధవ్యములు, పైని
మెఱుఁగులుమియునట్టి మేడిపండు; 785

ఆ. "నిన్ను వదలలేనె గన్నాకు నీవం"చుఁ
గూర్మిలొలుకఁబోసి కొన్నినాళ్లు
లొకరికొకరిపైన నొల్లమి గొన్నాళ్ల
చిత్రమయ్యె వారి జీవితంబు. 786

క. ఒకనాటి రాత్రి పడుపడు
కకుఁ జెప్పక వాఁడు నెలవుగడచి, జటిలా వృ
క్ష కదంబ ద్విస్త్రి రుక్తాం
ధకార నిచయంబు లడవిదారులఁ బడియెన్. 787

సీ. చంద్ర నిప్పులు వోలెఁ దీండ్రించు కనులంచు
వెలయు సింగములకుఁ దొలఁగి చనుచు
సాంద్ర ఘాంకార సంశ్లథ గుహాశార్దూల
ములు జరించెడు దారిఁదొలఁగి చనుచు
వితత స్ఫుటామణీ ద్యుతులు భుజంగ గ
రళ ఫూత్కృతమ్ములు దొలఁగి చనుచు
మద జలాసార సమ్మృదిత వారణ కరం
బుల చాలనములకుఁ దొలఁగి చనుచు

గీ. విధియ యుపదేశికుండుగా విపిన వీథి
దారి నడచెను వాఁడు బేతాళ వితతి
యనుగమింపదు వాని, నవ్వాని త్రోవ
ననుగమించెడు ప్రారబ్ధమునకుఁ దలఁకి. 738

ఉ. తూరుపునందుఁ దోచె శుకతుండనిభంబగు కాంతి దిక్కులొ
ప్పారె ఖగావళీ వితతవల్గురుతంబుల పద్మినీ మనో
హారి దివాకరుండుదితుఁడయ్యెఁ గరంబులుఁ జేసి యద్రి కాం
తార నదీ నదంబులకు దారసువర్ణ రుచుల్ఘటింపుచున్. 739

క. ఆలోన సుమతిఁ దైవక
రాలంబితమైన బ్రదుకునై మృగయా చౌ
ర్యాలుబ్ధ జీవు లంహః
పాలితులగు బోయలున్న పల్లియఁ జేరెన్. 740

ఆ. వారితోన మెసవు, వారితోన వేట
కేఁగి, మృగ సమూహ మెయిది చంపు
దారిగొట్టువాఁరు దానుఁగా,ఁ దనత్రోల
నిలిచి వెక్కిరించు నియతిఁ గనఁడు. 741

క. కచ వర్ణము పురుషమలు
మ్లుచ తనువర్ణంబు, దీర్ఘ లోలుపవీక్షా
రుచివర్ణము సరియగు గుఱు
కుచ యొక్కతెదక్కె, బోయ గూడెమునందున్. 742

సీ. అద్దానితోఁడ, నయ్యపశదుండొకరేయి
గూడెంబు విడిపోయి, క్రూరమృగవి
తానంబుఁదలఁగుచుఁ దరశాక్షియందిచ్చు
కఱకుట్లు మెసవుచు, కఠిన మిథున

కృత్యంబులను మదినేకట దనుపుచు
నాతుకచే నర్ధపీతమైన
మదిర గ్రోలుచు, దూరమార్గంబు గడచి, యొ
క్కటఁ బుళిందులతోడఁ గలిసి, యందు,

ఆ. గాపురంబు వెట్టెఁ గల్మషంబులకెల్లఁ
గేతువెత్తినట్లు గృపణుఁడగుచు
ప్రతిదినంబు, దారి, పాంథులఁ గొట్టుచు
నొడమి గొఱకకున్న నుసురుమెనుచు; 743

ఆ. పుట్టువగ్రకులము, పెట్టికొన్నదిపేరు
సుమతి, యజ్ఞదత్తసూనుఁడట! వి
వేకమునకుఁ దలఁగి వేయామడలువోయె
చెనటి దైవమెంత సేయలేదు! 744

మ. ఒకనాఁడొక్కఁడు వృద్ధు, భూమిసురుఁడయ్యుగ్రాధ్వ మందద్గువే
యక ముందే దనుఁ బల్కరించు జరయై, యాస్యంబు శ్రీవాసుదే
వ కథాస్యందిగఁ బోవుచుండె, విధికబ్రహ్మణ్యమున్ బెట్టు, చిం
తకు నే పల్లియయైనఁ గానఁబడదా! దబ్రోవ్వనం చెంచుచున్. 745

క. ఆలోన నడ్డె విప్రునిఁ
బాలసుఁడీ సుమతి, చేతిపాత్రను గుంజన్
కాలూనలేక ముదుసలి
తాళఫలంబట్లు భూమితలమునఁ బడియెన్. 746

ఆ. పీఁడు పాత్ర విడఁడు, విప్రుండు విడువఁడు
మిడుకుచుండ డొక్క బొడిచె వాఁడు
డొక్కలోన బ్రాణమెక్కడనున్నది!
పులుఁగులేని గూడు భూసురుండు; 747

సీ. ఖంజనపత్ర రుగ్గంజనంబులు కంఠ
దఘ్నమ్ములగుచు వస్త్రములు వెలుఁగ
కార్చిచ్చులంటిన క్రైవడి బ్రభుకే
శమ్ములు, తీక్ష్ణరూక్షములు గ్రాల
అచిరద్యుతులు నిల్కడైనట్లు, నిశితదం
ష్ట్రాకుంతములు చకచ్చకలు గురియ,
కందకన్నుల నుండి గారెడు కుటిల వీ
క్షణములు దిశల రక్తమ్ముఁ జిమ్మ

గీ. "బలము చిదికిన యమ్ముదివగ్గఁజంపు
టింతపాపమె!" యని దిశలేవడంక
క్షణములోననఁ దారూపుకట్టి నిలిచె
ప్రాణనిర్భేదకంబైన బ్రహ్మహత్య. 748

శా. దానిన్జూచిన యంత గుండెదిగులై, యా బ్రహ్మబంధుండు, న
య్యో! నాకెవ్వరు దిక్కటంచుఁబఱచెన్నున్మత్తుఁడైనట్లు, వీ
క్షానాట్యం బొనరించెఁ దొల్లిఁదనచే సమ్యక్కృతాఘంబు, లా
పీనంబుల్, పృథుసర్పపూత్కృతి విషావిర్భూతి నెగ్గింపుచున్. 749

ఉ. ఎయ్యెడఁబోదు! వెంటఁబడు నీ పెనుభూతము గ్రమ్మఱింప, నే
యయ్యగలండు! అంగదకు నన్నము, దప్పికి నీరు ముట్టరా
దయ్యె; కృతాంతభీషణ మహాట్టహసంబునుబోలె, నోర్వరా
దయ్యె రవంబు; విప్రహననాఽఘములంతటి చెట్టసేయునే! 750

ఆ. పొదరు దూరినంతఁ బొదలోన దూరును
పల్లమునకుఁ బోవఁ బల్లముననఁ
బాఱు, నిలిచినంతఁ బగబట్టి తానిల్చు
వాని వెంటనంటి, బ్రహ్మహత్య; 751

సీ. ఆకటఁ బ్రాణమ్ము లక్షిగోళమ్ములఁ
బడనున్న పండులవలెనె దోచె
మెడసాఁగి వదనమంగడికి నెత్తిన దివ్వె
యై, మిన్కు మిన్కు మంచలమటించె
కాలుసేతులు గాలిఁ గదలాడునట్టుల
వలె, బిట్టుగాఁ బెళపెళల నీనె;
కెందూళిబెరసి బ్రికిక్కిఱిసిన వెంబ్రుక
లెదిగిన గ్రచ్చుల పొదగఁదోచె.

ఆ. మఱచిపోయె, బోయమగువ నెప్పుడొవాఁడు
ప్రాణభీతి తఱచు బట్టికొనియె;
పఱచెఁ బఱచె వాఁడు పట్టినదే దిక్కు
గాఁగనెవఁడొ బ్రోచుగాక యనుచు. 752

ఆ. 'నేను!' 'నాది!' యనెడు నిత్యభావములందుఁ
దొలుత 'నేను!' పిదపఁదోచు 'నాది!'
'నేను' భావమునకు నెవ్వగల్గిన యప్డు
'నాది' పచ్చికుండ నాగ విరియు. 753

ఉ. ఆ సమయంబునందు, హరునంశములో జనమైనవాఁడు, దు
ర్వాసుఁడు దోచి, యోయి! పెనుపాపప్రోవ' భుజంగ శైల మ
భ్యాసము నందయున్నది తదాశ్రయు, డాహరి, భక్తహృత్పద
న్యాసుఁడు, తద్దయావిబుధనైచికి బిందని కోర్కెలున్న వే !. 754

గీ. స్వామి సరమునఁ దానమ్ము సలిపి, యచటి
మామనోహరుఁ గుఱిచి, నెమ్మనము దెఱిచి
వరపడుము, బ్రహ్మహత్య నిన్వదలి, యన్య
జన్మమైనట్లె, సౌఖ్యసంసర్గ మొదవు. 755

క. పొమ్మన్న, చెడినవిప్రుం
దమ్మోగమై పొతె, కతిపయాహంబుల, నె
త్తమ్ములఁదుమ్మెదలై, యని
శమ్మును మునులున్న స్వామి సరమునుఁ జేరెన్. 756

ఆ. అందుఁ దానమాడి, యాపన్నుఁడగుట, ని
చ్చలపు భక్తి, యెడఁద సంక్రమించి
కంఠరవము, బాష్పగద్గదికమ్ముగా,
స్వామిఁ గూర్చి, బిట్టు పలికె నిట్లు; 757

చ. ఎవఁడు ప్రచండవేగుఁడయి యీ సకలంబును నాక్రమించు నిం
దెవని పరాక్రంబునకు నెద్దియు నడ్డముగాన, మట్టిమృ
త్యువునకుఁ గూర్చుఁవాడు, యముఁడో సరిలున్ యదుదగ్రవీక్ష, స
చ్ఛవియగు వాసుదేవుఁడు, భృశంబుగ నాకరణంబు గావుతన్!. 758

క. ఈ జగము చిదాత్మకమై
యోజగఁ గనుపించు నెవని యున్నతి, జగతీ
బీజం, బాద్యప్రకృతియు
నై, జాగృతి నుండు దైవమరణము నాకున్. 759

సీ. ఏ పరమాత్మ యందీ సమస్తంబును
నణఁగెడు నరణియం దగ్ని భంగి
నెవఁడుపాదానంబు, నెవ్వఁడు గర్త, యె
వ్వఁడు దానీ లోకమై వరలుచుండు
కార్యకారణముల కల్పనంబులకు నె
వ్వనియునికి యప్రాప్య, మనఘు డెవఁడు
దనకుఁదానై జన్మమును బొందు, నిగమంబ
యెవ్వని గుర్తింప నేకమార్గ

ఆ. మట్టి యద్వితీయమైనట్టి వస్తువా
నందఘనము, భక్తిమందిరాంత
రంబునందుఁ గ్రీడనింబుగా నొనరించు
సగుణమూర్తి, నాకు శరణమగుత. 760

క. తనయందు జగములున్నను
దనయందడఁగినను, రెంటఁదగులక, సాక్షి
త్వనిరూఢుండయి బరగెడు
ననంత మహిముండు నాకు నాశ్రయ మగుతన్. 761

సీ. 'యశ్చక్షుషశ్చక్షు' రని యాత్మవిదులు బే
ర్కొనునట్టి సర్వాద్యరోచి యెవఁడొ!
ఆదిత్యవర్ణుఁడై, యంధకారమున క
వ్వలనుండు నేకరూటి వెలుఁగెవండొ!
భూతాత్మభూతులై, మునులెవ్వనికినై, న
లోక వ్రతంబు సల్పుదురొ! ముక్త
సంగులై, దన్ననిశ్చప్రపచంబుగఁ గొల్చు
జనములకును నిత్యసంగి యెవఁడొ!

ఆ. రూపహీనుఁడయ్యు, రూపంబుగొని, లోక
తంత్రములను నడపు దక్షుఁడెవఁడొ!
వాఁడు కరుణసేసి, వారించుగాఁత, నా
ప్రాణములను బిందు బ్రహ్మహత్య; 762

వ. జన్మ కర్మంబులు, నామరూపంబులు, గుణదోషంబులు లేకున్నను, లోకాప్యయ సంభవంబులకు నెవ్వండు స్వసంకల్పంబున వానిన్ గ్రహించి యనుకాలంబు వర్తించు నా స్వయంభువునకు నమస్కారంబు; పరేశున కేటికోట్లు; అనంతశక్తి కరూపున, కురురూపున, కాశ్చర్య కర్మనకు సాష్టాంగంబు; ప్రకాశాంతరాఽవిషయునకుఁ బ్రకాశకునకు సర్వనియంతకు "యతోవాచో నివర్తంతే, అప్రాప్య మనసా సహ"

యను శ్రుతి ప్రమాణంబునఁ జిత్తవృత్తులకు, మనస్సులకు, వాక్కులకు దూరతోఁగతుఁడైన వానికి వినయాంజలి; దేవా ! సత్యంబునఁ బ్రతిలభ్యుండవు, నైష్కర్మ్యగమ్యుండవు, నిర్వాణ సుఖ సంవిదుండవు, నీకు మన్మానసపూజ; హృషీకేశా! నన్నుద్ధరింపుము; పురుష్టుతా! నీకు నా ప్రార్థన! దివాకరునకు దీపార్పణంబు; అపీచ్యదర్శనా! భవన్మూర్తి నా కన్నుల వెన్నెలఁ జిలుకున్గాఁత; స్వామీ! బ్రహ్మహత్యాగోపీథఁబు సిద్ధించుగాఁత; 763

సీ. నీవ శాంతుండవు, నీవ ఘోరుండవు
గుణధర్మి, వెన్నంగ గూఢుడవును;
నిర్విశేషుండవు, నీవ సామ్యుండవు
జ్ఞానఘనుండ వీశ్వరుఁడవీవ
క్షేత్రజ్ఞుఁడవు నీవ, క్షేత్రంబు నీవ, స
ర్వాధ్యక్షుడవు నీవ, యాత్మమూర్తి!
మూలప్రకృతి నీవ, ముమ్మూర్తులకు మూల
మవు నీవ; దైత్యసంహరణ కరణ !

గీ. నీవ, సర్వేంద్రియమ్ముల నిలిచి, వాని
గుణములను గందు, వోంకార గురుగుహాశ
యుండవగు నీకు నతులు, వేధోండమూర్తి
భూత సమవర్తి ! సత్కృపా పూతకీర్తి! 764

క. సర్వప్రత్యయ హేతు, వ
ఖర్వజ్ఞానుండ, వఖిలగతివి, ఘనత్రివృ
న్మోర్వీశార్గివి ! నావగు
సర్వాఘములణచవయ్య ! సౌజన్యనిధీ! 765

చ. అని వినుతించి, శాశ్వతతులర్పణముంబొనరించి, వెన్కఁగ
న్గొనఁ దన బ్రహ్మహత్యగయికొన్నది, భస్మపురూపు, గన్నులం
దెససినవెన్నెలై, సుమతి, హీనగుణంబులు సల్లబెట్టి, పా
వనమగు వృత్తిమై నచట వాసమొనర్చి, తరించె జన్మమున్. 766

క. అని పల్కిన సూతుని గని
మునులు ప్రమోదమున జూటములు గదలిచి, యిం
కను, వాసుదేవమాహా
త్మ్య నిరూపణమందు బద్ధమతులై యున్నన్. 767

మ. అవితాఽశేషదిగీశ! యీశధనురంతాటోప! పాపాపహ
స్తవనీయాఽప్రతిమ ప్రభావ! భవకాంతా మానసానంద! చం
ద్రవికాసప్రతికర్మసుస్మిత బుతబ్రహ్మిష్ఠ వల్మీక భూ
శ్రవణ ప్రాహుణికీ కృతాఽమృత కథాసంరంభ! శుంభచ్ఛవీ!. 768

క. జనన మృతి రూప బాధా
వినివర్తన నామ ! వేదవిద్యాపార
ప్రణవపద! వల్లకీముని
మనస్తరణి ! రామచంద్ర ! మాయాతరణీ!. 769

మాలిని. పరమ పదవిహారా! భవ్యకారుణ్యపూరా!
విరతివనమయూరా! వేదవిద్యాప్రచారా!
గురుజఘనమృగాక్షీ కుంచితాపాంగదూర
స్ఫురదనుపమరూపా ! సూర్యవంశ ప్రదీపా ! 770

ఇది శ్రీ పరమ భాగవత పాదరజః పుంజ విమలీకృత మనోదర్పణ, పితృభూతశ్రీనివాస హృదయతర్పణ, లక్ష్మీదేవీగర్భశుక్తి ముక్తాఫల, నిరంతర నిరంతరా యాష్టాక్షరీ మంత్ర మనన స్నాతగంగాజల, భక్తి రసైకజీవన, శఠమర్షణ గోత్రపావన, నారాయణదాస ప్రణీతంబైన శ్రీనివాస ప్రబంధంబునం బ్రథమాశ్వాసము సంపూర్ణము.

శ్రీనివాసప్రబంధము

ద్వితీయాశ్వాసము

క. శ్రీకరనామ! పవిత్రా ఽ
నాకులజన భావ్య! దినకరాఽన్వయపుణ్య
శ్లోకాయిత చారిత్ర ! ద
యాఽఽకల్పా! ధర్మవర్మితాచారమతీ; 1

వ. మహనీయ సత్రయాగ సమావిష్టులగు నమ్మునిశ్రేష్ఠులకు, నిఖిల పురాణ
వ్యాఖ్యాన విచక్షణ వంశకరీరుండగు సూతుండిట్లనియె; 2

మ. అమితౌద్ధత్యముతోడ, దేవతల నూటాడించి, యజ్ఞాశు ని
క్కముగాఁ జంపెద నంచుఁద్రుళ్లు నసురున్ ఖండించి, ప్రహ్లాదు ను
త్తమభక్తున్, దయసేయు కార్యమునకై దైత్యారి, మున్, సామిసిం
హముగాఁబుట్టినదాన, నీగిరి, తదాఖ్యావాచ్యతన్ గైకొనెన్. 3

సీ. మిగుల కన్వీక్షించి, దిగులొందఁగారాదు
భవ్యకారుణ్య సంవర్షణంబు
సామిసింహంబంచు సంభ్రమింపఁగరాదు
వినత ప్రపన్న సంవిత్ప్రదంబు;
అట్టహాసంబుల కావటిల్లఁగరాదు
కలిల హృద్వాంభాంబు కతకఫలము
దంష్ట్రోగ్రమంచుఁ దద్దయుఁ దొలఁగగరాదు
వరదైకహస్త శోభాయుతమ్ము 4

క. కనకకశిపు భుజాబలంబునకె గాదు
పాపవీర్య శతార మెవ్వానినఖము
శ్రీ నృసింహుని పాదనీరేజములకు;
మన్నమస్కృతి నిగమసమ్మాన్యములకు;

మ. హరి, కూటక్షితిదార, మగ్రజుని జన్యక్షోణిఁ బోకార్చి, యు
ద్ధురుఁడై పోయినవార్త, కర్ణయుగళీ తోదంబుగా సోకినన్
హరిదర్పోపముఁడా హిరణ్యకశిపుం డక్షి స్రవత్కోష్ణబా
ష్పరుషా దూషితుఁ డిద్ధదావదహన ప్రఖ్యస్ఫురన్మూర్తియై. ౫

సీ. పుత్ర నిర్వారణంబు, గాత్రశోషకమైన
జనని వేదాంత బోధనలఁదేర్చి
యాసన్న సత్వ, కయాధువు నిజభార్య
హారివచో భంగి నూఱడించి
శకుని శంబర ముఖ్యులకు, నన్నసుతులకు;
జనక వాత్సల్యంబు సంతరించి
నముచి పులోమాది సమయజ్ఞులగు సుహృ
త్తులకు, రాచరికము దెలియఁబలికి

గీ. ప్రత్నరత్న విభావళీ పణ్యవీథి
కాయితాభ్రమ్ము, హర్ష సంక్రాంత జనము
తనదు, రత్నవతీ రాజధాని విడచి
కనకకశిపుండు గంధమాదనముఁ జేరె; ౬

సీ. కందర్పశింజినీకాంత టంకార ఝం
కార బంభరమల్ల గహన గహన
ములు దాటి, కమన నిస్తుల నేత్రచషక పీ
తాఽపీత రతి కర్శితాంగ సిద్ధ
కామినీ వికసిత కందరమ్ములు దాటి,
గంధర్వగాయనీ ఖరనఖాగ్ర
ముఖరిత వల్లకీ ముగ్ధ రాణాఽమృత
ద్రావితఘన శిలాతతులుదాటి

గీ. దృప్త శబరీధనూరోప దీర్ఘదంతి
దంత నిర్గతముక్తావితాన శార్క
రిలములగు తలములఁ దాటి, నళినవన వి
కాస మాసర కాసార గణము దాటి; 7

మ. కలపుంస్కోకిల కంఠ నిర్గత కుహూకారంబు, తారంబుగాఁ
దలఁపుల్ద్రివ్వెడుచోట, బర్హిణకుల ద్రాఘిష్ఠకేకారవ
మ్ములు బాధమ్మగుచోట, చక్రచయమున్మోదించ క్రీడించుచో
ట, తితిక్షాపృథు దీర్ఘశోనసగళాఢౌకత్కృతాంతమ్మునన్ 8

క. ఒక్క వటద్రుచ్ఛాయ, మనో
న్యక్కృత విషయేతరుండు. నళినోద్భవ ప
చ్చిక్కణనిహిత హృదంతరుఁ
డక్కర్బురరాజు, ఱాఖయై గూర్చుండెన్. 9

సీ. యమరాజునకుఁ జీ ఱలారవేసిన చాకి
రేవులయ్యెను దిశావృతిగణమ్ము;
నిర్వారికాసార నిష్కుటంబుల నాళ
పాదాగ్రములనిల్చెఁ బద్మచయము
ప్రబలవేణికలింకఁ బ్రాచి పేరినచోటఁ
బొగరాజె, చాపట్టువోసినట్లు;
ప్రళయరుద్రుని గాత్ర భస్మధూళులు వోలె
శాల్మలీతూల సంచయము లెగసె

గీ. మండలీకృత చండమార్తాండ చాప
కరకలంబుండు, మృగతృష్ణికానికాయ
వాగురల నొడ్డి, వేటకై వసులఁబెరిగె
జంతు సంత్రాసక నిదాఘ శబరరాజు; 10

గీ. అట్టివెట్టులఁ దపియించె నసురమౌళి
నలువలంకులఁ జటులవహ్నులను నిలిపి
యర్కుపై, నిర్నిమేషదృగంచలములు
గిలుకొలిపి, యోగాగ్నులు మేలుకొలిపి. 11

సీ. దురుసు నాల్కలుసాఁచి, యెఱమంటలంటినఁ
గమలు గాత్రంబుపైఁ గన్నులిడఁడు
సుడిసిన, సురగాలి మిడుగుఱుల్పొదివినఁ
గదురు బొబ్బలఁ దాల్మి ప్రిదులనీడు
వింత చీకటులట్టి వితతధూమ్యల వేడి
గ్రమ్మినఁ గాసంత రాలుపడఁడు
కట్టడియుల్కల కరణి పెన్గొఱవులు
పైఁబడ్డ నల్పంబు భ్రమసిపడఁడు
గీ. విడచి వచ్చియున్న పడఁతితోనన, యాత్మ
నంటియున్న మోహమవలఁద్రోచి
దివిసుతుండు, తపముదెప్పర మిట్టిదే!
యెన్నఁడైన ననఁగ ఋభుగణంబు; 12

శా. ఆకాశంబు నదించె, భీషణ తమోహంకార హుంకారమై
పాకోన్నిద్రిత హేమపుష్పకలికా ప్రత్యర్థి విద్యుల్లతా
నీకంబుల్ పసరించె వడ్గురిసెన్ నీలాభ్రజాలంబు, ని
ర్భీక ప్రజ్ఞములయ్యె దిక్క్రతులు, ప్రావృట్కాల మేతెంచినన్. 18

సీ. గ్రీష్మప్రదగ్ధ శరీరమ్ము, తొలివాన
బొడసూప, 'చుయ్య'ని పొగలు రేపి,
కాలు దంష్ట్రి సమస్కంధ శంపాకళ
ల్మనుకొని పలుమాఱు మొగముఁదన్ని

మృత్యుహాళాహాళి మేంద్రించు రసితంబు
తత సమాధికి ధర్మదారవట్టి,
యాదితేయులు వైరులై, పోయు పిశితంబు
భంగి, లోవేంద్రగోపములు దొరలి

గీ. తన తపోజన్యమునకుఁ దద్దయును, భంగ
పాటు నొందింపఁదలఁచినఁ బలుకలేదు,
నులుకలేదు రక్షోషౌళి, "యూర్జితంబు
నిష్ఠయన నిట్టిదే!" యన నిఖిలసురలు; 14

మ. వనదేవీ ధవళావకుంఠనములై వ్రట్లిల్లె నీహార వ
ర్షణముల్, రేలు గృశించె, నుష్ణతలు యోషా కంచుకాభూషణ
స్తన సాహ్యంబు వరించె, శీతనగ శశ్వద్వాయువుల్వీచె, నె
మ్మనముల్ రంజిలెఁ గ్రొత్త గేస్తులకు హేమంతమ్ము దోతెంచినన్. 15

సీ. కలిత తుషారపేశల పద్మములు, రుద
ద్వామాముఖాబ్జ బింబముల దొరసి
బిసకిసలయ ఖాది విస్రమర హంసీ క
షాయోక్తి మణిత సంచయము దొరసి
వలిపంపుఁ బొగమబ్బు, హాసనా హసనికా
ప్లవమాన ధూమ్య వల్లరుల దొరసి
సారస సార కాసార సారసరుచుల్
పువుబోండ్ల యనునయమ్ములను దొరసి

గీ. తపమునకుఁ బ్రతిపాక సంతతుల నీన
నొక మహానది త్రోపుడు లొరసి కొనిన
లవము, చలనమ్ము లేని శైలమ్మువోలె
నిలిచె నమరారి మౌనులాకులతఁ జెంద, 16

చ. మనసిజ దివ్య డిండిమము మాధుకరమ్ము రవమ్ము సాగె, చి
క్కని వలిగాడ్పు, కామినుల కన్నుల కబ్రపు బాసనేర్పె, కో
యని ప్రకటించెఁ బైకము లనంగుని యానలు, లోకమెల్లఁ జ
క్కని వలరాజుచేతి చషకంబుగ మారె, వసంత మందునన్. 17

సీ. మత్తలీఢాఽక్రీడ, మధుమధు వ్రతముతో
హాల కమ్ర 'సారంగ' మొలుకఁ బోసి
యాసవా కేకరాక్షీ సమ్యగుపదిష్ట
లాలితవీణ 'హిందోళ' మెనసి,
రత్న సోపాన విభ్రమ దప్సరోహంస
కమ్ములు, నవ 'వసంతమ్ము' జూపి
సాయాహ్న విశ్రాంత సారవ సారస
మ్ములు 'నాటఁ' పోహణింపులు వెలార్చి

గీ. ప్రాతరాయాత మాతరిశ్వములు, తమదు
మర్మరధ్వని 'దేశాక్షి' మలఁచి మలఁచి
శబ్దమయ మొనర్చిననుఁ దచ్ఛబ్దమందె
బ్రహ్మ భావించె రాక్షస రాజమౌళి. 18

వ. ఇత్తెఱంగున, నాలీఢపాద కందర్ప శరాస శరాసార మాసరాఽవష్టం
భంబులగు హిమారంభంబులును, కామినీ కుచ లికుచ రచిత కాశ్మీరజ
కంచుకంబులగు శిశిరంబులును, రసాల కిసాల కషాయ కలకంఠకామి
న్యుంభిత పంచమస్వర పరవశ దిగంతంబులగు వసంతంబులును, పరి
ఫుల్ల పాటలీరజఃపటల భరాఽలస మరుదంకురంబులగు నిదాఘంబు
లును, ఘనఘనాఘన గర్జాసమున్మేష సంపాదిత వామా స్వయంగ్రాహ
సౌఖ్యంబులగు జలధరాఽనేహంబులును, చంద్ర చంద్రికా వికసితంబు
లగు శారద సమయంబులును గడచి, హిరణ్యకశిపుండు, కామాదికలి
లుండు బ్రహ్మజ్ఞానంబునకుఁ బలె, బాహ్యస్మృతికి నేరకయున్న
సమయంబున. 19

ఉ. పోఁడిగ నా హిరణ్యకశిపుండటు వట్టిన నిష్ఠతోన, న
ల్లాడె దిగంతముల్, దివము నందున మంటలు రేఁగె, చుక్కలున్
గోడివడెన్, దివాకరుఁడు గుండిలె, నిందుఁడతంద్రుఁడయ్యె, మై
గాడిన యట్టులయ్యె శరకాండము, భీతవహేంద్రు పాలికిన్. 20

గీ. ఓసి! యోసీ! తిలోత్తమా! యోసి! రంభ!
యోసి! యూర్వశీ! యనుచు బట్టుఁజికె వారి
యిండ్లకై, శంభశికలతో నింతజెప్పి
పంపఁడో కాక, మతిచెడి పాకవైరి. 21

సీ. ఊర్వశీ! రావె! నీ యుదుటు గుబ్బలయాన
జేరినదే, యోసి! నిల్కడయె మదికి
పారిప్లన కటాక్షపక్ష్మలాక్షీ! యేడు
గడ, నీవెగదె; యలజడుల నాకు;
స్వర్వధూపత్రపాశ్యా! భవజ్జయగోపు
రంబెత్త వలెనె; చిత్రముల రంభ;
దాగెదేటికె తిలోత్తమ! యల్లయోంకార
మనవె; యోమదనఁద్యానిషద్య;
గీ. యూభిదురమేమొ! మొక్కవోయినది నేఁడు:
పట్టపేనుఁగు మొగదప్పి పండె నేఁడు
నీ ద్వయము దప్పినప్పుడీ యింద్రపదవి
నెయిదికొనఁగఁ గరాచూరు లీరె గదరె! 22

క. పట్టిన వాఁడే; దపములు
గట్టిడియగు నాహరణ్యకశిపుఁడు, వానిన్
దొట్టినవిజయము మన సిరి
యొట్టిడినట్లాయు ముందె యోచింపవలెన్. 23

ఉ. పొందుమనోజసాహ్యముగ, పుణ్యఫలంబుజయంబు వట్టి వే
రందు, సహస్ర నేత్రములు, ప్రసన్నవిచ్చి సమీక్షజేసెదన్
ఖండిత ధైర్యుడై, యసురకాంతుడు మీవలబద్ధనాడు పె
న్పడుగ నాకమంద, మన భావిశుభంబు గ్రొత్త జూచునే! 24

ఉ. పూతపసింది వంటి వలపుల్పచరించి, మనోజ్ఞ వల్లకీ
వ్రాత గళన్మరందముల వాని తలంపులు నింపి, కోష్ఠలో
కాలిగ చుంబనోత్సవ నిరస్తహృదంతరుజేసి, సన్మనో
భీతిదమాతపమ్ము నుడిపింపుడు, నింపుడు మాకు వేడుకల్. 25

ఉ. సంతనకట్టి వచ్చును వసంతుడు, కంతుడు, మండలీకృతో
ద్వాంత శరద్రుమంబుడు, బహుధా మిము గాచును, నూత్నయౌవనా
క్రాంతవనీ విటంక విసరప్రసరన్మద కోకిలారవా
చాంతములాశలున్నవి, విచారమికేల; జయంబుమీకగున్. 26

క. అని పలికి పనుప, నచ్చర
లనుపమ సాహస సహాయలై వచ్చిరి, హె
చ్చిన మంటవోలె, నాశర
మణి తపమున నున్న గంధమాదనమునకున్. 27

సీ. జంగమ స్థల పద్మసంభ్రాంతమొదవ, లా
క్షాసిక్త పదములు వేసివేసి
ప్రాణమబ్బిన రత్న పాంచాలికలు వోలె
తెలివిపోకల నల్ల దిరిగి తిరిగి
యెలుకలేచిన తెల్ల విరిదమ్ములను బోలె
నిండు చూపుల దిశల్నింపి నింపి
మదహస్తి శృంఖల విదలించినట్లుగా
ఫలయసంకుల ఘలంఘలలు రేపి;

గీ. అమర సంభుక్త గుప్తమౌ నమృతరసము
జార్చినటు వల్లకుల గానమార్చియార్చి
యచ్చరలు, గువ్వగోలుగా నా ప్రదేశ
మందుఁ గ్రీడించి, రతను దివ్యాశుగములు. 28

సీ. ఒకతె, దా నటియించె. చకచకద్దోర్మూల
లీలాఽనుబంధి హల్లీసకమ్ము;
ఒకతె, విచ్చినతమ్మికౌఱగోసి చూపించె
నిక్కయొయ్యారంబు ప్రెక్కణమ్ము;
ఒకతె; నట్టువలాడె, మకరధ్వజునిమావు,
సవరించి వైష్ణవ స్థానకమ్ము
ఒకతె, భ్రూభంగ సంయోజితతానయై
నెఱపె, దేసిగ, దేశినృత్య ఫణితి

గీ. ఒక్క సరసీజముఖి, పాడెనొడ్డగిలఁగ
మధుమధూక మధూళి, సమ్మదపుఫణితి
నొక్క పుంవత్ప్రగల్భ రసోద్ధురముగఁ
బలికెఁ గొనగోలు, యౌవనోజ్జ్వలరతాంగి; 29

సీ. అరవిందమును బూన్చి, యది నగుబాటైన
క్రేగంటితోనఁ గింకిరిగఁ జూచి
వంజుళం బెక్కడి, వసివాళ్లు గుడిచిన
ప్రిదిలినదని, చప్పరించి తెలిసి
పరిణత చూతమ్ము బరగించి, నడుమన
పలపలనైన వెల్వెలుకఁ బాటి
కల్హారమరివోసి, కానివావిగ నెంచి,
పౌడియూర్పు మర్మరంబులు వెలార్చి 30

గీ. చారుసప్తలా బాణంబు సంఘటించి
యదియు వితథమైన గుండె ధైర్యము దలంగి
నడునడున దుంకి, పెదవులు దడిపికొంచు
నచ్చరల వెఱవెన్క నట్టాడె మరుఁడు;

ఉ. సారమసారలోచనలు, జంగమ యౌవనగర్వముల్, మనా
గారచితస్మితల్, మదికి నబ్రపువేడ్కలు, చాతురీతురీ
ధారణనెన్నిఁ జేసినను, దైత్యుఁడు సంద్రపుఁజోడుకోడె గం
డారపు బొమ్మవోలె, నొకటన్గదలండు సమాధినిష్ఠుఁడై. 81

ఉ. వాలిక కన్నుదమ్ములను బర్తిద్విన సిగ్గులు బుగ్గలై, కడు
న్వ్రేలమియైన లేఁజెమట బొట్టుల వక్త్రములౌచు, వస్త్ర పాం
చాలికలట్లు నిల్చిరవశల్, సురనాథుని మ్రోల నచ్చరల్
హాళి దొడంగి, నెమ్మొగము లడ్డముగానిడి దోయిలింపుచున్. 82

గీ. చారుపుండ్రేక్షు ధనువున నారిదిగిచి
యొల్లఁబోయిన కళుకులై యుల్లమందు
పొలఁతిమున్నిడికొని నిల్చెఁ బుష్పధన్వి
యార్తి నిర్వాణదీప గృహమ్మువోలె. 83

క. ఏ దెసఁ జూచె మహేంద్రుం
డా దెస మఱుగౌచు, తావులందు నతగుఁడై
పేదవడిన కన్నులతో
నాదఁ దఱిసి, యవ్వసంతుఁ డల్లలనాడెన్. 84

ఉ. వారలఁ జూచి, యోటమి ధ్రువంబయి యింద్రుఁడు వేయిగన్నులన్
జేరిన యెఱ్ఱలై, మనసు చిందిలి డిగ్గనలేచె, వేత్ర శృం
గారవతీమనోజ్ఞ కరకంకణ నిస్తుల ఝుంకృతిధ్వనుల్
పోరచియయ్యెఁ, ఱేఁడుపఱువుల్గొనె నంతిపురమ్ము పాలికిన్. 85

ఉ. మోసల నిల్చి, మోడ్పుకరముల్ఘటియించిన, భ్రూలతా సము
ల్లాసము లేదు, సస్మితవిలాసము లేదు, వనీతలాంఘ్రి వి
న్యాసము లేదు, గాంగపులినాదృతి లేదు, హృదంతరం బనా
శ్వాసిత దుఃఖితంబు, సురవారవధూవరరాజమౌళికిన్. 36

ఉ. ఆ విధమెల్లఁ జారులు నయంబున వేఁజని విన్నవించినన్
దేవపురోధ, గీష్పతి, విధిజ్ఞుఁడు, వార్తలువుచ్చివచ్చినన్
వావిరి, నింద్రుఁ డమ్మొదలి వాకిటికే యెదురేగి, రత్నరు
క్ఛవితతంబు, మస్తక కిరీటము వంచి నమస్కరింపుచున్. 37

గీ. అర్ఘ్యపాద్యాది పూజలర్హముగఁ దీర్చి
విష్టరశ్రేష్ఠమున నుపవిష్టుఁ జేసి
వామనేత్రాకరాంచలా వర్జ్యమాన
చామరము, హస్తమునయందు సంతరించి. 38

క. వీచుచు, హిరణ్యకశిపుని
యేచిన తపమెల్లఁ దెలిపి, యింద్రుండు గపో
లాచిత బాష్పుండై, వీ
రోచిత వర్తనము దలఁగి యుస్సురమనియెన్. 39

చ. అనుటయు, మోముదమ్మి దరహాస మనోజ్ఞముగాఁగ, నంగిర
స్తనయుఁడు వల్కె, నేమి బలశాసన యింతగ డీలువోయె, దే
చిన బలుగాలికిన్నగము శీర్షము వంచునగాని వ్యోమమం
దన శిఖరాయతంబు తుహినక్షితిభృత్తు శిరంబు వంచునే. 40

సీ. నీవు మా యందటి నిక్కంపుగర్వ, మి
ట్లైనచో నింక నేమనఁగఁ గలదు;
శచి విలోకింపుము, సంధ్యా శశాంకరే
ఖాసదృక్షాంగియై, గన్నుఁగవల

నుసురువట్టిన యది, యసురుసురై జయిం
తుని వదనమ్ము, పీడ్వాణిన నవ్వు
లై, చూపఱకు మనము గలంచుచున్నది
పెన్నిధానమ్ముగా నిన్నుఁ గన్న

గీ. యదితి, నిశ్వాస ధూమావృతాంగి యగుచు
ననదయై వేగుచుండె, పర్యంకశరణ
తగదు సురరాజ; నీ నెమ్మి తమ్ము గుజ్జి
యయ్యుపేంద్రుండు, పవి, శుపదాయుధమ్ము; 41

ఉ. ఏవిభుఁ గాననేరరు మునీంద్రులు, నైక తపోవిధాన శు
ష్కాఉవయవుల్, విగర్హిత మహంకరణంబడగింప లేనిచో
నా విభుఁ డప్రమేయుఁడు, ననన్య శరణ్య మనస్సరఃప్రియం
భావుకమూర్తి, నీకగుత పట్టు, మహాపద నుద్ధరింపఁగన్; 42

క. అని, యష్టాక్షరమై, తను
మనమున జపియించువారి మాలిన్యము, పె
ల్చన నడచి, సర్వశుభముల
కొనరిన నారాయణమ్ము నుపదేశించెన్. 43

ఆ. దిటవు సెడకుమోయి; దివిజేంద్ర; సకలదై
వతశిరోధియైన వాసుదేవు
కరుణ గలదు నీకుఁ గడకు జయమ్ము నీ
దే; యటంచు నిర్ణయించె గురుఁడు; 44

క. ఆ మనువిడి, యతఁడరిగిన
సేమము గలదన్న వార్త చెవులకు విందై
శ్యామాకోమల గండత
లామృష్టాధరుఁడు మఘవుఁ డచ్చదయించెన్. 45

మ. గతియించెన్ దినముల్మహేంద్రునకు గంగాశీకరాసార వ
ర్ధిత చంచల్లవలీ నికుంజ తరుశ్రీ ప్రేమప్రబంధమ్ములన్
శ్రుతిసంతర్పణ వల్లకీక్వణన సందోహాఽవరోధంబులన్
నతికృన్నాకవధూ రసాభినయ పానస్విన్న యామంబులన్. 46

శా. నిత్యానంద పరీమళ స్నపితహృన్నీరేజుఁడై నట్టి, యా
దిత్యస్వామికి గుండె గుబ్బురన, వీ తెంచెన్ శ్రవశ్శల్యమై
దైత్యాధీశ్వరు భార్యయయ్యె నట నంతర్వత్ని యన్వార్త, త
త్రత్యస్వామరచార సంచయ నితాంత ప్రాంశుయత్నంబులన్. 47

సీ. ఆ వార్త విన్న నాకాధీశుఁడీగర్భ
మున వాఁడికెంత నేపున కెదుగునో!
బలియుఁడై యెంతగాఁ గలఁచునో; లోకమ్ము
లాదిలోననఁ దెగటార్పవలయు
నని నిశ్చయించి, యయ్యసుర తపంబును
దన కర్జమునకు లగ్గని దలంచి
ప్రబల మాయాజాల పరిణతాత్ముఁడు, పురు
హూతుండు, నవ్వరారోహ, యొకట

గీ. నేకతంబ వనంబున హృదయనాథు
గుఱిచి యోచించుచున్నఁ జెచ్చెఱఁ గడంగి
బందిగాఁ బట్టికొనియె సంక్రందనుండు
మచ్చరంబున లఘు విక్రమంబు నెఱపి; 48

సీ. సరసిజ లలితలోచన బాష్పములఁజేసి
యురమునుఁ బూరించుచున్నదాని
గర్భభారమున వేగమ్ము గమింపఁగా
మోపక, సారెనిట్టూర్చు దాని

దన కందునకుఁ జెట్ట దలపోయఁడే; పురం
దరుఁడంచు నెవ్వగ బొరయు దాని
పరమ పాతివ్రత్య సరణి కీ చెద్దయంబు
దొరయించెనని విధి దూఱుదాని

గీ. నీడ్చికొనిపోవుచుండె నాకేశ్వరుండు
ఋషి సమీకృత మఖవిధి కృతము లాహు
తులను గొనిపోవు దనుజుల తులువతనము
చక్షువులఁ గట్టి దుష్టవచస్కుఁడగుచు; 49

ఆ. అతుల నేగుచున్న యమరేంద్రునకు, దారి
నెదురు వచ్చె, లోకహితకరుండు
పరమపురుష చరణపద్మ సద్మాయిత
ధీరమానసుఁడు, నారదుండు; 50

క. తనకు వలగొన్న స్వఃకాం
తునితో నారదుఁడు పల్కె, దురుసులు సేయన్
జనుదెంతె యిట్లు సంక్రం
దన! నాకౌకంబు, సిరియు, దలఁగుట గాదే ! 51

వ. అని యెచ్చరించి, యేకాంతంబున నిట్లనియె; 52

సీ. దేవేంద్ర ! మఱియొక దేవరహస్యంబు
వినిపింతు వినుము, సద్వినుతుఁడైన
శంకుకర్ణుం డనాతంకనిష్ఠాగరి
ష్ఠుఁడు, నిత్యహరిభక్తి శోభితుండు
ధాతృ సన్నిధిని వేదమ్ములు నేర్చి యె
వ్వరికంటె ప్రోడ, సుపర్వమౌళి
హరియాన మోచి, యీ తరుణి గర్భంబున
నవతరింపంగఁ దా నదనుగాచి 53

ఆ. యున్నవాఁడు, వాఁడనుత్తముండా భవ్యు
కరుణఁజేసి, నీకుఁగలదు భద్ర
మరుగు దీని విడచి, యబ్జాక్షి, నా యాశ్ర
మమున నుండు గాఁత, మాన్యవృత్తి;

క. అని యెఱిఁగించిన, నారద
మునివచనము లాలకించి, పురుహూతుండ
వ్వనితకు వలగొని చనియెన్
మణి కవచిత చక్ర చంక్రమణ రథికుఁడై; 54

వ. ఆ దేవర్షియు నప్పరమ పతివ్రత నిజోటజంబు జేర్చి, హితవచనంబుల నోదార్చి, తోడి జరఠ మునివధువులకుఁ గలరూపు సెప్పి, సాదరంబున నభిరక్షించుచు, ననుదినంబుఁ బరమ వైష్ణవ ధర్మంబులుపదేశించు న్నంత. 55

చ. తరుణియు గర్భభారమునఁ దా నిదురించెడువేళ, దద్వధూ
దర పరివర్ధమానుఁడగు దారకుడూకొను మాటిమాటికిన్
హరియ గడుస్గడున్నధికుఁడందరకంటె, తదీయపద్ద్వయీ
పరిచరణంబె, జీవభవబంధ నిషూదనమన్న సత్యమున్. 56

మ. ప్రసవించెన్ దరళాక్షి, బాలకుని,ఁదత్పూర్వంబునన్పుణ్యగం
ధ సమున్మేషము రూపమై, లలిజగత్ప్రాణుండు వీచెన్, శుభ
ప్రసవంబుల్, మునిహృన్నికుంజముల నారన్ విచ్చెఁ సాధుత్రయీ
విసరంబుల్, సురలోక మార్గముల గప్పెన్ హర్షధారాభ్రముల్. 57

మ. అమరన్ బిల్చెను ధాతృసంభవుఁడు బ్రహ్లోదా ! యటంచంత, నా
శ్రమవృక్షమ్ములు మౌనిభాషిత మనూచ్చారంబు గావించె, స
ర్వ మృగంబుల్ దమమోర లెత్తి లలిత ప్రస్యంది హర్షాంబునే
త్రములై చూచె, సమస్త నిమ్నగల గాత్రంబుల్ ప్రపుల్లింపఁగన్. 58

సీ. చలితాలకుఁడు మౌనిజనములఁ జేరి, శ్రీ
హరి వచ్చుమార్గంబు లరసి తెలియు
నర్ధాక్షరోచ్చారణా మృత స్రోతంబు
కరములు దట్టి శ్రీకాంతుఁబాడు
హృత్పుండరీకంబు నెలయించి, శ్రీపాద
ములయందు నిధ్యానములవరించు
శ్రీవిగ్రహమ్ము నర్చింపంగఁ బన్నునై
తనుపారు పుష్ప సంతతులు గూర్చు

ఆ. నఖిల వస్తువులయు, నఖిల శబ్దములయు
నంతరమున శ్రీశుఁ డంచుఁ బలుకు
"నలఘుసూనుఁ గంటినంచుఁ" గయాధువుఁ
బరమమౌను లెల్లఁ బ్రస్తుతింప. 59

మ. చలమున్ బూని తపంబొనర్చుఁ సురరాజస్పర్ధిహవ్యాశికీ
లలు, దిఙ్మండల మాక్రమించి, దివిషల్లజ్జావతీ గండ మం
డల రాగమ్ములు గందిపోఁజమరి పైనన్ సత్యలోకంపు మే
రలు సుట్టెన్ భయదంబుగా, సిమసిమారావంబు గ్రందాడఁగన్. 60

సీ. విదలించి వేసిన వెస హస్త పద్మావ
లగ్నుఁడై, మర్మరాలాపమాడు
ప్రసభాఽభి హతిఁబోక వస్త్రాంచలంబంటి
విష్వగా ప్తికిఁ చిఱుపీకులాడు
కచబర్హ భారసంగ్రహణేచ్ఛువై, దూర
దూరంబులోన, వెన్దొరసితారు;
నిపుణ కటాక్ష సన్నిధి వంచితుండయ్యుఁ
జరణ నీరేజ సంస్పర్శకలయుఁ

గీ. గుచకలశ దిగ్ధ గాఢోపగూహనమ్ము
వలచి, యవధూతుఁడగు దైత్యకుల శిరోధి
ప్రచలిత తపోఁగ్ని, యార్ద్రాపరాధుఁడైన
యభికువలె, సత్యలోక లోలాక్షు లందు. 61

సీ. నళిన నాళాకాంక్షఁ దలఁగి సాహిణ వార్వ
ములు, హళాహళి, క్రేంకృతుల నొనర్చె
సర్వ శుక్లాంగ భాషా భామినీ గంద
ముకుదముల్బంధుజీవకము లయ్యె
స్వాధ్యాయనిష్ఠ వాచంయమిశ్రేష్ఠతుం
గ జటాకుటులఁ బొగ్గలాయుకొనియె
స్వాఽఽపచమ్మై నట్టి యబ్జమ్ము శిథిలప
త్రాఽగ్రమైఁ దానిల్వననుచుఁ దెలిపె

గీ. కంఠశృంగాటకాకుంఠ కాహళీస
పాకమోంకార ఘంట, నిస్వనము నిలిపి
కన్నడించిన లోకసంక్షయమటంచు
ముదుక వేలుపు. దానవు మ్రోలనిలిచె.

శా. ఏమన్నా ! యిటు కక్ష గట్టితివి, మున్నేకాల, మెవ్వారునున్
నేమంబుౝ తవణింపఁ జాలరిటుఁ దంౘ్రీ; కోరుకొమ్మోయి; నీ
కామంబుల్, దనివోవ వ్రేళ్ల కొలుచున్గానిత్తు, సద్వాసనా
స్తేమంబూనుచు నిల్వవయ్య; జగతీక్షేమాఽనుసంధాయివై; 63

ఉ. ఎందరొ; యెన్ని నిష్ఠలొ వహించి, పరాక్రమ దుర్విదగ్ధులై
ప్రందికి, కాలమందు విను; మాల్యవదాదులు, వారితోఁపలన్
జెందక, సత్వశుద్ధి వికసింపఁగ, నిర్జరకోటిఁగూడి పే
రొందుము, రెండు వంశముల కుమ్మలికంబు దొలంగునట్లుగన్. 64

వ. అని పలికి, వామలూరు వంశ పటలచ్ఛన్నంబును, వనమక్షికా పిపీలి కాది నిర్దయ దంశదంశితంబు నైన రక్షోవిభుని కాయంబున యందు గమండలు జలంబులు ప్రోక్షించిన, జలజాసన కరకుశేశయ మణీమయ కమండలు నిర్గత వారిధారా ప్రపూతసకలాంగుఁడయి, తపమ్ము గుంద లించి. పాతాళబిలమ్ములోని వల్మీకమ్ము వెలువడి, పవిసంకాశదేహుండును, పరిలసత్తారుణ్య సౌందర్య పరిపణాయిత శరీరుండును, జలజ కేసరవర్ణ సవర్ణవర్ణుండును నై, యొక మహాగ్నియుంబోలె వెలుఁగుచు న్జనుదెంచి. 65

గీ. మేఘనుండలిఁ బదివేల మెఱపులొక్క
గట్టియైనట్టులున్న వాక్కమనుఁ జూచి
భక్తివలగొంచు నేత్రపర్యాకులితంబు
నక్షిసలిలంబు వఱ్ఱుగా నంజలించి. 66

క. కోరిన వారల కోర్కె ల
వారిగ వర్షించు దానపారమ్య! మనో
వారణధోరణి యంత్రా
ధోరణనిధ్యాన సంగ దోహల చరణా; 67

సీ. శ్రుతికిఁజిక్కని నిన్ను నుతియింప నేర్తుమే;
గడలేని సాహసిక్యంబు గాక;
సకల చేతనుల హృత్స్థల వాసివగు నీకుఁ
జిత్తవృత్తిని వేఱ చెప్పవలెనె!
భూతపంచకములఁ బూర్వాది దిక్కుల
దిన యామినులఁ దమోదీప్తులందు
సర్వాశ్రమముల, సర్వజంతు సంతతులచే
మరణంబులేనట్టి మనికినొసఁగి

గీ. మనుపుమో దేవ! త్రిజగతీమాన్య జయము
నగరిమోసల నొక కంచుకిగ నొనర్చి
కకుబధీశులు, మత్కాళాచిక వహించి
ప్రశ్రయాధీనులై వెంట వచ్చునట్లు; 68

క. 'కానిమ్మ'ను నొక పలుకై
వాణీవల్లభుఁడు నయనపథము దొలంగెన్
దానవుఁడు విజయగర్వా
ధానందితబుద్ధి, రాజధానికి వచ్చెన్. 69

ఉ. వచ్చినతోన నింద్రుఁడు, సుపర్వరమాపరిరంభ గర్వితుం
డచ్చలమూర, నెంతయుఁ జరాత్మ విశేషవివేక శూన్యుఁడై
క్రచ్చఱ నాత్మదారఁ జెఱగాఁ గొనిపోయెనటన్నవార్త, భృ
త్యోచ్చరితంబు, మానసమదోత్కట హస్తికి సిళ్లు సూపినన్ 70

చ. మనసు నిదాఘమౌచు నెఱమంటలు వోయెడు దైత్యరాజుఁ గా
ననుఁ జనుదెంచె నారదుఁడు, నాతి కయాధువు వెంటరాఁ బ్రస
న్ననిజముఖాబ్జయై, కుముదనాథ కళాపరిభావిసుందరా
ననుఁ డసురేంద్రసూనుఁడు, గుణస్పృహణీయుఁడు వెంటనంటఁగన్ 71

క. తరుణి యెఱిఁగించె, విభునకు
సురపతి చెయిదంబు, వాని సూనరితనమున్
జెఱచిన నారదు కరుణా
భరితము వృత్తమ్ము, నుచితవాఙ్మృదులముగన్. 72

సీ. అమరర్షి యనియె నయ్యసురతోఁ దపమున
ఘనుఁడవెవ్వరికంటె, గలదె నీకు
నపజయంబనుట, యియ్యతివ, నీరేరుహ
పత్రలోచన, నాదు పుత్రిగాఁ గ

బరముగాఁ జూడక వర్థించితిని, పుత్రుఁ
బ్రసవించు వఱకు, వీఁడసమకీర్తి
వంశమ్మునకుఁ దెచ్చు, బ్రహ్లాదనామకుం
డందఱకు న్నిష్టుఁడై నదానఁ

ఆ. పెంపవయ్యె వీనిఁబేర్మి నిన్ గాదను
నలఘు తపముతోన వెలుఁగువాని
దివ్యతేజు, లోకదీపకుఁ జలితాల
కాంత కాంతవదనుఁడైన వాని; 78

ఆ. అంతఁ గనకకశిపుఁడమరర్షి నర్హోప
చార విధులఁదేర్చి సాఁగనంపె
నారదర్షిపైని గారవంబును, శక్ర
జాల్మ చెయిది, మదిని సందడింప;

మ. దనుజాధీశ తపస్సమాచరణఁ జిత్తంబుల్, వసంతాగమం
బున వృక్షంబులె యయ్యె రక్కసుల మూపుల్, నందనారామయా
వనసర్వస్వసుపర్వవారవనితా ప్రౌఢస్వయంగ్రాహ సౌ
ఖ్యనిపీతుండగు పాకవైరియెదలో గర్జించె భీత్యభ్రముల్. 75

సీ. నముచిపులోమాదు, లమిత విక్రములెప్పు
డెప్పుడో; యా యింద్రుని మేపుదఱుగ
దారుణంబగు ప్రవిదారణంబునఁ బాడు
దలవట్టి, యూడ్వఁగాఁ గలుగు ననెడు
చింతతో వ్రేఁగువా, రంతకుపెనువాడి
కోఱల మెచ్చని ఘోరదంష్ట్రి
లుప్పరంబును దన్ను నుగ్రజిహ్వలు, దావ
దహనమ్ము జిమ్ము నేత్రములు వెలుఁగ

ఆ. నా హిరణ్యకశిపు నత్యాదరమ్మునఁ
జేరి, సముచితంబులారఁ బలికి
యర్ఘ్యపూజనముల నలరించి, యిట్లని
పలికిరమరవైర కలిల మతులు; 76

మ. దితి సంతానము, దానవాన్వయము నుద్దీప్తంబుగానయ్యె, నా
యతభావత్క తపో విశేషమునఁ, గల్పాగ ప్రసూన ప్రసా
ధితమల్లావృతమింక దైత్యతరుణీ దీవ్యత్కటీ స్పర్శి కుం
చిత కైశ్యమ్ములు, తత్సుగంధముల దిక్సీమల్ బిసాళింపఁగన్. 77

మ. తమకే సౌఖ్యము వ్రాసిపెట్టినటు నిత్యశ్రీకులై, యప్సరో
రమణీ సౌఖ్యము, తారఁగ్రోలెదరు, క్రమస్వచ్ఛ గంగాంబు కూ
లములన్, నందన చందనానిల మరుల్లజ్జాళు వాసంత కుం
జములన్, నిర్జరులార్ద్రి ధూపలహరీ సౌగంధ్య సౌధమ్ములన్. 78

చ. సలలితవల్లకీరుతులఁ జల్లని మేనుల సోఁకులన్, బురం
ధ్రులు సతమున్ భజింప, సుఖ దూషిత చిత్తుఁడు, దైత్యవంశము
న్నలఁతుల మాటలాడునట! నా పురుహూతుఁడు లెంకలెల్ల, "నీ
కలిమికి మా హసాదు, త్రిజగన్నుత!" యంచని కేలుమోడ్పఁగన్. 79

క. జన్నంబుల హవ్యంబులు
దిన్న మదము కనులకెక్కి, దిట్టలు వోలెన్
క్రన్నన మముఁ గని, పొగరు
న్దెన్నులు వోయెదరు, సురలు, దెంపరితనమై. 80

మ. అనురాగమ్ము ఘటిల్ల నెప్పుడొకొ, స్వాహాదేవి గండస్థలి
న్బుణుకున్ బావకుఁడెల్ల ప్రొద్దులను నుల్లోలంబులై జ్వాల, లి
మ్మును లర్పించెడు హవ్యకవ్యములనే మోయున్, మమున్గాంచి, న
వ్వును శౌర్యంబునఁ, దాన గౌరవము నేపున్ గొన్నవాఁడున్బలెన్. 81

చ. హరితమపాలఁ గల్గునని, యబ్జభవుండు హృదంతరమ్మునన్
సురలకు మేలుగోరునని, శూలి ముకుందునియాన వెంబడిన్
వరవుడమోయునం, చడవి పాఱుల కూటువ మూకగట్టి యా
హరిహయుఁ దుల్లసించు, వశమైనటు నాకము శాశ్వతమ్ముగన్. 82

ఉ. ఏకతమున్నదాని, దనుజేశ్వరుపత్ని, నిరంకుశమ్ముగాఁ
గైకొనిపోయె, నారదుఁడు గాచినఁ బోలెనుగాఁక, వానికిన్
నాకవధూపదార్చన వినాకృతశీలికి, జాల్మి జాతికిన్
నీ కరవాలచాలనము నిల్చెనె కీసయఁ జిత్తమందునన్. 83

ఉ. ఆశచినాచి, దాని లలితాంగము నీవు సుఖించి, రమ్యసౌ
ధాశనయౌవతమ్ముల నహంకృతి మేము సుఖింపకున్నఁ ద
త్పాశవవృత్తికిన్ బదులు బన్నము గూర్చుట యేమి! దైత్యకాం
తా శబలాక్షి పాతముల దారులు వీడ్కొనుచేమి బాష్పముల్! 84

ఉ. పట్టము గట్టికొమ్ము, దిగిభమ్ములదంతము లూడఁదన్నఁగాఁ
బట్టము గట్టికొమ్ము, బలశాసను గర్వము మొక్కవోఁ, దిశా
పట్టము గట్టఁగా, త్రిదశబంధుర సౌఖ్యము నాచికోలుగాఁ
బట్టము గట్టికొమ్మసురభావిశుభమ్ములు పల్లవింపఁగన్. 85

చ. మముఁ బనిగొమ్ము శౌర్యఖని! మా కరవాలవశక్షకాంతులు
గ్రములయి, నాకమున్బొదివి, కానలభర్తృవియోగ గల్లపాం
డిమపిశునంబులౌత, శయనీయసుఖోచిత నైక విభ్రమ
క్రమసురపాఽ వరోధముల, గాద్గదికంబులు నేర్పునొజ్జలై. 86

గీ. అని యొడంబడఁ జేసి, యయ్యసురు లెల్లఁ
గావ్య రావించి, వినయంబు గ్రమ్ముకొనఁగ
మనవి యొనరింప "నట్లకా" కనియె శుక్రుఁ
డులివుకొనె వార్త విజయకాహళుల యందు. 87

సీ. మయకృత మాణిక్య మందిరమ్మున, రమ్య
గాణిక్య వర్తనక్రమము వెలసె
మిన్నంటె వేదవిద్వన్నృత్య మంజులో
దాత్తాది నాదవిధానలహరి;
వల్లకీగాన సంపత్సరీభావి సీ
మంతినీ రాగ సామ్రాజ్య మొలసె
దివి సోడుముట్టె, సందీపిత ధూప దీ
ప ప్రసూనామల పరిమళమ్ము

గీ. అతుల మణిమయ దివ్యసింహాసనంపు
ప్రభలచే భువియెల్ల, తారకితమయ్యె
సాగర తరంగిణీ తీర్థ జలము వచ్చె
నసురకుల బాహుపల్యంకికాహృతమ్ము. 88

మ. అభిషేకించెను భార్గవుం డసురరాజ్యంబెల్ల త్వద్బాహు శ
క్త్యభితో రక్షిత మౌచు వర్ధిలెడుఁ గాకంచున్, త్రయీప్రోక్త వి
ధ్యభిజాతంబుగ, మౌక్తిక ప్రకరశోభాంకూర తీర్థంబులన్
శుభశంస్యాసురనేత్ర హర్షసలిల స్రోతంబు సాకంబుగన్. 89

సీ. దనుజాధినాథుకౌనొదల శరచ్చంద్రికా
విమలమౌ నాతపత్రము నిజేశు
పజ్జలఁ గూర్చున్న భార్యనెమ్మొగమునఁ
దరఁగలుగట్టు చిత్తంపు హర్ష
మర్భకుండైన ప్రహ్లాదుని పుండరీ
కమ్ములు జల్లు చొక్కంపుఁ జూపు
దైత్య నితంబినీ తనుయష్టి భూషణ
వ్రాతమ్ము దైన వజ్రముల వెలుఁగు

గీ. సరవి, సాహోనినాదమ్ము సలుపు రాత్రి
చరుల హస్తాగ్ర చంద్రహాసముల కాంతి
యొక్కటే తెల్లదన మొంచు నుప్పరంబు
తపన మండల దీప్తి వితాకుపఱచె. 90

మ కురిసెన్ రక్తము వఱ్ఱుగాఁ ద్రిజగతీ క్షోభంబు సూచించి, బి
ట్టఱవన్ జొచ్చె వృకాళి, ఘూకములు నేత్రాంతమ్ము లంగారము
ల్పుఱపన్ సల్పె రుషానినాదములు, తీవ్రధ్వాన ఘూర్ణంబుగా
ధర, వీచెన్ పరుషాశుగమ్ములు, రజోధారాఽభివర్షంబుగన్. 91

చ. గిరులు వడంకెఁ జీకటులు గ్రిక్కిఱిసెన్, హరుకత్తు కైన యం
బరమున నుండి యుల్కలు విపాటిత దిక్కముగాఁ దొఱంగె, సా
గరముల రోదన ధ్వను లకాండముగాఁ బ్రభవించె, గుండెది
గ్గురుమన మంట వుట్టె వనకోటులఁ బేర్చిన జాఠరాగ్నియై. 92

ఆ. వాని నెల్ల దేవవర్గంబునకుఁ గీడుఁ
గాఁ దలంచి హర్షమేదురములు
మొగములొంచు, ఖడ్గముల జళిపించి, ర
వారి గాఁగ నసురవీర వరులు; 93

సీ. కాదంబరీ గంధ గర్వ చుంబనపాట
లితగల్ల నిశిచరీతతులు, కాంస్య
కందుక స్తన మాంసగంధ రాత్రించరీ
పరిరంభసుఖితాత్మపతులు, సంత
తాఽక్షీణలాఘవాభ్యాసనన్నాహిత
శ్రమబుర్చురత్తురంగములు, కర్ణ
కటుమదబృంహితోత్కటమతంగజ ద్రుక్పు
టాగ్నిచ్ఛటాపూరితాశ, లమర

గీ. హృదయ నిర్భేదకాతప హేళనములు
ఖర్గచాలన శబ్ద దిగ్భ్రాంతభూత
ములు, నిశాచరులకు దినమ్ములు గతించె
భాని సమరోత్సవోత్సాహ భాసురములు; 94

మ. హరి, కూటక్షితిదారమై యనుజునిన్ బ్రాణంబులన్బాపె, నా
హరి మర్దింపకయున్న నెక్కడిది యాహ్లాదంబు నాకంచు, భీ
కరుఁడై; యాశరుఁడ య్యమర్త్యుల పయిన్ గాల్ద్రొవ్వి, చాటించె సం
గరమున్, తద్ధ్వని, నాకభూసురసుఖోత్కంఠన్ విభాళింపఁగన్. 95

ఆ. కత్తివీచి, యంకకాఁడయి మున్నేగు
చున్న కనకకశిపు వెన్నుదన్ని
నడచి రసువవరులు, నముచిపులోమాదు
లాగ్రహాగ్రహోగ్రులంత్యసములు ; 96

మ. సకిలింతల్దివిదన్ని దేవతల యాశాసౌఖముల్గూల్చ, నే
త్రకటాహంబుల దృష్టులగ్గి గురువన్, తాదృక్ఖురన్యాస గా
ఢకరండంబుల భూమి గోడివడ, నొడ్డారించి, ఘోట్టాణఘో
టకముల్, రౌతులతో గమించినవి, గాథక్షిప్రయానంబులన్. 97

శా. సాలప్రాంశురథంబులుద్ధవిడి, చంచచ్చక్రముల్ భూతవే
తాళగ్రామరుషాట్టహాసముల కధ్యాహారముల్గా మహో
త్తాలధ్వానము లాచరింపఁగ, కృతాంతభ్రూకుటీత్రాస శౌ
ర్యాలంకారముతోడఁ దాము గదలెన్నాఃకారివేగంబులన్. 98

సీ. తమ సమున్నతి కభ్రతాపింఛ వారివా
హములు, నిర్జితసేనలట్లు దెరల
తమవైన బృంహితధ్వానంబులకు, సరి
త్పతుల గర్భమ్ములు పల్లటిలఁగ;

గండదానమ్ముల కటు గంధములు, దిక్ప
తుల రాజధానులఁ గలఁతవెట్ట
గ్రైవేయకములైన గంటల యులివుఁ ది
క్కూలంబులను దాకి మేలమాడ

గీ. తొండముల నున్న యాయస దండములయు
కాళిమాసారములు, లయకాల కాళి
కా తిమిరహాసములఁ బోలఁ గదలె వింధ్య
పర్వత గ్రావ నీకాశ భద్రకరులు. 99

సీ. కాలపూరుష దంష్ట్రికలు గ్రొచ్చిఁ గండపెం
డారమ్ములందు నెట్టిన ధరింప
ఫాలాక్షు తిగ కంటి వహ్నులు వెఱికి, కో
ల్తలసేయు నమ్ముల కలుగుఁ గూర్ప
వరుణుపాశం బరవరలు గావించిఁ వా
ర్వంబులకును ఖలీనంబు గూర్ప
సురరాజు కేశముల్దఱిగి, వానన, మందు
రాశోధనులకు దారములు వేన.

గీ. బరవసము మెండుకొన, మహోర్భటులు శాంక్ర
తము లొనర్ప సురాఽవరోధములఁ దన్ని
వివిధ హేతిచ్ఛటా గ్రస్త వీథులందు
నడచె నాశరసేన సన్నాహయుతము. 100

మ. కులశైలంబుల పక్షముల్దఱుగుచో, ఘోరాశ్మసంతానముల్
గలయందాకిన బీఱువోవక, యనల్పస్థేమ నిల్పె పెను
జ్వాల మే వర్మము, దానిఁదాల్చె, సకలాశల్ చిత్రపట్టాంబరం
బులఁ గైసేసెడుదాని, వాసవుఁడు దివ్యల్మెచ్చి యగ్గింపఁగన్. 101

ఉ. ప్రోవిడినట్టి కల్పకపుఁ బుష్పములంబలె, శుభ్రకీర్తి మే
నై పడివచ్చినట్లు, హృదయంగమ కాంతులు మూరిబోవ నై
రావతమెక్కి వచ్చు సురరాజు గనుంగొని రచ్చరల్, ప్రమో
దావిల నేత్రపద్మముల యంచులుదాకఁగ బాష్పపూరముల్. 102

చ. కరమున వజ్రమున్నది, వికస్వరశౌర్యులు, దిక్పతుల్ సరా
సరి నడుపన్గలారు, రణచండిమ నిర్జరకోటి కన్నులం
దురకలు వేయుచుండె, రిపులోడక యోపుదురే యెదుర్ప నె
వ్వరు పురుహూతు మీరు ఘనవాఙ్మయ ...పుల తూపులందునన్. 103

మ. వనజాక్షీ పరిరంభ గాఢతలు దప్పన్, జన్యని స్సాంద్ర హే
తినిపాతంబులఁ బొందియే యెఱుఁగ, నీ తీరెట్టిదో! జూతుఁగా
కను నౌత్సుక్యము మూదలించి, కనులందాకట్టుకో, గర్వపుం
దానకుల్, వార్వమునెక్కి వెన్కొనె, జయంతుండేపు సారించుచున్ 104

సీ. సహ్యంబుగాని భూషణ కాంతిపుంజ పిం
జరితుండు, ధనదుండు దఱిమి నడచె;
లలితముక్తామణీ వలయంబులైన త్రో
వలవెంట యాదసాంపతియు నడచె
జ్వాలాకలాపభాస్వన్మూర్తి, హుంకృతి
చ్ఛటలతోఁ గదలె వైశ్వానరుండు
కహకహోచ్ఛటుల ముక్కలుగాఁగ దిక్పాళి
బలసె, వెన్వెక్కి వైవస్వతుంతు

గీ. ఆత్మబలము లభయదాట్టహాసములు, ద
దుగ్రహేతిచ్ఛటాదీప్తు, లుత్పతిష్ణు
శౌర్యములు, కుంజర తురంగ సంభ్రమములు
కేరు నమరారులకు గోరగింపుగాఁగ, 105

శా. ఆ దేవేంద్రుని జూచి, నేత్రములయం దాగుబ్బులై రోస, మో
రీ! దేవేరులఁ బట్టినెట్టికొను చారిత్రంబు నీ శౌర్యమై
గాదా! వేల్పుల గద్దెనెక్కితివి! దుష్కర్మంబు జన్యంబు ను
త్పాదించె, మఱి, వీపు చక్కనయి నిల్వన్ గాక వేఱున్నదే. 106

ఉ. పోటరివైనఁ బాఱకుము, పూనిక శౌర్యమునుగ్గఁబట్టి, గె
ల్పోటము లంతు దేల్చికొనిపొమ్ము, మదీయఖరాసి నీవపుః
పాటన మాచరించి, విభవంబున బోనమువెట్టు సుమ్ము, నై
శాటులకెల్ల, యౌవతరహఃకృతిమాత్రఫలత్పరాక్రమా! 107

ఆ. అనుచు వాలు వీచి యమరేంద్రుపైఁబడెఁ
గనకకశిపుఁ డగ్గ్రగమ్మినట్లు
వానిగ్రుమ్మె నింద్రువారణమ్ము, కఠోర
దంత కుంతముల నుదగ్రమూర్తి; 108

ఉ. ఆ క్షతులన్ విశాల మురమంతయు రక్తముగాఁగ, దానవుం
డీక్షణసేసి, వీరులకు నియ్యదియే నవచందనంబు, హ
ర్షక్షణమంచు వ్రేసె, సురరాజు గృపాణమునెత్తుతోనఁ ద
ద్వక్షమునుండి శోణితము వఱ్ఱుగఁ బాఱ భయానకంబుగన్. 109

ఆ. మూర్ఛవోయి నట్టి పురుహూతుఁగైకొని
పాఱె, నమరవిభుని వారణంబు;
తెల్లనైనమేను, దితిజ నిస్త్రింశవి
క్షతము, జేగురగుచుఁ గానుపింప; 110

క. వరుణుఁడు, ప్రహేతితో ని
ష్ఠురముగఁ బోరాడి, వాని శూలాగ్రమస్మృ
త్స్ఫురణమొనరింపఁగ మది
ధీరత సెడి, సాయమునకు దిక్కులు సూచెన్. 111

శా. ఆలో మూలబలంబులేలికకు ముందై, జల్లుఁబోరాడఁగా
నాలోకంబులఁ దట్టు నెఱ్ఱనగవై, హస్తద్వయీచంక్రమ
చ్ఛాలంబొక్కటె, సర్వహేతిమయమై, శూరుండు దానొక్కఁడే
జాలెన్ వారికి నా ప్రహేతి, రుధిరాసారంబు తోరంబుగన్; 112

మ. రణసంరంభము రూపుకట్టినటు, లుగ్రంపశ్యనై టాలవ
హ్నినికాళంబులు వేడి చూపులయి, బంహిష్ఠ ప్రతాపుండు వ
చ్చె, నికుంభుండు, రథంబుపై, సురజయశ్రీ మంజు విస్మేర లా
పనముల్, చక్రఝళంఝళల్, దిశలకుత్పాదింప బాధిర్యముల్. 113

ఉ. వానికి మూదలించె పరిపంథిదవాయిత విక్రముండు వై
శ్వానరుఁడంత వక్త్రవిలసత్పరిహాసుఁడనెన్నిశాటుఁ "డో
రీ నిలుపోపు లెప్పుడు వరించెనా! నిల్వుము పోటుమాసివై
పీఁకనుడిగ్గి నా బిరుదు పెండెము నీ బది కాలఁ గట్టెదన్." 114

సీ. అను మాటలోన వాఁడైదు బాణమ్ములు
నుదురంటనరివోసి, వదల వాని
నడుమన ఖండించి, నాల్గమ్ములున్ దెగ
నిండఁ దిగిచియేయ, నెప్పరమున
నఱవఱ లొనరించి, "యోదు భళా! మేటి
జోదు" వంచు, పరాసు సూదనమ్ము
ప్రదరమ్ము నేసినఁ బాలార్చి, కోదండ
లస్తకమ్మను ద్రుంచి, లజ్జకండ

గీ. నొదలఁ గల్గిన నెదురించు మోరి! యంచు
రక్తకీలాఢ్యముగ నవ్వె, ప్రళయకోటి
గండరించిన యట్లు రాక్షసుఁడు, సౌర
సంతతికి నప్రధృష్య తేజస్కుఁ డగుచు. 115

మ. గద చేతన్గొనిడిగ్గి, పాదహతి నాకంపింప దేవౌఘ మె
ట్టిదిరా! నీపస యంచు వాహములఁ గొట్టెన్ బిట్టుగా, స్యందనం
బదరంటన్ దెగబాదె జీవములపై నాశల్దుటారింపఁగా
నిదియె శౌర్యము, పాఱె బర్హి, విసరన్నిశ్వాస దీనంబుగన్. 116

ఆ. వహ్నివోయి నంత, ప్రస్థలద్దాసర
కాస్యుఁడై నికుంభుఁ డనియె, కుమ్మ
రావమందు, వెకలియైగాదో! రాగిముం
తలకుఁ జూచుటంచుఁ ద్రస్తరించి; 117

వ. ఇవ్విధంబున నిఱువాగును, క్రందుకయ్యంబునకుఁ దలపడి, శంఖ తూ
ర్యమృదంగంబులయు, భేరీడమరుకంబులయు, హస్త్యశ్వరథంబులయు
నులివులు భీకరంబులై జెలంగ, రథికులు రథికుల, నిభంబులిభంబుల,
హయంబులు హయంబులం బోరునెడ, ఛిద్రంబులైన ధ్వజపటంబులు,
చిందఱలైన సితాతపత్రంబులు, చెల్లచెదరైన మహాధనంబులు వజ్రదం
డంబులు, ఛిద్రుపలైన బార్హంబులు చామరంబులు, తేలియాడునట్టలు,
కూడిననెనడులగుట్టలు, తెట్టువలైన పొలసులు, నలుసులైన పదంబులు,
రదంబులు, వాతోద్ధూతంబులై యుపరితలంబున నెగురుచు, వైరంబులు
మఱువవినియపోలెఁ బరస్పరంబు సంఘర్షించికొను నుష్ణీషంబులు,
కసిమసంగి పోరు పోటరుల యురంబులనుండి, ఖడ్గచాలన విశేషంబులఁ
బోటినబంతులన్బోని పైకెగయు వీరమాలలు, నికృత్తంబులైన బాహూరు
శిరంబులు, ఛిన్నరథాంగాఽసి తనుత్ర భూషణంబులు, భీషణంబులయ్యు
రమణీయంబులై యుండె. నంతలోన, గీష్పతినుండి, కాలంబు గానిది
యనియు, రణంబు విజయపరాఙ్ముఖంబనియు, ధర్మదార వివేకం
బనియు, నింద్రునకు వార్తలందిన; 118

క. అరగయ్యమునకు నైనను
తరపడి యింద్రుండు, కోటవాకిలిఁ దెఱిచెన్
సరసిజముఖి, యింద్రాణియుఁ
బరివారముతోన, గూఢపథములు వట్టెన్. 119

మ. పురుహూతుండుదయాస్తమానములలోఁ బొంగారి, గంగావిక
స్వరసౌగంధిక పూజలన్దనుపు నా స్వర్లోకలక్ష్మి వపు
స్స్ఫురణన్ఫోలిన పుష్కరద్వీపము సుచ్ఛానంబు దర్పంబునన్.
వరకుంభస్థలిఁ దన్నె చైత్యుఁదపసవ్యంబైన పాదంబునన్. 120

సీ. బలశాసనుని కీర్తిభరము మూర్తఁబైన
చదలుతేజికి మేన జౌకుఁబూసి
కల్పాగమాకల్ప కలికా నికాయంబు
లసివాడుఁగా బీకి యవల విసరి
వైభవోపేతమ్ము వైజయంతమ్ము గో
డలమీద వెకలి బొమ్మలను వ్రాసి
వర సుధర్మాసభా భవనమ్ము చిన్నెలు
బిమ్మటివో, తమ్ములమ్ము మూసి

గీ. ఆసవాకంఠపూర్తి లోహల వదంవ
దులు కులీన పదవ్యరుంతుదనికామ
చారు. లసురులొనర్చిరి సదమదంబు;
త్రెస్సిపోయిన సర మమరీపురమ్ము; 121

మ. మలగెన్ నృత్యములుచ్ఛిఖంబులగు హర్మ్య శ్రేణులన్ వల్లకీ
లలనా కోమల కంఠముల్, గళిత సల్లాపంబు, లిందిందిరా
వళికి స్ఫారణముల్, సుగంధి తరుణీ వక్త్రాబ్జ నర్మస్మిత
మ్ములు దూలె, న్నిఁక నేమిదక్కినది; స్వర్భ్యాగర్వ పర్వంబుగన్. 122

గీ. అబ్జ సంవాసినీ ప్రియాహార్య శోభ.
ధాతృలీలావతీ హస్త దర్పణమ్ము
వేల్పులకు నాటపట్టగు విజయనగరి,
దితిజరోషాగ్నిఁ గరఁగి యదృశ్యమయ్యె ; 123

మ. వరదైతేయ వినాశివీర్యుఁడు, పవిభ్రాజిష్ణుఁ డుద్యద్యశో
ధరుఁడా యింద్రుఁడు, తేజుగోల్పడి, దిశాపట్టంబుగాఁ బోయినన్
సురుచి స్ఫీత మణిప్రణీత కృతక స్రోతస్వినీ వారమున్
హరి సింహాసన మెక్కె దానవుఁడు, బాహాదోహలం బొప్పఁగన్; 124

సీ. పన్నగేంద్రంబులు, ఫణరత్నములు విప్పి
జంగమదీపికా సరణి నిలిచె,
నంజి, యా ప్రత్యూష మాసంధ్యమును, నప్స
రస్తతుల్ నృత్యంబు విస్తరించె
ప్రస్వేద వారిధారా స్రస్తకరముల
గంధర్వవల్లకీ క్వణనమెసఁగె
కటిబద్ధ వస్త్ర నిష్కాశనభ్రమశిరముల
ముకుళిత సురకరమ్ములను బొదలె

గీ. పుష్కరభ్రాదిని సీత బొమ్మిడాయ
తరుణకర్కట కూర్మోపదంశములను
త్రిదశకులరిపుమౌళి మైరేయపాన
కలిల చిత్తుఁడై, రేవగల్లడపి నపుడు. 125

క. త్రిదశేశ్వరు మస్తము, మ
త్పదమున, పెండారమందు, ప్రతిమగ వ్రేలెన్
వదరక, హవములు నాకై
వదలుండని యసుర మౌనివర్యుల నలచెన్. 126

వ. ఇట్లు సకల దిగధీశుల నిర్జించి, లోకైకనాయకుండై, కామచారంబున నింద్రియ సుఖంబు లనుభవింపుమఁ దనియక, శాస్త్రసేతువు నతిక్రమించి, చతుర్ముఖ ముఖాసాదిత వరప్రభూత దుర్వారగర్వాతిరేకంబున, సుప ర్వారాతి యేరినిం జీరికిన్గొనక పెద్దకాలంబు రాజ్యంబు సేయునెడ. 127

క. దినమొక యుగమై దివిజులు
కనుదమ్ములు కోష్ణ బాష్పకలిలముపై, దీ
ర్ఘనితాంత నిశ్వసనముల
మనుగడలు, హసంతికలుగ, మ్లానముఖులునై; 128

మ. హరఫాలాక్ష ధనంజయచ్ఛటలకథ్యాహారముల్, దానవే
శ్వరు విక్రాంతులు మమ్ము, తల్లి ప్రజలన్బాపెన్, జగద్రక్షణా
పరుఁడామాధవుఁడేలరాడొ! విదళింపన్వైరి, నింపన్దయా
భరముచ్ఛోషిత సంయమిప్రకర హృద్వప్ర ప్రదేశంబులన్. 129

గీ. అనుచు గగ్గోలుపడి, యమృతాశనౌఘ
మసురుసురుగాఁగ వచ్చె నయ్యజుని కడకు
సరసిజాసనుకడకు, వాగ్జాని కడకు
నిగమరోమంథయత్న నిర్నిద్రు కడకు. 130

చ. ఉడుగని దానవేశ్వరు మహోద్యమ మొక్కటఁ గాఱుచిచ్చుగా
దొడరిన నార్పఁ బూనితివి, దోసిటినిండ వరమ్ములెత్తి, యా
చెడుగఁడు కాననే పుడమి సేమములార్పెడు, ముల్లుదీసి కొ
ఱ్ఱడచిన చందమయ్యెఁ దిగునా! భువనావన సాత్కృతవ్రతీ! 131

చ. పలుకఁగ నేమియున్నది! భవత్ప్రతిపాదిత విక్రమక్రమో
జ్జ్వలితుఁడు దైత్యరాజునకు వాసగృహంబల వైజయంత మా
తలమున లోహితామిషవితానము తావులు సోణమంటిన
న్నలజడి గుందు గంధవహుఁ డప్పటికప్పటి కోకిలించుమన్. 132

సీ. ఒకనాఁడు గంధర్వయూథంబు పై నెత్తి
చని, వారి యవరోధజనమువట్టి
ఒకసారి, భుజగుల నొడిచి, తత్కాంతా క
టీర మేఖలలఁ జండించి రాల్చి

ఒకతేప, యక్షుల నుఱిమి, తత్ప్రేమంపు
నెలఁతల కోకలు నెఱికఁ బెఱుకు
ఒకమాటు, సిద్ధులఁ గికురించి, జవరాండ్ర
సమ్ముఖమ్మునన వస్త్రమ్ము లొలుచు

గీ. ఇట్టి పోఁకులు చెప్పెడి వేమి! మున్నుఁ
గన్నవిన్నవిగావు లక్షలకుఁ గలవు
వాఁడు చావకయున్న గీర్వాణకోటి
కమృతమును ద్రావనైన దేహమ్మె సేఁగి. 133

ఉ. నందన నందనానిలు మనాక్సరి సేవన, నిండుడెందమా
నందము నొందుసుందరి, వినన్గడుజాలి, రమాసగోత్ర, సం
క్రందనురాణి, శర్కరికాపథగేహినియయ్యె, నక్షిని
ష్యంద నఖంపచాంబుతతి, సార్ధచరీ పరిసాంత్వనమ్ములన్. 134

ఉ. చారువిలోచనాప్రణయచర్చితుఁడై, త్రిదివంబునేలు బృం
దారకమౌళి, నేటికి లతాపరిధానుఁడు, శీర్షసీరకే
దారపుఁబాగయై, వనపృదాకు జరత్కటు కంచుకంబు వే
కారెడుఁ గోలుపడ్డ సుఖసక్తికి, దండితుఁడైన కైవడిన్. 135

ఉ. రమ్ము, జగత్త్రయీ భరణరక్తి విభూణమైన విష్ణుతే
జమ్మొకటే శరణ్యము, ద్విషద్విషమమ్మగు వేళ శార్ఙ్గచా
పమ్ముదవమ్ము, కర్ణయుగపాటన సేసిన గాఁక, దైత్యద
ర్పమ్ములు వీఁగునే! యొరులఁబాటన సేతురె విక్రమంబులన్. 136

క. అనియిట్లు దివిజగణములు
దనుఁజుట్టిన, వారియార్తి ధట్టింపను, శో
భనముంప, నాసుదర్శన
ఘనగళహుంకృతులె దప్పఁ గావని యనుచున్. 137

గీ. చలువ తావుల పంకజాసనము విడచి,
నెమ్మిఁ దనవెంట నంటువాత్సల్యమ్ము విడచి
ముకుళితకరాంబుజుఁడు, భక్తి మునరుకొన్న
కన్నులై, చిత్తమై, జన్నిగట్టు నడచె; 138

చ. చిలుపని తేనెలై, కనులఁజిప్పిలు నీరముతోడ, జూటమం
డలమున యందు విష్ణు చరణప్రసవాపగతోడ జూడ్కికి
ట్టిలమగు తోలుపచ్చడపు దంబులతో, నహిభూషణాళితో
వలిమలయల్లుఁడప్పరమ వైష్ణవుఁడేగె, పిఱింది దన్నుచున్ 139

సీ. అణఁగియుండిన హాలాహలపుఁ డొక్కులు విజృం
భించి, క్రమ్మఱ నావరించెనేమొ
దక్షాధ్వరత్యక్త తనువైన సతిదేవి
మఱిపెముల్ తలఁపునఁ బొలసెనేమొ
కైతవమోహినీ కజ్జలాన్విత దృ
గంశువుల్ మదినిఁ దట్టాడెనేమొ
చరమసంధ్యాకాల సరభస తాండవా
రభటి భావము మేనఁ బ్రాఁకెనేమొ 140

ఆ. పరవశించు, నేడ్చు, ఫక్కుననవ్వు, ర
సామృతాప్తి నూఁగు ననుపదమ్ము
తన మనోధనమ్ము, తారకమంత్ర ము
ద్రాపినద్ధ హృదయతలుఁడు హరుఁడు.

ఆ. అతనివెన్క నడచి రఖిలదిశాధీశు
లాధివికలకుంచితాక్షులగుచు
నా రమేశకరుణ యల్పంబు దొలఁగిన
నంతవారు, నలుసులైనవారు. 141

ఉ. ఎక్కడనున్నవాఁడొ! జగదీశ్వరుఁ డాప్తులబాధ చిత్తమం
దెక్కని భ్రాంతియేమొ! గణియించియునించుక కన్నడించెనో!
యక్కమలాక్షు సత్కరుణనాదటఁ బొందఁగ మార్గమున్నదే!
దృక్కలశోష్ణవాః కణవిదీనము, చిక్కనిమ్రొక్కు దక్కఁగన్. 142

మ. పడపైయుండిన యయ్యనంతుని ఫణాపర్యంక మందిందిరా
సరసీజాక్షి పదంబు లొత్తఁగ, ముహుస్సంపుల్లరోమాంచయై
కరమర్థిన్ స్మితలిప్తగండతలుఁ డేకాంతమ్ము సేవించునో!
సరియెవ్వారు వచింపమా వెతలుదంచత్ స్ఫూర్తి మా స్వామికిన్. 143

చ. కర మహతీ కలక్వణ విగాహిరసాకుల కంఠ వాటికా
పరిణత రక్తి రాగ సుఖ పారణ నారదు గారవించుచున్
మఱచినవాఁడొ! యన్యము రమావరుఁ డల్ల వికుంఠమందు, త
త్పరవినతాసుతచ్ఛవిపతత్ర మృదువ్యజనానిలంబులన్. 144

మ. సకలాశాగతి దన్నుగాఁ దలఁచి, వీసంబైన తద్భిన్నదే
వకదంబంబును గోరకెయ్యెడల సేవాభాగ్యమిచ్చించు న
త్యకలంకుండగు నెట్టి భాగవతు భావాయత్త హృద్గేహ త
ల్లకమైపోయెనొ! స్వామి, విస్మృతరమా రాసిక్యపర్వేందుఁడై. 145

మ. అని వాపోవుచు, నబ్జసంభవ సహాయావాప్తిచేఁ గొంత నె
క్కొను ధైర్యమ్మును, యామినీచరభుజా ఘోరాసిధారాను చిం
తనచే డెక్కొను భీతిమై యమరు, లానందాబ్ధివీచీఘటా
రణితంబౌ, నల సత్యలోకమున మేరల్దాటి వేగంబునన్. 146

గీ. కదలికలు లేని యుదధులై, కనుల నడుమ
గండరించిన వెలుఁగులై, కష్టతపము
వట్టి, సృష్ట్యాదిగా నున్న పరమ మునుల
పసనిగద్దె, తపోలోకపథము గడచి. 147

వ. వచ్చువారు, జనలోక మహాలోకంబులవతరించి, యెదుట శింశుమారాకారుండైన నారాయణునిన్గని, వినయవినమిత శిరస్తటీ ఘటిత కిరీటమణి మరీచిరింఛోళికా సమర్పిత నీరాజనులై నమస్కరించి యిట్లు వినుతించిరి: 148

సీ. స్వామి! నీదైన పుచ్ఛమ్ము, వహ్నీంద్ర ప్ర
జాపతిముఖ్యులు కోపుతావు
వాల మూలమ్మున వసియింత్రు ధాతృవి
ధాతలు, సంవిదద్దావచనులు
నిఖిల లోకానంద నిధి; నీ కటీరమ్ము
ఋషి సప్తకము కాపురించు తావు
నీ దక్షిణార్ధంబు నెలవు, చతుర్దశ
ఋక్షంబులకు, కాంతి పృథులములకు

గీ. దక్షిణాయన నక్షత్రతతికి గీము
వామభాగమ్ము, నైకదివ్య స్వభావ:
భావ బహు రూప! వీక్షావిపన్నపాప!
భూత హృద్వర్తి! ఆశ్రిత పోషణార్తి!! 149

క. పిఱిది దెస దేవమార్గము
సురగంగయుఁ బోలుచు నీకు జోతలుఁ వేదాం
తరహస్య వేత్తృ పాట
చ్చరరచణా! సప్తసామసారథ్య చణా! 150

సీ. నీ దక్షిణంబంఘ్రి, నెలకొన్న దభిజిత్తు,
సవ్యాంఘ్రిఁ యుత్తరాషాఢ పదవి;
అమరు దక్షిణ నేత్రమందు ధనిష్ఠాభ
మపరచక్షుస్సు, మూలాన్వితంబు;

సన్యాపసవ్యముల్ శ్రవణగోళములు మ
ఘాది నక్షత్రమ్ములవఘళములు :
ఉభయాయనమ్ములు, నుభయ పార్శ్వమ్ములు,
కృత్తికాది త్రయవృత్తి యొప్ప

గీ. వామదక్షిణ స్కంధ సంవసతి దనరు
శతభిషయు, జ్యేష్ఠయును, వేదసరణి దీప్తి !
పరమ కల్యాణ ! కల్యాణ గిరిశరాస
రక్తి పల్యాణ భక్తివారణ విహారి.

గీ. పొలుచు దేవ! పునర్వసు పుష్యమియును
తావకంబైన యుత్తరార్ధంబు నందు
తత దయావార్ధి ! భావత్క దక్షిణార్ధ
మార్ద్రయుచు, మఱి యాశ్లేషకైన తెఱంగు. 151

క. ఉత్తరహనువు నగస్త్యుఁడు
హత్తు యముం దపరహనువు, నంగారకుఁడు
ద్వృత్తుఁడు, ముఖమున వెల్గును
కృత్తాశరసంఘ! నిగమ గృహావసతి గృహీ ! 152

క. గళమున రాహువు, వక్ష
స్థ్సలమున సూర్యుండు, హృదయ సద్మమ్మున జా
బిలి గుహ్యంబున రవిజుఁడు
విలసిల్లెడు నీకు నతులు, విజ్ఞానతనూ ! 153

క. స్తనముల నాశ్వినులును, మే
హనమున గీష్పతియు, నాభి నసురగురుఁడు, చం
ద్రుని తనయుఁడు ప్రాణంబున
ననువున వర్తించు నీకు, నంజలులు హరీ ! 154

గీ. అంగ మందెల్ల, కేతుగ్రహంబు వోలిచి
రోమకూపంబులను, తారలామతిల్లి
యఖిల దైవతమయము కాయమ్ము గొన్న
యాదినారాయణునకు సాష్టాంగశతము. 155

వ. అని ప్రస్తుతించి వచ్చువారికి ముందట 156

సీ. హరి పాదపద్మ నూపురశబ్ద నిభ పరా
త్పరనామ ముఖరకంధర దనర్ప
పంచసంస్కార ప్రపంచసంచిత శుభ
ప్రతతులై, యూర్ధ్వపుండ్రములు వొదల
పుటపుటనైనట్టి బొజ్జపై నిలువక
నిలుచువల్లికి కుఱుచలు ఘటింప
న్యగ్రోధ కిసలసనాభి జటాచ్ఛటల్,
నెటి సుషుమ్నా సత్య నియతిఁదనర

ఆ. వచ్చె వారికడకు, వైకుంఠ తులసికా
విహృతి గంధవహుఁడు వీచినట్లు
పరమ భక్తకులము ప్రాణమ్ము, కీర్తిక
ర్పూరవాసితుండు, నారదుండు. 157

ఉ. ఆతని జూచినంత హృదయమ్మున మల్లెలుబూచినట్లులై
యాతురముల్దొలంగిన దివౌకసు లల్లన చేతులెత్తి, ని
ర్ధూతతమోవికారునకు మ్రొక్కిరి, మాధవ పత్సమర్పణా
జాతకృతార్థతా కలశసాగరమస్తుమనోజ్ఞమూర్తికిన్ 158

ఉ. హాటకగర్భుఁడంత 'దనయా! యిటురమ్మ'ని, దివ్యవక్త్రశృం
గాటక శీతలస్మిత వికాసము గుత్తులుగట్ట నిచ్చ దోః
కూటములందు చేర్చికొనెఁగుట్మలితమ్ములు కన్నులై నిరా
ఘాట వికుంఠభక్తి పరిగంధిల చిత్తుల సంగమల్పమే! 159

క. ఓరంత ప్రొద్దువట్టెను
సారసగర్భునకు బాహ్యసంగతికిన్, శ్రీ
నారాయణ పదయుగ చిం
తారసమత్తునకుఁదన్నుఁదాఁదెలియుటకున్. 160

గీ. నారదునివంటి వాఁడౌనొ యౌరసుండు;
ధన్యుఁగాఁదన్నుఁ దలఁచె విధాతయపుడు;
తానొకఁడ యేల; సర్వమ్ము ధన్యమయ్యె
పూతదేవర్షిజని తోడ భూతధాత్రి. 161

గీ. ప్రథమ సంధ్యా వికస్వరపంకజముల
కన్నదమ్ములువోని నీయడుగుదోయి
వచ్చుటెచ్చటి నుండి దేవర్షి! యనుచు,
ప్రశ్రయంబున నడిగి రస్వప్నులపుడు; 162

గీ. కనకకశిపుని బాహువిక్రమముచేత
మచ్చునాల్కతోఁదిట్టిన మాడ్కివోయె
హరిదధీశుల స్వైరవిహారకేళి
మల్లెవట్టిన చేనయ్యె మగతనంబు; 163

క. హరి యెచ్చటనున్నాఁడో;
శరణాగత రక్షకుండు, సర్వజ్ఞుఁడ వీ
వరసి వచింపుము, కరుణా
పరులుగదా! భాగవతులు పరమార్థఖనీ; 164

సీ. ఆ పల్కులకు నవ్వులై కన్ను లమరర్షి
త్రిఃకృత్వముగ వాసుదేవుఁబలికి
వచియించె, విష్ణు శబ్దమ్ము ముఖ్యార్థమ్ము
హరిలేని తావిసుమంత గలదె!

యే స్వర్ణకశిపున కీరెల్ల వెఱతురో,
యతని యెద్దను గూడ హరిగలండు
సకల జీవుల వైన సర్వభావమ్ములు
నాశ్రీధవునకుఁ బాదాశ్రితములు 165

గీ. తులసిదళములు, పెఱయౌనె! కలుచకాఁడు
నెల్లవేళల నిట్లు దూషించి, యభవు
నతనిచేఁజెగి మోక్షంబు నందఁగలఁడు
శాశ్వతానంద మతని నైజమ్ముగాన;

గీ. ప్రేమ యొక్కటెగాదు శార్ఙ్గికి మనఃప్రి
యమ్ము; ధారావగాహికమైన బుద్ధి
యేకరణినైనఁ దను విస్మరింపకున్న
వాని లోగొను కరుణాస్వభావుఁడతడు. 166

సీ. ఇది పరమంబైన విదులు వట్టిన త్రోవ
మునుమిన్నుటరయని ముక్తి తెరువు
యాజకుండరణిచే నగ్ని పుట్టించెడు
పవిది, సంతతతీక్ష్ణభావనాబ
లంబునఁ దొలివెల్గు నింబుగాఁ గను యోగి,
యింత విస్తర మేటికిపుడు నాకు;
నా హిరణ్యాక్షు యుద్ధాసక్తు మర్దించి
యంతనుండియు భూమియందె, పుడమి 167

గీ. దానతోఁగూడ నాస్థానమైన వాఁడు
హరి, నభోవాహినీ విమలాంబుపూర
పౌనరుక్త్య జలాఢ్య ప్రవాహ మజ్జ
నంబు ఋషులొందు శేషశైలంబునందు.

క. పొందచటికి, భక్తిని, నెమ
కుందు దయాధాముఁ దెలిసికొనుఁడు తొదలు, దు
ష్టుండగు దితిజుని బోరిగొని
నిండించెడు మీకు నతఁడ నిఖిలార్థంబుల్. 168

గీ. అనుచు సెలవిడి, నారదుం డక్షియుగము
తెరువులకుఁదప్పె, మహతీసుధీకృతమ్ము
భావపద్యాకులము, పరవాసుదేవ
భజనతో దేవతల గఱుపారజేసి. 169

సీ. పోవఁబోవఁగ నల్లబొడసూపెఁ బశ్చార్ధ
కాయమ్ము, వామమ్ము గాంగతటము
అటు మీఁదఁ జెవుల విందగుచు విన్పించెఁ బం
చారించి వల్లకీ స్వరచయమ్ము;
అపైని, గ్రచ్ఛ కాయల రవళియుఁబోలె
పదకింకిణీ కలక్వణము మిగిలె
అటు వోవ, ప్రావృషేణ్యము పయోవాహ ని
ధ్వానమై, గాత్రగీతమ్మె దక్కె

గీ. మఱల, శుష్క పలాశమర్మరమువోలె
వినబడియు, వినరాని నిస్వనము; భక్తి
నతని వోయిన దిక్కున కంజలించి
రఖిలసురలు, దిగీశాదులైనవారు; 170

సీ. అయిదేండ్లు నిండకున్నపుడ లోకాశ్చర్య
దంబైన తీవ్ర తపంబు వట్టి
బ్రహ్మాదులకు నేత్రపర్వంబు సేయని
వాసుదేవునిఁ గోర్కె పండఁజూచి

యాకసంబు ననన్యాదృశ్రితంబైన
గౌరవమ్మును శ్రీశుకరుణఁ బడసి
కట్టుగొయ్యను ధేనుగణ మట్లుఁ దన్ను రి
క్కలు వలచుట్టు భాగ్యమ్ము గలిగి 171

గీ. వివిధ కల్ప పరంపరా ధ్రువతనున్న
ధ్రువుని గని, ప్రశ్రయమునఁ జేతులు మొగిచ్చి
రమృతపీథులు, సాధుసమాగమమ్ము
కార్యసిద్ధికిఁ బ్రథమవాక్యమ్ము గాదె;

సీ. అత్రి, పులస్త్యుండు, నంగిరసుఁడు వసి
ష్ఠుఁడు; శాంతి దాంతినిష్ఠుఁడు, మరీచి
క్రతువని యెడువారు, కమలాసనుని మాన
సాత్మజుల్, బ్రహ్మర్షులైన వార
లా ప్రజాపతులు, బ్రహ్మకు సృష్టికార్యంబు
చేదోడు, చిరతపస్సిద్ధమతులు
వారిఁగాంచిన యంత వందించి రమరులు
వినయ సుందరముగా, విదితమౌని

గీ. వరసమాధినివాత దీపంబులైన
యాత్మలల్లన, చిఱుగాలి నల్లఁగదలు
నబ్జములుగాఁగఁ గదలి, కార్యము ఘటించు
నంచు సూచింప, విష్ణుమూర్త్యంతరములు; 172

శా. రాగద్వేష విహీనుఁ డత్యమర శౌర్యప్రాభవుం, డాత్మ వి
ద్యా గోపాయిత చిత్తవర్తుఁడు, శివధ్యానైక పారీణతా
భోగుం, దర్కసుతుండు, నిండుకొలువై పొల్చారు, లోకంబునన్
మ్రోగెన్, దేవకదంబగుంఫిత మధుద్రుట్కీర్తి తారధ్వనుల్. 178

చ. అమరులు తోనఁ జొచ్చిరి బృహస్పతిలోకము, కర్ణశష్కులీ
ప్రమదము, శౌరికీర్తి రసరంజిత రాగము విన్న యా గురుం,
డమృతపుఁ గుండలైకను, లయాచితమై యుపపన్నమైన ది
ష్టమునకుఁ గేలుమోడ్చె, సహసావికసత్పులకాచితాంగుఁడై; 174

శా. ఆ దాక్షాయణి, పిత్రవజ్ఞకుఁ దనుత్యాగంబు సేయన్, శిరో
పీఠీకుంద కుముద్వతీరమణ రుగ్వేణీ పరాభూత దై
ర్యాధారుండయి, యెంతయున్ బడలె నార్యాజాని, దావవ్యథా
నేదిష్ఠంబులు వాసరంబులగుచు న్నిద్రాదరిద్రాణముల్. 175

మ. ఒకనాఁడా శివుఫాలభాగమున యందుత్పన్నమయ్యెన్, సతీ
ప్రకటారుంతుద విప్రయోగ పిశునప్రస్వేద, మా బిందువం
దొకసూనుండు జనించె, నర్కరుచి, సద్యోయౌవనస్ఫూర్తి, వా
నికి నంగారక నామమయ్యె, మృదవాణీ గంధసాగంధ్యమై. 176

క. ఆ లోహితాంశలోకము
శ్రీలజ్జాసేన నామ శివతాతిరసో
త్కూలము, సనకాదికము
న్యాలాన వికుంఠనగరి కనుగలిమయ్యెన్. 177

గీ. చంద్ర చందనమందార సారవర్ణు,
డంధకారాతి తోఁబుట్టువైనవాఁడు
కావ్యుఁడేలెడిలోకమ్ము, గరుడగమన
విమల చాటువచో ఘుమంఘుమితమయ్యె. 178

సీ. తన రూపసంపద, వనజారిపీయూష
హారిరూపము వీప్సయైనవాఁడొ
బహుకాల గృహమేధి పదవితో, వన్నెమా
యని షోడశాబ్ద దేహమ్మువాఁడు

యెవ్వరితోనైన నెచ్చోట నవ్వకు
    నంగలింపని సౌమ్యుఁడైనవాఁడు
చీకటితప్పు సేసిన తండ్రికిని సూనుఁ
    డై, గుణార్ణవరమ్యుఁడైనవాఁడు 179

ఆ. హాళికిఁ గడుఁ గూర్చువాఁడు, ముత్యాలగొడుగు
నెమ్మిఁగొలిపెడు కీర్తిభరమ్మువాఁడు
బుధుఁడు రాజైన విష్టపం బదితినంద
ను ఖు; ప్రవేశించి రాధివిహ్వలితమతులు.

గీ. పరమపదనాథ సేవాప్రబంధవృత్తి,
వ్యాపకాష్టాక్షరీ గంధ పావితమ్ము
సౌమ్యహృదయమ్ము, విబుధ సంసద్వినిస్స్ర
వత్సుధాగానలహరి డెప్పరము మునిఁగె; 180

ఆ. అసిత వృషభకకుద్భిభమైన, యభ్ర
జలధిజారమ్యకేశవేశమ్మునందు
నవదరించిన ముత్యాలజల్లివోని
యుడుపథము దాటి, పయనించిరోలి సురలు. 181

సీ. కలశసాగరవీచికా గర్భభాగ్యమ్ము
    శివజటావాటికా శేఖరమ్ము
గౌరీతనూ పరిష్కారలీలాదర్శ
    మతను సంరంభసిద్ధౌషధమ్ము
హరివధూ పితృనిశాంతవలేప భరమ్ము
    మానినీ మానవిధూననమ్ము
హరిదంగనా చందనా పూర్ణ చషక, మ
    త్యున్నత కీర్తి శాణోపలమ్ము

గీ. సకల దైవత ఘన బుభుక్షా ప్రపూర్తి
వశిమనో శూకలాశ్వరేవంతుఁడైన
హిమకరుఁడు విష్టరమ్మొటియించు జగము ;
దరిసి దమరులు, శౌరి గాథాలపనులు ; 182

క. నారాయణ కీర్తన, శ్రుతి
పారణమై యమృతకరుఁడు ప్రసరజ్జ్యోత్స్నా
స్మేరముఖుం డాలోసన,
నా రాక్షసబాధ దలచి, యదవదలయ్యెన్. 183

సీ. శివశిరశ్చంద్రికా శిశిర మృద్వంశీస్మి
తమ్ము, నీశానులోకమ్ము దాటి;
ప్రత్నరత్నాలోక పరిభూత మఘవచా
పమ్ము యక్షప విష్టపమ్ము గడచి
జలదేవతానేత్ర శఫరీ విలాసమ్ము
పాశి రాజ్యమ్ము క్రేవఁకుఁ దొలఁగి
యా స్వర్ణకశిపున కనుఁగులయ్యెను, గాని
కర్బుర ప్రజల వీక్షలకుఁ దప్పి

గీ. సప్తజిహ్వాల నధ్వరాజ్యమ్ము గుడిచి
త్రేచు వైశ్వానరుండున్న తెరువు గడచి
కనకకశిపు గదాదండ కాలదండ
మృత విలాసమ్ము నాకమ్ము నతకరించి. 184

చ. తపములు రూపు దాల్చిన విధమ్ములు, వేదసరోజ గంధ స
ల్లపములు ధిక్కృతైహిక విలాసులు, పూజ్యులు, వాలఖిల్యులే
తపసుని చింతసేతురు నితాంత నిరీహక భక్తి, తచ్ఛవి
స్ఫుపుటిత దివ్యలోకములు దాటిరి దివ్యులగాధదుఃఖితుల్. 185

గీ. సతత గమన క్రియా యత్త సప్త సప్తి
నిర్జరుల వందనమ్ము మన్నించెఁగాని
కర్మసాక్షికిఁ దీరిక గల్గునేమి !
నిలిచి యసినాఱు మాటైనఁ బలుకుకొనుకు ! 186

ఉ. పూవిలుకాని మూలబలముల్, జటిలాధ్వరగణ్య పుణ్యసం
భావిత యాయజూక సుమబాణ సుఖాగను శిక్షణ క్రియా
శ్రీవిలసత్తనూలతలు, చిందిన యందములప్సరస్తతుల్
త్రోవలనడ్డు లోకములు దోచెను ముందు సుధాస్రవంతులై. 187

గీ. అమరులా తెరువునఁ జూడ కన్యమార్గ
ముల నడచిరి, సుకములఁ దలఁచికొన్న
వెంటనే స్వర్ణకశిపు నిర్వేలహాస
వీప్సయైన కరాచూరి వెలుఁగు దట్టి. 188

క. అమరుల చక్షుర్గోళము
లమలినదుగ్ధాబ్ధివీచులై పొంగఁగ, దు
ర్గమ సంసార నిరాసము
శమథన మునిసదన శేషశైలము దోచెన్. 189

సీ. ఎచ్చోట మొలచిన యిషికా వ్రజమునకుఁ
కల్పవృక్షములతోఁ గలుగు వావి
యే చక్కని నదించు హేరాళ పికగీతు
లమ్మహతీనిక్వణాయితములు;
యే నిట్టఁబూవుల నివతశించినతావి,
ప్రథమర్షి హృదయ నిర్వాణసుఖము
యే నేలఁ బ్రవహించు నేరులసలిలమ్ము
లామ్నాయ హృద్వచస్యంది మధువు

గీ. యెచట వసియించు హీనులకేని, పుడమి
మరలఁబుట్టెడువెత, చందమామఘుటిక
యా ధరాధరమునుఁగాంచి యమరులెల్ల
రంజలించిరి, "నారాయణా!" యటంచు. 190

సీ. పఱపుగాఁబరచిన ఫణమండలములు, పు
ష్కరరోధిపృథుల శృంగములు గాఁగ
వైకుంఠ పద్యాన ప్రతిముహూరోమాంచ
కంచుకమ్ములు, వృక్షగణముగాఁగ
నయనాబ్జ నిత్యదానంద బాష్పమ్ము లు
చ్ఛంద స్యదస్రవఝ్ఝరులు గాఁగ
పురుషరత్న ప్రభాభరదంతురితము, మే
ఖల, రమణీయ మేఖలయుఁగాగ

గీ. దుగ్ధపాథోధి వదలిన తోయజాక్షు
పదము కదలిక, నిత్యసేవలు ఘటించు
ఖగనాయకుఁగని, సుపర్వులు శిరమ్ము
లల్లవంచిరి, వినయవైయాత్యమతులు; 191

మ. హరి!నారాయణ! వాసుదేవ! వనమాలాశోభిపీనాంస! సుం
దర శ్రీవత్స కలాప! నేత్ర యుగళీ తంతన్య మానానుకం
ప! రసాదుర్ధర దుఃఖ పాటన విధా పారీణహుంకార జ
ర్ఘరిత స్వాంతనిశాట! చాటువచనా రజ్యత్సనాది వ్రతీ! 192

చ. విలయతమిస్ర వేళ నతివేలరుషాగ్నిఁగుసుంభరాగము
గ్గలజగమెల్లనించి, యెసకమ్మన సోమకుఁ గొట్టిఁ నల్వ ప్రాఁ
బలుకులు సేర్చి, ధర్మ విభవం బెసఁగించి, పునః ప్రసన్నతా
కలితములైన నీవెడఁద కన్నులు మాకుఁబ్రసన్న మయ్యెడున్. 193

చ. అతులిత శక్తి, దేవతలు నాశరులై యమృతమ్ము ద్రావుము
ద్రతిఁ దెగబాఱి, సంద్రములు ద్రచ్చినఁ గవ్వపుఁగొండ నిల్చుసు
స్థితి దలపోసి, కామఠము దేహమొనర్చిన భవ్యమూర్తి, మా
వెతలు హృదిన్ దలంచి, కనిపించును గాఁత దృగుత్సవంబుగన్. 194

చ. అసమశరున్గటాక్షమున యగ్నికి నాహుతి సేసి, దేవతా
విసరము గారవింపఁ గడుఁ బేర్చిన దైవము, రేరిహోఋఁదే
విస్మరలీల కౌగ్గి, కనువేదుఋనన్బదఁబాతె। మోహినీ
మసృణ కటాక్షముల్, జగదమంగళముల్ హరియించుఁ గావుతన్. 195

క. అని వినుతించుచు, లక్ష్మీ
మనోహరున కనుఁగు, శివుఁడు మాఱాకుగనై
చనుదెంచు వేల్పుఁ బెద్దల
ఫణితులచే, గిరులు, దరులు, ప్రతినదియించెన్. 196

సీ. ప్రావృషేణ్యము వారివాహమ్ము దేహమ్ము
సదమల హాస చంచలల నీన
వక్షస్థలీ కౌస్తుభ ప్రభారించోళి
మఘవగోపమ్ములుమ్మడిగఁ జిమ్మ
శ్రవణాంత విశ్రాంత చక్షురుత్సవ కటా
క్షములు, కేతక పుష్పగతుల నెనయ
కనక కిరీట సంఘటిత వజ్రద్యుతుల్,
నెలకొన్న పదను వెన్నెలలఁ జిమ్మ

గీ. నార్ద్రి హృదియెల్ల ననుకంపయై, కఠోర
రాత్రిచరదుఃఖ దహన సంత్రాసితులకు
నమరులకు, సాత్వతాంక స్థితార్థపేటి
యాకృతిని గొన్న వర్షరుపట్టుఁ దోచె. 197

15)

ఉ. తోచిన, దేవతావరులు, తోయజలోచన కాంత కాంతిధా
రాచకితాక్షులై, తెలివిమాన్పడి, తత్కృపఁదేరి, యింద్రనీ
లాచల తుల్య దేహము, తదంతిక చంద్రికఁ బోలు నవ్వులై
యేచిన పుణ్యమట్లుఁ గొలువిచ్చిన శ్రీహరిఁ గాంచి కాంచుచున్. 198

గీ. కాంచెదరె గాని, విమల ముక్తాసహస్ర
ములు, దృశాశుక్తికలను నిల్పుదురె గాని,
హృదయమేమైనదో! జెప్పనెవఁడు లేదు;
ఆ ప్రమోదమ్ము, మూగదిన్నట్టి తీపి. 199

సీ. ఒక కొంత తడవున కుల్లంబు దెప్పరి
ల్లిన కాలగళుఁడు, హృద్వనజనిహిత
తారకమంత్ర నిధ్యాన రసాంభోధి,
పరమ వైష్ణవుఁడు, మేదురకటాక్ష
పుష్పమ్ములనుఁ బాదపూజ గావించి, హృ
షీకేశపాదాభిషేక జనిత
విమలగంగా సరిద్వీచీ సమీచీన
తరుణార్కరాగ బంధురజటా క

గీ. లాప మొరయంగ మ్రొక్కి, యాలాపనమ్ము
లడుగడుగునందు, భక్తి కన్యాస్వయంగ్ర
హమ్ములై, యిమ్ములగను శ్రుత్యంతములకుఁ
బలికె, సౌధాశనాధి నివారకముగ. 200

నమో భగవతే తుభ్యం వాసుదేవాయ ధీమహి
ప్రద్యుమ్నాయానిరుద్ధాయ, నమస్సంకర్షణాయచ. 201

శా. వైకుంఠమ్మునుఁబోలి యీ నగము, భావత్కాంఘ్రి విన్యాస భా
గ్యా కీర్ణంబయి, యస్మదాదులకు సేవ్యంబయ్యె, శ్రుత్యంత వీ
థ్యాకల్పంబగు నీ పదార్పణము లభ్యం బెరికో గాక, నా
కౌకశ్రేష్ఠులమైన మాకయిన దేవా! ప్రాప్యమై యుండునే? 202

చ. పొలుపగ నీ పదద్వయిముఁ బూనెడు భాగ్యమునోచికోని నా
తల, భవదీయ పాదజనితంబగు వారినిఁబూని హర్ష వి
హ్వలితము, నన్ను వైష్ణవులయందనవద్యుఁడటంౘు, మూఢధీ
కలితులు దేవతల్, భవదగాధ రహస్య విపంచితాత్ములై. 203

చ. నిను భజియించువాని నవనీతల పూజ్యునిఁజేతు సత్కృపా
వననిధి; యమ్మగా నిలచి వచ్చితివా త్రిపురంబులన్, యశో
ధనముల నాకు నెత్తితివి, తావకలీలలు దుర్విభావ్యముల్
వనజనివాసి నీ ప్రణయపారణ! భక్త కులైక తారణా ! 204

సీ. ఎవ్వారుహితులు నీ కెవ్వరు గారు! స
ర్వసముండ వీవు, విశ్వంబు నీవ
యైనప్డు, నీ కన్న నన్యమెయ్యది! సౌమ్య
ములు నీదురూపముల్, మొనయుడితర
ములచేత బాధలనలఁగెడు తఱి, వానిఁ
గాచెడు బుద్ధిఁ బ్రకాశమానుఁ
దగుటయ కాక, త్వద్భతులగు వారిపైఁ
గాని, విద్వేషంబు గలదె! నీకు !

గీ. మూఁడు ముసుగులు గల రూపములకు నవల
నమల మవబోధ రసరూపమైనవాఁడ!
భావపరిశోధితాత్మ సంప్రాప్యమూర్తి!
శ్రుతిశతాంభోజ నిర్గమద్విత తకీర్తి! 205

వ. యన్మూలకేతులైన యతులు సంసార బహిరుత్క్షేపణంబు క్షణంబునం దాచరింతురు, ప్రపన్న తాపోపశమాతపత్రంబైన నీ పాదపద్మంబునకు నమస్కారంబు; సర్వేశ్వరా! సంసరణ రూపంబైన సంసారంబునజీవులు, నిరంతర తాపత్రయోపహతులై, సుఖంబున కన్నులు సాచుటయకాని, కానరు; సవిద్యంబైన త్వత్పదచ్ఛాయ నాశ్రయించినవారు ధన్యతములు; అట్టి నీ చరణంబులు మాకేడగడయగున్గాక; నీడంబున నుదయించిన

పక్షులు, గలయంతటఁదిరిగి, క్రమ్మఱ నీడంబులన జేరినట్లు, త్వన్ముఖ పద్మ నీడంబులైన ఛందస్సుపర్ణంబులు మఱల నిన్నజేరు; వాని సాహా య్యంబున సుధీమణులు, వివిక్తంబున వెదకివెదకి, యఘమర్షోద సరిద్వ రాశ్రయంబయిన, నీయంఘ్రితలంబు సెందెదరట్టి పదయుగంబునకు సాష్టాంగంబు; శ్రద్ధావతియు, శ్రుతవతియునైన భక్తింజేసి సంమృజ్య మానంబైన హృదయంబున నిన్నవధరించి, వైరాగ్య బలంబైన జ్ఞానంబున ధీరులు గొందరు, నీ చరణసరోజ పీఠంబునందెదరు;విశ్వసర్గ స్థితిసంయమార్థంబు కృతావతారుండవైన నీ యంఘ్రితలంబు మాకు శరణంబగుగాఁత. స్వజనుల కభయంబగుగాఁత! దేవా! అంతర్యామి రూపంబున నిత్య సన్నిహితుండవయ్యును దూరగుండవు. సానుబంధంబై, యసద్వస్తువైన దేహంబుననూథంబులైన "మమాఽహ"మ్మనెడి మా దురా గ్రంబు లప్పాటివి! సత్సమాగంబున త్వత్స్వరూపజ్ఞానంబు జీవులకు లభించునంటివేని యది సముద్రలవణ భూతలామలక సమ్మేళనంబు; జీవులసద్వృత్తులైన యక్షంబులఇ బరాహ్ృతాంతర్మనస్కులు న్మత్తులు; సాత్వతులు త్వత్పదన్యాస విలాస లక్ష్మీ నిరస్తాన్య చేతస్కులైన యున్మత్తులు; వేఱు కొందరాత్మ సమాధి యోగబలంబున బలిష్ఠంబైన ప్రకృతిని నిర్జించి నిన్ను గదియంజూతు రది బాధక్లేశ సాధ్యంబు; ప్రపత్తిభావంబున నొనర్చు నీ సేవయ పరమ సుభాకరంబ; స్వామీ ! నిత్యప్రపన్నులమైన మా కాశ్రయంబుగమ్ము; 206

సీ. పరమేష్ఠి యొసఁగిన వరములఁజేసి, దు
ర్మదుఁడైన యట్టి హిరణ్య కశిపుఁ
డుచ్ఛృత్రువర్తియై, యుర్వినేకాతప
త్రంబుగా నేలుచు, ధర్మధనులు
మునుల మనస్సరంబుల, మదవారణం
బై కలంచుచుఁ ద్రిదశాధిపతి కి
రీట రత్నంబుల, దృప్తుఁడై, తన గండ
పెండారమందుఁ దాపించికొనియె

గీ. నింకఁ దక్కిన వారలనేలఁ దడవ
నీవె గమనింపకున్నచో నెవరు, వేద
చోదితంబైన ధర్మపు బాధఁదలఁచి
యోమఁగలవారు, చక్రధారీ; మురారి! 207

క. నిగమములు నీ శరీరము
నిగమంబులకైన సేఁగి నిన్నంటదా! మా
నిగణము వెట్టె యూర్పులు
దగులవా! నీశ్రవణములకు ధర్మైకరతీ! 208

క. జగములు నీలోనివి, యా
జగములకైనట్టి బాధ జలజాక్ష! సహిం
పగనేమి కారణము! కల
జగములు పొలివోవ, సృష్టి సవరించెదవే! 209

మ. అనినన్గన్నుల జేగురై, మొగమునందాస్ఫోటితాశావధి
ధ్వనిగా, హుంకృతి గందరింప, మునిబాధాదూన చేతస్కుఁడై
వనజాతాక్షుఁడు పల్కె, వానివగు దుర్వ్యాపారముల్ మాకుఁదో
పనివే! కాలము రావలెన్ తదుదర ప్రస్థంబు గోరాడఁగన్. 210

ఆ. వేద, దేవ, ధేను విప్రులయందు, స
జ్జనులయందు, ధర్మసరణులందు
నేతదవనమునకు వెలసిన నా యందు
మచ్చరంబుతోన మడియువాఁడు. 211

ఉ. సాధుగుణాశ్రయుండు, భృశశాంతుఁడు, సర్వశరీరధారులం
దాదరమున్వహించి, హితమారసి సేసెడు బుద్ధివాఁడు, ప్ర
హ్లాదుఁడు, నెల్లవెంటల మహాత్ముఁడు, వానికి మచ్చరించుఁ గ్ర
వ్యాదుఁడు, తక్షణంబ హత్యమార్చెద, లోకభయంకరంబుగన్, 212

ఆ. భక్తకుల శిరోధి, ప్రహ్లాదుఁ డసురకుఁ
బుత్రుఁడగుట, యసురబొలయు కొఱకె,
పొందు సురలు, కాలమును వేచి యుందుండు
నిఖిలమిదియుఁ బూర్వ నిశ్చితంబు; 213

క. ఏ నలిగిన, చతురాస్య ద
యానిహితములైన వరము లడ్డునె; మతో్క్ర
పానలమున మక్షికమై
తోన నశించెడును వాఁడు, తొందరలేమిటికిన్. 214

ఆ. అని వచించి, శౌరి యంతర్హితుండైన
నాధి దొఱఁగి, యమరులంజలించి,
యా హిరణ్యకశిపు హతుఁడైన వానిన
కాఁ దలంచి, హర్షకలితులైరి. 215

వ. ఇట దానవేంద్రునకుఁ బ్రహ్లాదు వెనుక మువ్వురై, నల్వురు పుత్రులైరి.
వారాహ్లాద సంహ్లాదహ్లాదులు. వారియందగ్రజుండైన ప్రహ్లాదుండు- 216

ఉ. శీల విభాసి, యింద్రియ వశీకరణ ప్రవణుండు, సత్య సం
పాలిత వృత్తి, యార్యజనపాద నమస్కరణాదరుండు, భూ
తాళిహితంబె, తద్దయును నాత్మఁ దలంచెడు వాఁడు, దీనర
క్షాలసితుండు, భక్తకుల సమ్మద శారదచంద్రుఁ డిమ్ములన్. 217

గీ. గురులయందీశ్వరుని బుద్ధి గూర్చువాఁడు
వినఁబడిన, చూడఁబడినట్టి గుణములంద
వస్తుబుద్ధిని, హృదయ మేర్పడని వాఁడు
నసురకులమున కాశ్చర్యమైనవాఁడు. 218

క. వ్యసనముల యందు లేశము
విసుగుఁ గొనఁడు, నిస్పృహత్వ విలసితుఁడై, కా
మ సమాగమ దూరగుఁ డా
త్మ సమములను బుద్ధి, భూతతతి మన్నించున్. 219

సీ. వితత జన్మైశ్వర్యశ్రుత భాగ్యములవేధ
మానమౌ మదముచే మఱపుగొనఁడు
దాంతేంద్రియ ప్రాణతను బుద్ధియౌచు, నే
వికృతికిఁ గిసంత వెరవుగాఁడు
తను మచ్చరించువారినిఁగూర్చి, దయదప్ప
నితర భావమ్మున కెడమొసఁగఁడు
తన కెంత బాధయుండిన, నన్యదుఃఖమ్ము
బోకార్పనే మనమ్మునఁదలంచు.

ఆ. నఖిల సద్గుణముల కాశ్రయుండై, వానిఁ
బాయకుండునట్టి పరునిఁబోలె
నఖిల సద్గుణముల కాలవాలంబుగా
నైనవాఁడు నిర్జదారిసుతుఁడు! 220

మ. దితి సంతాన దురాగత ప్రణిత హృద్దీకుల్, ఉశాధీశదే
వతలున్గూడ, నిశాటరాజసుత భాస్వచ్ఛీల సంపన్నతల్
స్తుతియింపన్ దొరకొంద్రు హస్తయుగళీ శుంభన్మణీవల్లకి
శ్రుతిసంచారిత రాగబంధముల, పెచ్చుల్గ్రమ్మ ముద్బాష్పముల్. 221

గీ. సకల లోకేశునందు నైసర్గికమ్ము
వాని రతిఁజూచి, సర్వ దేవతలు, దైత్య
రాజసుతుపాదయుగళి నేత్రమ్ములందు
నిల్పికొని తమకమున ధ్యానించుచుంద్రు. 222

సీ. క్రీడనకంబులఁ గ్రీడించు బాల్యంబు
నంద, శ్రీవాసుదేవార్పితంబు
బుద్ధిమై, జడుఁడైన పోలిక వర్తించు,
నఖిల శబ్దముల ముఖ్యార్థమొకర్కొ

'నారాయణా!' యను నామంబెయ్యైనట్టు
　　లేది ప్రశ్నించిన నెనసి, పరుని
యీశుని యభిధానమే ప్రతివచనమ్ము
　　గాఁగనై, యున్మనస్కతను మెలఁగు

ఆ. కృష్ణుఁ డనుగ్రహమ్ము హృదయమ్ములో గొన్న
జగమె మఱచెఁ గడల సంచరించు
ప్రాణిజాతమెల్ల భగవంతు దేహంబు
కన్న భిన్న మనుటె కలగఁదోచి. 223

సీ. ఆసీనుఁడై మాధవా! యంచు వాక్రుచ్చుఁ
　　దిరుగుచు సంసార తరణి! యనును
గుడుచుచు శ్రుతిసతీ గోచారయను, పరుం
　　డిన యప్డు కేశవా! యని వచించు
జలములు ద్రావుచో జలజాక్ష! యనుఁ, బల్కు-
　　చో, భక్తకుల మనచ్చోర! యనును
ఆడుచో, హరి! కూడియాడవే! యనుచు నా
　　త్రిలి చీఱు, సంగాతిఁ బిలిచినట్లు

గీ. హరి పరీరంభ వివశుఁడై యాత్మ దేహ
మమల వనమాలికా వాసనాశ్రితంబు
గాఁగ, నసురుల నాశ్చర్య కలితమాన
సులఁగనొనరించు, నైశాటకుల శిరోధి. 224

శా. ఆడున్ జేతులు దట్టికొంచు గత లజ్జాసంగుఁడై భక్తిమై
బాడున్ గన్నులు మోదతుందిలములై వైకుంఠ సత్కీర్తి, త
ట్టాడన్ నవ్వులు, పిల్చు శ్రీధవుని రారా! యంచు, సొలోన గో
డాడున్, శ్రీహరి దాటిపోయినటు, లోకాతీత భావంబులన్. 225

సీ. వైకుంఠ చింతాకబలచేతనుఁ దౌచు
నేకాంతమును జేరి, యేడ్చు నొకట;
తద్భావ పీయూష తర్పితచిత్తుఁడై
మవ్వంపు వెన్నెలల్ నవ్వునొకట
సకల భూతవ్రాత సమ్మదాపాదిగా
నిర్వేల రీతి గానించు నొకటి
తన్మయంబైన వర్తన, తద్విలాసచే
ష్టాభంగి కనుకృతి సలుపునొకట

ఆ. హరియుఁ దన్నుఁ దాకినట్టులై పులకలు
పఱపులౌచు, కళలు బఱపునొకట
పరమ యోగివరులు భక్తి యిట్టిదె! యంచు
నచ్చెరువునఁ జిక్కి యంజలింప. 226

చ. క్వణితమొనర్పఁ బాదకటకంబులు, వాతెఱనవ్వుటీరిక
ల్పైనఁగొన, యోగిచిత్తశబలీకరణంబులగన్నులై, జగ
జ్జనకుఁడు వచ్చినట్లయిన, చక్షువులందనురాగ బాష్పము
ల్దొనఁక, సమాధినిశ్చలుఁడు, లీనమనస్సకలేంద్రియుండుగన్. 227

గీ. ఎవరిఁజూచిన 'హరిఁజూపుదే!' యటంచు
వెంటఁబడు, 'నీవె హరి' యంచు వేడికొనును,
తజ్జనంబులు, తద్భక్తిధారలొత్తి
క్షణము, తారు, దివ్యానందమనుభవింప. 228

సీ. ఆహ్లాదమున నారదాది భక్తుల వీణి
యలు, మమ్మరంబుగాఁ బలికినట్లు;
వైకుంఠనాథుని వైజయంతీ వాస
నాఝురుల్ పొంగివెన్నడినయట్లు

వేదాత్మకుండగు విహగేశ్వరుని పక్ష
మూల గాలి, పైపైనిఁబొలసినట్లు
హరిపాదములనొత్తు నబ్ధిజాకరకంక
ణమ్ముల రవళులు గ్రమ్మినట్టు

గీ. లాత్మయెల్లను వైకుంఠమై, శరీర
మప్పళించు బ్రహ్మానందమై, త్రిదశుల
యంబకములకుఁ బట్టరానట్టి కాంతి
నలరు, సురవైరిసుతుఁడు, బ్రహ్మర్షినుతుఁడు: 229

శా. ఆ వార్తల్ చెవిసోకి, హేమకశిపుండత్యంతముద్వేగమై
శ్రీవత్సాంకితదివ్యపాదయుగళీచింతా పరిష్కారు, ధై
ర్యావిష్కారు, విరక్తహీరు, వినయవ్యాహారు, ప్రహ్లాదు, ప్రే
మావేశస్పృహణీయ హాసముగ బాహాశ్లేష మందించుచున్. 230

ఉ. చీరి, కళల్దొలంకు నునుఁజెక్కిలి ముద్దిడి, ప్రాతరబ్జశ్రృం
గారము నీరసంపఱచు కన్నులలోనికిఁజూచి, తాను దౌ
వారికుఁడై, తద్విత్తులిత వాసుఁడొకండు తదంతరంబున
న్దిరినయట్లుదోచి, తృటి, నెమ్మదినంటిన సత్వలేశమై. 231

మ. ఒక లోకంబురు దీప్తిమంత, మచటన్నొప్పారు నానందనా
మకమౌ సౌధము, దానిలో నిగమమర్మంబైన దాంపత్య, మ
త్తుకొనన్ చిత్తము భక్తితోఁగొలుచుద్వార్థ్సం డింతలో, మౌనిదా
రకు, లారాక్షసరాజుచిత్తము వివర్తంబయ్యె వేఖంగులన్. 232

వ. అనిన శౌనకాది మహామునులాశ్చర్య రసచుళుకితులై, దనయన్నంజంపిన యాదిదైవంబునకుఁ గ్రోధంబువట్టిన యసురేంద్రుండు, తనయునిన్ద్రాకి నంతఁబరిప్లవమానసుండగుటయు, వానికి వాసుదేవాది దర్శనంబగుటయు నెట్లనిన, సూతుండిట్లనియె: 233

సీ. వాసుదేవుని పాదపద్మముల్దక్క, న
న్యవిషయంబులఁ జిత్తమద్దు వెట్టి
భక్తి సాధించు నవ్వాని హృద్గుహ యందు
వైకుంఠుఁడెపుడు నివాసముండు,
నుండి యభద్రంబులున్మూలన మొనర్చ
సత్వగుణంబు పోషణ మొనర్చు
సత్వసంవృద్ధితో, శారీరకములైన
యక్షముల్, దేవభూయమ్మునందు

గీ. వారి సంస్పర్శ, వారి దృక్పాత, మెదిరి
హృదయముల సాత్వికము వృత్తి నెలయఁ జేయు
భక్తిసాధన విధమిది, పరమ భక్త
శేఖరుండైన ప్రహ్లాదుఁ జెప్పవలెనె ! 234

వ. అదియున్గాక, హిరణ్య పూర్వద్వయ జననంబులును విప్రశాపంబుననైనవి. వారంతస్సత్వులు; బహిః క్రుద్ధులు. వారి కసురావేశంబు; ఇట్టిదులు బలిచక్రవర్త్యాదులు మఱికొందరు ప్రథితులు. శంబరాదు లితరులు భయతస్తామసులు. వారికి స్వరూప మనస్సునను, జడమనస్సునను గ్రోధంబు యావిష్టంబు. వారంధంతమోయోగ్యులు; హిరణ్యాక్ష హిరణ్యకశిపులు హరిపార్షదులైన జయవిజయులనిన, శౌనకాది మునిగణంబు వారల జన్మ వృత్తంబు వినవలతుమనిన సూతుం డిట్లనియె; 235

సీ. శబ్దగోచరుఁడు, రజస్సక్తి లేని వి
శుద్ధసత్వమ, తనూశోభయైన
యాద్యుండు పురుషుఁ డభ్యర్థితంబులు శక్తు
లౌదలఁ జేమోడ్పు లైభజింప
వసియించు నెచట, కైవల్యంబు రూపంబు
గన్నట్లు కామదుఘంబులైన
తరువుల, యోగ పద్యశ్రీక సర్వర్తు
తంతన్యమానభాస్తతులు గల్గి

గీ. యలరు, నైశ్రేయసాభిఖ్యమైన కాన
నంబెచట, ననిమిత్త ధర్మంబుతోడ
హరినుపాసించినట్టి సత్పురుషులున్న
చోటు, వైకుంఠపురము తేజోమయమ్ము.

క. సకల నమస్కృతమిది, ఋషి
సకలాశా లక్ష్యమిది, దిశాపతి బృందా
రక దుర్వీ ఖావ్యమిట, వే
దకలాప్రాంత సూచి తమ్మగుపదమున్. 287

గీ. పొలుచుచుందురు వైకుంఠ మూర్తులచట
నింద్రపదవిఁ దృణంబుగా నెంచువారు
దేహమెల్లను, పరవాసుదేవ మంత్ర
మననమున, తన్మయంబకా, మనెదువారు. 288

చ. అతులమణీ విభాసితములైన విమానములందు, కామినీ
తతులనుఁ గూడి, దేహిభవతాపనివారక శౌరి సద్యశ
స్స్తుతుల నొనర్చుచుందు, రనసూయులు, ముక్తులు, భక్తి తత్వ స
న్నతులు, విశుద్ధ మానసు, లనాదృత మన్మథ విక్రమక్రముల్. 289

సీ. జ్ఞాన పూర్వక భక్తి సర్వేశు సేవించి,
యఖిలాఽతిశయ ముక్తి నందియును, ప
రాత్పరు సేవానురాగంబు మదులందుఁ
గ్రందు కొనంగ, నిష్కలుషమతులు
హర్యనుకంప, హంసాది తిర్యగ్దేహ
ములుగొని, యాతనిఁ గొలుచుచుంద్రు
గొందరు, మందార కుందాది దేహముల్
దాల్చి, కైంకర్య విధాస్పృహాతి

గీ. శయులు, పరవాసుదేవుండు శయకుశేశ
యములఁ దులసిని గ్రహియింప, నతులమైన
తత్తపంబును మెచ్చుదే దప్పు, యన్య
భావలేశంబు నంటని పరమఋషులు; 240

మ. హృదయంబెల్లను వాసుదేవ మయమై, యేపారు హర్షాంబుశో
భదముల్, నేత్ర సరోరుహంబులగు తద్భక్తావళీ చిత్తముల్
గదుపంజాలవు, దేవయౌవత సుధాలాపస్మితజ్యోత్స్నలు, లు
న్మద లావణ్య సరస్సదృక్ష జఘనంబుల్, నేత్రతారళ్యముల్! 241

శా. ఏ సేవన్ దలపోయునో విభుఁడటంచే ప్రొద్దు, తద్వక్త్రవీ
క్షాసర్వాశయయౌచు, పాదయుగ సంవాహంబు గావించు మాణిక్యకు
ద్యాసక్తిన్ దనరూప పెక్కులుగనై, యబ్జాక్షి, దుగ్ధాబ్ధి వీ
చీసాచివ్య కరద్వయంబులను లక్ష్మిదేవి, యుత్ఫుల్లయై; 242

మధ్యాక్కర : ఆ సురులకైనను బొంద నర్హంబులమరాదిలోక
విసరముల్, గాని దుర్విషయ వివశీ కృతేంద్రియులౌచు
నసమతపంబులు సల్పనైనను, భక్తిఁ బోవిడిచి
విషమమ్ము, వైకుంఠలోక, విభవమ్ము దరిసింపనైన 243

వ. సహధర్మంబుగా, తత్వ విషయంబైన జ్ఞానంబు బొందఁజాలిరియై, సకలాభ్యర్థితంబైన నృజన్మంబునందియు, భగవన్మాయామోహితులై, పరావరు నారాధింపని వారంధంతమస్సున కేగెదరు. స్పృహణీయ శీలురు, దేవ వృషభాఽనువృత్తిఁజేసి దూరయములు, విష్ణుయశః కథా నానురాగవైక్లబ్య బాష్పకళఁజేసి పులకీకృతాంగులైన నరులు, సత్య లోకంబున కూర్ధ్వంబైన వికుంఠంబునందుందురని సూతుండిట్లనియె, విగతస్పృహులు, బ్రహ్మ మానసపుత్రులునైన, సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతులు, యాదృచ్ఛికంబుగా వైకుంఠంబుసేరి; 244

ఉ. వారి తపోమహత్త్వమున వారితులై, గత చేష్టలౌచు దౌ
వారికులుండ, యోగబలబంధుర విశ్వజనీనపాద సం
చారములన్, విహంగరథుసద్మముఁ బూతమొనర్చికొంచు, వి
స్ఫారవిలోచనుల్, మునులువచ్చిరి, సప్తమకక్ష్యచెంతకున్. 245

చ. తటిసిన, వారిముందట గదా కలితోరుభుజుల్, పరార్థ్యర
త్నరుచిరకుండలుల్, దివసనాథసతీర్థ్యకిరీటు, లంగద
స్ఫురితభుజాచతుష్కులు, వపుర్విలసద్భహు చిత్రమాల్యమా
సర నవ గంధ సమ్మిళితషట్పదఝుంకృతి వల్లకీరుతుల్ 246

క. ఇరువురు పురుషులు, హరిమణి
పరిభావి శరీరకాంతి పరిణాహులు, దో
చిరి, వారి మునులు గమనిం
పర, హరిపరరూపనిబిడ పరవశదృశులై. 247

గీ. వారు జయ విజయులు, భగవంతుఁడైన
హరికిఁ బ్రతిహారు, లవ్వారియత్నులందుఁ
బొలుచుఁ గించిద్రుషారేఖ, పూర్వమేమి
జరగెనోగాని, రభసవిక్షతులు వారు 248

క. అవిహతగతులే పట్టున
నవిషయు, లపగతవిశంకులాదిమునులు, వా
రి విలోకింపక, యడుగక
జవజవఁజనుచున్న, వారిసరణిన్ గనుచున్ 249

సీ. అవ్వాతరశనుల, నవగతతత్త్వల
నతదర్శనులను, దశార్ధమైన
వయసునఁగనుపించు పరమవృద్ధుల, వారి
తేజంబవగణించి, తీవరమున

నల్వుర వేత్రదండంబుల వారించి
రుభయులు, భగవంతుఁడొప్పుకున్న
శీలంబునై, వారిచేష్టుడిగింప నె
వ్వరుఁబూనరైరి తత్పార్శ్వచరులు

గీ. సర్వజన సమక్షంబున, స్వర్ణతములు,
ఆత్మతమ దిదృక్షకుఁ గడు నంతరాయ
మేగుదెంచి, నేత్రముల మనాగుదీయ
మానకోపులు, పలికి రమ్మౌనివరులు; 250

మధ్యాక్కర: ఎన్ని కల్పంబులో దపము, లెవ్వరుఁ జేయనిభంగి
మన్నన గావించి శౌరిమందిరవాసంబె గాక
యున్నతి, దౌవారికులుగ నుండెడి భాగ్యంబుగలిగి
చెన్నటి యీ భేదబుద్ధిసేయుట పాడియే మీకు ! 251

మధ్యాక్కర: "ఎవడైన ద్రోహంబొనర్ప, నెంచి యేతెంచునో యంచు
నవహితులముగాఁగ నుండనయ్యెఁబో" యందురో ! యేమొ
ప్రవిమలమతిగాని యట్టివాఁడిందు జొరఁగనర్హుండె !
సవిమర్శముగఁజూడశౌరి సదనంబు సర్వలభ్యంబె ! 252

సీ. అరయఘటాకాశమందు, మహానభం
బునుబోలె, సర్వజీవుల హృదంత
రముల, నంతర్యామి రమియించు విజ్ఞాన
జృంభితుండై, యని యెదఁదలంతు
రాత్మవేత్తలు, ధీరు, లట్టి వానికి భయం
బెక్కడి యది! బుద్ధిహీనులగుచు
వైకుంఠవాసికిఁ బరగు నంతర్యామి
కిని భేదబుద్ధి దర్శించుకతన

గీ. మూఁడు జన్మంబు లసురులై పొందు, పాప
ఫలముగా, హరివైన రూపమ్ములకును
గుణములకు నవయవములకున్ క్రియలకు
భేదమెంచుట, తామసవృత్తి గాదె ! 253

వ. అని ఘోరంబుగ శపియించిన, నస్త్రపూగంబుల, ననివారణంబగు బ్రహ్మ దండంబు నాలకించి భయకంపమానులై, సనకాదుల పదంబులు గ్రహియించి, యల్ప దోషంబునకు ఘోర దండం బొసంగితిరి. మీ శాపంబు, మే మింతకు మున్నొనర్చిన లక్ష్మీ బ్రహ్మాది తిరస్కారంబులకును నిష్కృతి యగునంతటిది. అగున్గాక, యొక్కటి మీరు గృప సేయ వలయు. మే మధోలోకమ్ముల నసుర దేహంబు లందినను గాలాత్యయంబున, భగవద్యథార్థస్మరణ వినాశియైన యజ్ఞానమ్ము మమ్మావహింపకుండున్గాతయని ప్రార్థించుచున్నంత– 254

క. సనకాదుల యెడ నాశ్రిత
జనకృత దోషంబు నెఱిఁగి, సహదేవిగ వ
చ్చె, నియతమునివిసరాన్వే
షణీయచరణుండు, భువనపతి యచ్చటికిన్. 255

సీ. బహుకాలసాధిత స్వసమాధిగమ్యమ్ము
లైన శ్రీపాదమ్ములమరువాని
హంసాఽవదాతమ్ములైన సవిరుల సో
కుల, నల్లగదలు ముంగురుల వాని
స్వానుగ్రహము రూపమైనట్టులున్న సి
తచ్ఛత్రకాంతి సంతతులవాని
తన రాకలోన, సత్త్వము సర్వ హృదయమ్ము
లందుఁ దామరతంపరైనవాని

గీ. పార్శ్వ చరగణ ప్రతిహృతౌపయికు, కృత్స్న
కరుణచే నిండియున్న మొగమ్మువాని
వేయి చంద్రులకా, స్పృహణీయధాము
నాదిదేవుని దరిసించి రాదిమునులు 256

ఉ. స్నేహ పరీత దృగ్వితతిసేచన గల్గిన వార్షుకాభ్రవా
ర్వాహముఁ బోనివాని, రుచిరంబగు ధాత్రు మయాత్మ కౌస్తుభ
శ్రీ హవణిల్లు పేరురము చిన్నెలవాని, త్రయీ సుహాసినీ
మోహన మంజులోష్ఠపుట పుష్పితకైతక చారుహాసునిన్. 257

సీ. ఒకచేయి గరుడిపై నూది, వేఱొకట న
బ్జంబు ద్రిప్పుచు నున్నవాని, పీత
మంశుకంబై, నితంబాధిశ్రితము, కాంచి
యై, భృంగ పార్వణంబైన వైజ
యంతితో, మణి కాంతిమంతమౌ మకుటమ్ము
తో, గండతల దీప్తితోడ బెరసి
యామ్రేడితద్యుతులైన కుండలముల
కల్గు ప్రకోష్ఠ రుగ్వలయములను

ఆ. గూడియున్న వాని, గుణముల కవ్వలి
వాని, "తన్నెఱుంగు వార" మంచుఁ
బలుకు కుహకములకుఁ బట్టనివాని, న
య్యంబుజాక్షుఁ గాంచి రాదిమునులు; 258

ఉ. ఏ విభు పాదపద్మముల నెన్నఁడుఁ బాయని భాగ్యమున్న శ్రీ
దేవియు, యన్మహత్వ మవధిన్గన నేరదొ! యట్టి స్వామి, స
ద్భావము తోడఁ దానెదురు వచ్చిన, మౌనులు, శర్మవార్ధి సం
ప్లావితు, లక్షిపాత్రములఁ బానమొనర్చిరి రూపమాధురిన్. 259

సీ. పరమవైరాగ్య విష్టరసంస్థితులు, గుణ
సంగంబులేక, యక్షరు భజించు
చును, సదానందవార్ధి నిమగ్నులైన, స
నాదులఁ గూడ, నబ్జాక్షు పాద
పద్మ కింజల్క సంపన్మిశ్రతులసీ మ
రందవాయువు, ఘ్రాణరంధ్రగతము
వారి చిత్తమ్ముల, వారి దేహమ్ముల
సంక్షుబ్ధము లొనర్చె, చరణయుగము

గీ. మొదలు, ముఖమండలముదాక, ముత్ప్రవాహ
మెక్క వీక్షించి, బహిర బహిః ప్రపూర్ణ
మొక ప్రతీకమై, నిధ్యాన మూని, రథుల
భృశతపశ్శక్తి నజిత సేవితులు మునులు; 260

ఉ. పారమహంస్య మార్గమునుబట్టిన ధన్యులు, యత్స్వరూపమున్
జేరిచి యాత్మలందు నతసీసమవర్ణము, లోకతంత్ర ని
స్సారణశూరులో! యదిదృశాపథిఁ దోచిన, మౌని హృన్మృదా
సారముతోరమై, వెలికిజాతె, వచోవిభవాఽభిరామమై. 261

చ. అఖిల గుహాశయుండవగు, దైనను దుర్జనదృష్టి కందవ
ట్టిఖలులు, పాపపుంజవికటీకృతచిత్తులు వోదు రంతకో
న్ముఖులయి, నీ పదాబ్జములు ముట్టిన చిత్తమువారు, జన్మక
ర్మకలుషదూరులొందెదరు మాధవ ! శాశ్వతముక్తి సౌఖ్యమున్; 262

శా. నీ నాభీ కమలంబునం దొదవి నిన్సేవించు సృష్ట్యధ్వరా
నూన ప్రాభవుఁడైన మజ్జనకుఁడీయోజన్ భవట్యగ్రహా
ఖ్యానంబున్ బొనరించె, నట్లుగనె, సాక్షాత్కారమున్జేసితీ
వై, నీసత్కరుణా విశేషమనవద్యంబచ్చు సంవిన్మయా ! 263

శా. నిన్నుద్గ్రంథులు భక్తి యోగరతులై, నిష్పన్ హృదబ్జంబులుం
దున్నిల్పూనుచు, నీదుతత్త్వమును, నేర్తుర్ లెస్స గుర్తింప, నా
పన్నానీకశరణ్య! భక్తులకునై బాటింతు దేహంబవి
చ్ఛిన్నప్రాభవ! నీదులీలలు జగత్క్షేమంకరాకారముల్. 264

ఉ. తావకసత్కథామృతము ద్రావి రమించెదువారు, ముక్తికై
ధావతిగొందురే! దివిజధామమునైన, తదీయతుచ్ఛసౌ
ఖ్యావహ జీవితంబయిన నాసయొనర్తురె! భక్తి భావనా
భావితచిత్త వృత్తికివి వచ్చునెసాటి, యపీచ్య దర్శనా! 265

సీ. నీ గుణశ్రవణంబు నిండించికొని; కర్ణ
ములు, భృశహర్షంబు బొందెనేని
తులసి పోలిక వచస్సులు, భవదీయశ్రీ
పాదంబులక యాసపడునయేని
చిత్తంబు నీపాదసేవధి విడక, లో
లుప మౌచు, నందదొర్లునదియేని
జీవుండు, తావకాస్మేరచంద్రికలకు
నాస్థ, జీవంజీవమయ్యెనేని

గీ. నిరయమైనను సరియ, నిన్మఱచునట్టి
జ్ఞానమైనను మాకుఁదుచ్ఛమ్ము, విధి ని
షేధవిరహితభక్తి సంశ్రిత! భవాబ్ధి
తరణి! యజ్ఞానమోహవిధ్వంసతరణి! 266

ఉ. ఓ పురుహూత! నిన్గనుచు నుల్లము దృప్తి వహించె, దేవదే
వా! పరవాసుదేవ! యిటు లాదృతిమాకుఁబ్రసన్నుఁడైతి, నీ
కీపరమాణువుల్ చదురులే! దగు పూజలొనర్ప, బాష్పధా
రాపరితఃపరీత, మనురాగవృతంబగు మ్రొక్కు దక్కఁగన్." 267

గీ. అని నుతించెడి పరమయోగాఢ్యులైన
వారిపలుకులఁ జిత్తంబు పల్లవించి
సంయమీంద్ర చతుష్టారమ్యసన్నిధానుఁ
డజితుఁడమృతాయమాన వాక్యముల ననియె; 268

గీ. నను కదర్థీకరించి, సన్మాన్యులైన
మిమ్మలఁతిగాఁగఁ జూచుట మివుల దొసఁగు
త్వత్కృతంబగు శిక్ష, మద్వాంఛితంబె
భక్తులగు మీరు మా కనువ్రతులుగాన; 269

క. భృత్యకృతంబగు పాపం
బత్యంతము వారి నేలు నధిపతిఁ జెందున్
సత్యము గావున, నా యప
కృత్యము మన్నింపవలయుఁ గృపసేకొనుచున్. 270

గీ. ఎవని భృత్యులు గావింతు రేనములను
నరయఁదచ్స్వామిఁ జెందు నయ్యపయశంబు
నదియ, తత్కీర్తిఁ జెఱచు భయంకరమ్మ
త్వక్కుఁ జెఱచెడునట్లు శ్విత్రమ్ము గ్రమ్మి. 271

శా. ఈ వైకుంఠము, లీమహత్త్వములు, నీ పేరాశలక్ష్మీ కటా
క్షావిష్కారము, త్వత్పదార్హణనమస్యాప్రాప్తఁ మీ, మీకు మ
ద్భావారాధ్యులకే దొసంగయినఁ జేయన్ సాహసంబూనుచో
నావర్చస్కభుజంబునైన నసిఛిన్నక్షిప్తమున్ జేయనే! 272

సీ. త్వాదృశపాదసేవాలబ్ధి, మీపోల్కి
నొదవిన వైరాగ్యయుతుఁడ నేను
త్వన్నమస్యా గౌరవోన్నతిలోనె, మ
న్నామంబు పాపభిదామహంబు

బ్రహ్మాది సకలదేవతలు, యత్ప్రేక్షాల
వార్థంబు, రేవగ లటమటింతు
రట్టి శ్రీదేవి, మదంకంబు విడదు, మీ
పాదసంవాహన భాగ్యగరిమ

గీ. సద్వరములందు, చోత్రద్రుతాత్మకమ్ము
హుతము గుడువను, మీరు సమ్మతముతోడఁ
దినెదు, ప్రతికబళమ్ముచేఁ దృప్తిగొందుఁ
బరమమునులార! తత్వరూపమ్ములార! 273

ఉ. ఎవ్వని పాదపాంసుజలమిందుకిరీటుఁడుదాల్చు, లోకమం
దెవ్వనినామకీర్తన వహించు యశమ్ము పరాస్తపాపమం
చవ్వనజాక్షుఁడెవ్వరికినై దలవంచు! సమస్త భద్రముల్
ద్రవ్వెదు మీపదంబులకు; తాపసులార! నిజంబు వల్కెదన్. 274

వ. అనుచు వినయంబులాడెడు భగవంతునకుఁ గృతప్రణాములై బ్రహ్మర్షులు “నీ చికీర్షితంబెఱుంగము. మా శాపంబు నీకు సమ్మతంబందువు. శాపం బనుగ్రహంబందువు. గుణాతీతంబులైన మా మానసంబులు గుణక్షోభంబం దుట చిత్రంబయ్యెడి, నీ విడంబనంబేల” యనిన వాసుదేవుండు “వీరు సురే తరగతినంది, సంరంభసంభృత సమాధ్యనుబద్ధ యోగులై మరల మత్స కాశంబందెదరు. ఇదియెల్ల నాచేతన విహితంబు. నిర్విచారులు గండని” యానతిచ్చిన— 274

క. మునులు, నయనపర్వంబగు
వనజాంబకు విగ్రహంబు వలగొని, హర్షం
బునఁ బులకలెయిదికొనఁ బో
యిన దౌవారికులతోడ, నిందీశుఁడనెన్. 276

సీ. భద్రంబగున్గాఁత ! భయపడకుండు, స
మర్థుండనైన, బ్రాహ్మ్యంబు తేజ
మును ధిక్కరింపఁబూనను, వారు మత్తనూ
రూపంబులగుట, నీశాపమిపుడ

గాదితఃపూర్వంబ గలదు నామది, నేను
యోగనిద్రారతి నున్నయపుడు
శ్రీదేవి వచ్చి, వారితయయ్యె మీచేత
మరియొక్క యెడల బ్రహ్మయునుఁగూడ

గీ. త్రివిధదోషంబులిపుడు మూర్తీభవించెఁ
దీంద్రగాఁగ, త్రిజన్మపాథేయమగుచు
పొందు, మీవలెనే హరిపురముగూడ,
తడవు, మీతోడి యెడబాటుఁ దాళలేదు. 277

క. అని మొదలయిడిన, వారలు
పనవుచు, వనజేక్షణునకుఁ బ్రణుతియిడిన యం
తనఁబడిరి, వికుంఠము నుం
డి, నికుంఠితరుచులు, మదులు డిందుపడంగన్. 278

గీ. వారు, కాశ్యపతేజముల్బ్రణముజెంది
దితియుదరమందుఁ జేరి యుదీర్ణతేజు
లగ్రగజుండు హిరణ్యాక్షుఁడయ్యె, తమ్ముఁ
డయ్యె, హాటకకశిపుఁడన్నసురవరుఁడు. 279

వ. ఇది వారల జన్మవృత్తంబిఁకఁ బ్రధాన కథ వినుండని సూతుండిట్లనియె;
280

సీ. అసురేశ్వరుండు శుక్రాచార్యుఁడాత్మవం
శములకు గురుఁడౌట, సమయమునకు
నతఁడు, కార్యాంతర వ్యాసక్తుఁడగుట, త
త్సూనులధ్యాపక శూరులగుట
దలపోసి, వినయ సాదరముగా, వారిఁ జం
డామర్కులను సన్నిధానమునకుఁ
బ్రార్థించి పలికె "యెవ్వరు నేర్పిరో! వీని
కసురాంతకుని యశోఽధ్యయన సరణి

గీ. నవశిరీషమ్ములనుఁ బోలె నవకములకు
నిలయమైనట్టి వీని బుగ్గలు, విరోధి
యశము గీర్తించి కలుషిత మైనయవియు
గరళ సమ్మిశ్రితమ్మౌ దుగ్ధమ్ము వోలె. 281

క. మదసామజ భృశచింతా
స్పదమై, దరికొన్నకూట పాకలమటు, నా
మది నేర్చుచున్నదీ వ్యథ
సదయతఁ దొలగింపవలయుఁ జాతుర్యమునన్. 282

వ. అని యొప్పించిన వారు గొనిపోయి, తక్కిన యంతేవాసులతోడఁ ద్రివర్గంబు నేర్పిరి, స్వపరాఽసద్గ్రహాశ్రయంబులైన వారి కఱపులు, వాని యందు నీటివ్రాతలయ్యెను, వానినతండు గీరభాషలంబలె పఠించె, నిట్లు గొన్నిదినంబులు గడచనిన హిరణ్యకశిపుండు, ప్రహ్లాదు భావభంగి నరయఁ గోరి సన్నిధికి రావించి; 283

గీ. అంకమును జేర్చి, యలకల నప్పళించి,
కనులు ప్రేమాభిరామంబుగాఁ గపోల
ములనుఁ బుడుకుచు "నీమది కెలమి నించు
నొక్క సూక్తంబుఁ బఠియింపవోయి !" యనియె; 284

వ. అంతఁ బ్రహ్లాదుం డిట్లనియె; 285

సీ. వినవయ్య సురరాజవేలాఽతిగాఽప్రతి
మాన శౌర్యోద్రేక ! మహిని జనులు
శస్యంబుగాని యసద్గ్రహంబున, సము
ద్విగ్నంబులైనట్టి దీవిచార
ములచేత మివుల సమ్మోహితులై, గర్త
ములఁ బోలు సంసారములనుఁ బడి, య
భద్రమందెద, రాత్మపాతంబుగాక, సం
సారమ్ము లందుఁ బ్రశస్తి గలదె?

గీ. తెలివిగలవాఁడు, మోహంబు దలఁగి, విపిన
వీథిని సమాశ్రయించి, వివిక్త సేవి
యగుచు, వైకుంఠ చరణ సమర్పణమున
జనన మరణంబులకుఁ దప్పి చనుట నీతి; 286

గీ. అనిన నా హేమకశిపుఁ డాస్యంబు జేవు
రించి, యంతన ప్రేమ విపంచి మోసి
యల్లనన్నగి, యెవ్వరో! హరినిఁ బలికి
యిట్లు శైశవహృది హరియించినారు; 287

క. అవహితులై, తగుతెఱఁగులఁ
దివిరి శిశువు మనసుఁ జక్కఁ దీర్పుఁడు, పొందం
చు వినయమును చింతయు, సరి
గవిసిన మది, గురుల దైత్యకాంతుండనిపెన్. 288

ఆ. వారు గేహములకు వచ్చి, ప్రహ్లాదునిఁ
బుచ్చితోక్తి భంగి బుజ్జగించి
యెవరు వల్కిరయ్యె యిట్టి మాటలు నీకు
నేము గఱపనట్టి ధీవిధమ్ము ! 289

క. ఎవరో ! చెప్పించిన యటు
లవకేశిగ మా ప్రయాసమట్లు వలికి, దై
త్యవిభుని కథ, మాకున్ గౌ
రవ మార్చితి, విట్టి యవకరంబులు సనునే ! 290

వ. అనిన ప్రహ్లాదుండీషదంకురిత మధురస్మితసుధాస్నపిత కపోలంబుగా
నిట్లనియె- 291

సీ. "నవ వసంతము వచ్చినది" యంచు నెవరైన
నటవీస్థలికి వార్త లంపవలెనా !
"దినకరుండదె ! దోచె వినుపీథి, వికసింపు"
మని తామరనుఁ బరులడుగ వలెనా !

తోయదంబునకు, విద్యుద్వల్లికకు రాగ
భరమితరులు వచ్చి కఱప వలెనా !
యినుఁగునకునుఁ దల్లి యెడఁదలో నాదిగిపో
యెదురీతి, లాతులు నుడువవలెనా !

గీ. జీవికిని విష్ణురతి స్వతస్సిద్ధ, మతఁడు
మూలతస్సంవిదానందమూర్తి గాన,
నడుమఁజేరు నవిద్యలోఁబడి, యథార్థ
మును మఱచి, సంసృతిని మూరిబోవుఁగాని; 292

క. కావున, నా కెవ్వరి బో
ధావగతియులేదు, నైజమైనది నాకీ
శ్రీవిష్ణుభక్తి, యెవ్వరి
యావర్జన మేల! జీవి యాత్మస్థితికిన్. 293

గీ. పరులు దారను భిన్న భావంబు లెవని
మాయచే నగు, దాన నమర్త్యులైన
మోహితులుగాఁగ, సంసారముల నశింతు
రట్టి మాయేశ్వరునకు సాష్టాంగశతము. 294

మ. అనుకూలుండగు నెప్డు మాధవుఁడు దా, నవ్యాజకారుణ్యజీ
వనుఁ, డా కాష్ఠమునంద, నైకజనన ప్రాప్తంబు, దుఃఖైకకా
రణమౌ మాయ దొలంగు, తోనఁజను దుర్లంఘ్యంబు, 'నే' 'వాఁడు' నాఁ
జను, మిథ్యాశ్రయబుద్ధి, సర్వమును భాస్వచ్చిత్కళారూపమై. 295

మ. వరబ్రహ్మాదులకైన యాధిషణ యప్రాప్యంబు, సర్వేశస
త్కరుణాసంగములేక, మానవుల వార్తల్ సెప్పఁగానేల ! కా
న, రవీందుల్ నయనద్వయంబగు జగన్నాథాంఘ్రి సంసేవనం
బురు కల్యాణము, దానికన్నను మహోద్యోగంబు వేఱున్నదే ! 296

ఉ. ఏ జనియందు విత్తిన యహీనశుభావహ సత్క్రియావళీ
బీజములిట్లు పండినవొ ! వేద్యపరార్థము విష్ణుసన్నిధిన్
సాజముగాఁగ నా మనసు, సర్వజగత్తును విస్మరించి, సం
యోజితమౌను, తత్పదయుగోపరి, వాడనిపూవు కైవడిన్ 297

సీ. తల్లి, చేదదవు, సద్యోజాతశిశువున
కన్ని సుఖంబులు నైనయట్లు,
వెలఁది కన్దమ్ముల చలనంబులభికున
కఖిల వాఙ్మయసారమైనయట్లు
ప్రాణమిత్రులకుఁ బరస్పరమభివీక్ష
యమృతధారా సేకమైనయట్లు
పతివత్నికిని, ప్రాణపతిభావసాహచ
ర్యమ, జీవసాఫల్యమైనయట్లు

గీ. కంజనాభుని పాదయుగమ్ము నాకు
సర్వసౌభాగ్య, మినుమయస్కాంత సన్ని
ధిని పరిభ్రాంతమగునట్లు, మనసు, వానిఁ
దలఁచికొన్నదె, శమము దప్పిపోవు; 298

ఆ. ఇంతవట్టునుడివి, హృదయనిక్షిప్త దై
త్యారి దివ్యరూపుఁ దూరకున్న
వానిఁజూచి, యసురవంశ నైజరజోఽధి
కృతులు కావ్యపుత్రు లిట్టులనిరి. 299

సీ. అయిదేండ్లు లేవు, నీయంత నేమేమొ భా
షించెద, విచట వల్లించినట్టి
త్రైవర్గికమ్ములు దదవవు, దైతేయ
చందన వనమందు జాతమైన

కంటకద్రుమమవు, గాదిలి సైరణ
లికలేవు, వేత్ర చాళికలెగాని
యని తర్జనాదులనదలించి, యసురోచి
తముల్తైన పాఠ్య సంతతులు నుడివి

గీ. నేరుపొప్పంగ మాతృ సన్నిధికి నేఁగ
నా కయాధువు, శిశువున కనునయంబు
లాడి, తానంబు లాడించి, యర్హవస్త్ర
భూషణాదుల సింగారములు ఘటించి; 300

ఉ. కన్నుల నీరు వెట్టికొని, కందు కపోలము లప్పళించి, యో
యన్న! నిరంతరమ్ము హరియందు సమాహిత మత్సరుండు మీ
యన్న! యనుంగు సోదరుని నాహవమందునఁ జంపెనంచు, నీ
వన్న, రమేశ పాదయుగళార్పిత చిత్తుఁడవెట్లు సేయుదున్! 301

శా. ఆ వేదర్షి పవిత్ర బోధలకు రూపైనావు, దైతేయవం
శావిర్భూతము వైష్ణవంబయి, మహానందంబె, కానీ, రుషా
గ్న్యావిష్కారము తండ్రి చిత్తము, మిథోవ్యాపన్నమీతీరు, తం
డ్రీ! వేళంతము, నూష్మకమ్మువలె, నాహృత్సీమ వేధింపదే! 302

క. విడువుమన, విష్ణుచరణని
గడితంబగు నీదుభక్తి, కాలము దానే
ర్పడువఱకు, లేని యటులనె
గడుసుఁదనము తోడ, గుప్తగతి నుండవలెన్. 303

క. ఆడకు మహితంబులు, మఱి
పాడకుము మురారి గుఱిచి, భార్గవులనవ
జ్ఞాధౌకితుల నొనర్పకు
పాడిగరావన్న! జనకువలనఁ గుమారా! 304

గీ. పోయిరమ్మన్న, జననికి మ్రొక్కి, యాతె
కనులనిండుగఁ జూచి, దీవెనలు గురియ,
కమలభక్తైకధుని, చలితాలకుండు
గదలె, ప్రహ్లాదమూర్తి భార్గవుల వెంట. 305

శా. ఆ వెంచేయు కుమార రత్నమును దైత్యస్వామి వీక్షించి, చం
ద్రావిర్భూతినిగన్న సంద్రముగనై, హర్షాశ్రువుల్, నేత్రల
క్ష్మి విస్మేరము లిమ్మడిమ్మడిగ భాసింపంగ, రోమాంచముల్
ప్రోవై, స్వాంతశిరీషపేశలతలూర్మిల్లఁగఁ దట్టాడఁగన్. 306

సీ. రారా! మదీయ నేత్ర ద్వయాఽమృతవర్తి!
రార! మద్వంశకైశోరసింహ!
రారా! సురారాతి దక్షణవప్రదీ
ర్ఘాయతబాహ! యింద్రాదిలోక
పాలక నిద్రావిపత్కారిలోహ గ
దాదండ! రార! యధ్వరవినాశ!
రారా! పితృవ్య నిర్యాతనాశాగ్రగంథి!
రార! భార్గవధీప్రపూరకంధి!

గీ. అనుచు నాహ్వానమొనరింప నర్భకుండు
తండ్రి పదయుగ్మములపైని తలనుమోపె
మోపిన శిరస్సుపై ముత్తెములు వెలార్చె
నా జనకుకండ్ల నాగుబ్బులైన జలము. 307

ఉ. ఎన్నిదినమ్ములయ్యె నిను నే కటి వీక్షణవేసి, భాగ్యసం
పన్నము, శారదేందుపరిభావిమృదుస్మితమైన యాస్యమీ
కన్నుల వ్రేలుచున్నయది గాదిలిపట్టి! యటంచు నంకపీ
ఠిన్నలువొప్పఁజేర్చి, భ్రుకుటిన్ నటియించెడి కౌతుకంబులై. 308

చ. లలితరసాలపల్లవ గళద్రసపాన కషాయకంఠకో
కిల యెలుగించినట్లు, మృదుగీతమొకండు వచింపవోయి! నీ
వలచినదాని, రాత్రిచరవంశకరీర! త్వదుక్తి మౌక్తికా
వళిఁ బొదిగించికొందు గరువంబున, శీర్షకిరీటమందునన్. 309

క. అనవుడు ప్రహ్లాదుఁడు, హృద
యనివాసముకుంద చింతనామృత నిష్యం
దనిభృతవిలోచనుండయి
వినయంబు, నయంబు, పరిఢవిల్ల వచించెన్. 310

సీ. శ్రవణంబు, ప్రత్యక్షరస్రవత్పీయూష
పూరసంతుష్ట శ్రవోయుగమ్ము
కీర్తనం, బక్షినిక్షిప్త దివ్యస్వరూ
పానంద హర్షబాష్పావిలమ్ము
స్మరణంబు, తన్మయాక్షర మంత్రప్రతిముహూ
రావర్తివరవశంబైన మనస్సు
పాదసేవనము, తచ్ఛ్రర్మ్యామహామహ
విస్మృతలోక సంవేదనమ్ము
గీ. అర్చనము, వందనము, సఖ్య, మాత్మనప్ప
గించుటయు, విష్ణునందు సాగించెనేని
యదియ నిజమైన చదువు, తదన్యమెల్ల
జననమున రాఁక, మరణంపు పోఁక, తండ్రి ! 311

శా. ఆ మాటల్విని, క్రోధకుండములుగా నక్షుల్, సురారాతి యే
మేమీ! యిట్టివి నూరిపోయుటకునే యీ భార్గవాధ్యాపనం
బామోదించుట! తిన్న కూటికిని ద్రోహంబింత యౌనే! మదీ
యామేయంబగు శక్తి పాడఱునె యిట్లారణ్యముత్కోశమై ! 312

గీ. ఎవ్వఁడే నాదు సోదరునెనసి చంపె
నట్టి వాని చాటూక్తుల నలవరించి
శిశువు హృదయంబు సెఱచుటే! సిగ్గుచేటు
గాదె! మీర్కావ్య సుతులౌట కల్లరీంద్రు. 313

గీ. ఛద్మవేషులు, దుర్మైత్ర సంగతులు, స
మాచరించెదు నఘమవశ్యంబు పండు
కాలమున కాదికొని పాతకంపు ఫలము
ధృష్టరుజగాఁగఁ గమిచి కారించునట్లు. 314

క. అనవుడు గురుపుత్రులు దమ
మనములఁ గడునవసి, తడవు మ్రాన్పడి, రీథా
వనతులు, సురవైరికి ని
ట్లని రంతేవాసి గుఱిచి, యచ్చెరువడుచున్. 315

మ. ఎవరున్ జెప్పరు, మేముఁ జెప్పము చివస్పృక్కీర్తితారుణ్య! వీ
ని విపక్షాశ్రయ వృత్తి, జన్మమునకే నిర్ణీతమైనట్లు మా
యవగాహం, బటుగాన, వేసరిక కార్యాపాదిగా, దౌర్మి పె
క్కువతోఁ గార్యము దీర్పఁగావలె విపక్షున్ బుద్ధి దప్పించుచున్. 316

ఆ. అన్న గురులపల్కు లాలకించిన దైత్య
వరుఁడు, భార్గవులను బదరుటుడిగి
కొమరు జూచి పలికె, గురులు బోధింపని
చెట్ట, యెట్లు నీకుఁ బట్టెనోయి ! 317

క. ఆ పలుకులు విని, సర్వ
వ్యాపిపదాబ్జాతములకు నడియరి మాయాఽ,
వ్యాపన్నుఁడు, నారద భా
షాపక్త్రిమబుద్ధి, వినయచర్చితుఁడనియెన్. 318

మ. తమకున్ బుట్టదు, సాధు బోధముల చేతన్‌రాదు, దారాది గే
హములన్ జిక్కిన మానసంబులయి, మిథ్యార్థంబులన్ జిక్కి, జ
న్మములు న్తావులు బొందువారలకు, నానాజన్మ దౌర్గత్య వి
భ్రమ నారాయణ పాదపద్మ యుగళీసంసక్తి దైత్యేశ్వరా! 319

వ. బహిరర్థంబులందు నివిష్టులకు, తాదృశుల వచనంబుల, ప్రీతికరంబులై యుండు, వర్ణాశ్రమధర్మాదిరూప నానావిధ కంఠసూత్రబద్ధులై వారు, గుర్వాభాసులైన యంధులచేత నీయమానులైన యంధులంబలె, కామ్య కర్మ గర్తంబు లన్పడెదరు. నిష్కించనులైన భాగవతుల పాదరజోభి షేకంబు, దుర్లభంబు, అది దొరకొన్ననాఁడు జీవుఁడు దరించునని యూరకున్నపుత్రుని, రుషాంధీభూతుఁడైన హిరణ్యకశిపుఁ డుత్సంగంబు నుండి పడనూకి యిట్లనియార్చె. 320

ఆ. పీడు దావనైన పీడును దుఃఖంబు,
గొంచుఁబొందు వీని, కులకళంక
మైనవానిఁ జంపుఁడసురులు, నానావి
ధమ్ములైన యాయుధములు బూని. 321

క. పినతండ్రిఁ జంపెనని, తన
మనమున కలఁగండు, దైత్యమర్దను పదచిం
తన తమ్ముఁడు వోయిన! వీఁ
డయనమునన్నైన నఁ దలఁచునా! చిత్తమునన్ 322

గీ. అంగములయందు దుష్టంబునవదళించి
శేషరక్ష యొనర్చుట, జీవనమున
కైనపథ్యం, బుపేక్షించెనేని, యది స
మస్త కాయమ్ము జెఱుచుఁ గ్రమమ్ముగాఁగ 323

క. పరుఁడైన హితకరుండౌ
దరపాత్రుఁ డపత్యమట్ల నాత్మజుఁడైనన్
విరసాత్ముఁడు దూష్యుం డె
వ్వరుసున, రోగమ్మువోలెఁ బ్రాణమె సెఱచున్. 324

వ. వీఁడు సుహృల్లింగధరుండైన శత్రుండు, సంభోజనశయనాసనాది సర్వోపాయంబుల వీనివధింపుఁడని. యనుచరుల నాజ్ఞాపించిన, శూల పాణులుతిగ్మదంష్ట్రికరాళాస్యులు, తామ్రశ్మశ్రుశిరోరుహులు ఛించిఛిందీ తివాదులర్భకుం గొనిపోయిన. 325

క. ఆ పోవు సుతునిఁ జూచుచు
నాపోవని యర్మిలియును, నాత్మకు వ్రేగై
వ్యాపించిన మచ్చరమును
ప్రాపై, నిట్టూర్చి. దైత్యపతి యుదిలకొనెన్. 326

మ. తనయచ్ఛద్మముతోడ నాటుకొనె నంతశ్శల్య, మెవ్వాని బో
ధనలో ! వానికి నెత్తి కెక్కినవి, నిత్యం బొక్కఁడే యమ్ముకుం
దుని సంకీర్తన, దైత్య వంశములకున్ దుష్కర్ముఁడ వ్వాఁడు నేం
దునఁ బోకార్తును, వీని దుర్మతి కయాధూ; సుంత యోచింపవే ! 327

మ. అతివా! యొప్పరికింప కర్జమటె బాల్యం బంచు! ప్రాయంబుతోఁ
బ్రబలియె, భక్తియు వ్రేఁ కనైన, నుడిగింపన్ శక్యమే ! దైత్యవం
శతతుల్ వేల్పుల కాడిమోయుటలు నిస్సందేహ, మవ్విష్ణువా
దితిసంతానపు వేస్త కాఁడుగదె ! ప్రీతిన్ భోగముల్ కూర్పఁగన్ 328

మ. పినతండ్రిన్ బరిమార్చెనన్న వగ యల్పియంబులే, దింకన
న్ననిఁబోకార్చిననైన, వీని హృదయం బారాటమున్ జెందునే !
తనయుండెవ్వఁడు ! తండ్రికిన్ హృదయ సంతాపంబుఁ బోదట్టువాఁ
డనుకంప్యుండె ! పితృవ్యథాకలన దుష్టాచారుఁ డే పట్టునన్ ! 329

ఉ. వాని మొగమ్ము ఫుల్లశతపత్రముఁ గాంచిన వేళ, ప్రేమమా
ధ్వీనిబిడమ్మె నెమ్మనము, విష్ణుకథా కథనంబుతో, వ్యథా
కూణితమౌను, రేవగలుఁ గూడదు నిద్దుర, ప్రాజ్యరాజ్యశ్రీ
ఖానిచితమ్ము, నా బ్రదుకు. పాడఱి యున్న దదీప్తదీపమై. 330

సీ. అనుచును హిరణ్యకశిపుఁడయ్యతివ సేయు
యూరడింపులకైన, జోగోర్వలేని
హృదయమునఁ గన్ను గవలలో నెయిదికొన్న
బాష్పములతోడ, నేకాంతవసతిఁ జేరె. 381

వ. అంత నక్కడ, దయానిస్స్వులైన కింకరులు, శమానుచరుల క్రమేద నంబులు, ప్రహ్లాదుఁ బట్టికొని, దిగ్గజంబుల, దందశూకంబుల, నాభిచారా వపాతనంబుల, గరదావాఒభోజనంబుల, సనిరోధంబులైన మాయా విశేషంబుల, హిమవాయ్వగ్ని సలిలంబుల, పర్వతాక్రమణంబుల మరియు ననేక వధోపాయంబులఁ బీడించిన. 382

ఉ. కన్నుల నీరు గూడదు, మొగమ్మున నంకిలిలేదు, గుండెలో
నెన్నఁగభీతి లేదు, జనియింపదు చారుకపోలమండలీ
స్విన్నత, శ్రీశపాద సరసీరుహచారునివేశ సంశ్రయా
భ్యున్నతిఁ జేసి, దుఃఖ లవమున్ మదిదట్టని భక్తమౌళికిన్. 383

మ. హరి! నారాయణ! దీనరక్షణ విధాత్యం తీనకారుణ్య! సు
స్వరసామాప్లవ మౌనిశేఖరహృదీప్సాలభ్య సాన్నిధ్య! వే
దరహస్యాఒతిగ! సర్వభూభరణ చిత్రక్రీడ! లక్ష్మీమనో
హర! చంద్రార్కమయాంబక ప్రకట దివ్యాలోక! నారాయణా! 384

శా. ఈ సర్పంబుల నీవు, దిగ్గజములం, దీ తిగ్మధారా కృపా
ణీసర్పద్భృశకాంతి నీవు, నసురోన్నిద్రాభిచార క్రియా
వ్యాసంగంబుల నీవు, సర్వములనీవై యున్న నాకింక, భీ
త్యాసక్తుల్ గలవే! మహౌఘగజక్రాంతి! నారాయణా! 385

మ. జనకుండంచును బుత్రుఁడంచును వృథాసంరంభముల్గాక, ప్రా
క్తనకర్మంబున వచ్చు జీవులకు నిక్కంబున్నదే! లోకతా
రణలీలాచణ! నీవ నిక్కమగుసర్వం, బీయసత్కల్పనా
వని, దగ్ధం బొనరింపవయ్య! కరుణాప్రాచుర్య! నారాయణా! 386

మ. సకలోపాస్యపదాబ్జ! రాజసమతిన్, జంబించి నా తండ్రి తా
వక వైరంబున కగ్గమయ్యె, వరముల్ పథ్యంబులే! భోగపం
క కరీషంబులు, ఆత్మఘాతి యగు నజ్ఞానంబుఁ బోఁదట్టి తం
డ్రికి నీ దాస్యసుఖంబునిమ్ము, సంహృతభవార్తివ్రాత! నారాయణా! 337

క. అని యనుచెగాని, పెఱయది
పనవఁడు, రక్కసులు వెట్టుబాధలు వానిన్.
జెనక వపుణ్యుండౌనరుచు
ఘనసత్క్రియలెల్ల ఫలము గానని ఖంగిన్. 338

క. వారపుడు, ముధాభూతని
కారులు, గతగర్వ, లసురకాంతునితో, ల
జ్జారూఢులనిరి, బాలుని
యారాటములేని భక్తి కచ్చెరు వడుచున్. 339

సీ. వీఁడు సామాన్యుండుగాడు దైత్యేశ్వర!
యవిదితంబగు శక్తి నలరువాఁడు
గజముల నుసికొల్ప, గజదంతములు మైన
మవిపోలె వక్రంబులయ్యె, తిగ్మ
విషవీర్య సర్పంబు లసదృశుండగు వీనిఁ
బరికించి ఫణములు వ్రాల్చినవియు
నాయుధమ్ములు వైవ, నాయుధమ్ములు బొందు
తోమాలలై, మేనఁదోచినవియు
గీ. నాభిచరణికములు, విఫ్నితాత్మ శక్తు
లయ్యె, జలములవ్రాఁతలై, యల్పములు, ధ
రావపాతనములును, జలాఽవలేప
ఘోరఘోట్టాణఖురశిరః కుట్టనములు. 340

క. అనియన్న మచ్చరము మది
మునుకొని, పొనుగుపడఁజేయఁ బుత్రస్నేహం
బును, వీనితోన నాయువు
దనకున్దీరునా! యటంచుఁ దల్లట పడుచున్. 341

గీ. అనుచరుల నంపి, యేకాంతమందు. నైక
భావశబలితుఁడై, శాంతిపదటఁ గలిసి
నెఱపుఁపుయిలోట వెమ్మ, నిబ్బరముపోఁక
బవిరెజుట్టఁగ నాసుర్య భావవర్తి. 342

సీ. వీని జన్మమ్మునకైనట్టి కారణ
సామగ్రి దానెట్టి చందమొక్కొ;
సకల దేవతల మాత్సర్యమ్ము రూపొంది
యిటు, పుత్రజన్మ గ్రహించెనొక్కొ!
పినతండ్రి ఇచ్చిన వెత యించుకంతయు
నెడఁదదన్నని వితంబెట్టిదొక్కొ!
వరములిచ్చిన బ్రహ్మ, భావిమృత్యువును ని
క్షేపించి, వీని సృష్టించె నొక్కొ!

గీ. అనుచుఁ దలనూచు నిట్టూర్చు, నట్టునిట్టు
వెకలి చూపులు చూచు, రుగ్వికటనేత్రుఁ
డంతరాంతర నిర్గళదశ్రుకణ మ
లీమసహృదుండు, మాత్సర్య లీనమూర్తి. 343

వ. అట్టి యెడఁ జండామర్కులు గాన్పించికొని, రాజునకిట్లు విన్న
వించిరి. 344

ఉ. లోకములన్నిటిన్ దృగవలోకన మాత్రన నానవెట్ట, నా
కౌకసులన్నదల్చి పడిగాపులు సేయఁగఁ జాలినట్టి నీ
పీకసుగందుఁ గూర్చి యిటులేటికిఁ గ్రుంగెదు దైత్యనాథ! నీ
రాకర వీచి చంచలము లారయ నర్భక భావభంగిమల్. 345

ఆ. వత్తురింతలోన భార్గవు లతుల త
పః కరండ దృష్టి పాతు, లంత
వఱకు, నయభయంబు లరసి శిక్షించుచు
కూర్మి కొమరు నోమికొనుట లగ్గు. 346

క. ఆ చండామర్కుల హిత
వాచాళమితాత్ము(డగుచుఁ బ్రహ్లాదునిఁ బ్రే
మోచితముగఁ జీఱుచుఁదా
నాచార్యులతోడ నసుర, యప్పుడ ననిపెన్. 347

వ. వారును, గృహమేధీయంబులైన త్రివర్గంబులు వలికి, పలుమారు శిక్షించిరి. ద్వంద్వారామోప వర్ణితంబులైన యయ్యవి వాని మనస్సున కంటకుండె. కాని ప్రహ్లాదుండు ప్రశ్రితావనతుండై ''యవుఁగాద'' నఁడు, గ్రహించినట్లయుండు, నొక్కనాఁడాచార్యుండు పరావృత్తుండైన, తోడిబాలకులు దన్నుఁ గ్రీడలకున్బిలిచినఁ గృపాజనితోపహాసుండై వారలతో నిట్లనియె. 348

ఆ. చచ్చువారిఁజూచి, చానున్నవారి నూ
హించి కొనక, యాటలంచు నాయు
వేల రిత్త సేతు, రేనాఁడుఁ జావని
పదవి గనుఁడు, చెప్పవలతు రండు. 349

ఆ. గురులు సెప్పు దారి కొఱగాదు, వారర్థ
పరులు, లౌకికములు పరిభవింతు
రాత్మ కెద్దిహితమొ, యదిగాక గ్రాహ్యంబు
సారహీనములకుఁ జనఁగఁ దగునె ! 350

ఆ. కాననట్టి వాఁడు, కాననివాఁడు నూ
తగానిపోఁక భద్రదదంచా! మఱవు
జిరులు మాన్పి, యెఱుక నెఱయింప లేనిది
వృథయె గాక బ్రదుకు లేటి చదువు ! 351

ఆ. మిత్ర మెవఁడు దనకు శత్రు వెవ్వం డుదా
సీనుఁ డెవఁడు బుద్ధిచేతఁ గల్పి
తములె గాక, వినుఁడు దైవంబె సంపద్వి
పత్ప్రదంబు, పెఱలు వట్టిమాట. 352

క. మానుష జన్మంబున, ధ
ర్మానుచరుఁడు గాదయేని యది గడచిన నిం
కేనెఱి, భద్రం బంద
న్గా నగు జీవునకు, సుంతగానఁగ వలదే. 353

ఆ. మాటిమాటి కగునొ! మానుష జన్మంబు
పరమ దుర్లభంబు, ప్రాప్తమైన
దీని, సుకములకును దిగద్రావఁ బూనుట
కప్పురంబు వెట్టి యుప్పు గొనుట. 354

వ. మానుష జన్మంబెట్లు దుర్లభం బందురేని, దేవతిర్య జ్మనుష్య స్థావరాది రూపంబులఁ జక్ర పరిభ్రమణంబు సేయు జీవునకు నరజన్మం బ నియతంబు, పరమ సుకృత పరిపాక విశేష లభ్యంబుగాన, దాని యంద భగవద్ధర్మాచరణంబు గర్తవ్యంబు, అదియుఁ గౌమారంబు నుండియు యారంభణీయం, బెలయందురేని, చతుర్థవయః పర్యంత జీవనం బ విశ్వసనీయంబు. భగవద్ధర్మంబులు చిరకాల సాధ్యంబులుగదా! అస్థిరంబైన మనుష్య జన్మంబు చేత నవి సాధితంబు లెట్లగు నిశ్శ్రేయస ప్రాప్తి యే కరణి నేర్పడునందు రేని, వినుండు, భాగవత ధర్మ సాధనంబున దొరకొన్న మానవునకు, తద్ధర్మ విరోధి కర్మాభావంబుండె నేని వల పర్యంత భగవద్ధర్మోపసంహారంబున, నిశ్శ్రేయస రూప నిరతిశయ పురుషార్థం బద్యతనంబు. అరబ భగవద్ధర్మ విరోధి కర్మ సద్భావంబుననైన నభిక్రమ నాశంబు లేదు. ప్రత్యవాయంబు సున్న. కల్యాణ కృత్తునకు దుర్గతి లేదు. వానికిఁ గ్రమంబున నైన నిశ్శ్రేయసంబు సిద్ధించు. భగవచ్ఛబ్ద వాచ్యుండు నారాయణుండు. వాఁడముకుందుండు. తక్కు దేవతల భగవచ్ఛబ్దం బౌపచారికంబు. వారి యిచ్చు ఫలంబులు

నాలుపు తిండిడి పదయునవి. విష్ణు సేవయ నుసురుమును౯గా నుట.
అకామునైనఁ గాని సర్వకాముండైన గాని, మోక్షకాముండైన గాని, విష్ణుసేవఁ
గావించువాఁ డుదారధిషణుండు, మఱియు వినుండు. 355

గీ. వాఁడ ప్రియుఁడెల్లవారికి, వాఁడ యాత్మ
వాఁడ యీశ్వరుఁడెల్లచో, వాఁడ మిత్రుఁ
డట్టివానిని విడచి, తదన్యదైవ
ములనుఁ గొలుచుట, పెడతలమొలచు బుద్ధి. 356

క. సుకమును దుఃఖము దేహము
నకుఁ దగిలియెయుండు, జీవనమ్మున౯ దఱితోఁ
బ్రకటమగుఁ జీఱినట్టుల
నకృష్టపచ్యంబు సస్యమట్టులఁటోలెన్. 357

క. పరమశ్రేయము హరిపద
పరిచర్యయ గాన, దేహపాతమ్మున ముం
దఱయ, వివేకినరుం డఱ
మఱలు దలఁగి దానివైపు మఱలంగఁదగున్. 358

సీ. నరుని యాయుర్మాన మరయంగ నూఱు వ
త్సరములు, దాననర్ధమ్ము, తమము
వోలు నిద్రగతించు, పూర్వవింశతి వత్స
రములు క్రీడాసక్తి రాలిపోవు
వడిమియాయువు దీఱుఁ బడఁతుల కౌగిళ్ళ
దాన, నేర్పడిన సంతానచింత
ముదిమిప్రాప్తింప బెబ్బులియైన రోగమ్ము
వాలమల్లార్చి, పైఁబడఁగఁదివురు

గీ. చావువచ్చిన బందులు దేవురింతు
రాస్మశానమ్ము, జీవి దేహమును వదలి
మరల సంసృతిచక్ర సంభ్రమితుఁడగును
విడుమరయె లేనియట్టి దీ విధి విధమ్ము. 359

మధ్యాక్కర. కంటిరే మనవారు భద్రకరమైన, పథమును వదలి
పంటింపకయ, సంసృతికిని పట్టైన యార్గురు శత్రు
లంటుకొంద్రయి తోద, నంట, ననవరతంబును మూటి
వెంటలఁబడి వివేకమ్ము, వితగాగ నవయుచున్నారు. 360

మ.అ. క్షణములోఁగుత్తుకగోసి, కతిసుఁడై మాంసమ్ము దినెడు
చెనటికసాయి, నిక్కంపు, చెలిమిగల్గిన పోలెబస్త,
మునకు మేతందిచ్చునట్ల, మోసంబుగనియైన బ్రదుకు
మనుజునకిడు నల్పసుఖము, బ్రమందించు నెక్కటితెలివి 361

క. తావన్మాత్రంబున, నీ
జీవి భ్రమసి, బ్రదుకుకోఁజిక్కున్, స్వర్లో
కావాసి, యింద్రుడైనను
కేవల సౌఖ్యంబు, మనికిఁగిల్కొనుటున్నే! 362

ఆ. కాన, బాలులారః ఘనవిషయాకృష్టు
లైన యసురజనుల యంటు వదలి,
యాది దేవుఁడైన యట్టి నారాయణు
పదములంటి, చెడని పదవిఁగనుఁడు. 363

సీ. ఆ పరమేశ్వరుననురాగమడి, మహా
యాస సంపాద్యమటన్నవెఱవు
దలఁగుండు, సర్వభూతమ్ముల నాత్మస్వ
రూపుఁ దేవాఁడు, పరుండు గాడు
నిన్ను నీవెఱుఁగక, నిఖిలంబు నెఱుఁగుట
కై పోఁక, మిపుల హాస్యంబుగాదె!
విధి నిషేధములకు, వెలియైన దయ్యాది
నారాయణుని ప్రాపు జేరుత్రోవ

గీ. యనుభవమె యొఱఁగల్గుఁ దద్ఘనదయా వి
కాస విహృతికి, శుష్క తర్కములుగావు
దైత్యభావమ్ము విడి, భూతతతినిఁ గరుణ
గనుఁడు, సంతుష్టుఁడగు రమాకాంతుఁడెపుడు. 364

వ. భగవంతుండు సంతుష్టుండైన నలభ్యం బెయ్యది? ముక్తికన్య పరమ భక్తుని పాదసంవాహనంబు గోరు. పరమపద నాథ చరణ నీరేజ సుధా మగ్నుండగు భక్తునకు, చతుర్విధంబులగు ముక్తులు నకించిత్కరంబులు. త్రివర్గంబులు వేద ప్రతిపాదితంబులు గదా! వానిన మన గురువులు బోధింతురందురేని, యధికారి భేదంబున వేదపురుషుండు సర్వంబును బ్రతిపాదించు. పరమ ధర్మంబైన శరణాగతి యుపనిషచ్ఛిరో మండనంబు. తొల్లి నారాయణుండు దీనిన పరమ ధర్మంబుగా నారదునకుప దేశించె. నాకుఁ దద్దయా సంప్రాప్తంబని, తన తల్లియైన కయాధువు గొన్ని దినంబులు నారదు నాశ్రయంబున నునికియు, దానపుడు గర్భ స్థుండైన వితంబును దెలియఁ బలికి, యిట్లనియె: 365

ఆ. నాదు తల్లి మఱచె, నారదు నుపదేశ
సరణి, కాలకర్మ పరతఁజిక్కి
గురుని బోధ, బుద్ధి దఱుగదు, నేఁడుఁ జె
ప్పిన వితాన, నాకు వీసమైన. 366

క. నా మతము ననుసరించిన
కామంబులు గోసి, బుద్ధిఁ గాంక్షించిన, జ
న్మామయ నికార కేశవ
సామీప్య సుఖమ్ము మీకు సంప్రాప్తించున్. 367

వ. అస్తి, జాయతే, వర్ధతే, పరిణమతే, అపక్షీయతే, వినశ్యతి, యనునవి షడ్భావ వికారంబులు. ఇవి దేహంబునకె కాని, యాత్మకు లేవు. అది నిత్యం, బవ్యయంబు, శుద్ధంబు, క్షేత్రజ్ఞ వాచకంబు, ఆశ్రయంబు, అవిక్రియంబాత్మ జ్యోతి, సర్వలోక హేతువు, వ్యాపకంబు, నంగ

రహితం బనావృతంబేకంబు. ఇవి ద్వాదశ లక్షణంబులు. ఇట్లుగా, నారాయణు నెఱింగి, దేహంబువలని మోహంబు దలంగవలయు. స్ఫురత్స్వర్ణకణంబులైన గ్రావంబులనుండి, ధమనాద్యుపాయంబుల హేమకారుండు హిరణ్యంబు బడయుపగిది, నాత్మ ప్రాప్త్యుపాయంబుల బ్రహ్మగతినరయవలయు. మూలప్రకృతియు, మహదహంకారంబులు, పంచతన్మాత్రలు, ప్రకృతులనంబడు, సత్వాదులవ్వాని గుణంబులు, ఏకాదశేంద్రియమ్ములు, పంచమహాభూతంబులు, వికారంబులు. ఇవియ దేహంబు. సమన్వయంబునఁ బురుషుండొకండ. దేహంబులు స్థావరజంగమాత్మకంబులై యుండు. 'ఇదిగా 'దడి'గా' దని పురుషుని నిశ్చయింపవలయు. మూలప్రకృత్యాదులకు వేఱై, మణిగణంబులఁ జొచ్చియున్న సూత్రంబు వడువున, నాత్మయన్నింటఁ జొచ్చి దీపించు. ఆత్మ జన్మాదిశూన్యంబు, నవస్థాశూన్యంబు, బౌద్ధిక జాగరణస్వప్న సుషుప్తులనెఱుంగు వాఁడాత్మగ్గసుమ ధర్మంబులైన గంధాదులచేతఁ దదాశ్రయంబైన వాయువు నెఱుంగునట్లు, త్రిగుణాత్మకంబులైన కర్మజన్మంబులైన బుద్ధిభేదంబుల నాత్మ దెలియనగునని, వెండియు నిట్లనియె: 368

క. బుద్ధికృతము సంసారము
బుద్ధి గుణంబులును, కర్మములు తద్రూపం
బిద్ధగుణులిట్టు లెఱిఁగి య
బద్ధంబని వదలుదురు విపక్త్రిమవృత్తిన్. 369

క. సకలార్థములు మనస్సున
బ్రకటంబులు స్వప్నజాగరములటు, తొడయున్
సుకమును, మోహము, వెఱపును
నికటమ్ములు, మనసుగూర్చు వివిధ లసితముల్ 370

గీ. కాన, త్రిగుణంబులందు నాకాంక్షలేని
యప్పుడు మనస్సులేదు, తద్వ్యాపృతమ్ము
లేదు సంసార, మప్పుడులేదు జీవి
కరయ బంధంబు మోక్షమధ్యాసకృతము. 371

ఆ. ఇట్టి గతినిఁబొంద హితకరంబును సర్వ
సులభమైన భక్తి వలఁతి త్రోవ
దాని దొలఁగి వేఱుదారులు ద్రొక్కుట
బుద్ధి గడ్డిగఱచి, ముండ్లఁబడుట. 372

సీ. గురుసేవ, వినిహితాదరముగ సేఁత, స
ర్వంబైన లాభవిసర్జనంబు
సాధు సమాజ సంసర్గంబు, కేశవా
రాధన, పులక సంక్రాంత దీప్తి
తత్కథాశ్రద్ధ, తద్ఘనగుణకర్మ సం
కీర్తన, బాష్పసంకీర్ణగళము
తత్పాదయుగళ నిధ్యాన, మర్చావతా
రమ్ములఁ గైంకర్యరక్తి, సర్వ
గీ. భూతములయందు వాసుదేవుండు గలఁడు
సేవ్యుఁడని వారివలని నిస్సీమరక్తి
యివియ, సర్వేశ్వరుని మెదికించు గుణము
లేటి కన్యంబు! ముక్తి తంగేటిజున్ను. 373

ఆ. ఆఱుదోసములకు నాకరంబైనట్టి
మనసుతోడిపొత్తు మనికితంబు
పాము గల్గినింటఁబండఁగా నౌనె! యే
వేళవచ్చి, కాటు వేయఁగలదొ! 374

క. కావున, సంతతజాగృత
భావంబున, భక్తిసేయవలయుఁ గరణముల్
కావలములు, దగువెంటల
నా వైకల్యంబులార్చి, యదుపు నిడఁదగున్. 375

సీ. స్వేచ్ఛాగృహీత సర్వేశలీలాతనూ
ధ్గత దివ్యకాంతులు దలఁచి తలఁచి
లోకమాంగల్యమ్ము నాకట్టుకొన్న శ్రీ
శుని దివ్యకర్మముల్ చొక్కిపలికి
యఖిల భూతమ్ములయందుఁబంచారించు
కరుణాదిగుణము లగ్గలమునెన్ని
జగతీకృతార్తి రాక్షస గర్వకానన
దావవిక్రమములు తద్దఁబొగడి

గీ॥ జాదుకొన్న గగుర్పు, కపాయకంఠ
మలమికొన్నట్టి బాష్పంబులై, యపత్ర
పుఁడు, విలాపించు, నాడు, నుగ్గడువుఁజీఱు
పరమభక్తుండు, విష్ణుతాత్పర్యజీవి. 376

గీ॥ ఇట్లు తద్భావ భావానుకృతి నొనర్చు
నాశయాకృతుఁడై, భక్తుఁడంతరంగ
సరణి నిర్దగ్ధ బీజానుశయుఁ డపేత
మాయుఁడైఁతోన నవ్విశ్వమయునిఁ జెందు. 377

మ. ఇది దుస్సంసృతి చక్రశాతనము, బ్రహ్మేంద్రాదులున్ బొందఁజా
లిదిగానట్టిది, కేశవాయితమనోలీలా మయం, బిద్ధతృ
ప్తిదమీనిర్వృతి, నెల్లిదింపకుఁడు, పాపిష్ఠంబులాసుర్యదు
ర్మదముల్మాల్చి కొనుండు, వైష్ణవ పథామ్నాయాఽభిషేకంబులన్. 378

మ. ధనముల్ ధాన్యము లాత్మబంధువులు మాద్యద్దంతులా గౌరశో
భనముల్, మీ భవ దుఃఖబాష్పములు నిల్పన్‌లేవు, లోకత్ర యా
వన పారీణము, లాద్య మౌనివరహృత్పర్వంబు లా పంకజా
క్షుని పాదంబులుదక్క, తక్కఁడితరక్షోదీయముల్ మార్గముల్. 379

మ. క్రతు సంపాదిత నాక భోగములు బుగ్గల్ నీటిపై, నీధరా
కృతభోగంబులయట్ల, దేవతలుగానీ, కేవలానందసం
కృతసంసారులుగారు, వీని కొఱకై వేరారుటల్ రిత్త, శా
శ్వతమానందము విష్ణుభక్తి యసుఁడీ! చర్చించికొండాత్మలన్. 380

మ. ఒక సౌఖ్యంబును గోరి మానవుఁడు దా నుద్యోగమున్జేయ, దఁ
త్సుఖమంతర్గత దుఃఖమై యొదవు, నాక్షోభంబు బోకార్ప వే
ఱొకయత్నం, బది వేఱు దుఃఖమున సంయుక్తంబు, దుర్వాసనా
ప్రకటం బీ జని, దీని మాల్పుఁడు పరార్థ్య శ్రీశసేవారతిన్. 381

మ. తొలిజన్మంబున కామ్యకర్మములతోఁదోదయ్యె నీ దేహ, మా
పులుమై, కుక్కలఁ దన్నవే దగిన దిప్డున్ కామ్యముల్ గోరి, త
త్ఫలమై వేరొక మేను బొందుటలె! బాధామూల మీవాసనా
వళికిన్ దప్పి భజింపుఁడీశ్వరుని శశ్వత్సాధు సంసద్గతిన్. 382

సీ. కామ్య కర్మంబులు, కాయము ల్నె సెడు
తంతు సంతానంబు దైత్యులార!
దేవాది దేహంబులీ విధంబులె, భర్జి
తంబైన బీజమ్ము, దాఁఫలింప
నట్లీశ్వరార్పితంబైన సద్భక్తి జ
న్మాది వ్యథాభార నోదనమ్ము
కావున, నిష్కాములై, వాసుదేవు సే
వింపుఁడాయుస్సును వితగఁజేయ

తే. కుండు, సద్భక్తి కష్టసంకులము గాదు
వాఁడ యాత్మ స్వరూపుండు, వాఁడ దయితుఁ
డతఁడ 'నేన'ను శబ్దార్థమైనవాఁడు
తెలిచి చూడుండు, నిబిడచింతా సమాధి.

సీ. దేవాఁ సురులెగాని, దేవ సంతతులు గం
ధర్వాదులేగాని, యుర్వి నున్న
మనుజులె గాని, దుర్మలినరక్షస్సులె
గాని, పక్ష్యాదులు గాని, భక్తి
బట్టి, నారాయణునిఁ బ్రాపింపఁగా వచ్చు
నది యొక్కటే, హరికైన త్రోవ
యదిగాని దానాదు లతుల తపమ్ములు
విజ్ఞత కొఱయైన వేదబమ్ము

గీ. లిదియ పరమార్థమనుచు సర్వేశుఁడమర
ఋషికి నుపదేశమిచ్చిన హితము త్రోవ,
యమరఋషి నాకు బోధించినట్టి త్రోవ,
యాపదలు దీర్చి, దరిఁ జేర్చునట్టి నావ. 384

గీ. బ్రాహ్మణుండైన సద్భక్తి పథము వదలి
వేదములు వల్లెవేసిన, వేసినట్ల
గాని, సంసృతి దొలఁగదు—కాననమున
వెల్లగొన్నట్టి వెన్నెలవ్వెడఁగు బ్రదుకు. 385

క. పాడుఁడు శ్రీహరి, నలరుచు
నాడుఁడు, సకలమ్మునందు, నాత్మేశ్వరుని
న్జూడుఁడు, రక్షోభావము
వీడుఁడు, రండింక, చదువువెట్టి వదలుచున్. 386

ఆ. దైత్య రాజసుతుని ధర్మ ప్రబోధమ్ము
విన్న దైత్యసుతులు కన్నడించి
గురులమాట, యసురకులవైరి వాసుదే
వుని భజించు కొఱకుఁ బూనుకొనిరి. 387

క. పౌత్త్రములు దేరు, చూపువి
యత్తలమున బోధలందు, నదలించినచో
నుత్తరము లేదు, బాలుర
వృత్తంబులు, శుక్రసుతుల యెద గదలించెన్. 388

ఆ. వారు వచ్చి కొమరు వర్తన, తర్కశి
ష్యుల తెఱంగు, నేత్ర కోణకోణ
గళిత బాష్పులగుచు, గద్గదికమ్ముతో
విన్నవింప, నసుర, విహ్వలించి. 389

ఆ. తాను జెడుటెగాక తక్కరి బోధలఁ
బరులఁగూడ మాల్చు పథము వట్టె
నిఁక నుపేక్ష సేఁత, సకల రక్షోవంశ
విక్రమంబులతను వెక్కిరింత. 390

క. అని కన్నులు జేగురులై
తనయునిఁ గొనితెండటంచుఁ దన యనుచరులన్
బనిచి, కనకకశిపుఁడు దన
తను వంతయుఁ గ్రోధదావ దహనమయంబై. 391

క. వినయమ్మున వంచిన తల
కనుదమ్ముల శాంతి, హస్త ఘటితాంజలిగాఁ
జనుదెంచిన కొమరుని గని
ఘనగర్జానిబిడ కంఠకందరుఁడగుచున్. 392

ఉ. వేలెడు లేవు, సర్వసురవిక్రమదుస్సహక్రుద్ధ భ్రూకుటీ
జ్వాల, మదీయశాసనము, బల్బజపద్ధతి నెల్లిదించి న
న్నాలము సేతువా ! సుతుఁడవై పితయింటికి నిప్పుబెట్టఁగాఁ
జాలితివా ! నిశాటకుల సంతతి వైష్ణవభక్తిఁ ద్రోతువా ! 393

ఉ. ఎవ్వని ప్రాఁపుగాంచి, యిటులీ తెగనీల్గుదు ! కాలకంఠుఁడున్
చివ్వకు లోకువే యనిన, నీయవనంబున కెవ్వఁడోఁపగాఁ
గ్రొవ్వులువల్కు ! వానిఁదెగఁ గూల్చెద తమ్మనుమోరి ! గాథలున్
ద్రవ్వినగాదు, ఘోరకదనంబున బంటయి నిల్వఁగావలెన్. 394

ఉ. పాడెదవెప్డు కేశవుని బత్తెము జీతములేని లెంకవై
వాడిదొఱంగి వాసవుఁడు వన్యమృగంబులతోడి వాసమై
గోదనుచున్నవాఁడు, సురకుంజరభర్త బిరానవచ్చి, పో
రాడగరాదొ ! యింద్రుని దురంతమనోవ్యథ దీఱునట్లుగన్. 395

శా. వైకుంఠంబుననున్న వాఁడనియెదో వార్తల్ మదిన్ నమ్మిఁత
ద్వైకుంఠమ్మన కాయితం పడితి, మత్సైన్యంబుతో, నింతలో
వైకుంఠమ్ము నిరస్త దీపమని చెప్పన్వింటి, నింకేడ, క
న్నాకై వేల్పులఁ దేల్చువాఁడు; బెదరెన్ నా క్రూర బాహాసికిన్. 396

క. ఎవని బలమ్మునఁ బ్రేలెద
వవిచారిత వితథసూక్తులర్భక ! మచ్ఛౌ
ర్యవికంపిత మానసులై
యవసథములు దొఱఁగి వేల్పులదవులఁబట్టన్. 397

వ. అనిన, ప్రశ్రయాఽవనతుండైన ప్రహ్లాదుండిట్లనియె. 398

సీ. స్థిరజంగమములైన జీవరాసులకు, బ్ర
హ్మాదులకును బలమైనవాఁడు
నీయందు, నాయందు, నెగడి, షడ్గుణముల
దైన సంసర్గంబు లేనివాఁడు
అధ్యక్షుఁడైన, మాయాచ్ఛన్నులకుఁగనం
బడనట్టి తెఱఁగు జొప్పడినవాఁడు
వన్యబహ్యాయాస పథములఁగాక, ప్ర
సన్నతాస్థితి కన్ను సన్నకాఁడు. 399

గీ. అఖిల బలవంతులకు బలమైనవాఁడు
మూఁడు గుణములకును బహిర్భూతుఁడగుచు
గుణములందున్నయటు భ్రమగొల్పువాఁడు
పరమ పూరుషుఁడే నాదుబలము తండ్రి !

సీ. కాలరూపుం డురుక్రముఁడీశ్వరుండు, స్వ
శక్తుల జగములు సంహరించి
వెలయించు, విజ్ఞానవికసిత యోగసిం
హాసనాభాసితుం, డలఘుసత్త్వ
బలములు, నింద్రియమ్ములు, నోజము సహంబు
దనరూపములె గాఁగఁదనరువాఁడు
నఖిల దేహమ్ముల నాత్మ స్వరూపుఁడై
'నేన'ను ప్రథకర్థమైనవాఁడు

గీ. వాఁడ నారాయణుండు, దుర్వైరవృత్తి
మాని, తత్పదములు గొల్వఁ బూనవయ్య !
యీ త్రివర్గంబు పదటికే, యెంతయున్న
శాశ్వతానంద పదము నీజాలదయ్య. 400

క. ఆసురభావము విడి, చి
త్తాసమభావంబు వదలు, మదియు హరికి స
ర్వేశున కర్హణమప్పుడు
గాసిపఱచు పగఱు నీకుఁ గలుగరు జగతిన్. 401

ఉ. లోకములెల్ల గెల్చితివి, లోపలిశత్రుల గెల్వనేరకే
యాకులపాటు జెందెదవుఁ హన్యులు భిన్నులు లేరు, నిన్నుఁజీ
కాకులువెట్టఁ దెల్వియను ఖడ్గముతోఁదెగఁ దుంపుమయ్య చిం
తాకరులన్, ప్రశాంతియును, దాంతియు నీకు హసాదువక్కెడున్. 402

గీ. సుతుని మాటలఁ గ్రోధమూర్ఛితముగాఁగఁ
దెలివి, కన్నుల నగ్గినిట్టలము గురియ
కత్తి ఝళిపించి, యార్చి, యక్కనకకశిపుఁ
డవని కంపింప నడచి, ప్రహ్లాదు డాసి. 403

ఆ. ఓయి! దుర్విదగ్ధ! యోరి! వంశవినాశ
కారి కుటిలబుద్ధి! కావరములు
ప్రేలినంతలోన, విష్ణుండు గొప్పవాఁ
డగున యేమిః బాసటగున! యేమి! 404

క. ఏవిభుఁడనొ, సర్వంబున
కా విష్ణువొ, నేఁడ తేల్తు, నయ్యపశదుఁడే
వావిరి మెలఁగునొ చెప్పుము
కావరమడఁగింతు, వానికడఁ బరికింతున్. 405

ఆ. అనగ, లోచనముల నానంద బాష్పంబు
లై, శరీరమెల్ల నలమికొన్న
పులకలగుచు, వినయచుళకితముగ దైత్య
పుత్రుఁడనియె, ముత్తెములు వెలార్చ. 406

క. ఎక్కడ లేడని తెలుపుదు
నెక్కడఁజూచిన వెలుంగు, నే నీయందున్
నిక్కముగఁ గాంచుచుంటిని
పెక్కులు వాదంబులేల! భీకరమూర్తీ! 407

మ. అనినన్ దైత్యుఁడు మూఢచిత్త! హరి, సర్వావస్థితుండంచు, నే
యనుమానంబును లేక పల్కె, దది తథ్యంబేని, యీ స్తంభమం
దునఁ జూపింపుమటంచు, సర్వసురహృత్త్రోదంబు దోస్తంభము
ష్టినిఁదన్నెన్, సభలోని కంబమును, దిక్సీమల్ బ్రకంపింపఁగన్. 408

18)

ఉ. ఆ నినదంబుతోన, వికటాట్టహసంబులు బర్వె, కల్పకా
లానల కీలికాచ్ఛట ఛటారవ భైరవముల్, నిశాచర
ప్రాణవికర్షణమ్ము, లసురప్రవిదారణ కంఠగర్జితా
ధ్మాన ఖగేంద్ర పక్ష బహుధాస్ఫుటశబ్దములం గవించుచున్. 409

ఉ. ఆ వికటాట్టహాసముల నంగము కంపితమై, సమస్త భీ
త్యావహశౌర్యదుర్దమసురారి మనంబు లవంబుగ్రుంగి, తో
డ్తోవశమై, యుగాంత భృశతోయదగర్జితహుంకృతుల్, మొగం
బై, వికటాక్షవీక్షణములై నిలిచెన్, కరఖడ్గ దీప్తులన్. 410

ఉ. ఎచ్చట నుండి వచ్చినవొ! యీ భయదాట్టహసంబులందుఁ దా
విచ్చుఁ కండ్లఁ జూచె, వివశీకృతుఁ డాసురచక్రవర్తి, రూ
పచ్చెరు వర్ధమానుషము, నర్ధమృగేంద్రము, కంబమందు, వి
ద్యచ్చటులాస్యవహ్నిపరితః పరితప్త నభోవిటంకమై. 411

క. హరిరూపము, నరరూపము
సరిసరిగా నున్నయవి, విచారము సేయన్
ధరలోని సృష్టి గాదిది
హరిమాయా రచిత మంచు నచ్చెరు వడుచున్. 412

వ. ప్రతప్తచామీకర చండలోచనంబును, కరాళదంష్ట్రింబును, కరవాల చంచల క్షురాంతజిహ్వంబును, భ్రుకుటీ ముఖోల్బణంబును, స్తబ్ధోర్ధ్వ కర్ణంబును, గిరి కందరాద్భుత వ్యాత్తాస్య నాసంబును, దివిస్పృశత్కా-యంబును, అదీర్ఘ పీవరగ్రీవోరు వక్షస్థలంబును, నల్ప మధ్యమంబును, చంద్రాంశు గౌర తనూరుహచ్ఛురితంబును, విష్వగ్భుజానీక శతంబును, నఖాయుధంబును, సర్వ నిజేతరాయుధ ప్రవీక విద్రావిత దైత్యదానవంబును నగు నృసింహరూపంబు గాంచి, మాయా జటిలుండై హరి, నన్ని కరణి వధించువాఁడు గావలయునని "భూతేభ్యస్త్వ ద్విసృష్టేభ్యో మృత్యుర్మాఽభూన్మమ ప్రభో!" యని చతురాస్యు వరంబడిగిన నాటి తన దొసంగు దలఁచి యూడంబోవక. 413

ఆ. కత్తి విసరి వేసి,- కాలకంధర గర్జి
తాయతంబు, వ్యాత్తమైన సామి
సింహ వక్త్రమందు,(జేరిన యది, సంద్ర
మందుఁ బడిన గుంజయట్టులయ్యె. 414

క. గద గొనివచ్చిన. తార్క్ష్యుఁడు
పదరెడు సర్పంబుఁ బట్టు వడుపున గదతో
గొదగొన్న, నసుర, లాఘవ
పదమై సంహనన ముద్ధవడి, చెంగించెన్. 415

గీ. ఇట్లు చెంగించి, కేశవుండిట్టులమ్మ
తన బలము నోపలేక హస్తములపట్టు
వదలెనని యెంచి, బరవసమెదిగి, మేన
నిమ్మడిగనైన బలమున నెసక మెసఁగి. 416

సీ. క్రమ కూర్చికొని, ఖడ్గ చర్మము ల్ధరియించి
త్రసితామరులు, జలధర నికాయ
యవనికాంతరితులై, యభివీక్షసేయ, రా
క్షసమౌళి, శ్యేనవేగమునఁదాకి
ధరణిపై మఱియుఁ బుష్కరముపై చిత్రచం
క్రమణంబులను, జన్య గతులఁ జూపఁ
గులిశాక్షతుండైన క్రూరనిశాటు, ను
త్స్వానుఁ గొంత సమయ మసడ్డసేసి.

గీ. ఘన భుజంగమ్ము మూషికమ్మును గ్రహించు
నట్లుగాఁ బట్టి, భూమియు నాకసంబు
గాని యూరుస్థలంబున మేను బిగిచి
కహ కహారావ భరిత దిగ్గగనుఁడగుచు. 417

గీ. ద్వారదేశమ్ము పైని తా నధివసించి
శర్వరియుఁ బవలునుగాని సమయమందు
దుర్నిరీక్ష్య పరాక్రమదోహలుండు
స్వామి, సురదుఃఖదళన కుపక్రమించె. 418

ఉ. చించు, పిచండభాగమును, జిల్లని పైకెగురన్ జపారుణం
బంచితలోహితంబు దగయంటినకైవడి, మధ్యమంద సా
రించును నాల్కఁ, గ్రోలి సవరించును హుంకృతి, దీర్ఘదంష్ట్రికా
కంచుకితమ్ము వక్త్రము, నికామము దైత్యులభీతిగొల్పఁగన్. 419

ఉ. చించునురమ్ము, రక్కసుల చిక్కని గర్వము జీల్చునట్లు, వా
రించును నల్ల, వారిదగు చిక్కణ శౌర్యము ద్రోచినట్లు, వే
ద్రెంచు సిరానికాయ మదసీయ యశమ్ములు కూల్చునట్లు, పూ
రించును గర్జితంబు, నిబిరీసరు దగ్నితరంగితమ్ముగన్. 420

ఉ. ప్రేవులు కంఠమాలికలు, పిచ్ఛిలరక్తము గంధసారసౌ
ఖ్యావహలేపనంబు, బలహంతృమణీఖచితాంగుళీయక
శ్రీవిభవమ్ము, హస్తగత శీర్షకచంబులు, రమ్యదారుణం
బై విలసిల్లె, సామిఁహరిదైన శరీరమలేఖ్య రీతిగన్. 421

మ. సురవిద్వేషి నిశాటరాజబలవచ్చండాల కుంభస్థల
స్ఫురణాపాటన జాగరూకములు, ప్రస్తోష్యద్వినీతార్తి సం
హరణంబుల్, నృమృగేంద్ర హస్తరుహముల్ మర్దించుగాకస్మదీ
యరజః కల్పితనైక దుఃఖజనన ప్రారబ్ధనాగంబులన్. 422

వ. ఇట్లు, నరుండును మృగంబునున్గాని సామిహర్యక్షరూపంబున, రజనియు దినంబునుగాని యపర సంధ్య, నంతరంగ బహిరంగేతరంబైన సభా ద్వారంబున, పుష్కరంబునన్ భూమియు గాని యూరుమధ్యంబున, ప్రాణ రహితంబులు సహితంబులు గాని నఖంబుల, త్రైలోక్యహృదయ శల్యంబైనహిరణ్యకశిపు వధియించి,సంరంభదుష్ప్రేక్ష కరాళలోచనుండు.

వ్యాత్తాననుండు, ఓష్ఠపుట లేలిహాన కుసుంభారుణ జిహ్వుండు, అసృగ్వ
సాక్తారుణకేసరాననుండునై యున్న నారాయణున్గాంచి, రాక్షసాను
చరులు సాయుధులై లేచిన. 423

క. కొందఱఁ గఱకు న్నూపులఁ
కొందఱి హుంకృతుల వేఱకొందఱి నఖరా
స్కందనముల, మానసములఁ
జిందిలగాఁజేసి, విగతజీవులఁజేసెన్. 424

చ. త్రిభువనమస్తక జ్వరము దీరినయంతన రక్కసుండు, వీ
తభయులు, హర్షబాష్పకలితంబులు నేత్రములై, దివిష్ఠులై
ఋభువులు శ్రీనృసింహునుతియించిరి, ముప్పదిరెండు వర్ణముల్
ప్రభ జిలుకంగనున్న, నతపాలన మంత్రమునుచ్చరించుచున్. 425

క. పాడిరి గంధర్వులు, వెస
నాడిరి, సురకాంత లభినయమ్ములతో, ది
క్క్రోడములు, ప్రతినదింపఁగ
వోడిగ, దుందుభులు మొరసె, పుష్కరమందున్. 426

వ. ఆ సమయంబున బ్రహ్మేంద్రగిరిశాది విబుధులును, ఋషిపితృసిద్ధులు,
విద్యాధర మహోరగులు, మనువులు, ప్రజాపతులు, అప్సరశ్చారణులు,
యక్ష కింపురుషులు, సహకిన్నరులు భేతాళ భూతంబులు, నంద కుము
దాది పార్షదులు, గుమిగూడి, తీవ్ర తేజస్కుండైన భగవంతుని వీక్షిం
పను, మొగం బెగయింపనుఁజాలకున్నఁ గనుసన్నల ననునయించి
చతుర్ముఖుండిట్లనియె 427

మ. పరమార్థంబుగ నీ స్వరూపమును జెప్పన్నూప, భావింప, నే
ర్పరు లెవ్వారలు, తోయ బిందువులు మా ప్రజ్ఞల్మహైశ్వర్య బం
ధురలీలార్ణవ! నేఁడు ద్రుంచితివి దైత్యున్, లోకమందెందు నె
వ్వరునూహింపని క్రొత్త రూపమున దేవా! దీనచింతామణీ! 428

మ. మును పెవ్వారు నొనర్ప నట్టి తపము న్బూనె న్నిశాటుండు, ద
ద్ఘనవహ్ను ల్సకలాశలన్ గమిచె, తద్బాధానివృత్త్యర్థమై
తని వొప్పారఁగ, నీయరాని వరముల్ దక్కోలుగా నిచ్చి, హ్రా
ద్వ్రణమై నిల్చితి, దాని మాన్పితివి దేవా! చిత్ర శౌర్యమ్మునన్. 429

ఆ. కాళ్లముందు చూపె, గలుగునే; మాకుఁ ద్రి
కాలమాపకంబు జ్ఞానశక్తి;
మా యలంతిపనుల మనపరివై, దిద్దు
నసురహరణ ! నీకు నంజలింపు. 430

వ. అంత వినయవినమిత జటామండలుండై యురగకుండలుం డిట్లనియె 431

మ. వరదానంబున దృప్తుఁడై యసుర, తీవ్ర క్లేశముల్ గూర్చె. నీ
పరిచర్యాపరులైన భక్తులకు, తత్ప్రాగల్భ్యముల్, త్వద్భయం
కరహుంకారముతోన నీల్గినవి, రిక్తప్రాయముల్గాక, ని
న్నారయన్జాలునె, యన్య గర్వములు ! దైన్యోపేత భక్తావనా ! 432

చ. అసురగతించె, తత్సుతుఁడనన్య పదాశ్రయుఁడింక, వాని, నీ
యసదృశసత్కృపామృతరసాంచితదృక్కులనాదరింపు, మీ
విస్ఫుమరరుట్పరీతమభివీక్ష నొనర్పఁగలేక విగ్రహం
బసదులు, దేవతల్ త్రసితులైరి, శమింపుము, సత్వవార్నిధీ ! 433

చ. ఎవ్వడో యుగాంతకాలమున నెత్తెదు కోపము నీకు, లిప్తలో
నపగతమౌను సర్వము, మహాభయదంబది యేమిరూప, మ
ల్పపుఁ బనికై ! మనస్సునకు వచ్చి నటించిన భంగి గాక, నీ
కృపణున కింతయే త్తెఱియె ! యెవ్వరు నమ్మెదరయ్య! కేశవా! 434

క. చాలింపు మిదానీంతన
మాలోలారక్త జిహ్వామగు రూపము, ప్రే
మాలాప మేదురంబుగఁ
బాలింపుము సురల, నిఖిల బ్రహ్మాండపతీ ! 435

వ. పరమపదనాథ పదాబ్జ నిధ్యానసముల్లసిత మనశ్చంద్రుండగు నింద్రుం డిట్లనియె. 436

మ. క్రతుభాగంబుల నాహరించెనను దుఃఖం బింతలేదో జగ
త్పతి ! నీ గేహమ లైన మా మదుల, తీవ్రత్రాసరూపుండు, సం
తతమున్, దా కొలువయ్యె, మా బ్రదుకు దగ్ధంబయ్యె స్వామీ ! పునా
రతముల్గావుత, మా మనస్సులు, భవద్రమ్యాంఘ్రి పద్మంబులన్. 437

ఉ. నీ పదచింతనామృత ధునీపరిమజ్జనహృష్ట చిత్తు లీ
షాపదభాక్త్వగౌరవ మొసంగరు ముక్తికిఁగూడ, సర్వ కాం
క్షాసహమైన, భక్తిరతి నాత్మకు నీగదవయ్య! దేవదే
వా! పరమేశ! బౌద్ధిక పథాఽతిగ భీకరచిత్రవర్తనా! 438

వ. నిరంతర నియమసుఖజుషులైన ఋషులిట్లనిరి. 439

ఉ. వానెదవీ సమస్తము, తపంబునఁజేసి, తపంబు పేర్మి నీ
వానిన దెల్లఁబోవ నడవన్గలవాఁడ వనాది! తత్తపం
బేనినుఁ దెచ్చికో,లసుర, యీసున, మా తపముల్ బెకల్చెఁత
తోఁకణఁపుద్రుంచి, మాకునోదఁగూర్చితి నిల్కడ, ధర్మకంచుకా! 440

మ. సవనాగ్నుల్ విహరించి, పుణ్యహుతసంసద్ధూమ గంధమ్ము, లు
త్సవమొప్పారఁగ నాని, యేండ్లునసనె, యజ్ఞం బున్ననే, వానినే
త్రవికీర్ణారుణ కాంతి, మా మొగములన్ బ్రాలంగ, దుఃఖవ్యథా
భవధూమంబుల గ్రోలుచుందుము, జగచ్ఛ్వామీ! రమావల్లభా! 441

వ. స్వస్వగోత్ర సంతారణ తరులైన పితరులిట్లనిరి. 442

మ. పితృసంతృప్తినిగోరి శాస్త్రపథికుల్, విద్యాయుతుల్, చాక్షుష
క్రతుతీర్థంబుల, నస్మదన్వయ శుభగ్రంథుల్ సమర్పించు, పిం
డతతుల్, ముందె మెసంగు, క్షుత్తెనసి, మాత్రాణబల్విఁకంపించు, శూ
న్యతమఃపుంజిత దృక్కులయ్యెదము దేవా! దీనరక్షావ్రతీ! 443

క. శిక్షితుఁడు రాక్షసుఁడు, లో
కక్షేమము సంఘటిల్లె, కారుణ్యసుధా
ప్రోక్షణములు, సౌగంధిక
వీక్షణములు, పౌలయుగాంక, వినతులపైనన్.

వ. సిద్ధులిట్లనిరి. 445

క. మా సిద్ధులు హరియించిన
పాళవికున్జంపి తీవు భయహరణ! పునః
ప్రాసక్తము లై సిద్ధులు
మా శిరములు వెలుఁగు, హర్షమహితమ్ములుగన్. 446

వ. పంకేరుహభవ నిపీత మాధుర్యంబులైన చరణంబుల, దృష్టి పంకేజం
బులఁ బూజించుచు విద్యాధరులన్నారు. 447

మధ్యాక్కర. భయద సుందరరూప! స్వామి! భద్రమ్మొ గావింతుగాక
నయవిదూరులకైన, శిక్షణాబుద్ధి, గలదె! నీయందు!
జయగర్వవిషమితచిత్తు శమలంబుదొలఁగె, నీదైన
శయసంగమునఁజేసి, వార్థిశాశయపూజితచరణ! 448

వ. బహుకాలనివర్తితభోగులైన నాగులిట్లనిరి. 449

శా. దేవాధీశ! ఫణాసహస్రముల దీప్తిన్ జల్లు రత్నంబులన్
లావున్దేవయుఁజూపి, కైకొనియెపో, లావణ్యతారుణ్యరీ
థావిభ్రాజితలైన మాసతులఁ గూడఁజ్జికొనెన్, చచ్చె, నిం
కావేశించును, మా మనస్సుల సతీత్వాహార సౌరభ్యముల్. 450

సీ. వాని విక్రాంతితో వసివాడె, సకలధ
ర్మములు, తెప్పితెనంచు మనువులనిరి
గంధర్వులింక, రింభద్వల్లకీ మూర్ఛ
నాసుందరములు, దిఙ్నగములనిరి

యక్షులు, దితిజపల్యంకికావహన కి
 శాంకముల్ మాయువేళయ్యెననిరి
యోలి, ప్రజాపతులుద్ధతుండీల్గె, సృ
 ష్టిక్రమంబింక నిర్వక్రమనిరి

గీ. ప్రథమతోభూత దుఃఖ భరస్మృతిప్ర
భిన్నబాష్పోద్గతులు, తతః పృథులమోద
బాష్పముక్తామణీ విభాభాసినేత్రు
లాత్మమస్తకనిహిత హస్తాబ్జయుగులు. 451

చ. స్ఫురదరుణాధరంబు పయి, సోనలు గట్టిన బాష్పవారియై
గురుజఘనమ్ముపైఁ బొరలు క్రొవ్వెదయై, దయనీయనేత్రపు
ష్కరవిగలత్కటాక్షయయి, క్రమ్మిన చీకటితోఁ చిత్తమై,
హరి సవిధంబు జేరెను కయాధువు, దేహము కంపమొందగన్. 452

సీ. వాఁడె ప్రహ్లాదుండు, భావత్కభక్తిసం
 భావనాఽధరితాన్యబంధచయుఁడు
వీఁడె యాహ్లాదుండు, పితృనిబర్హణభయం
 కరదృశ్యవీక్షణాఽక్షమదృశుండు
సంహ్లాదుఁడతిగో! యీశ్వర! మూకదృక్కులా
 గుబ్బుగా నను(బట్టికొన్నవాఁడు
హ్లాదుండువీఁడు, నాయనబోయి, దిక్కులే
 నట్టి కొమ్మగ, రోదనాశ్రయుండు

గీ. అచ్యుతా! వాని, వీనిని, నభవ! వీని
వీనినిన్గూడ, జాలితోఁ బెనుపవయ్యె
దిక్కులేనట్టి దాన, నార్ద్రీకృతంబు
లైన చూపులఁ గరఘమయ్యాః; ముకుంద! 453

ఉ. నిన్ను దృణీకరించి. రజనీచరనాథుఁడు, లోకపాలిఁగ
న్నన్నలనేలెగాక, తుదిఁజచ్చె భవన్నఖవిక్షతుండు, స
ర్వోన్నత! నీ మహామహిమనోపుదురే యొరులడ్డగింపఁగా
కున్న, చతుర్దినావధిక గుంభితవీర్యకువృత్తి దక్కఁగన్. 454

ఉ. కన్నులు బాష్పపూరములుగా, పరమాత్మునితోడివైరము
త్సన్నమొనర్పుమంటి, నిజదారకుమార్గముసేయమంటి, సం
భిన్నులు మౌనులైన, నది కీరితి,యాయువుకూల్చునంటి, నా
సన్నమృత్యువై - వినఁడు, చచ్చెఁదుదిన్, పలుమారమట్లుగన్. 455

చ. హరి! పరమాత్మ! దీనజనతావన! కంటకకంఠలుంఠనా
తుర బహుళక్రృతావతర! తోయజలోచన! యింద్రశౌర్యదు
ర్ధరుఁడగు నావిభున్ పలువిధంబునఁజంపి, సుపర్వలక్ష్మి సు
స్థిర మొనరించితింక దయసేయుము, కన్నులు చల్వలీనఁగన్! 456

ఉ. చంపనుఁ బూనుకొంటివదిసాజమె, నల్వురిజంపునట్లుగాఁ
జంపఁగరాదొ! పొట్టనతిజాల్మతఁ జీల్చుటలేమి, ప్రేవులన్
ద్రేంపుట లేమి! రక్తములఁ దీంద్రఁగఁద్రావుటలేమి! గర్జనా
ఘుంపలివేమి! యీపగిదిఁ జంపనె చంపుటలౌనె? కేశవా! 457

క. అమరజ్వరమగు నాపతిఁ
జమరిన నీ నఖరములకు సాష్టాంగము, ధ
ర్మమయా! నన్నుమిగిల్చిన
క్రమమేమయ్యా! శుగగ్ని రగులుటకొఱకై. 458

క. మరియొకపరి సాష్టాంగము
పురహర హృదయాపహారి! బుధుతల, వీరిన్
పరమకృపాభరదృష్టులఁ
బరికింపుము, పితృకృతమ్ముఁ బాటింపకుమీ! 459

క. నారదమున్యుపదేశము
పారియుఁ బారదు మనంబు పట్టున, సర్వా
ధారములగు నీ పదముల
నారఁగ నా తలను నిలుపు మఖిలాండపతీ! 460

ఆ. అనుచు విన్నవించు. నాకయాథువు విన్న
పంబుతోడ, మెత్తబడియుఁ బడఁడు
కనకకశిపు బలునఖమ్ములు, కన్నుల
తెరువులందు, తెరలు తెరలు దోచి; 461

సీ. అంత విరించ్యాదుఁ లాన్నృసింహుని కోప
సంరంభమును మాన్పు చతురులెవర
టంచు విమర్శించి, హరికిఁ బట్టపుదేవి
శ్రీదేవి దరిసి, వాసిగలతల్లి!
దనుజేంద్రగాత్ర రక్తంపు నారుణ్యమ్ము
దొరలంగనాడు విచ్ఛురితలోచ
నమ్ములతో లోకనాథుండు! నీవైన
ధృతిఁబూని కోపమ్ము దీర్పవమ్మ

గీ. యనుచుఁ బ్రార్థింప, మున్నెన్న డట్టి రభటి
జూడనిదియౌటఁ, గన్నులఁ గూడికొన్న
భయములై, దరియంగ వెన్బడుచునున్న
నఖిల గీర్వాణవరులు, ప్రహ్లాదుఁదరిసి. 462

క. ఓ యన్న! నీవ వలఁతివ
పాయము దాటింప, ఫణింపపర్యంక శ్రవః
పేయములగు వాక్యమ్ముల
నీ యుగ్రత డించి, శాంతి నెలయింపగదే! 463

మ. అని ప్రార్థించిన, ప్రశ్రయానతుఁడు ప్రహ్లాదుండు, 'కానిండ'టం
చనుమోదించి, ప్రమోదకుట్మలితదివ్యద్దేహుఁడై, తండ్రిఁజే
రు ననుంగున్ శిశువట్లు, దైవతకరీరున్‌డాసి, సద్భక్తిచం
దనలిప్తంబులు చూపులన్బలిపి, వెంటన్ మ్రొక్కి యర్పించినన్. 464

ఆ. పాదమూల పతితు, బాలకు, ప్రహ్లాదుఁ
గాంచినంతఁ గరుణఁ గరఁగి హస్త
పద్మములను దాఁచి, వడిలేవ నెత్తి, యా
కౌన్నయట్టు లొడలిగుర్పఁజూచి. 465

మ. పరమేశుండు శిరంబుపై నునిచె, సేవాప్రాణలక్ష్మీ నిరం
తర సంప్రార్థిత, మాదితేయసుఖసంపన్నిత్య నిర్వాహకం
బురుకాలాహి విభీత భక్తజన సద్యోభీతికృంతమ్ము, శ్రీ
కరమౌ దక్షిణ హస్తమున్, పరమ విజ్ఞానామృతస్యందమున్. 466

సీ. హరి కరస్పర్శతోన స్సంగతమ్ములై
యఖిలాఽశుభములు, సద్యఃప్రవర్తి
తాత్మదర్శనుఁడు, హృష్యచ్ఛరీరుఁడు, ముద
శ్రుస్ఫీతనేత్రుండు, శోభమాన
ద్రవితాశయుండు, నిధ్యాన హృత్కమల సం
స్థాపిత వైకుంఠ చరణయుగుఁడు
నగుచు, నృసింహ పదాబ్జాత భృంగమ్మ
లై కటాక్షమ్ము లందంద నిలువ

గీ. కంఠదేశమ్ము గద్గదికమునఁ బెనఁగ
నశ్రుసంపాతములు, పల్కులడ్డగింప
నాత్మభావంబు నెగిరింప ననదలైన
భాషణముల హృషీకేశుఁ బ్రస్తుతించె. 46

మ. జలజాతాసన వాసవాదివిబుధుల్, సత్త్వైకతానుల్, మహ
ర్షులును, న్నీవగు జన్మకర్మములతీరుల్ సంస్తుతింపన్ సమ
ర్థులు గారన్న, దురన్వయాఽవసథ చేతోవృత్తి, నే నేర్తునే !
కలభంబీద వలంతియే ! వననిధిన్ ! స్వామీ ! రమావల్లభా ! 468

మ. అల సూర్యేందులు చేతి తాళములుగా, నాబ్రహ్మఘాసాంతజీ
వుల శారీరక చాలనం బభినయంబున్నా, ననాద్యంతదో
హలకాలాఖ్యుఁడుగూడ నీదగు గుణాఖ్యానంబు గావింపఁగా
నలుపుండేనట; యెవ్వరర్హులిఁక దేవా! నిన్నువాక్రువ్వఁగన్ ! 469

మ. కులమున్ తేజము, పౌరుషంబు, ధిషణాకూలంకషత్వంబు, ని
స్తుల నిష్ఠాఽనుసరంబు, రూపమున పొందున్, త్వత్వదాభ్యర్చనా
కలనాసిద్ధికిఁ బోలవీశ్వర ! యహంకారాఽతిగంబైన శే
వలభక్తిన్ దనివొందియుంటెదవు, గోవత్సంబు చందంబునన్. 470

మ. సకలోపాసిత సద్గుణావళులు సంసక్తంబులైనన్, ముధా
సికతాముష్టియెగాక, శాంతి, లవమున్ జేకూరునే ! త్వత్పదా
బ్జ కళాలింగిత చిత్త మొక్కటియె శశ్వచ్ఛాంతి, హర్షాంబుసే
చక ధారాధర నామకీర్తన ! సుధాసార ప్రసాదేక్షణా ! 471

మ. ఒక భక్తుం డుదయింప వంశమున దేవోత్తంస ! తద్భక్తిచే
వికసించున్ కులమెల్ల పార్వణవిభాస్వీతంబు యామ్యంబు, భ
క్తి కలాపంబును బూను నంత్యజుఁడు దర్శింపంగ, శ్రుత్యర్థ వే
దికి భూదేవున కెచ్చు భక్తజనగోత్రీ! ప్రేమభిక్షావ్రతీ! 473

వ. దేవా ! నీవవాప్త సర్వకాముండవు, నీకజ్ఞుల పూజలతోడిదేమి ! పరమ కరుణాళుండవు అగుటన్జేసి, బాహ్యద్రవ్యంబుల నొనర్చు నర్చనంబు లంగీకరించినట్లుందువు. తద్గ్రహణంబు వారొసంగిన ద్రవ్యంబులు, వేలు మడుంగులుగా నొనర్చి వారి కొసంగుట కాని వేఱుగాదు. 474

సీ. స్వామి! యథా మనీషంబుగా విగత వి
క్లబుఁడనై త్వత్పాద కమల సంస్తు
తి నొనర్తు, దైవతాఽధీశ! యవిద్యతో
గుణనిసర్గంబునాఁ జనెడు, సంసృ
తినిబద్ధ నీచుఁ డుత్తీర్ణుఁ డౌటకు, భవ
త్ప్రస్తుతిగాక మార్గంబు గలదె
కొలుపు తాడిడి ఫలంబులు గొంట గాదు, నీ
సేవ, నిశ్శేష సంసృతి హరంబు
గీ. శివ శివత్వమ్ము తావకా సేవనమ్ము
వేద నిశ్వాస! సనకాది వీతరాగ
హృదయ వైకుంఠ దేవర్షి నిత్యగాన
కలశ సాగర శయన చిద్గగన తపన! 475

శా. నీ యాజ్ఞల్ దలపైని నిల్పుచు, భవన్నిర్వేల కారుణ్యదా
రాయత్తంబులు వైభవంబులగు బ్రహ్మాదుల్ భవన్మూర్తి వీ
క్షాయత్నమ్ములు మాని భీత్యవశమూక ప్రేక్షకుల్, దేవ! జ్యో
త్స్నాయుక్తస్ఫుక్కుల వారిఁ జూడుము, మనస్సంతాపముల్మాయఁగన్.
476

చ. అసురులు, నిన్ను గైకొనని యార్యపథ ప్రవిదూరు లట్టిచో
విస్ఫుమర విక్రమంబుదగు, వీరలు, విశ్వము, త్వత్కృపారస
ప్రసరము, రక్షసేయుటకుఁ బాత్రులు, కన్నులకిన్క యేరికై!
యసమవిచిత్రవీర్యవిభవాఢ్య! నిరంజన! భక్తరంజనా! 477

క. దుస్తర హిరణ్యకశిపు
త్రస్తులకున్ మోదమయ్యె, దరవిహృతికిఁగాఁ
బ్రస్తుతు లొనర్తురివిను
విస్తృత భూమర్త్యలింక వినతశరణ్యా! 478

మధ్యాక్కర. నీవైన దంష్ట్రలు, జిహ్వ, నిట్టలంబైనట్టి తమము
గావించు బొమముడి, పెల్లుగా, నెదదాల్చిన యట్టి
ప్రేవులు, దిక్కులు వగులు వేంద్రమ్ములైన యార్పులును
గావు, నాకెన్నడు, భయము గల్పించునవి, శ్రీనివాస! 479

మ.అ. నైకజన్మమ్ములయందు, నాయొనర్చినయట్టి కర్మ
పాకమ్ము, పైపైని బడెడు, బహు దుఃఖ సంతతి నలిగి
చీకాకు పడితి నీ సేగి, సీమాతిగంబైన కరుణ
బోకార్చి, హర్షంబు, మదిని, బూరింపుమో శ్రీనివాస! 480

మ.అ. ఒక పాము మూయ, నింకొక్క, టువ్వెత్తుగాలేచునట్టు
లొకగుణం బదుపులో నుండ, నొక్కటి పడగెత్తినిలుచు
ప్రకటంబు లీ యాఱు పగఱు, పొలార్చు చున్నారు, నన్ను
తికమకలుడిపి నన్నోమ్ము, దీనుండనో శ్రీనివాస! 481

సీ. ఒకదాని సంయోగ మొదవించు సంతోష
మొకదానితోడి నంటుత్తలమ్ము
ఒకదానితోడి వియోగమ్ము, పరితాప
మొకదాని విడుపు, హర్షోల్బణంబు;
ఒక దుఃఖమ్ము దొలంప నొనరుచు జతనంబు
నంద, వేరొక దుఃఖమలమియుండు
సుఖదుఃఖములు రెండు జోకమ్ములే, ప్రియా
ప్రియమనోభావ సంసృష్టిఁజేసి

గీ. సకలయోనుల యందివిదే సరణి, భావ
వాగురాబంధములు, వీనివలనఁ దప్పు
కడుసుఖమ్ము, నీ దాస్యయోగమ్ము దెలిపి
నీ పదమ్ములు చూపి, మన్నింపవయ్య. 482

వ. రోగంబున కౌషధంబును, శిశువునకుఁ బితరులును, నిమజ్జనోన్ముఖునకు నావయు శరణంబు లందురు. తత్త్వంబు విచారింప నవియు శరణంబులు గావు. పరమయోగి పరమధనంబులైన నీ పాదంబుల నిక్కంపు శరణంబులు. ఆదిదేవా! నీవ నా పరదైవతంబవు. విరించ గీతంబులై, లీలా రసంబులైన నీకథలయందు, నామనంబహరహంబు రమించునట్లాశీర్వదింపుము. తత్స్వాదయుగాలయ పరమహంస సంగతి, నిరంతరము నన్ను రక్షించుచుండున్గాఁత. త్వదుపేక్షితులతోడి సంగతి విషప్రాయంబగున్గాఁత. లోకంబున నెవ్వం డేకృత్యంబు, యత్ప్రేరితుండై, యదింద్రియంబుల, నెందులకు, యత్సంబంధియై, యేస్థలంబున, నేసమయంబునం, దేరూపంబున నొనర్చు, నా ప్రకారంబులన్నియు నీవ. నీవుగానిది లేదిది యథార్థంబు 483

సీ. పురుషం డనుమతింప, నురుకాలచోదిత
గుణయైన మాయ, మేకొని, మనంబు
సృజియించు, దాని నిర్జింప నశక్యమే
రికినైన, కర్మ సంవృతము, కర్మ
మయము, జీవుండు దన్మహిమకులోఁబడు
నుద్యతంబైన యవిద్యఁజేసి
ర క్తి, షోడశవికారముల సంసారచ
క్రంబున జీవుండు కసటు గుడుచు

గీ. జన్మ కర్మల చక్రంబు సాఁగుచుండు
తిరుగలిగ, నెన్నటికి విడుమఱయెలేదు
నీ వొకఁడు దప్ప, నిత్యమీ నియతినుండి
బయటఁబడినట్టి ప్రాణి యెవ్వాఁడు దేవ! 484

క. నీ వాత్మ గుణంబులచే
నావృతుఁడవు గావు, సంతతాఽమిత చిచ్ఛ
క్త్యావిష్టుఁడ, వజయాఖ్య మ
హావిష్టరచక్రవర్తి; యనుపమకీర్తీ! 485

ఆ. కార్యసాధనములు గల్గినవాఁడు, నీ
కరుణఁజేసి కాలపురుషుఁడీయ
నాది సంసృతికి, వినామోక్ష, మగ్గంబు
సేసె, కావవయ్య ! శ్రీనివాస ! 486

శా. ఆయుర్లక్ష్మలు చామరద్వయములౌ, హంకారడోలావిహా
రాయత్తుల్, దిగధీశు లెవ్వని రుషోద్యద్భ్రూకుటీ ఖేలనా
పాయగ్రస్తులౌ యట్టి నాపిత, భవద్బాహూర్ధతిన్, గువ్వయై
పోయెన్, జూచితినయ్య వారి విభవంబుల్, వాని యాయుష్యమున్. 487

సీ. అబ్జజునాధిపత్యము మొదల్గా, తృణాం
తంబున్న జీవవితానభోగ
ముల పరిపాకంబు దెలిసితి, నైంద్రియం
బులు, వానినొల్లి, నెప్పుడొ గ్రసించు
కాలపూరుషునకుఁ గబళంబులవి, యణి
మాది విజృంభణం బట్టి యదియ;
యింక నాయువు, శ్రీయు నే పదార్థములురు
క్రముఁడైన కాలవిక్రాంతి కరయ

ఆ. మాయయంటి, యెందు మలినంబు గానట్టి
మెఱుక యొసఁగి, యెందునెప్పుడేని
కాలమునకు నంటఁబోవని, నిజభృత్య
పదవి నొసఁగి, కరుణ బఱపుమయ్య ! 488

క. రోగములకు నావాలము
భోగశరీరంబు, భోగములు దుఃఖంబే
ప్రోగైనవి, మనుజుఁడు, కా
మాగతి, నీరెంటి వెంట నలయుచునుండున్. 489

శా. ఆ సింధూద్భవకబ్బలేదు, విధికప్రాప్యంబు, శుభ్రాంశురే
ఖాసంభావిత జాటజూటునకు సంకల్పాంచితగం, బీరజో
వ్యాసక్తుండగు రాక్షసాన్వయుని శీర్షాకల్పమయ్యెన్, భవ
ద్భ్రీప్సి సంపన్నము, పద్మహస్తము, దయార్ద్రీభూత చేతస్కమై. 490

ఆ. అంతమాత్రముననె, యభవాదులకు నెక్క
డై తినను నహంత నంటనీకు
మది, భవద్దయారసాభ్యున్నతియెగాని
నేను, పాత్రుఁడగుటతోనఁ గాదు. 491

తరువోజ. ఒక కోర్కె వెంట వేరొక కోర్కె, యిట్టు
లోసరిల్లని కోర్కెలొదఁగూర్చు సంసృ
తికిఁబాత్రమైయున్న, దీనుని నన్నుఁ
దివిరి కారుణ్య సందీప్తిఁజేకొంచు
సకల జీవవ్రాత సంక్షేమసక్త
చర్యుండు, దేవర్షి, చక్షువుల్ విప్పి
సుఖసాగరంబు నిస్జూపించె, నిగమ
శోఖాకర పదాబ్జు; సుందరవదను. 492

తరువోజ. బంధుర నిర్వాణ పదములై నట్టి
భావత్క కథలంద, పరమ ! నా మనసు
తుందిలోన్మాదమై తోషిల్లుగాక
తోయజనయన ! నీ తోడి సంసర్గ
మందక, విషయకుల్యామగ్నులైన
మందులు, దామెట్టి మహితులేయైన
బొందింపకుము సంగములు వారితోడ
మోహాంతాబద్ధ బుద్ధులతోడ. 493

సీ. ప్రియము, నప్రియమును, ప్రేమా ఒరణిచ్చన్న;
మానసికంబు, బున్మస్తకము
నీ కేసరావళి, నీ పరిప్లవ జిహ్వ,
యుచ్ఛూనకేత్ర నిష్ఠ్యూతవహ్ని
యత్తాల విశ్వ గర్భోద్భేది కహకహల్
దీర్ఘ దంష్ట్రిలు, చలత్ప్రనకర్ణ
ములు, కాల సర్పముల్, భ్రూచాలనమ్ములు
రక్త దిగ్ధమ్ము లాంత్ర స్రజములు

గీ. నాకు భీప్రదములు గావు, నా మనః ప్ర
మోదకరములు, భక్తిసంపుటితమూర్తి !
సతతమిట్టులె మన్మనశ్చక్షువులకు
సన్నిధి యొనర్చి, రక్షణ సలుపవయ్య ! 494

ఆ. నన్నురక్షసేసి, నా తండ్రి ఐంపుట
దలఁప నాకుఁగరుణగలిగి గాదు
శిష్ట రక్షణంబు, దుష్ట శిక్షణమును
పరమ పురుష! నీ స్వభావమగుట. 495

క. త్రిగుణము విశ్వము సృష్టిం
చి గుణమ్ములఁ గూడి, దానఁజేరుచు, నొక్కం
దగు నీవు, మూఁడు ముసుగుల
నొగి, సంహారాదికముల నొనరుతువీశా! 496

క. సదసత్కారణ కార్యా
స్పదమగు నీ విశ్వమునకు, పరహేతువు నీ
వ,దనరు మాయాకృత
భిదగానీ, నీవుగాక, వేఱున్నదియే! 497

ఆ. అగుట నీ స్వరూపమఖిలంబునందును
జూచునట్టి, లోని చూపునిచ్చి
మనుపవయ్య! మోహమాలిన్యము దొలంచి
మనసునింప, భక్తి మధువునింపి. 498

సీ. రసములకై పాఱు, రసనేంద్రియము, దాహ
మెత్తిన, జింక బర్వెత్తునట్లు,
శ్రవణముల్ శబ్దంబు సంగతినంటు, తే
నెలవెంట, తుమ్మెదల్మలయునట్లు
పలుగంధముల వెంటఁబడు, నాసికా గ్రంథి
ధనముల వెన్వెంట పినుఁగువోలె
వీక్షణమ్ములు కామవిహృతికై పాఱు, దొ
మ్మిగనుఁ జీమలపుట్ట బగిలినట్లు,

గీ. ఆకలికి, దప్పికినిఁ గడు నటమటించు
బహుసపత్నులు మందిరపతి నలంచు
కరణి, నిన్నియు నన్నుఁ జీకాకుపఱచు
నీ దయయెలేక, భక్తియెలేదు స్వామి! 499

మ.అ. వీఁడు నావాఁడు ప్రేమంపుపేర్మికి నర్హుండు వీఁడో
గాడుదాసీనతదగును; కలుషుండు, వాఁడుబో, వైరి
వాడిమి, వానియం దనుచు, స్వపరబుద్ధులవలన్దగిలి
పాడౌను లోకమ్ము, జన్మబంధముల్ సృష్టించికొనుచు. 500

మ.అ. తామరసాక్ష! నీ పాద తాత్పర్యమైనట్టి భక్తి
సామాన్యమా! బహుక్లేశ సాధ్యంబటందురో యేమొ
స్వామి! నీ పాదభక్తులు, కృపాపరులున్నారు గాదె!
యోమగా, నీకన్ననోర్పు, లొదవిన యవనైకపరులు! 501

మ.అ. వారు ప్రత్యక్షదైవములు, వారికన్నేవలపన్న
నీరేజనాథ! నీ కరుణ, నీ దైనకోపఘూర్ణితము
వారి సేవింపదెప్పరమొ! వార్షుకాభ్రమ్ములఁబోల
ధారగావర్షింతు రెపుడు, ధరననుగ్రహసుధావృష్టి. 502

మ.అ. వైకుంఠ! నేనొల్లముక్తి, భక్తి పీయూషవర్జితము
నీకు, వేఱుగనుండి నిన్ను, నిచ్చలు గొలిచెడు ద్వైత
మే కృపసేయు మీక్లిన్న హృదయభావ స్నిగ్ధ రచన
లాకదఁ గలవె! దృగ్బాజనానంద దుఃఖ బాష్పములు! 503

మ.అ. అడవులఁజేరి యాకులును, నడ్డమౌ గడ్డలు మెసవి
కడునిడుమల కోర్చి, నవసి, కవిలగడ్డములను బెంచి
యెదఁదల సాత్వికం బహములేపాద,జగదీశ! నిన్ను
బొడఁగానలేరు, పదటికి, బూనిన వ్రతములై స్వామి! 504

క. నిరహంకృతి, నీవారల
పరమకరుణబడసి, నీదు పదములపైఁ గ్ర
చ్చఱ నెరఁద బరచువారలు
చరియింతురు. విగత మోహసరణుల యందున్. 505

క. అనుచు ననేక విధమ్ముల
వినుతించెడు భక్తివరుని వీక్షించిన యం
తన, హరి కన్నులర క్తమ
లెగసినమేరలకుఁ జలువలివతాళించెన్ 506

క. ''నావలనఁజేసి, యురుబా
ధావిషవలయముల నెంత దపియించితి వ
త్సా! వెతలు గడచెనిఁక నీ
త్రోవల సౌఖ్యములు వాఱు, దొంతరలగుచున్. 507

ఆ. అనఘ! కామపూరుఁడను నేను, ననుఁజూచు
తోన, బుజలుసుమ్ము! దుఃఖచయము,
కోరికొమ్ము, నీవు గోరినవరము, నే
మైననిత్తు, విష్ణుపాభ్యుదయము. 508

ఆ. నేను దుర్లభుఁడను, నిష్ఠతో నను విల్చు
కొన్నవారి, నేలఁగన్నవాఁడ
వత్స! నీదు భక్తివలఁ జిక్కితిని, దుష్ట
హననమునకు సింహమైన నేను" 509

క. అని లోభపెట్టు పరమా
త్మని గని, "భక్తికిని కామములకును నేస్తం
బొనరునె!" యని, స్మయమాన వ
దనుఁడై, ప్రహ్లాదుఁదఘవిదారికి ననియెన్. 510

ఉ. పుట్టుకతోన బుట్టినవి, పోకలఁబెట్టెడు కామముల్, తదా
ఘట్టనకోర్వలేక, త్రిజగద్వరణీయ! భవత్పదాబ్జము
ల్వట్టితి, నీవుగూడ నను వంచనసేయుదె! చిత్స్వరూప! యే
పట్టున నెట్టి కోర్కిదెసప్రాలని సద్వరమిమ్ము, మాధవా! 511

సీ. అర్థంబు గోరుచు ననుచరించెదరు, భృ
త్యులు రాజులను, భూమిపులు, ప్రయోజ
నార్థులై యొసఁగెదరర్థముల్, వారి సం
సర్గమాత్మ ప్రయోజనము, నీవ
వాప్తకాముండవు, నరయ చిద్ఘనుఁడవు
నాకుఁ గూడఁ బ్రయోజనమ్ము లేదు
మనదైనయట్టి సంబంధమ్ము, శారదా
కాశమ్మువోలె నిష్కలుష, మెట్టి

గీ కామమును లేనివాఁడు, నీకరణియే, వి
శుద్ధసత్త్వుఁడుగాఁగ నౌ సిద్ధచరిత!
యాపదవి నాకు దయసేయవయ్య! నీదు
నడుగులే, జీవనంబుగా నడపుమయ్య! 512

ఓన్నమో భగవతే తుభ్యం, పురుషాయ, మహాత్మనే
హరయేఽద్భుత సింహాయ, బ్రహ్మణే పరమాత్మనే. 513

ఓం నమో భగవతే, నరసింహాయ, నమస్తేజస్తేజసే, ఆవిరార్భవ, వజ్ర
నఖ! వజ్రదంష్ట్ర! కర్మాశయాన్ రంధయ రంధయ, నమ ఉగ్రస్వభా
వాయ, మహాత్మనే, తమోగ్రసగ్రస ఓం స్వాహా అభయమభయ మా
త్మని భూయిష్ఠా ఓంక్ష్రౌం. 514

గీ. అనుచు సాష్టాంగ మొనరింప, నబ్జనాభుఁ
డాదరమ్మున నిసితింతలైన కనుల
వెన్నెలల జాలుగాఁ జూచి, ప్రిదిలిపాఱు
భాగ్యఫలరసములుగాఁగఁ బలికెనిట్లు.

క. ఏకాంత భక్తిరస, మా
ధ్వీకృతమానసులు, నీదువిధమట్టిఱు, దా
మేకారరిహాముత్రసు
ఖాకలనకు, మోహబంధనాందోళితులై. 516

ఆ. అయిన నసుర భర్తవగుచు మన్వంతర
మెల్లసాఁగి, సుఖిగ నుల్లసిలుము
మత్కథాప్రబంధ మధుర శ్రవణయజ్ఞ
మున, దినములు హవ్యములుగ వేల్చి. 517

ఆ. సకలభూతములను సంపూర్ణముగనున్న
నన్న, యాత్మ నిలిపి, సన్న్యయముగ
సకల కార్యములను సలుపుము, పాపంబు
లంటకుండు, నిన్ననాత్మబుద్ధి. 518

క. కాలము ప్రాప్తించిన, నిహ
మూలము దేహంబు వదలి, పుణ్యయశశ్శ్రీ
లాలిత చరితుఁడవై, మ
త్పాలిత వైకుంఠమునకు వచ్చెద వనఘా! 519

క. కైతవనృసింహ లీలా
స్ఫీతము నీగాథ, భక్తిఁజిందెడు చిత్తం
బై తగనెవ్వఁడు జదివిన
నాతల, వానికిని జన్మలంటవు మఱలన్. 520

వ. అనిన ప్రహ్లాదుండిట్లనియె. 521

క. కూటకిటి వౌచు నసుజువి
పాటన మొనరించితంచు, బద్ధామర్షా
స్ఫోటిత వివేకుఁడై, మి
థ్యాటోపము జూపెఁ దండ్రి, యచ్యుత! నీపై. 522

క. ఆ యఘము దలఁగి, నీదు కృ
పాయుత దృక్కులను జేసి, యతిరోహిత వి
ద్యాయుక్తుఁ డగుచు నీ మి
థ్యాయిత సంసృతికిఁబాసి, తనిసెడు గాఁతన్. 523

గీ. "నీవు పుట్టినకతమున, నీదుతండ్రి
యొక్కఁడేయేమి! నీ పాదముంచినట్టి
యెడలఁ దిరిగిన పురువులు స్వదయు శుభము
నీదుసద్భక్తిపాకమేతాదృశమ్ము. 524

క. సమదర్శకులు, ప్రశాంతులు
క్రమనిహితాచారపరులు, కలుషమ్ముల యో
గములేనివారు భక్తులు
ప్రమదమ్మున నేను వారివరవుడమోర్తున్. 525

సీ. నా యంగసంగమ్మునను జేసి, నిర్ధూత
పాతకుండై దివ్యపదవిఁ బడసె
నీ తండ్రి, లోకంపు నియతిగాఁ బ్రేత కా
ర్యము లొనరింపు, భూతాళితృప్తి
నొందింపు నైకవిధోజ్జ్వ లాన్నంబుల
నదియుసూ ! ప్రేతకార్యంబు తొడవు
బ్రహ్మవాదుల యభిప్రాయంబు, పాలనం
బై ప్రేతకార్యంబు లాచరింపు

గీ. మన్మనస్కృత లోని తామసుల నదిమి
నట్టులనె వెలిపగతుర నదిమి ప్రజల
యవసరంబుల తీర్చ భోగాళిగాఁగ
మనుము ప్రభువన, నిట్టి నేమంబువాఁడు.'' 526

వ. అంతఁ జతుర్ముఖు నుద్దేశించి నృసింహదేవుం డిట్లనియె. 527

క. ఎన్నడు నిట్టి వరంబులఁ
గ్రన్నన నివ్వకుము దుష్ట రాక్షసులకు, వా
రెన్నుదురె ! హితాహితములు!
పన్నగముల కమృత మిడెదు వారున్గలరే ! 528

ఆ. అనుచుఁ బలికి దైవమంతర్హితుండయ్యె
నాదిలక్ష్మితోడ, నపుడు సురలు
వారు వోయినట్టి వలనికి సద్భక్తి
నంజలించి రెదల నమృతమొలికి. 529

ఉ. ఆదిజుఁడైన బ్రహ్మకును నంజలిసేసి, హిమాంశు భాగ్య సం
పాది జటాకలాపునకుఁ బ్రస్తుతిఁ గూర్చి రమేశ సత్కృపా
శ్రీ దయివారు దివ్యులకు సేవలు గూర్చి నిశాటసూనుఁడా
హ్లాదము గూర్చె నందరకు, నంచిత భక్తి పురస్సరంబుగన్. 580

గీ. వారు, ప్రహ్లాదు దీవించి, వరవిమాన
కోటి మణికాంతి గగన మాగుబ్బు గొనఁగ
పోయిరంతటఁ దమ లోకములను గుఱిచి
యాన్నృసింహపదాబ్జనిధ్యానమతులు. 581

క. దేవోత్తము నాజ్ఞావిధి
దేవాహితుఁడైన పితకుఁ దీరిచి పరలో
కావశ్యకములు రాజ్యర
మావిలసితుఁ డయ్యె, దైత్యమర్దనుఁ డంతన్. 582

మ. హవిరాజ్యోత్తమ గంధజుష్టములు గానయ్యెన్‌వనుల్, చక్షురు
త్సవ సంధాయిని యయ్యె భూసతి యు దానున్ ప్రాజ్య సస్యాఢ్య ధ
ర్మ విచారాదృతి భూప్రజల్ మనిరి, గోవ్రాతంబులు త్స్వాహి
లవపుష్కాంతము లెల్లెడ న్దిరిగె ప్రహ్లాదుండు పాలింపఁగన్. 583

క. ఇది ప్రహ్లాదుని చరితము
సదమల మీ కథను భక్తిఁ జదివిన సంస్సృ
త్యుదితములు బంధములు హరి
నదలిచి, తనవానిగాఁ గృపామతిసేయుఁ. 584

వ. ఈ ప్రహ్లాదుండ, యేష్యంబున, భగవన్నియోగంబుఁ దలఁ దాల్చి, కలియుగంబున వ్యాసయోగిగ నవతరించి, ద్వైతమత ప్రవర్తకుండై, విద్యానగరాధిపుఁడును, సాహితీ సమరాంగణ సార్వభౌముండునగు, కృష్ణరాయనికిఁ బూజాప్రతీకంబై, తదభ్యుదయంబులు బండించు. మునల నాయుగంబునన, రాఘవేంద్రస్వామిగ జన్మించి, యతిరాట్కుల

మందనుండై, తుంగభద్రా తీరంబున, బృందావనంబున నుండి, భక్తులకు
జింతామణిగ వెలుంగునని యెరింగించి, సూతుండిట్లనియె. 285

మ. స్తవనీయానఘనామ చింతనగమిష్వత్ప్రాణజీవౌఘదు
ర్భవసంసార నికార నేత్రయుగ దృక్ప్రస్యందధర్మోదకా!
రవి సంతానయశోఽవి గీతనృప ధర్మప్రోతచారిత్ర ! శై
శవచాపధ్వనిమాత్ర సాధ్వసవినశ్యద్ఘోర రాత్రించరా ! 586

క. స్థాణుకృతనామ కీర్తన !
స్థాణుప్రాణప్రదాయిచరణ ! శ్రుతిసతీ
పాణీరిత మృదుగాన
ప్రాణాయితకీర్తి ! పరమపదపురవర్తీ ! 587

మాలిని. దశరథ నయనస్ఫ్రుక్చంద్రికా స్మేరమూర్తీ !
దశగళశరగర్వ త్రాసకృచ్చాపశౌర్యా !
కృశనియమ మునీంద్రాపీతసంపూతకీర్తీ !
శశికరపరిహాసిస్ఫారకారుణ్యధుర్యా ! !

ఇది శ్రీ పరమభాగవత పాదరజఃపుంజవిమలీకృతమనోదర్పణ,
పితృభూత శ్రీనివాస హృదయతర్పణ, లక్ష్మీదేవీ గర్భ
శుక్తిముక్తాఫల, నిరంతర నిరంతరాష్టాక్షరీమంత్ర
మననస్నాత గంగాజల, భక్తి రసైక
జీవన, శరమర్షణ గోత్రపావక,
నారాయణదాస ప్రణీతంబైన
శ్రీనివాస ప్రబంధంబున,
ద్వితీయాశ్వాసము
సంపూర్ణము.

శ్రీనివాసప్రబంధము

తృతీయాశ్వాసము

క. శ్రీ కైవల్య విధాయి ద
యాకర సరసీరుహాక్ష! యనవద్యదయా
స్తోక గుణ చరిత! ముఖజిత
రాకాహిమధామ! మహిత రాఘవ రామా! 1

వ. మహనీయ గుణ గరిష్ఠులగు నమ్మునిశ్రేష్ఠులఁజూచి వ్యాఖ్యాన విచక్షణుం
డగు సూతుం డిట్లనియె. 2

సీ. సంపదర్థులకు నైశ్వర్య పారమ్యంబు
పుత్రార్థులకు బహు పుత్రసుఖము
జ్ఞానకాంక్షులకు సుజ్ఞానమ్ము, నృపులకు
రాజ్యలక్ష్మి స్వయంగ్రాహభూతి
కామార్థులకు సుందరీ మందహాస ని
ష్యంద శీతలము సంసారభరము
మోక్ష లిప్సులకు, చిన్ముద్రాపరత్వంబు
మంత్రవాదులకును మంత్రసిద్ధి

గీ. మఱియు, నెవ్వరి చిత్త మె త్తెఱఁగు నందు
వాటమైయుండు, నదియెల్ల వలసినట్టు
లిచ్చి రక్షించు, శేష భూభృచ్చయమ్ము
వేడువారికి, దొడ్డిలో వేల్పుగిడ్డి. 3

సీ. కోరు కోర్కెల, నేన్గుకొలగాఁగఁ దీర్చుటఁ
జేసి, చింతామణీ శిఖరి యనుచు
జ్ఞాన పూర్వకము, చిదానంద మొసఁగుట
నను్షమానంబు, జ్ఞానాద్రియనుచు

సర్వ తీర్థములకు నాశ్రయ భూమి యగుట, హృ
చ్ఛమలాఽపహము, తీర్థశైల మనుచు
వితత సంఫుల్లారవిందవాపీ మనో
హరమౌట, పుష్కరాహార్య మనుచు

ఆ. తొల్లి యొకపరి ధర్ముండు, దొడ్డ తపము
నంటి, నెరవేర్చు కతన వృషాద్రి యనుచుఁ
హాటక మయంబగుట, కనకాద్రి యనుచుఁ
బలుకుదురు, తత్త్వరహస్యపారవిదులు. 4

గీ. అంజనాదేవి, వ్రత కర్శితాంగి యగుచు
ఘనయశస్స్వంతు, హనుమంతుఁగనియె నిచట
దేవసాహాయ్య కరుఁడౌట దెలిసి సురలు
హర్షమునఁ బల్కిరిది, యంజనాద్రి యనుచు. 5

క. అనిన మునులు, హనుమంతుని
జననము వినిపింపు మన్న, సమ్మదపీయూ
షనిభృత నేత్రుఁడు, కౌతుక
మనూనముగ, సూతుఁ డిట్టు లారంభించెన్. 6

ఉ. ఒక్కరుఁడుండె, వానర కులోద్భవుఁడైనను, రూపవైభవ
న్యక్కృత మన్మథుండు, విలయాంతక వీర్యుఁడు, కామరూపి స
మ్యక్కృత మౌని మండలనమస్యలు, దీవెనలై, శిరంబుపై
నెక్కొన, కీర్తి జీవనధునీపతి, కుంజర నామధేయుఁడై. 7

ఉ. వాని యవార్యసత్త్వమును, వాని నయోదయవృత్తి, వాని పం
చానన విక్రమంబు, సురసార్థ జయావహమైన హుంకృతి
ధ్వానము, హోమసౌరభనిభాస్ఫుటజంబులె గాదు, జన్య భూ
మ్యానత వైరులైన, యచలాధిపులు న్నుతియింతు రిమ్మలన్. 8

చ. వరతరుమాంసలాంసములు బాహువులై, తపనీయపింగళో
దరములు కన్నులై, హరిశతార సముజ్జ్వల వాలవర్తులా
చరణముగా, కపీంద్రుఁడు, భృశంబుగఁ జుట్టెడువేళ, కాననో
త్కరము, సజీవమైన గతిఁ గన్పడు, ధీర మనోహరంబుగన్. 9

సీ. వాని యర్ధాంగి, ఖాస్వద్రూపమునఁ జేసి
యచ్చరగాకయు, నప్సరసయ
యైన, దనాహార్యమాకల్పమైన పా
తివ్రత్యమునది, శాంతిధన మౌని
సేవా సమాసక్త శీలంబునది, దాని
యాత్మ సుపేశలంబయ్యె, ఐహిర
పారగంభీరంబు, ప్రసన్నని కోయిల
పలుకు లోఁగొని, మదబంధురముగ
గీ. బాఱెడు ప్రవాహమట్టు, లవ్వనిత మధ్య
మట్లు, మాలిన్య లేశ శూన్యమ్ము దాని
నడత, వింధ్యావళీనామ్ని, నాతికుచము
లట్లు, తేకువయు, న్ననన్యాదృశమ్ము; 10

వ. అమ్మిథునమ్ము, శబరీ కబరీ నిబిరీసనీలిమ కృతాంధకార, తిలతండుల న్యాయబంధుర చంద్రికా పరిణత, వింధ్యయామినీ గహ్వర గాఢ పరిష్వంగంబులను, మదకల కురరకుల దశ్యమానమదిచ పల్లవ సౌగంధ్య సౌగంధ్య దివ్యమైరేయ, కృతపుటాంతర్మండలావృత్తి కనీనికాకమనీయ, కపోల ఖురళికామల్లప్రగాఢ చుంబనంబుల మలయంబులను, వనకరికుంభ మదజలసేక సంవర్ధిత శాఖిశాఖా శిఖోద్వ్రాంత. కుసుమవిసరాఽయత్న కృతసుమ శయన, సహ్యాభూ నిరవకాశ వక్షోజ నిద్రాయితంబులను, గంధమాదన సౌగంధిక సౌరభ ప్రవాహ శీతవాతపోతసంచారంబులను, చందన సుగంధిల పురుషాయితంబులను, పారియాత్రక వనదేవతా చరణాలక్తక రసరంజిత పల్లవప్రస్తర పరిస్రంసన్మేఖలా కలాపముక్తా విచికిల దళిరభసంబులను, కుసుమరేణుపాంసుల కటకతట దివ్యవనితా ముకుర సరిద్వరాఽవగాహన శిథిలితతనూ నాగబంధంబులను, తాంబూ

లీలతాఽవనద్ధపూగ షండమండితంబులై, వనలక్ష్మీవాస భవనంబు లన్నోప్పని హిమాద్రి లతామంటప దుర్వార ధేనుబంధంబులను, కోకిలా కులసీమాంతమ్ములు వసంతమ్ములు, సర్జకదంబవ్యామిశ్రిత, మయూర కేకాఽనుయాత, పర్వతధాతు తామ్ర, ప్రవాహ రమ్యంబులగు ఘన సమయంబులు, సారసారవ సంఘుష్టంబులై, విమల చంద్రమండలమ్ము లైన శరత్తులు, పాటలి సంసర్గ సురభివనవాతంబులైన నిదాఘంబులు, కుసుమితకుందసుగంధి గంధవాహమ్ములైన హేమంతమ్ములు, తమవిశా, మదనుఁ ఖండించి, పండించి. 11

క. అలసిన, వారికి సంతతి
గలుగదు, నెడఁదలకు, వారి కన్నులకు, ఘనసా
ర లలితచందనము క్రాఁ
కలిల రహిత చంద్ర చంద్రికాశీతలమై. 12

ఉ. అంతట, కుంజరుండు, తుహినాంశు కలాపతిబద్ధజూటు, హే
మంత తుషారతుల్య లసమాన శరీరు, దయాకదంబిత
స్వాంతు, సురాసుర ప్రణత పాద సితాబ్జు, గిరీశు గూర్చి, య
త్యంత సునిష్ఠమై తపమనాకులవృత్తిఁ జరింప నెంచుచున్. 13

సీ. హిమవంతమును జేరి, హేరాళ కిన్నరి
వల్లకీరుతులు జొప్పడనిచోట
గంధర్వ కామినీ ఘనద్వైవతాలాప
ములు, దవ్వులనె యొల్లఁ బోవుచోట,
అప్సర స్తరుణీశతాఽ క్రాంత కలరవ
ధ్వనులు, కర్ణమ్ములఁ బడనిచోట,
నుత్తుంగ కుచ శబర్యుత్తాలజఘన వి
భ్రమములు, కన్నులఁ బడనిచోట

గీ. లలిత గంధమ్ములను గాలిమలయు చోట
లలిత శైలేయనద్ధ శిలాతలములు
నేత్ర పర్వంబులగు చోట, నిశ్చలముగ,
కుంజరుండొక్క, తాయిగాఁ గూరుచుండె. 14

గీ. వనిత వింధ్యావళీ దేవి, వన్యమాత్ర
పరిగతాహారయౌచు, రేలుఁబగలు, చిత్త
మందు, పశుపతిమూర్తి, బాహ్యమున ధర్మ
చరణములు గాఁగ, దినములు, జరపుచుండె. 15

సీ. ప్రత్యూషమున యందు, పడఁతి తుమ్మెద వెంగి
లింపనిపూలు, తల్లీనవృత్తి
దెచ్చి, మహేశ్వరు దివ్య పదంబుల
కర్పించు, మనసుతో నంటుగూర్చి
వేరువెల్లకుల నైవేద్యమ్ము వెట్టు, ను
గ్గడువైన భక్తి, భోగ్యములు సేసి
శర్వాణి పాదాబ్జ సంగతి నిట్టుండు
పతిసమాధివ్యథాభరము దలఁచి

గీ. శీత వాతాతపమ్ముల శిథిలితమ్ము
గాని చిత్తమ్ము తోడుత కమలగంధి
తా తపశ్చర్య గైకొనె, 'తమకుఁ బోదు
మాకుఁబోద'ని కఠిన సంయమిత వృత్తి. 16

క. వెంలె దినమ్ములు, మాస
మ్ములు నబ్దమ్ములును ఋతుసమూహముతో, ను
జ్జ్వలనైకాహార్యమ్ముల
నలువుగ నటియించి పోవు నటకులు వోలెన్. 17

గీ. అమల పద్మాసనాసీనుఁడై నిమీలి
తాక్షుఁడై నిశ్చలేంద్రియుండైన యతఁడు
స్తిమిత శఫరమ్ము, సుప్త పద్మము వినిశ్చ
లాంబువై యున్న, విపినసరంబుఁబోలె. 18

ఆ. వాని యురు సమాధి, వానియర్ధాంగి,బా
హ్యమ్ము, నాంతరికమునైన దీక్ష,
యా తుషార పర్వతాశ్రమంబుల నున్న
తాపసులకు, నద్భుతంబు సేసె. 19

ఆ. తత్తపంబు, హృదయతట మెగఁదన్నిన
నింక, నాలసింప నేల యనుచు,
పురహరుండు దోచె ముందట, జూటాగ్ర
చంద్ర చంద్రికలను జాలువార్చి. 20

క. తన హృదయస్థితుఁ డగు న
ర్జున దేహం దగ్రమునన శోభిల్లెడు సూ
చనయై, కపిపతి, ప్రాత
స్స్నన కమలమ్ములుగఁ దెఱిచె, చక్షుర్ద్వయముఙ్. 21

వ. తెఱిచి, రోమాంచ కంచుకిత దేహుండై, యిట్లుగా నుతించె. 22

శా. ఏ నీ పాద సరోజ సేవనలచే నింద్రాదు లవ్యాహత
స్థానశ్రీకులౌ! తాదృశంబులగు త్వత్పాదాబ్జముల్, నా మన
స్సైన, నిత్యంబుగ వెల్గనిమ్ము జగదీశా! పార్వతీ ప్రేమ పీ
యూషనిష్యందవిలీనదేహ! కరుణాసాచివ్య చిత్తవ్రతీ! 23

చ. అరవులఁ గోలు వేదములయందు వృథాశ్రములౌచు, దేవ! నీ
యడుగుల జాడలన్ వెదకునట్టి యవస్థల గోరికొందు, రే
ర్పడునె! తుషన్ బుభుక్ష కడవట్టుట! చిత్తము నీపదంబులం
దిడుట, మహార్హమౌ తప, మహీన విభూషణ! సాధుపోషణా! 24

చ. పసరము కామగృష్టి, యొక పాదపమామరశాఖి, యట్టివే
యసదృశభాగ్య వర్షకము లౌనట గొల్చిన యప్పు, డట్టిచో
ప్రసృమర దేవతానివహభావధునీ వహదబ్ధి! నీదుప
ద్మసరుహము ల్దలంపఁ గలదే! మితి, యబ్బెడు భాగ్యరాశికిన్. 25

ఉ. తావక సత్కృపా పరిణతంబయి, సర్వసమృద్ధి, మద్భుజా
పీవర విక్రమస్థితము, వేదగవీ ఘనదోగ్ధ్రమౌని సే
వా వరణీయ మీ బ్రదుకు, పన్నగకుండల! లోపమొక్కటే
వావిరి, సర్వహర్ష పరిభంజకమై,నను గ్రుంగఁ దీసెడున్. 26

చ. అలకలతోడి ముద్దుమొగమై, యమృతమ్ములు జాలు కన్నులై
కలకల నవ్వు నొక్క పసికందు నిజాంకము సేర్చి, తద్రజో
మలినత, హర్షమున్ గుడుచు మాన్యత లేదు, జగత్త్రయావనా
కుల! శిశుభాగ్యగంధిలత గూర్పుము, మజ్జనియన్నశాఖికిన్. 27

క. అని విన్నవింప, శుభ్రాం
శునిభాంగుఁడు, చంద్రకిరణ శోభావహ భ
స్మనిబద్ధుఁడు, హిమకర సుమ
పణితవ్య జటావిశోభి భర్గుండనియెన్. 28

సీ. అమరసహాయ బాహాఽభి శోభిత! కుంజ
రా! నీ తపం, బనన్యాదృశమ్ము
వింధ్యావళీ దేవి, విమలనిష్ఠాకర్శి
తాంగమ్ముతో, సగమైన యదియు
ప్రాప్తవ్యమర్థమే, బడయంగఁ గలరు మీ
వులు, బెట్టిదవుఁ దపమ్ములను గాని,
బలిమి బండించిన ఫలము, తుచ్ఛం బౌనె!
కల్యాణ మొసఁగఁగాఁ గలదె! చెపుమ!

గీ. గౌతముండను బ్రహ్మర్షి గలఁడు గాదె!
యతనిసుత, యంజనాదేవి యనెడు నది, వి
భాసమంచితఁ దనయగాఁ బడయగలవు
తనివి నందుమ, యంతమాత్రమున నీవు. 29

క. నీ దౌహిత్రుఁడు, సురదై
త్యాధికబలుఁ, డఖిలదైవతా విష్టుం, డి
చ్ఛాధీ నేంద్రియుఁడై, ధర
జీధవళాంబరము, కీర్తి నిలుపుఁ దిరముగన్. 30

క. పొమ్మని పోయిన, కుంజరుఁ
డుమ్మలికము గదిరి, తోన, నుపశాంతియు ను
ల్లమ్మునఁ బెనఁగొన, విధికృ
త్యమ్మిది యనుకొనుచుఁ దనదు నంగనతోడన్. 31

ఆ. ఎప్పుడెపుడు మౌనియేతేరు, నంజనా
దేవినెప్పుడొసఁగు, దీర్ఘకాలి
కంబు కోర్కెయెపుడు గడముట్టనీడేరు
ననుచు, మౌనితెన్ను లరయుచుండె. 32

వ. అనిన, పరమర్షులు సూతుంగని యిట్లనిరి. 33

సీ. గౌతముండురు తపస్యాతృప్త సకల దై
వతమౌళి, బ్రహ్మకు వలయువాఁడు
తత్తపంబునఁజేసి, తనివినందియకదా!
యాచతురాస్యుఁ డహల్యనొసఁగె,
నాయక సౌందర్య మసదృశంబన విందు
మట్టి తేజశ్శాలి, యాత్మతనుజ
కపికుంజరున కేలఁ గడఁగి సమర్పించె
పెఱయింటి బ్రిదుకు దెప్పరము గాదె!

గీ. తల్లిదండ్రిలదగు సన్నిధాన భాగ్య
మును దొఱంగిన యంజన, పుట్టువెట్లు
సాఁగె, సౌరభ్య భరిత వసంతముగనా!
క్రిక్కిఱియు నెండలన్డేబు గ్రీష్మముగనా! 34

గీ. అను మహర్షుల వచనంబు లాలకించి
నూతన కథాకథన కౌతుకాతిరేక
మతులఁ గూడ, శబ్దరాహస్యవేది,
యీడితార్థమ్ముగా, సూతుఁ డిట్టులనియె. 35

వ. తొల్లి, కృతయుగమ్మున స్త్రీ లెల్ల రేకవర్ణ, లేకరూపలై యుండి, దర్శ
నంబున, లక్షణంబున, విశేషంబులేమింజేసియు, హావభావంబుల
వైవిధ్యంబు లే మింజేసియు, నతృప్తుండైన పరమేష్ఠి, విశేషంబు గల్పింప
వేడి, సర్వోపమాద్రవ్యంబు, యథోచితంబుగా వినివేశించి, యొక నారీ
రత్నమ్ము సృష్టించిన. 36

క. హలమన వైరూప్యము, త
ద్దలప్రభవమైన యదియు హల్యము, నారీ
తిలకంబహల్య, తనువున
నలుపంబును దోషమెందునంటని దానన్. 37

ఉ. తోయలిగాంచి, వాసవుని దొట్టి, సమస్తదిగీశులాత్మలన్
కోయని యార్చి యంగజుఁడు, గ్రిమ్మిన, ధైర్యతనుత్రముల్, పెరి
ల్లై, యతివేలమై వలపులంటరు పూవులు, చందనంబులన్
బూయరు, చల్లగాలులకుఁ బోవరు, బొందరు రేల నిద్దురన్. 38

ఆ. ఒక్క రెఱుఁగకుండ, నొక్కరు ప్రార్థించి
రబ్జభవుని జేరి యతివ మిన్న
నన్ని మొరలు విన్నయట్టిదే గాని, దా
పలికి యెఱుఁగఁ డొక్క పలుకు నలువ. 39

క. పరమ తపోనిష్ఠా త
త్పరుఁడగు గౌతముఁడు దీనిఁ బడయఁగఁదగు నం
చరసి, యహల్యను, విధి న
న్నిరీక్షకుఁడు, ధర్మగేహినిగ నర్పించెన్. 40

సీ. అగ్నిహోత్రమునకు, నగ్నులు విహరించు,
పతి, తానమొనరించి వచ్చులోన
పలు విధమ్ముల సమిధలు గూర్చు, నగ్నికు
ల్లాసంబుగా, బర్హసదృశవేణి
పతిభుక్త శేషమ్ము, భాసురాంగి, భుజించు
నిమ్ముల, యజ్ఞ శేషమ్ము వోలి
చలితాలకులు, బ్రహ్మచారుల నెలయించి
పనిగొను, మాతృభావమ్ముతోన

గీ. అలఁత దోచుట మధ్యమ్ము నంద కాని
కానిపింపదు, సుంత మొగమ్మునందు
పదఁతి ఋతుకాలమున యంద పతినిఁ గూడు
నధ్వరమ్మున, యజమాను, నతివపోల్కి. 41

ఆ. మెలఁత వోవునట్టి మేరకు, కనక కాం
తులు, సరోజ గంధములు, మునీంద్ర
వాటికల వసించు వనితలకు న్నిదుఁ
గనులు, దాని రూపు కలిమి గూర్చి. 42

క. మహితమ్మగు ధర్మమ్మున
సహితమ్మై, ధీరవృత్త జరగు నహల్యా
గృహిణీత్వ, గౌతమస్థితి
మహాపురుష కీర్తివోలె, మది హరియించెన్. 43

క. ఆ యిరువుర గార్హస్థ్యము
కాయము గొన్నట్టు, లగ్నికల్పుఁడు, నిగమా
ధ్యాయి, శతానందుండను
సోయగముల కుప్ప, యొక్క సూనుఁడు గలిగెన్. 44

సీ. ఆ యహల్యాదేవి యతివేల సౌందర్య
మమరంగ రూపుకట్టియ్యినట్లు
అభ్యర్హితంబైన యా గౌతముని ధర్మ
రతి, మతిగాఁగ, చేరగిలినట్లు
ఆయ్యాశ్రమంబుల, హవ్య సౌరభ్యంబ
యలవోక మాట లందైనయట్లు
ఆ చైత్యమృగ విశాలాక్ష విస్రంభమ్మె
యరుదుగా, హృదయమందైనయట్లు

గీ. గలిగె నొక పుత్రి, దైవతమ్ములకుఁ గూడఁ
గన్నుదనియించునది, పైని గలుగు పుల్ల
యశములకు బీజరూపంబులైన, మంజు
హసితముల, ఋషివాటంబు లందగించి. 45

ఆ. ఆ లతాంగినామ మంజనాదేవి, య
య్యతివ, నీరువోయునప్పుడుటజ
వల్లికలకు, దాని వలువఁ దాకియుఁ దాక
నోడు, గంధవాహుఁ డుద్యమించి. 46

వ. ఇట్లుగా, గౌతముని ధర్మ రక్షితంబైన గార్హస్థ్యంబు, పరమ రమణీయం
బయ్యె. నది యట్లుండె. 47

క. వినుత గుణుఁడు, సకల మనీ
షినివహ సంకీర్త్య మానశీలుం డాది
త్యుని వంశంబు తపంబన
మనుజాధిపు లందు మేటి, మనువొకఁ డుండెన్. 48

ఆ. వాఁ డయోధ్య యనెడి పట్టణ మొక్కటి
గట్టి, లోక ధర్మ గతుల నెఱిఁగి
ప్రజల సుఖమ, జనికిఁ బరమార్థమై, ధాత్రి
నెల్ల నేలెఁ దా, నిరీతి గాఁగ. 49

క. వితత యశుండగు వైవ
స్వతమను వొకనాఁడు తుమ్మ, ప్రభవించె, సము
న్నత తనుఁడయోనిజుండై
సుతుఁడొక్కం డద్భుతముగఁ జూడ జనంబుల్. 50

గీ. వాని నిక్ష్వాకు వనియె, వైవస్వతుండు
కనుల కర్పూరమై వాఁడు గడపె బాల్య
మాయుధమ్ముల, లఘుహస్తుఁడై జయంపు
కొమ్మ కిరవును బోలె వక్షమ్ము విరిసి. 51

శా. ఆ యిక్ష్వాకుఁడు భూమినేలె, పృథుబాహావిక్రమక్రీత దై
తేయ ప్రాభవుఁడాది రాజ నిభకీర్తి స్ఫార చంద్రోత్సవం
దేయాతంక మెఱుంగ నట్టి ప్రజలో నేకీకృతంబై గళం
బా యంభోధులు నాల్గు, తద్ద్వీపుల ధర్మానసక్తి నగ్గింపఁగన్. 52

వ. అయ్యిక్ష్వాకునకు నూర్వురు కొమరులందు, కుక్షియను వాఁడు ప్రథముండు. పంద్రెండవ వాఁడు నిమియను నభిధానంబు గలాడు. వాఁడు గౌతమాభ్యాపంబున, వైజయంతం బను పురంబు సేసికొని, బ్రహ్మోత్తరంబుగాఁ బాలింపుచుండె. 53

సీ. తండ్రియౌ నిక్ష్వాకు తఱఁపున కెక్కంగ
పంచసాహస్రి కాబ్దములు, దీర్ఘ
సత్రంబు, విమల చారిత్రుండు, నిర్వహిం
పఁగ నెంచి, పరమ తపఃప్రభావ
వినుతుల, నాఁగిరసుని, భృగుమౌని, న
త్రిని, హోతలుగను వరించి, బ్రహ్మ
ఋషి, నవ్వసిష్ఠుఁ బ్రార్థింప, నంతకుమున్న
నింద్రునిచే వరియింపఁబడుటఁ

గీ. జేసి, తానంతరమ్ము వీక్షింపఁ బలికి
యవ్వసిష్ఠుండు, సురపతి యధ్వరమ్ము
నిర్వహింపంగ నేఁగె, దానికి మనమ్ము
కలఁగి నిమి, సర్వ సన్నాహ కలితుఁ డగుచు. 54

క. భాసుర తపః ప్రభావా
గ్రేసర బ్రహ్మర్షి లేమికిని వనరుచు, న
భ్యాసమున నున్న గౌతము
భాసుర యమనియము, భూమిపతి వరించెన్. 55

క. సురపతి జన్నంబు, గుణో
త్తరముగ నెఱవేఱె, త్రిదశ ధామము విడి, స
త్వరముగ వచ్చె వసిష్ఠుఁడు
నరపతి జన్నంబు దీర్ప, ననిచినమతియై. 56

వ. వచ్చి, తన హోతృస్థానంబు, గౌతమునిచేతఁ బూరింపఁబడుట యెఱిగి,
కలుషిత హృదయుండై, యపుడును మధ్యాహ్నంబగుడు, నిమిన్ దరిసిన. 57

క. దైవ వశంబున, దృఢని
ద్రావశుఁడై యున్నపుఁడు, బ్రహ్మర్షినిరీ
క్షావేదితుఁడయ్యును, నైం
ద్రివివశుఁడు బోలె, వార్త దెలియకపోయెన్. 58

గీ. కొంత తడవు నిరీక్షించి, కోపఘూర్ణి
తాక్షుఁడై, వెనుదిర్గి, తానరుగనున్న
తనువుదెలిసి, రాజర్షి, వచ్చినదె, మాట
లై, శతాంతంపుపాటు, బ్రహ్మర్షియనియె. 59

చ. పరమతపః ప్రభావమున భవ్యుఁడు, సంతతభూతభూ శుభం
కరుఁడు, పయస్సమర్పణవికస్వరమేఘనియుక్తిఁజేసి, స
ర్వఋషి సమర్చితుండు, మహనంతుఁడు, నీకసదయ్యెనే! మహ
త్తరుల యవజ్ఞ, మ్రుగ్గిరి శతారము, ఘోరము గాదె ! దుర్మతీ ! 60

గీ. చేతన విహీనదేహంబుచే, దురంత
దుఃఖమును బొందెదంచుఁ దోడ్తోఁ బలికి
బ్రహ్మఋషి పోవుచున్న, భూవరుఁడు హుంక
రించి, దట్టంపు కనలావరించి, పలికె. 61

క. క్రమ్మకొను నిదురతో, దే
హమ్మెఱుఁగని నాకు, కాలయమదండ సదృ
క్షమ్మగు శాపమ్మొసఁగితి
నెమ్మిగలవె ! తపము పెంపు, నెఱిదప్పటకే! 62

ఉ. ఈవును గూడ, చేతన విహీన శరీరమునంది, దుఃఖిత
ప్రావిలమానసుండ వగుమంచని, తత్సమసత్తపః పరీ
భావితవహ్నియైన నరపాలకుఁ డాడి, తొలంగె దేహము
న్నావల, బ్రహ్మయోనియును, నంగముపీఁడె విషణ్ణచిత్తుఁడై. 63

మత్తకోకిల. ఈ విధంబున వారలిర్వు రహీనమానసులయ్యు, కో
పావధూత వివేకులై, వికటాసురుల్దముఁ బొందిన
ట్లై, వినాశకరంపు శాపములాడి, వాయు శరీరులై
చేవడిందుచు, భూమిరోదసిఁ జేరిచుట్టుచు విహ్వలుల్. 64

గీ. కొన్ని యేడులు గడిపి, పెక్కు దురవస్థ
లంది, నారాయణుని యంద, డెందములనుఁ
జేర్చి, తపియించుచుండ, రాజీవభవుఁడు
దయను, విప్రర్షికిని, సన్నిధాన మొసఁగె. 65

వ. అప్పుడు, వసిష్ఠుం డిట్లనియె. 66

మ. నిమిశాపమ్మున నంగభంగ మొదవె, న్నిర్వాహమెట్లింక ! స
ర్వము కర్మమ్ము, శరీర నిఘ్నముగదా ! బ్రహ్మర్షినై, యిట్టి దై
న్యము నే నెట్లు భరింతు ! నన్యమొక దేహంబిమ్ము, తల్లబ్ధి, నా
కమలంబైన తపోనిధానమయి, హర్షాధేయమై వెల్గఁగన్. 67

ఆ. అనిన, నళినజమ్ముఁ డాత్మలోఁ గరఁగి, యి
ట్లనియె, వరుణమిత్రు లైక్యముగను
తేజములను వదలిరి యావేశింతుఁ
బొమ్ము, తేజములను బొంది మనుము. 68

వ. అచ్చటఁ గూడ నయోనిజుండవ, శోకింప వలదని, యూరడించెనని బలికిన, సూతుని జూచి, పరమర్షు లిట్లనిరి. 69

ఆ. వినఁగ వినఁగ నెంతొ, వేడుక గల్గించు
గాథ, యిది, వచించు కరణి యంత
కన్న మిన్న, పైని యాకథ వినిపింప
వయ్య! వల్లకీస్వరాఽబ్ధి హృదయ! 70

వ. అనిన సూతుండిట్లని వచించె. 71

క. పరమేష్ఠిని గుఱిచి, నమ
స్కరణము గావించి, మౌనికాంతుఁడు, విచల
త్సురుచిర తరంగపీయూ
ష రసాకరమైన దుగ్ధజలనిధిఁ జేరెన్. 72

పృథ్వి. ప్రదీప్త నిజదేహకాంతులును, బర్వి దిక్సీమలన్
విదిర్చ, నవపద్మ పాంసువులు, విభ్రమన్మేఖలా
నదత్కనక కింకిణీ, నటితనైక చైతన్యయై
మృదూదర వికంపన భ్రమదహీనమున్వ్యోమమై. 73

పృథ్వి. తళత్తరళ తారకా వికసిత స్ఫురద్వీక్షణా
వళీ, ప్రతిముహుః ప్రభావిత సుసర్వహృత్కంధియై
సలీల నరుదెంచె నూర్వశి, హసాదటంచున్ జగం
బు లేల్లు కుసుమాయుధుం, డుదితమోదుఁ డేతేరఁగన్. 74

క. లలిత సమీర విచుంబిత
విలసిత వక్షోజ యగుచు, వేల్పుగరిత, యు
జ్జ్వల లవలీమరిచలతా
కులిత వికచ కాననముఁ గ్రుమ్మఱుచున్నన్. 75

సీ. తెలుప క్రాల్గన్నుల తెలివును, బంగారు
పదనిడినట్లున్న వల్దకుచము
లలఘుకైశ్యమ్ము, మేఖలమలంఘలంకు
మురిపమ్ము దిద్దు సుందరగమనము
పులు లేని ముత్తెంపు తెలినవ్వు, చెంగావి,
పలుచని వాతెఱ, యలసభావ
మునదైన పొలుపును, బొదగని, క్షీరోద
సవిధంబునందు సంచార మొనర

గీ. జేయుచున్నట్టి వరుణుండు, చిడిముడిన్బ
డుచు, తడఁబడుచు, వెసఁగిడ్పడుచు, మనోజు
వలన, నయ్యింతివలసికి వచ్చి, యిట్టు
లనియె, నభ్యర్థితంబు, ధైర్యమ్ము దలఁగి. 76

క. మొగమున కెగసెడు చన్నుల
సొగసుల చిన్నారిదాన! చూడఁగ నీవే
బిగి జక్కవ చనుగవలో
వగగల బంగారె గలదొ! వయసే గలదో! 77

గీ. అనిన నూర్వశి, యొదలెల్ల నందగించి
నట్లయిన, వల్లకీ సమఖ్యాన నిక్వ
ణమ్ములై పల్కు, లమృతపూరమ్ము గురియ,
ప్రణయ శీతలితమ్ముగాఁ బలికె నిట్లు. 78

చ. ఉదధిగభీర! నీదయిన యుల్లము నట్టియ కాదలంపు, మా
హృదయము గూడ, ప్రేమలకు నెగ్గు దలంచుటలేమి, రాంమే!
మొదటన నన్నుఁ గోరె సురపూజ్యుఁడు మిత్రుఁడు, కామకౌశలా
స్పదమగు మేను నీదనుచు, సమ్మతి జూపితి, దప్పుఁజాడియే! 79

క. నా భావము నీ యందవి
నాభూతము, కాన, భావనారతి, సౌఖ్య
శ్రీభోక్తవగుము. యుభయ వి
ధాభద్రము, మార్గమిదియ, తప్పదటన్నన్. 80

ఆ. దాని మెలపు సొలపు, దాని భ్రూభంగ చా
తురియు, హృదయమందు నెరసికొనఁగ
చిత్తపంకజమునఁ జెలువ నిల్పుచు, తేజ
మమర నొక్క కుంభమందు వదలె. 81

క. భావంబు గరఁగి, కన్నుల
ప్రేవలఁ జిఱునవ్వుఁ బొంగుచు, కించిచ్ఛిథిలీ
భావంబులోడ నూర్వశి
దా, వరుణునిదైన సన్నిధానము దలఁగెన్. 82

పృథ్వి. ప్రసూన శరవీరసద్వశము, బర్వినట్లై, దిశా
విశృంఖల కటాక్షవీచులు, వివేకమింకింప, ని
ర్వ్యపార విహృతేంద్రియుల్, మునులు, స్తబ్ధులై చూడఁగా
నశేష తనుమాధురీస్ఫుణహీనపౌష్కల్యమై. 83

సీ. అరుదెంచె నూర్వశి యర్ఘ్యము కడకు, త
ద్వృత్తాంతమంతయు దివ్యదృష్టి
గమనించి, సూర్యుండు కలుషించి, భావంబు
నొరుల కర్పించిన యొడల నేమి

సౌఖ్యంబు! భూలోకసరణి యిట్టిది గాని
దేవలోకముల నీ దృగ్విధమ్ము
యుక్తమే! పొమ్ము, నీ వుర్విపై జరియింపు
మల పురూరవు హృదయమ్ము గలఁచి

గీ. కమలలోచన! యిప్పుడు నిర్గళితమైన
యస్మదీయమ్ము, వరుణవీర్యమ్ముతోన
గలుపుమని పంచె, మఱుమాట బలుకవెఱచి
తరుణి, గావించెనంత తథావిధమ్ము. 84

మాలిని. అనల రుచిరతేజం బంగమై, పూర్వమెట్ల
ట్లన గుదిరిన రూపై, యవ్విధంబైన ప్రాయం
బున మగుడ జనించెన్ పుత్రుఁడై యవ్వసిష్ఠుం
డనిలపథము, తేజోవ్యాప్తమై యందగింపన్. 85

వ. నాటనుండి, మిత్రావరుణుల తేజస్సంగమంబునన్జేసి వసిష్ఠుండు, మైత్రా
వరుణియయ్యె, నాతని నిక్ష్వాకుండు నిజవంశహితంబు పొంటె, పురో
ధసుగా వరించెనని, క్రమ్మఱ సూతుం డిట్లనియె. 86

క. అంత, విదేహుండగు భూ
కాంతుని నిమి గుఱిచి, యెదలు గరఁగి, తపోభా
స్వంతులు, వేల్వఁగఁ దొడఁగిరి
సంతన గట్టికొని ఋషులు, సహనియమముగన్. 87

క. ఇమ్ముల, గంధమ్ములు, మా
ల్యమ్ములు, పరిధానములను, ననుచరితసపో
రమ్ముగ, విప్రులు, నృపు దే
హమ్మును, రక్షించుచుండి, రవహితమతులై. 88

ఆ. వేల్మి ముగిసినంత భృగ్వర్షి, రాజుచే
తనముఁ దేరఁబూని యనిమిషులను
దరియ, తృప్తుంగుచు, ధరణీశు దేహమ్ము
గుటించి, యిట్టులనిరి సురలుప్రీతి. 89

మత్యాక్కర. 'ధరణీశ గోరుము, వరము, దదయక, యుత్తమేమైన
పరమార్థ'మన్న భూవరుఁడు, ప్రాణుల చక్షువు లందఁ
బరంగ వర్తింతు నేననుచుఁ బలికిన నట్లకా కనిరి
సురలు, సర్వప్రాణి నేత్రశోభాయమానుండు నిమియు. 90

క. సకల భూత ప్రపంచ చక్షుర్ద్వయంబుల, నాటంగోలె, నిమియు వాయు భూతుండై చరించు, నతని విశ్రామంబు పొంచె భూత గ్రామమ్ము, మహార్నేత్ర నిమీలనం బొనర్చు, నది ప్రాణులకు శోభాకరంబ యయ్యె నంత మహర్షులు, పుత్రార్థమై నిమి దేహంబు నరణిం జేర్చి మథియించిరి. తరువఁ దరువ నందొక పుత్రుండు, మహాతపోవీర్యసంభృతుం డుద యించె, మథనంబునన్జేసి, వాని జనులు మిథి యనిరి. జననంబున జన కుండయ్యె. విదేహ సంభూతుం డగుట వైదేహుం, డిది నిమి వృత్తాం తంబు. 91

వ. ఈరీతి గాఁగ, గౌతము
పౌరోహిత్యమ్ము, నిమినృపాల వసిష్ఠో
దార తితిక్షానియమని
కారముగా, ఘోరశాప కారణ మయ్యెన్. 92

చ. అమరులు గౌతమ్రశితమనార్యము కర్మముగాంచి, తచ్ఛమ
క్రమము నడంచి, శాపమున కశ్మలమున్గలిగించి, తత్తప
శ్శమ మహిమంబు గీడ్పఱుప, సంతనకట్టి. బిడౌజు దేవతా
గ్రమ్ముఁ బురికొల్పి వేడిరి, యరిందము, సర్వము నిర్వహింపఁగన్. 93

క. ఆతఁడహల్యారూప
క్రీతుఁడు, తద్గాత్ర వరపురీపాలన సౌ
ఖ్యాతురుఁడై జనుదెంచెను
గౌతముఁడు న్నెదకు, మదనగదిత పథుండై. 94

సీ. అతఁ డంతంతల నల్లాడుచును, ముని
కులపతి, సచ్ఛాత్రకులుఁడు, నదికి
నభిషేచనార్థమై యరిగిన, నగ్నులు
విహరించుచున్న యవ్వేలది, రూప
సంపదుత్సారిత సకల జగత్త్రియీ
హరిణాక్షియైన యహల్యఁ జూచి
కృతక గౌతమ వేషభృతియై, కరంబు గ్ర
హింప, నత్తన్విఁ తాదృక్ప్ర వృత్తి
గీ. గౌతముల యందు నెన్నఁడుఁగనని దౌట
కినుక గొను కన్నులైన, చక్రీకృతోగ్ర
చాపుఁడై కాముఁడాలీఢ చరణుఁ డగుచు
పుష్పశరములు, పుంఖానుపుంఖ మేసె. 95

గీ. ఏయ, మొగమెత్తి చూచె నయ్యింతి, మౌని
వేషమున, నాకరాజు పంచేషు సదృశు
సోగ కన్నులను సిగ్గు, సోయగంబు
లీన, నింద్రుని మేనిలో లీనమయ్యె. 96

క. ఆలోన, గౌతముల వా
ర్తాలాపము, చెవులఁబడిన, హరిహయుఁడు, తప
శ్శ్రీలలనాహరణ పరుం
డాలము సేసినటు, మౌని యక్షులఁ బడియెన్. 97

వ. అప్పుడు గౌతముం డిట్లనియె. 98

ఉ. ఓరి దురాత్మ, మామకము నూనుచు వేషము, మత్ప్రియాంగనా
చారవిశుద్ధి, దూషణము సల్పితి. ధర్మమునేలఁ జాలువాఁ
డీరహి, దుష్పథంబుసనుటే ! మరి, మాదగు రూపమూని దు
శ్చారమె ! గౌతమాఖ్య దివిషత్ప్రతిషత్పరిహాస మయ్యెనే ! 99

గీ. వృత్త సంపన్నమౌని, దుర్వృత్తునింద్రుఁ
బలికెఁ గన్నుల నగ్నులు జిలుకరించి
యోయి ! సురరాజ ! విఫలుఁడవై యమేయ
మఘము గుడిచెదుగాక, పొమ్మ'ని భృశమ్ము. 100

క. ఆపలుకు తోన పతితము
లైఫలములు, శక్రుఁడవనతాస్యుడు దొలఁగెన్
కోపాటోప పరిప్లవి
తాపఘనుఁడు, మౌని యయ్యహల్యను జూచెన్. 101

సీ. ఓసి ! దేహంబు నాకొసఁగి భావమ్ము వా
సవునిదిగాఁగ వేసమ్ముగట్టి
చరియించుదాన, వర్షసహస్రమింద వా
తాశనవౌచు, నత్యంతతప్య
మానవై, భస్మశయ్యా నిపాతితదేహ
వై, యెవ్వరికినైన నక్షిగోచ
రవుగాకయుండు, మా రవికులచంద్రుడు
దశరథ రాముండు దరలివచ్చు.

గీ. నంత, కాతనికాతిథేయమ్ము నొసఁగి
కశ్మలము విడి, నిజతనూకాంతి యెసఁగ
వచ్చెదవు, నాదరి కటంచుఁ బలికికొని
తుహినధరణీధరమ్ముల త్రోవఁబట్టి 102

క. పోవుచు, నిజసూనుని, సం
భావితనియమాఽభిరాము పరమర్షిమతుం
డై వెలయు, జనకనృపుకడ
సౌవస్తికుగాఁగ నిలిపె, సంతస మొదవన్. 103

గీ. అంజనాదేవి, దుహిత, తన్నంటి రాఁగఁ
బోవుచున్నట్టి గౌతము బుద్ధియందు
దైవఘటనావశంబునఁ దతయశుండు
చండ విక్రముఁడగు కుంజరుండు దోచె. 104

ఆ. గౌతముని పథంబు కన్నులఁ బరచి, తో
కొనుచుఁ బోయెనంత కుంజరుండు
వాని భార్యయైన వనిత వింధ్యావళి
కాక్షణంబ, తల్లిదైన మనసు. 105

తరువోజ. ఓ కుంజరుండ! సత్యోదిత! నీవ
యుత్తముండని తోచి యుల్లంబునందు
నా కొమరిత, శీలనందిని, రూప
నగపుత్రి, మత్తపోనందనవనము
నీకడనుంచి పో, నెనరు గల్గినది
నీవ, తండ్రివిగాఁగ నెలఁత రక్షించి
ప్రాకటంబుగ నొక్క పతిఁ గూర్పవలయు
రమ్యస్వభావ! తీర్పవలె, నా కోర్కె. 106

క. అని యన్న కుంజరున కా
ననమున వెన్నెలలు బూచి, నా భాగ్యమనెన్
వనితయు వింధ్యావళి, యం
జన, చేరదీసి, శిరము చల్లగ నిమిరెన్. 107

క. భూరికృతాతిథ్యం ముదా
పూరితుఁడగు గౌతముండు వోవుచు, తుదలన్
జేరిన యశ్రువులఁ దప
స్స్యారుచిరములైన కనుల నాత్మజఁ జూచెన్. 108

క. పితృవిరహమ్మృదిత నంజన
సతి, వింధ్యావళి, మృదూక్తి సంపద దేల్చెన్
సతత హితప్రియచర్యా
గతినంజన, పితృవియోగ గాథలు మఱచెన్. 109

సీ. యౌవనం బనెడు రాజ్యాధినేత విహార
మునకునై, యంజనా తనుమనోహ
రారామమును జేర నంతకుమున్న త
దర్హోపచార నిష్ణాత్ములైన
భృత్యులు వేచెడు విధముగా నంజనా
సుతనుగాత్రమ్ము లాయితములయ్యె
దౌవారికుని బోలె, తరుణీ హృదబ్జమ్ము
తొలుతఁ గన్పించి, మ్రొక్కులు ఘటించె

గీ. నాకె వచియించు ప్రతిపల్కునందు క్రొత్త
చాతురులు నేర్పె మరుఁడు శిక్షాగురుండు
కనులు, ప్రత్యుపదేశ దక్షంబులగుచు
వానికే నేర్పె, సరిక్రొత్త భంగిమములు. 110

గీ. ప్రభువు, దుర్బలుఁడైన గర్వంబు బలిసి
వీఁగి సామంతులెల్లలు చెసుచునట్లు
అంతవఱకును, నయము ననణఁగియున్న
వికచకుచయుగమెడఁద నొత్తికొని వచ్చె. 111

సీ. కలకంఠి, నవమాలికావల్లి, తరుణామ్రమ
మున(జేర్చి, కన్నులు దనియ(జూచు
చక్ర విశ్లేష శుష్యచ్చక్రవాకీత్వ
గంబువులరసి చిత్తంబు గల(గు
తల్లి(గానక దురపిల్లు నేణీశాబ
కంబుల, మాతయంకంబు సేర్చు
పార్వణ చంద్రికా పరిణాహియామినీ
శైతల్యముల కలనత వహించు

గీ. యౌవనం బను మంత్రితోడై, కుతంత్ర
ములను నేర్పిన, రెట్టింపు బలముగూడి
మానినీమానదుర్గ నిర్మథనచణు(డు
పంచబాణు(డు పురము పాలించునపుడు. 112

క. చతురశ్రశోభియౌవన
వలియగు నాత్మజను గాంచి, వాసరపతి, త
న్మతిహితు(డగు నొక వరునకు
నతివ మెస(గ(దల(చి, వావులరయుచునుండెన్. 113

మ. స్తవనీయంబగు శౌర్య సంపదయు, నుద్యద్బాహు వీర్యంబు, సం
శ్రవణీయంబగు కీర్తి, మౌనిజన రక్షాబుద్ధియున్ గల్గి,దే
వవరేణ్యుల్ నుతియింప(బొల్పెసగు దివ్యన్మూర్తి, శాఖామృగ
ప్రవరుండెడ్డనుదోచె, కేసరి, సతీపాణిగ్రహ ప్రాప్తికిన్. 114

గీ. కుంజరు(డు చెప్పి పుత్తెంచె, నంజసావి
శారదుల, మాల్య భూషణచయముతోడ
నాత్మ తనయ గ్రహింప నభ్యర్థనమ్ము
సల్పుచును, వీర కేసరి సవిధమునకు. 115

క. మునుప, శ్రవణాఽవతంసం,
బనూనమగు నంజనా హృదాకర్షిహ్రుషీ
కనిభృత రూపము, దాత్త
త్వనిరూఢము మానసమ్ము, వరకేసరికిన్. 116

గీ. అగుట సమ్మతి దెలుప, దేవౌఘశంసి
తమ్ములగు వైభవములు, తద్దయును గూర్చి
కుంజరుఁడు దీర్చె, పెండిలి కూతునకు, జ
గచ్ఛుభంబుల, కోంకారకలనగాఁగ. 117

క. సర్వసుపర్వులు విమలా
శీర్వాదము లొసఁగి రెలను, చిక్కఁణగంధా
పూర్వములై, కల్పకములు
వార్వీచులు వోని కుసుమవారము గురిసెన్. 118

క. కేసరియును, నంజనయు, ను
పాసన సల్పిరి మనోజ్ఞు, బహుపరిరంభ
వ్యాసక్తులు, దేహోద్వై
తాసక్తులు, కోష్ణచుంబనాదరమతులై. 119

ఆ. అతఁడు కామరూపుఁడతివ చాతుర్యధు
ర్యావతార మేమియనఁగఁ గలదు!
వారి రాసములకు వసుమతీ, పాషాణ
వితలుగూడ, పులకతతి వహించె. 120

చ. అనిస మునీంద్రు లిట్టులని రార్య జన స్తవనీయగౌతమ
ప్రణిహితమైన తేజము, నహల్య సురూపము గల్గినట్టి యం
జనకు, కపీశ బాంధవము సాంప్రతమే! విధియంత గేలిసే
యునె! రమణీయమైన జని! నుత్పలమున్నఁటకాలఁద్రొక్కఁడే! 121

ఆ. సూతుఁడప్పుడనియె, నాతన్వి పూర్వజ
న్మంబునందు నందినది కఠోర
మైనశాప, మెంత యధికుల కైనను
కర్మఫలము ద్రోవఁగాదు నిజము. 122

వ. దాని పూర్వజన్మ వృత్తాంతమ్ము వినుండని యిట్లనియె. 123

సీ. మాయూర పించభూషాయుక్త కైశ్య తా
పింఛ రుక్మబల దిగ్వితతివాఁడు
కాదంబరీ గంధకలిత వీటీమృగీ
మదతుందిలాస్య పద్మమ్ము వాఁడు
కామినీఖర నఖక్షత దంతురిత భుజాం
తర రత్నహార సంతతులవాఁడు
కిన్నరీబృంద సంగీత చాలిత శిరో
భ్రాజిష్ణువగు తపారంబువాఁడు

గీ. జరఠపన్నగ కంచుకసముద్ధృతోత్త
రీయ హాటక కాంతి వీచీయుయుత్సు
పరిసరంబుల వాఁడొక్క సరసుడుండె
భాగ్యశాలి విద్యాధర పరిబృఢుండు 124

గీ. వానితనయ సుకంఠి, యాబాల బాల్య
మెల్ల విద్యాధరీ కౌతుకోల్లసిత భు
జాగ్రముల యందఁ గడచె, విద్యాధరునకు
నెలఁత చిఱునవ్వు చలువవెన్నెలలకీడు. 125

వ. దానికి యౌవనోద్గమంబైన నొక్కవాఁడు తోడిచేడియలన్గూడి యారామ
విహారంబుసేసి, వనదేవతా ముకురాయమాణంబగు సరంబున జలకంబు
లాడినది, వలువలు ధరించుచున్నంత నెయ్యేని కారణంబున నాది
కపియైన వృషాకపి వీర్యంబు ధరియించి, ధరియింపనోపక, యసు
రుసురై వోవుచున్నవాఁడు, భగవంతుండగు జాతవేదుండు దృగ్గోచరుం
డగుడు, వానిం దిలకించి. 126

క. యౌవన మదమునఁ గన్నులఁ
నావిరులై యా సుకంతి, ఘనకుచకంపం
బావహిలఁగ, నవహేళన
గావించుచు, మూతి ద్రిప్పి కలకల నవ్వెన్. 127

ఉ. అయ్యవహేళనంబు హృదయంబు గలంప, రుషారుణచ్ఛటల్
గ్రయ్యబడం గృశాసుఁడనె, కర్కసమై నెఱజవ్వనంబులో
తొయ్యలి పొంగిపోయెదవు, ధూర్తతఁబండ్లిగిలింతు క్రోతిపై
ప్రయ్యెడుగాక యీ ఫలము, భామిని; యూరకపోవనేర్చునే ! 128

గీ. అనతికాలంబునంద, యీతనువుదొఱఁగి
వనితగాఁ బుట్టి యొక కపివరుని గూడి
యిమ్మహేశ్వరు వీర్యంబు నెమ్మి దాల్చి
తనయుఁ బడసెదుగాఁత బిత్తరపుదాన ! 129

క. అతిశయబలుఁడై, వాఁడు
న్నతగుణుఁడై దిఙ్నికేతనా నటితయశః
ప్రతిబుద్ధ సుజనమతియై
యతులంబుగ వెలుఁగు, కేశవానుగతుండై. 130

క. అనుచనుచునె సరసర బో
యెను వహ్ని, సుకంతి వణకు నెదలో దిగ్భ్రాం
తిని బొంది, తెప్పరిలి యే
మనఁగా నేరకయ, పితృ గృహమ్మును జేరెన్. 131

వ. ఆ సుకంతియ కాలాంతరమ్మున సంజనగా జన్మించినది; శాపంబు, యవ్వారారోహకు వరంబైనయది. తదనంతరం బాకర్ణింపుండని సూతుండిట్లనియె. 132

క. గడచెను కాలము, సౌఖ్యని
గడితముగా, గాని సుతుఁడు గలుగఁడు, ప్రాయం
బడవిని గాచిన వెన్నెల
పడఁతి మొగము, తీవ్ర తాపభరితంబయ్యెన్. 133

ఆ. తపమొనర్చియైన, తపయుని చిర్నగ
వులను జూచువఱకు వెలితి దీర
దంచు, వెలఁది, శేషుఁ డవనీతలమ్ముపై
నిలిచియున్న కుధరతలము జేరె. 134

సీ. ఎచ్చోట నెత్తమ్ము లివతళించెడు, దేవ
ఋషి మహతీనాదవృష్టిఁజేసి
యెచ్చోటికుంజమ్ము లేకాంత భక్తిభా
వాసార పారికాంక్షాశ్రయమ్ము
లే గిరికుల్యల నెసఁగు నీరము, మౌని
వర గభీరోంకార సురభిళమ్ము
దేవకాంతాతనూ దివ్యగంధమ్ము, పా
నఃపున్య మే సుమనస్సురభికి.
గీ. సకల దైవమ్ము లేకొండ, శ-సుకుశేశ
యములు ముకుళించి నిచ్చలు నర్చసేతు
రట్టి శేషాచలముఁ జేరినంతలోన
తీరినటులయ్యె నంజనాదేవి కోర్కె. 135

వ. ఆ కొండనెత్తమ్ములందొక సమతలమ్మున, నాశ్రమమ్ము సేసి, యనుంగు భర్తయైన కేసరి యవసరంబులు దీర్చ నంజనాదేవి, పరమశివుం గూర్చి తపమ్ము వట్టిన, 136

ఆ. ఆమె తపము చోద్యమైనది, తచ్చైల
మునులకెల్ల, హరిణగణము తమదు
కనుల, నామె కనుల రడసుంచి పోల్చికా
న్నదియు తెలియలేదు నాతి మనసు. 137

సీ. కుసుమవృంతము లొత్తికొన, మెచ్చికొను మస్త
మున, కర్కశపు జటలను ధరించి
కమ్మకస్తురి తిలకమ్ముతో, పేరెత్తు
నొసటిపై, కర్కర భసితమూని
మణులయొత్తులకు ముమ్మరము గాఁగలఁగు మ
ధ్యమ్మున, కటుకుశదామమూని
వలిపెంపు జిలుఁగు దువ్వలువకే వెతజెందు
తనువున ధాతువస్త్రమ్ముదాల్చి. 138

గీ. కలికి, పూనిన సాహసిక్యములు జూచి
స్థాణువైనట్టి శివుని నిర్దయను దలఁచి
దాపులందున్న వనదేవతలు, పలాశ
పతిత సుమకైతవమున, బాష్పములు నించె.

వ. ఈరీతి పెక్కేఁడులు తపంబుకట్టిన శశాంకధరుఁడు కరుణించి, 139

చ. దరిసెనమిచ్చె శంకరుఁడు దారశరద్ఘన పాండురాంగుఁడా
దరమధుపూర్ణ నేత్రయుగ తామరసుండు, గజేంద్ర కృత్తితో
నురగ విభూషణ వ్రజదృగుజ్జ్వల రత్నమరీచి నేత్రక
ర్బురహరిదంతరుండు, పరిపూరిత సర్వ మనోరథుండుగన్. 140

చ. పలికె గిరీశుఁడిట్టులను వట్టితివోసి! తపస్య! కోర్కియ
గ్గలముగఁ గూడులెమ్ము, త్రిజగమ్ముల నెవ్వరు వోలనట్టి యు
జ్జ్వలమగు విక్రమమ్ము గుణసంపదు పేతము గల్గునొక్కధీ
విలసితమైన వెల్గు, పగవీడుము, పుత్రుఁడు గాఁగ సుందరీ! 141

క. ఒకనాఁడు గంధవాహుఁడు
వికచసరోజాక్షి! తపము పెన్నిధియై, తా
వకనికట భూమి, పరిణత
మొక పండిడివోవు, నిర్జరోత్తముఁడు దయన్. 142

గీ. దాని భక్షింపు, మమృత సమానమైన
దాని, హుంకారవైరి విద్రావణుండు
లోకశివతాతికీర్తి, త్రిలోచనములు
లేని శంభుండు, సుతుఁడు, దోర్లీల నెఱపు. 143

క. అని పలికి శివుఁడు వోయిన
వనజాక్షికి కనులు నాడె భవ్య భవిష్య
ద్దినములు, సుతఘన సుగుణ
ప్రణిహిత సౌగంధ్య వీచి రమ్యంబులుగన్. 144

ఉ. ఎన్నఁడు వచ్చు గంధవహుఁడెన్నఁడు సత్ఫలమిచ్చు, కోర్కెతో
నెన్నఁడుదీరు, నా కనుల నెన్నఁడు వెన్నెలఁజిల్కు యర్భకుం
డన్నెలదాల్పు దివ్యవరమై నటియించు నటంచు, ప్రత్యహం
బున్నమితాస్యయై, వికసితోత్పలలోచన జూచుచున్నెడన్. 145

ఆ. మూర్తమైన దయను బోలి సమీరుండు
మలయ గంధసార మిశిత దేహుఁ
డొక్కనాఁడు ఫలము నుంచి చెచ్చెరఁబోయె
నువిద, తెలిసి తెలియకున్న యటులె; 146

క. తరళాయతాక్షియు, నమ
స్కరణము గావించి, విభుని సమ్మతి, శం
కర కరుణా నిచుశిత మ
ప్పరమ ఫలము దినియె, నాశ పరుగులు వాఱన్. 147

గీ. భువన కల్యాణ కరుఁడైన పుత్రు గుఱిచి
వారి దాంపత్య సుఖము దివ్యముగ వెలిఁగె
నఖిల కల్యాణ సాధకమై వెలుంగు
సదమలంబైన యొక్క యజ్ఞమ్ముబోలె. 148

వ. అంత గర్భంబు నిలిచి నవమాసంబులరిగిన దీపంబు నుండి దీపాంతరం బుంబోలి సుతుండుదయించిన. 149

సీ. చిన్ని వాలమువాని, శీతాంశుధరు జటా
కుటిఁబోలు నెఱ్ఱని జటలవాని
బీర పూవులఁబోలు బిరుసు కన్నులవాని
బంగారుచాయ మేన్పసిమివాని
నొంటి జందెము వాని, సురుతరగ్రావ కా
ర్కశ్యతుందిల హనుగరిమ వాని
కర్ణ శష్కుల భాసి కమనీయకుండల
స్తబకితవక్త్ర సచ్ఛవుల వాని

గీ. గాంచి, యంజన కన్ను లగ్గలము విరిసి
శర్వచరణ సమర్పితాబ్జములఁ బోలు
చిన్ని పాపని కౌగిటఁ జేర్చి హర్ష
సలిలముల నభిషేచ నార్చనము సలిపె. 150

వ. మునులారా! యిది యంజనాచల వృత్తాంతమ్ము, మరియొక్క కథ వినుండని సూతుం డిట్లనియె. 151

సీ. పరమేశు గుఱించి యెవ్వరి కంటె, కరము దె
ప్పరమైన తపమును బట్టి, నిలిచి
తద్వరంబున సముద్ధతమైన విక్రమం
బునఁ జేసి, యమరులఁ బొనుగుపఱచి
రంభ ప్రధానాప్స రస్సతీలాలిత్య
మ తగురా రాక్షసరతుల కీడ్చి
కందాశనులు ముని గణముల నోటఁ గ్రు
క్కిడదముగా మాంసమ్ము గ్రిక్కిఱించి

గీ. నాఁడు వృషభాసురుండు, సర్వసహోక్ష
మాగుణస్పర్ధి భయదక్రమమ్ము వాఁడు
రుంద్ర హుంకార ఘన శతారుండు దేవ
విభు ముహుః కల్పితాత్యంత వేధ వాఁడు. 152

క. ఒకనాఁడు వాఁడు శేషా
ద్రి కటక భూములను సంచరించుచు, చలితా
లక శోభితముఖు, హృద్రో
చక గాత్రుండైన యొక్క శబరుని జూచెన్. 153

మ. కని యెవ్వాఁడవు రోరి! పుష్టమగు కంఖాణంబుపై నెక్కి దీ
ర్ఘనిశాతంబగు ఖడ్గమూని, కడు చక్కంబోవు చున్నావు, నే
త్ర నటద్గర్వము, సుష్ఠుమాంసలిత గాత్రద్యోతకంబై, యటం
చు, నిశాటుండు, ఘనాఘన ధ్వనినిభోచ్చానో క్తి ధట్టించినన్. 154

క. దరహాసము, మోమున సుం
దరమై, లేశమ్ము లేనిదరమై, శబరుం
డరసియు నరయని చూడ్కుల,
పోరిఁ బొరి తన త్రోపవెంటఁ బోవుచు నున్నన్. 155

క. ఆనిర్లక్ష్యము తోత్ర
మ్మున, నాగముగ్రుమ్మి నట్టిపొలుపై, కన్నుం
గొన తెరగలియై రక్కసుఁ
డనువేలము త్రోవనడ్డి, యార్భటు లెసఁగన్. 156

సీ. వింధ్యాద్రి శిఖరంబు వెన్ను దన్నిన గదా
దండంబు విసరి దుర్దాంత బలుఁడు
కహ కహ నవ్విన, కైతవ శబరుండు
శరపాతముల దాని నుఱుముసేసె
ఆశ్చర్య మతుల హవణించివాఁడు, స
మీపభూరుహముల నేపుతోడఁ
బెకలించి వైచిన, పిన్నని సగవు తె
ప్పలనాడ, వానిని, పదటు సేసె

గీ. ఘనశిలాతతి వైవ నుగ్గడువుగొఁగ
ఖండములు సేసె, రోసంబు గండరించి
యగ్రమున దూకె, నసుర బాహాప్పళించి
నిగుడు నారసముల వాని నిల్వరించె. 157

గీ. శబరు బెట్టిదుగా నెంచి శత సహస్ర
ప్రబల మాయా కదన విదాంవరుఁడు, యామి
నీచరుఁడు, పలు మాయల నిర్వహింపఁ
దలకొనియె, డిశల్, నిట్ట చూపులను జూడ. 158

ఉ. అంతట, కారు క్రమ్ముకొనె నగ్గలికమ్ము, భయంకరారవా
క్రాంతములయ్యె, కానన ముఖమ్ములు, కౌశిక ఘుర్ఘురధ్వని
భ్రాంతములయ్యె వృక్ష నికరమ్ములు, భీకర వాతజృంభణా
చాంతములయ్యె నాశలు, విచాలిత పర్వత సంకులంబుగన్. 159

సీ. ఒకచోట వినిపించు నుత్రాల యామినీ
చరభుజా కర్కశాస్ఫాలనములు
ఒక్కచోఁ బ్రవహించు నుద్వేల నేత్రజ్వ
రాపాది కశ్మలితాస్ర నదులు
ఒకచోట వినిపించు వికట గంధ గజేంద్ర
దశదిశా పటహ చీత్కారములు, మ
రొక్కచో జృంభించు దిక్కూల కషణ పిం
డారక చటుల ఘాంకారములు, వ
గీ. రాహ ఘుర్ఘురములు, మనో ద్రావకములు
భూత భేతాళ హసపూగములు, దవాగ్ని
కీలికాచ్ఛట ఛటలు, తుంగిత పరేత
నాథ గళ గర్త జనిత రవాధికములు. 160

వ. అపుడు కైతవ శబరుండది రాక్షస మాయగా నెఱింగి సంకల్ప మాత్రం
బున నద్దాని నివారించి శరాసారంబు బరగించిన, 161

క. వీఁడతి విక్రమి, మర్త్యుఁడు
గాడు, త్రినేత్రుండు గూడఁ గడగానని దే
వేడితుఁడగు విష్ణుండ, ని
గూఢముగా నుండె ననుచు కోణపుఁ డెంచెన్. 162

ఆ. వాఁడు మాయమగుచు, వనజనాభుని పైన
గుదులు, శస్త్రములును గ్రుమ్మరించె
పిన్ననవ్వుతోన, నన్నింటి వితథంబు
సేసె మాధవుండు, శిష్టనుతుఁడు. 163

ఉ. పెద్దయుఁ బ్రొద్దు, వీని భుజవీర్యము నొప్పరికింపఁ గాదటం
చద్దినినాథ నేత్రుఁడు, మహః ప్రసర గ్రసితాంతరాళ, వి
భ్యద్ధరణీధరేంద్ర తనయాధవ తీవ్ర తృతీయ నేత్రు, శౌ
ర్యోద్ధతు, చక్రరాజమును, నూహదలంచిన యక్షణంబునన్. 164

మ. చనుదెంచెన్ దివిజాధినాథ రమణీ సౌభాగ్య సంపద్విశో
షణసంచారము, విష్ణుపాదయుగళీ సంసర్గ మర్త్యోఘపా
పనికాయోన్మథనైకసారము, జగద్వంద్యమ్ము, నాకేశము
ఖ్యనిలింపుల్, కరయుగ్మముల్మొగిచి, యుత్కంఠన్ విలోకింపఁగన్.
165

శా. ఆ చక్రంబు, పరేశునాజ్ఞబడి జిహ్వామాలికాభీలమై
వీచుల్వీచులు దొడ్డ నవ్వులెసఁగన్. వే రాగ, మృత్యూదయం
బై; చేడ్పాటున రక్కసుండు, నిటలన్యస్తంబు చేదోయియై
వాచాపర్వముగాఁగ నిట్లు వలికెన్, వైకుంఠ భక్త్యుద్గతిన్. 166

చ. పరముఁడ వీవు, నీదు విభవంబులు గానఁగనేర రా పురం
దరముఖులైన నిర్జరులు, తావక పాదసరోజ జన్య పు
ష్కరములు దాల్చి శంకరుఁడు సర్వశుభంకరుఁడయ్యె నీదయా
పరము నను గ్రహించి, పరిపాలన సేయుము, ధర్మరక్షణా! 167

శా. శ్రీకంఠుండు వరంబులిచ్చెనని నిస్సీమంబు గర్వంబు మా
జాకై, లోకము గాసిపెట్టితిని, చక్రస్వామి రావించి, యీ
నాకున్ మోక్షమనుగ్రహించితివి, దైన్యంబేల! దేహంబు చీ
కాకైయున్నది, ద్రుంవవే, పడిగ, శిక్షారూపరక్షావ్రతీ! 168

సీ. వేదసౌధంబుల విహరించు సర్వాతి
శాయియైనట్టి తేజంబు, దేహ
మొనరఁజేకొని, యుర్వికిని వచ్చి, శబరకు
త్సిత వృత్తి గైకొని, దృప్తుఁడైన
నాకు మోక్షసుఖంబు, వీఁక బ్రసాదించె
నిట్టి ప్రసాదమింకెందు గలదు!
నా మోక్షసుఖ కారణంబైన యీ కొండ
మన్నామధేయ సంపన్నమగుత.
గీ. యీ దృశంబైన మూర్తియే యెపుడుఁ గనుల
హృదయమున నాఁడుగాఁత నాకిందిరేశ!
నిత్య సంవిత్స్వరూప! శాంతి ధనమౌని
మానసానందకారి సన్మాన్య చరిత! 169

క. రావయ్య! చక్రరాజ! మ
హావిక్రమ! నా గళమ్ము మసలక దునుమ
న్గావలె, తోడ్తోఁదెఱువ
న్గావలె, వైకుంఠపురపు కావలి తలుపుల్. 170

గీ. చక్రరాజమ్ము దునిమె నిర్వక్ర తేజ
మాక్షణమ్మున సద్ధర్మహంతృ గళము
గగనమున నుండి పడియె ముక్కారు పంట
సురలు వర్షించునట్టి క్రొవ్విరులవాన! 171

వ. అని పలికి వెండియు, నూతుంచిట్లనియె. 172

ఆ. నీలుఁడను కపీంద్రు నెలవగుకతమునఁ
జెప్పఁబడును, నీలశిఖరి యనుచు
నాదివోత్రి కిదియు నాశ్రయంబగుట వ
రాహ శైలమనెడు ప్రథఁ దనర్చె. 173

గీ. అమృతబీజంబు వేంకారమగుట, కటమ
నంగ నైశ్వర్యమగుట, నీ యద్రి యభయ
మునకు నాశ్రయమగుట, సన్మునులు, వేంక
టాచలంబంచుఁ బలికి రత్యగ్నితనులు. 174

వ. తొల్లి, నారాయణుండను మహాయోగి తపంబువట్టి, కమలాక్షుఁ బ్రత్య
క్షంబుసేసి, తనపేర నీ గిరిని బిలువ వరంబు గోరిన నిది నారాయణాద్రి
యయ్యె, వైకుంఠంబునుండి యానీతంబగుట వైకుంఠాచలంబందురు.
విష్ణులోక నివాసులు, దీని నానందాద్రి యని గీర్తింతురు. శ్రీ పదంబును,
శ్రీనివాసంబు నగుట, దీని నుభయధా, శ్రీశైలంబని వ్యవహరింతురు.
పరమపదవాసినీ కటాక్ష తారకిత వక్షోభాగుండై శ్రీనివాసుం డిందుండు
టన్జేసి, యిది శ్రీనివాసగిరి యయ్యె, నిది దిక్సూచిక. కల్పభేదంబులననేకం
బులగు నామంబులీ పర్వతంబునకుఁ బ్రసిద్ధంబులై యుండు; 175

చ. అభినుతిసేయలేడు, చతురాస్యుఁడు లేశమునైన సత్యవా
గభిరతి నెన్ననేరఁడు షడాస్యుఁడు పాదమునైన, పన్నగ
ప్రభుఁడు సహస్రజిహ్వికలఁ బల్కఁగ లేడొక యర్ధమైన, శ్రీ
విభు చరణోత్సవాకరము, వేంకటశైల గుణాధిపత్యమున్. 176

గీ. ఇంక నరులు నేర్తురే! శేష శైలంబు
వాసి దెలియ, తెలిసి పక్కణింప
నది, యహార్య రూపమైన సాలగ్రామ
మది, సహస్రపాదు నమృతతనువు. 177

వ. అనిన, యాగ దీక్షితులైన మహర్షు లిట్లనిరి. 178

గీ. స్వామిపుష్కరిణీ స్వచ్ఛవారిఁబోలె
పాపభంజకములు నీదు భాషణములు
తపము, యజ్ఞమ్ము, ధర్మమ్ము, దానమైన
శ్రీశు లీలా విశేషముల్ చెప్పవయ్య ! 179

చ. అరుదగు వేంకటాచలమునందు వసించుటఁజేసి, వేంకటే
శ్వరుఁడని పేరు గన్న నవసారసపత్ర విలోచనుండు, శ్రీ
హరి, యెపుడెప్పుఁడెవ్వరికి నాదృతి దర్శనమిచ్చె, నెవ్వరె
వ్వరు నుతియించిరాధ్యు, ననవద్యపరీమళ పేశలంబుగన్. 180

ఆ. అనిన సూతఁడనియె, నబ్ధివారికణాళి
నైన, లెక్కపెట్ట నగునొ యేమొ;
ఆ జగన్నియంత యనవద్యలీలల
నెవరు, చాలి, యేర్పరించువారు ? 181

చ. అయినను, విన్నవింతు, త్రిగుణాత్మకులీలలు, జన్మకర్మ దు
ర్ణయములడంచి, శాంతినిఁదిరంబుగ నిచ్చునుగాన, త్వచ్ఛ్రవో
ద్వయముల నోముపంటగ ముదమ్ముగ ద్రావుఁ డనబ్ధిసంభవం
బయి, త్రిగుణంబులన్ జెఱచునట్టిది నూత్నరసాఢ్య మీ సుధన్. 182

వ. అని పలికి సూతుం డిట్లనియె. 183

సీ. తన నేత్రకోణ సంజనితశోణిమ, హరి
హయ లక్ష్మి కుద్వాసమైనవాఁడు
తన జాఠరాగ్ని కింధనముగా వాతాపి
కుటిలాసువులు వాడికొన్నవాఁడు
పరమశాంభవ తపోభరముచే నెవ్వారి
కంటెను కడకొప్పుడైనవాఁడు
అత్రితపమ్మున కనుగతమైన మ
హాదేవు పూర్ణాంశమైన వాఁడు

గీ. కాలకంధరు కఠిన హుంకారములకు
సవతులైనట్టి కఱకు పెన్ జడలవాఁడు
ముగురుమూర్తుల గౌరవములను గొనెడు
వాఁడు, డెప్పరమైన దుర్వాసమౌని. 184

క. అత్తపసి యొక్కపరి, సుర
సత్తములకు సేవ్యమగుచు, సర్వర్తు సుఖా
యత్తంబై, పున్నెంబుల
పొత్తంబగు శేషశైలమున కరుదెంచెన్. 185

ఆ. అరుగుదెంచి సుఖాసీనుఁడైన యంత
మనసు నిర్భరమైన సమాధి మునిఁగె
పన్నగాచలమందు, తపంబులెన్ను
పొడిగాఁ బండుటన్న నబ్రంబుగలదె ! 186

ఆ. ఆ సమీప మంద హాలామదోద్వృత్తి
తిమురు కన్నులందు తీడిరంచి
తలయు, మొలయు మఱచి, మలయుచునుండె, కి
న్నరుల జంట యొకటి, పరువమెనసి. 187

శా. ఉత్తుంగ స్తనకంచుకంబు దొరగ, న్నుద్వేగియై కిన్నరుం
డొత్తన్, తన్నఖరక్షతంబులకు భావోద్రేకమై, కిన్నరున్
హత్తెన్బో! చపలాక్షి, దృప్తకటి సీమాబద్ధకాంచీస్థల
త్తాదృక్కల కింకిణీరుతులు, సాంద్రంబై విజృంభింపగన్. 188

క. ఆ నినదము చెవులన్బడి
మానితము సమాధి చెదరి, మాసరమై, క
న్గొనల నరుణిమ దొలుకం
గా, నప్పుడా మౌనివరుఁడు కన్నులు దెఱచెన్. 189

శా. పీటీగంధము, మద్యగంధమును, నిర్వేలంబుగా, నివ్వనీ
వాటంబుల్ గబళింప, మాన్మథ సుఖవ్యాసక్తి వర్తింతురే!
చోటుల్లేవె దరీ నికుంజతతు, లిచ్చోనేరి కధ్యాపనం
బీటెక్కాల్! మునులుందురేమొ! యను మాటే లేదా! భావంబునన్. 190

క. పొంగిన కామమ్మున, మది
క్రుంగుడు వడినప్పుడోలములఁ గూడుట కా
కంగదగోని బాహిరముల
నంగడి వెట్టెదరె: లోకమన్నది లేదే! 191

గీ. పొందు, మీ గర్వఫలము గొనుండు, శబరు
లగుచు, నటమట గుడిచి కదన్నములను
నలవడుచుఁ దిరుగుండు కదధ్వములకు,
కనులు గప్పిన భోగభాగ్యములు దలఁగి. 192

సీ. అని శపించిన మదంబంతయుఁ జెడి, పోని
దుర్వాసుఁడని యెర్గి, దుస్సహంబు
దుఃఖమై, తత్పదతో యజంబులఁబడి
లబలబలాడ, నుల్లంబు గరఁగి
శబర జన్మమున సాక్షాత్కరించును, లోక
రక్షణ చణుఁడు వరాహమూర్తి
తద్దర్శనంబునఁ దలఁగి కుత్సిత జన్మ
స్వస్వరూపంబు సంప్రాప్తమగును

గీ. పొందనుచుఁ బల్కి, బహుకోపనుండు వోయె
వారి శాపంబునకె, కొండజేదినట్లు
తీవ్ర దుఃఖభరమ్మున, బెరలి, తెరలి
కిన్నరులు, దేహసంగంబు కీలువదలి. 193

క. ఇరువురు జన్మించిరి, ముని
వరకటు శాపోపహతులు ప్రభలు దలఁగి, ని
ష్ఠుర శబర వంశముల, సీ
ధురసార్ద్రి పలాలగంధ తుములములందున్. 194

వ. కిన్నరుండు వసునామ్ముం, డది చిత్రవతి; అనురూప లాలనంబుల వారి
ర్వురు వివాహ యోగ్యులై నంత. 195

క. వసునకు, చిత్రవతికిఁ గుసు
మ శరుండర్మిలిని దీర్చె మాధ్యస్థము, సం
తసమున గడచె వివాహం
బసమున, బాంధవులు, వేడ్క లగ్గింపంగన్. 196

క. మనసులో గలిసిన పెనకువ
లను, సముచిత భోగ్యవస్తు లాలనముల, హ
ర్షనిచిత దినములుగా, న
వ్వనితకు, వరునకును, బ్రదుకుబాటలు చెల్లెన్. 197

గీ. ప్రాక్తనంబైన సంస్కారభంగి, నబ్బె
నమ్మిథువమునకు దేవాదిదేవుఁ
డైన యజ్ఞవరాహు భక్త్యతిశయంబు,
మునివరుని తిట్టు వరముగా పొటమరించి. 198

ఆ. ఎల్లదేవతలకు నేలికయై, ముక్తి
కేకదాత యైన నిందిరేశు
పాదపద్మములను భజియింపఁ గలుగుట
నైక జన్మ పుణ్యపాక గరిమ. 199

సీ. తీర్తురు భక్తి సందీపితుల్, పర్వత
ఝరములు, నుదయాద్రియరుణ కిరణ
ముల సోఁకునందరమున్న, తానంబు, గో
విందనామామృత కందళితము

సుమముల దెత్తురు, సోగకన్నుల భక్తి
దయివార, గానసందానితంబు
లోవి, శుభ్రంబుగ, నీవార మన్నంబు
నర్పింత్రు, మధుకధారాప్లుతమ్ము

గీ. ఓర్మి, హరి వాసరమ్ములందుండ్రు నిట్టు
ద్వాదశీపారణమ్ము నిద్రను దలంగి
సల్పెదరు, వనేచరులతో సంగడంబు
తమ మనోవృత్తులకు నిరోధంబు గాక. 200

ఆ. మానసికబలంబొ! మౌనిశాపాఽనుగ్ర
హంబొ! వారి కన్నులందు, తలఁపు
లందు, యజ్ఞపోత్రి, యసివారుగా దిర్గు
మేని చందనంబు, మిసమిసలుగ. 201

గీ. ఎవరొ చెప్పించినటు దోచు, నిందిరేశు
వైభవమ్ములు, వారి హృద్వనజమంచు
సద్గురుపు లభ్యమైనచో, శౌరికరుణ
దొడ్డి బెట్టిన వేలుపుగిడ్డి గాదె. 202

క. వారి పవిత్ర ప్రణయ సు
ధారస సరసీరుహము విధమ్మన, మధువి
స్మేరముఖమ్మన, నందం
బారెడు శిశువొకఁడు గలిగె నాత్మముకురమై. 203

ఆ. పీరుఁడంచు వానిపేరు, తన్ముఖము వీ
క్షింప చిత్రపతికి, కేవలమ్ము
హరి దయారసమ్మొ, యంగమ్ము ధరియించి
పావఁడగుచుఁ దిరుగు భంగి దోచు. 204

సీ. ఆడరా! నా తండ్రి! యాత్మేశుగుఱిచి, వ
ర్షాభ్రమ్ములో నెమ్మియాడినట్లు
పాడరా! మాయన్న! పరమేశు, వాసంత
వనులలో, కోయిల పాడినట్లు
పలుకరా! కూన; విశ్వవ్యాపినామమ్ము
తొలుకు తేనెల చిల్క పలికినట్లు
పట్టరా! తాళమ్ము, తరుణమేఘము మంద్ర
పంచమమ్ముగను గర్జించినట్లు
గీ. రార! మాభాగ్య ఫలమ! రారా! వసంత
మారుతమ! రార వైకుంఠు మధురనదమ!
తనివిపోవక పిల్చు, చిత్రపతి. సూను
హరికృపారస మాధుర్య మాస్వదించి. 205

గీ. వసువు, కందోలవీణపై బాడునప్పు
డామధురిమల, కలరు నారాయణుండు
వాని మంగళకైశికి, యీనుతీపి
మత్తులో మున్గితేలు రమాధవుండు. 206

సీ. వాని కుటీరమ్ము పజ్జ నశ్వత్థమ్ము
వనరుహేక్షణుని నివాసభూమి
తన్మూలమున, శిలాతలిచేర్చి, నిర్మించి
నట్టి, జానుప్రమాణాలయమ్ము
యజ్ఞవరాహ దేవాకార సూచనా
ప్రాయమైనది యొక్క ప్రస్తరమ్ము
కించి దేరండ తైలాంచితంబగు నొక్క
ప్రమిద, శిలాగ్ర దీపమ్ము, వసుని
గీ. షాద జీవాతువది, వాని సద్భావ
ఖనిజనితమైన మణి యది, కష్టములకు
సుఖములకు హేతువది, వాని చూపు, మనసు
నోహరిచెనంగు, యజ్ఞవరాహమూర్తి. 207

వ. ఒక్కనాఁడు వసుశబరుండు, సపత్నీకుండు, తేనియలు, వైణవంబు
లైన తండులంబులు దేరంబూని చనువాఁడు కుమారు నుపలాలించి
యిట్లనియె. 208

క. ఈ యున్న తండులంబుల
నాయన ! యన్నంబు వండి, నారాయణ పూ
జాయుతముగ నైవేద్యము
ధీయుత యొనరించి, పిదపఁ దినఁదగు సుమ్మీ ! 209

ఆ. వాఁడు 'వల్లె' యనియె, పాపండు యజ్ఞభూ
దారచరణ భక్తిపూరితుండు
చెలువ మొలుకు చెలియు, సెలవిల్లు తోడరా
నడచె వసువు, తఱచుటడవులబడి. 210

గీ. వారు కనుమఱుగైనంత వీరుఁడతుల
భక్తిచుళుకితుఁడామని పరభృతమ్ము
పలికినట్టులు, రోమాంచ పరవశుండు
పరమ పురుషుని గీతము ల్పాడుచుండె. 211

సీ. పాశ్చాత్యములు వాయుభంగంబులుమిసె, ని
ర్వేలంబుగాఁగ, కుకూలవహ్ని
అంగారఖచితంబులైనట్లు హరిదంత
రమ్ములు, నేత్ర జ్వరంబుజొనిపె
ఘనపనద్రులు జిహ్వికలు సాచెనీటికై
యలమిన దావ జిహ్వాచ్ఛలమున
దగగొన్న హరిణ సంతతి, పేరెములువాఱె
చకచకన్మరు మరీచికల గుఱిచి.

గీ. పల్వలంబుల చేపలు, భానుభాను
సూచికావ్యథితమ్ములు సొమ్మసిల్లె
పితృపతి వహించు డాకాలు పెండెరమ్ము
ప్రాప్తమయ్యెను, మిట్టమధ్యాహ్నవేళ. 212

గీ. అప్పుడాకలి దుస్సహమైన, తండు
లములు వండఁగలేక, బాలకుఁడు ప్రాలె
దానవారికి నర్పించి, తాను గుడిచె
నవియ, యమృతాయమానమ్ములయ్యెనపుడు. 213

క. వసువును గృహమ్మును జేరె
న్పసియును, నలఁతయనుగ్రమ్మి, భగవన్నామ
ప్రశమితఖేదుఁడు, నీడగ
నసురుసురై, యాలు వెన్ననంటుచు రాగన్. 214

వ. వచ్చి వండని యన్నంబును, భక్షితంబులైన తండులంబులం జూచి,
క్షుత్పరవశుండు మదిన్గనలి, 215

క. ఓరి ! దురాత్మక ! యఘ ని
స్తారకు నైవేద్య మిడక, త్వరపడి, నీ క్షు
ద్భారమును బాపి కొంటివా !
ఘోరంబపచార మిట్లు, గూడఁగఁ దగునే !. 216

మధ్యాక్కర. అని వాని యుత్తరమునకు నాగక క్రోధారుణములు
కను లౌచు, ఖడ్గమ్ము వెఱికి, కలిలమైనట్టి చిత్తమున
తనయుని మస్తమ్ము సఱుకఁదలకొనె, నశ్వత్థ వృక్ష
మున నుండి దోచె శ్రీధరుఁడు, పుణ్యభక్తౌఘ కింకరుడు. 217

ఆ. వాలు వెఱికికొంచు, వనజాక్షుఁ డనియె, సా
త్వికముగాని భక్తి, పేర్మి గనునె !
నీదు సుతుఁడు భక్తి నిష్ఠఁ డవ్వాని సా
త్వికము భక్తి, నాకుఁ దృప్తి నొసఁగె. 218

వ. మీరు పూర్వజన్మంబున కిన్నర దంపతులు, దుర్వాస శాపంబున నీ
స్థితి గలిగె, మీ పూర్వ జన్మంబులందు క్రమముక్తి గనుండు, మీ కుమా
రుండు భాగవతుండీ జన్మంబున నన్నుపాసించి, రాగల పుట్టువుల మోక్ష

మందు వాఁడు, అవిపక్వ కషాయులకు మద్దర్శనంబు దుర్లభంబైనను, మదీయ కరుణావిశేషంబున నిది దొరకొనె నని, యంతర్హితుండైన వసు శబరుండు. 119

క. కోపము సర్వము జెఱచును
కోపము దిగఁద్రావి, సత్వగుణ కలితుండై
శ్రీపతిని గొలుచు వాఁడ ము
ధాపతితుఁడు గాక, ముక్తి ధామము నందున్. 220

ఆ. అంచుఁ దెలిసి, హృదయ మాకట్టి, శత్రు ష
ట్కంబు నిగ్రహించి, కలికి తోడ
కిన్నరత్వమంది, గీత గానమ్ముల
పరమ పురుష సవిధ పదవి నందె. 221

వ. అని మఱియు సూతుండిట్లనియె. 222

క. జాబాలిముని ప్రోక్తం
బై, బహుశాఖములఁ జెఱచునదియై, మోక్ష
శ్రీభర్మ లలాటికమగు
నీభవ్యము కథ వినుండు హితమతులారా! 223

సీ. ఒకసారి పరమర్షులుజ్జ్వలంబిది యంచు
సర్వ తీర్థముల కాశ్రయమటంచు
సర్వ మాహాత్మ్య విశ్రామ పేటికయంచు
ప్రసన్నపద్దివ్య నిర్ఝర నికాయ
సలిలావగాహ సంక్షాళిత బాహ్యాంత
రికమల మంచు, సుర్వీజపుష్ప
ఫలగణ చిత్రిత బహుభూమికం బంచు
స్వైరచర ద్వన్య సత్వమనుచు

గీ. సకల సురమండలీ శిరస్థల చిరత్న
రత్న నీరాజితాంఘ్రి నారాయణునకు
నవసథంబంచు, నవ్వేంకటాద్రి యందు
వేల్పుఁదొడఁగిరి. రోచిష్ణు విష్ణు గుఱిచి. 224

సీ. లలిత వీణాకంఠములతోడ, సామగా
యన్కులైన వారి గానామృతమున
నా ధరారథమునయం దచేతనములు
చేతనమ్ములుగాగ, చేతనము ల
చేతనంబులుగాఁగ, సిద్ధచారణులంబ
రము నందు నిలిచి, చిత్రముగఁజూచి
రావహ్నియును లేలిహానముల్, మృగజిహ్వ
కాకోమలమ్ములు, కనకసదృశ

గీ. ములు, ప్రదక్షిణార్చులతోడ మొనసి, హవ్య
మునకు నఱ్ఱులు సాచె, ధూమ్యతి ప్రదీప్ర
మఘవమణి నీలకాంతులు మసలి మసలి
శైల మంతయు నొక యజ్ఞశాల యయ్యె. 225

క. హరియందు సమర్పించిన
పరుసపుఁ బనులైన పుణ్యఫలముల నీనున్
హరియందు సమర్పించిన
చిరతర పుణ్యములు, ఘనత నెందుట యరుదే! 226

ఆ. అపుడు శ్రీనివాసుఁడా పరమర్షుల
కర్మనిష్ఠ కెడఁదఁ గరఁగి లక్ష్మిఁ
జూచి యిట్లువలికె, చోద్యంబు సేయుద
మొకటి సురలుసూడ, నువిదమిన్న! 227

ఉ. శ్యామల కోమలాటవి సమంచిత మీగిరి యందు నుత్పల
శ్యాముఁడు సంచరించును సమాశ్రితుఁడై నిరతంబు నన్నవా
దీ, మఱియొక్కసారి గ్రహియింతురు గావుత మౌనులెల్ల, ర
మ్మా! మదయత్నమ్మశేష పరిహాసి వికాసి కటాక్షభాసినీ! 228

క. ఈ మును లనలంబున వప
హోమించెడు వేళ, నేన, యుండి గ్రహింతున్
శ్రీమంతుఁ డనై, భక్త
క్షేమంకరరూప నిచిత శృంగారుఁడనై. 229

గీ. ఏను విటుఁ డౌదు పెదవుల నివతళింప
స్వైరిణీ దత్త తాంబూల పరిమళంబు
నీవు వేశ్యవు గమ్మ, పూర్ణేందువదన
పోదమిర్వురమును మహామునుల దరికి. 230

మ. అనినన్ కన్నుల క్రేవ లజ్జ దొలుకన్ హాసాంకురాస్వాదనీ
య నవేందుద్యుతిమన్ముఖంబున "సరె" యంచాడె దుగ్ధాబ్ధి క
న్య, నిమేషమ్మున మేన నచ్చువడె, గణ్య ప్రత్నగాణిక్య శో
భన కృచ్చారు విలాసముల్, మదన సాక్షాత్కార సాహిత్యముల్. 231

సీ. శరదుత్కట స్మయ సౌరభేయ కకుప్ప
పక్షమ్ము కైశ్యమ్ము భంగి యమర
భావజున్మనివైన బటువు బిల్లలు, కుచ
ద్వయము లేగౌనుఁ బ్రదస్తరికిఁ దన్న
కిటకిట నైన క్రిక్కిఱి కౌను, సదసద్వి
ధాన మాధ్యమిక వాదమ్ము సూప
క్రేళ్లఱి కెడి లేళ్ల గతిఁ గన్నులవైన
మెఱుఁగులు తలచుట్టు దిరిగి రాఁగ,

గీ. లలిత తారుణ్య మదరక్త విలస దధర
ధగధగ న్నవ్యో దంతక్షతములతోడ
పద్మనాభుని కోర్కెలు పారమెద్ద
కమల, యాలోనఁ దానొక్క గణిక యయ్యె. 232

సీ. కడల నెల్లెడఁ జూచుఁ బొడమిన సిగ్గుతో
శిరము నల్లన వంచి, చెలఁగి నవ్వు
నంతలోనఁ దెమల్చి, యంతలోన నమర్చు
కొంగు, వెన్నెల గాయఁ గొనరుచూపు
కంకణ ద్యుతి బర్వ కరములు వీచు, ర
మ్మన్న యట్లులును, గాదన్నయట్లు
కిలికించితంబు వేడ్కలు సేయ, బొమ్మల
పొలపంబుతో, తలంపులు నెలార్చు.

గీ. క్రమ్ము తావుల కూని రాగమ్ములలోనె
మూర్ఛనలు వోవ, లోకమ్ము మూగవోవ
నా మహాదేవి లీలల నరసి యరసి
మోహితుండయ్యెఁ బో జగమ్మోహనుండు. 233

వ. ఇట్లు సమ్మోహితుండై, ప్రతిక్షణ విజృంభమాణ యౌవనభరావేశ బహుముఖ ప్రచలిత లీలా పరిష్కార యగు నా దేవి వెంటన్నపుడి, 'రారమ్మ'ని యొత్తిలి చీరుచు, చారు పీతాంబరంబు డిగజారి, దళితేంద్ర నీల శకల శ్యామాభిరామంబును. నవ తులసిమాలికా పరిష్వంగ శోభాయమానమ్మునగు కాయమ్ము గంపింప, సదయంబులు, సాగ్రహంబులు, సాతంకంబులు నగు కటాక్ష స్తబకంబులు, మదబర్హిణ బర్హ భారంబులు పరశ్శతంబులు సృష్టింప, తొల్లి కంజాక్ష కైతవ యోషా స్వరూపంబు వలచి కృత్తివాసుండు బరువెత్తిన కైవడిఁ బరువెత్తునప్పుడు,

మ. ఒకచో నిల్చును గొంత, క్రీఁగనులయందొయ్యారపుం నవ్వులై
యొకచో నవ్వును వీఁ జెమీటినటు, బాగొప్పంగ దంతద్యుతుల్
ప్రకటారుణ్యములైన పాదతలముల్బారాణి పండింపఁగా
నొకచోనాడు, రమాపురంధ్రి, హరికి న్నుల్లంబు రంజిల్లఁగన్. 235

శా. ఆ లక్ష్మీమృదు విభ్రమంబులకు దేహంబెల్ల రోమాంచరిం
ఛోళివ్యాపృతమై. మనోభవమదోచ్చానంబులౌ హుంకృతుల్
పాలార్పన్ ధృతి, నెమ్మనంబు విటభావం బాచి, లీలావతీ!
'చాలుం జాలిక పోకువే' యనుచు నబ్జాక్షుండు వెంటాడినన్. 236

ఆ. విమల భక్తకరుల వెనువెంటఁగాని, వెం
టాడనట్టి దిట్ట, హరి, యిదేమి
చెయిదమనుచు నెఱను చిత్రీయమాణులై
రభ్రతలి సనందనాది మునులు. 237

ఆ. మగని మాయ ఘనమొ! మగువమాయ ఘనంబొ!
యెడఁదలోన నిర్ణయింపరాక
రెండు చేతులెత్తి శ్రీమతే నారాయ
ణాయ యంచుఁ బలికె నారదుండు. 238

మ. మదిగైకొన్న భుజంగభావలతకున్ మాఱాకుగా, దేహమం
దుదయించెన్నవ సాత్త్వికప్రతతి హాలోద్రిక్త వేశ్యానఖ
ప్రపదాంకంబులు, వీడ్కొనెన్, తులసికాప్రాలంబదామంబు, చ
క్రదరాదుల్ వెనువెంటరా, హరికి యోగన్యస్త సౌగంధ్యమై. 239

సీ. గణికాంఘ్రి జతు రసాక్రాంతమ్ము, యజ్ఞోప
వీతమ్ము, మూపున వ్రేలుచుండ
వెలయాలి పంటినొక్కులతోడి తెల్లనా
కులతమ్మ, పెదవిపై దురుసులాడ

[1]కామినీ కుచదర్ప గండూషితప్రాయ
మగు నెద చందనం బవఘళింప
మానినీ దత్త నిర్మాల్యమ్ము, నిడుద పె
న్నెఱిగుంపులోనుండి నిక్కిచూడ

గీ. కనులు పొలయించు జాగరారుణములైన
యుదుటుఁజూపులు రాసిక్యమదము జిమ్మ
నరిది విటుఁడయ్యె, భక్తి సింహాసనుండు
శ్రీనివాసుండు, యోగీశ్వరేశ్వరుండు. 240

మ. విటుఁడై స్వామి, మనోజ్ఞగాత్రి! యిటుకరావే! చారుతారుణ్యసం
పుటములోఁ్వలిన నీయురోజములు దోబూచాడఁగాఁ బైటనో
క్కటఁ దప్పించుచుఁ జేర్చుచున్ మెలఁగు కాంతాశాలినీ! నీయుర
స్తటి యామ్రేడితమొందుభంగి, 'జిసి' ధాత్వర్థంబు సంధించెదన్. 241

సీ. పరుగెత్తఁబోకువే! పాటలీగంధి! మి
థ్యాకల్పమదిగొ! జవ్వాడు నడుము
పలుకవే! నిలిచి, శోభాతరంగిణి! నిట్టు
సడలించుగాక, మా శ్రవణ యుగళి
నవ్వవే! కాంతి చండాతకంబున దాన
నీ కన్నుదోయి వెన్నెలలు నింద
పాటిత కరిదంతభా తిరస్కారి పు
ల్లకపోల! యీయెద ప్రాలవేమె!

గీ. యింత నాలిసిగ్గులదాన వెట్లు వేశ్య
వైతివే! మత్త బర్హి పింఛాభకేశ!
మమ్ము వలపింపనేర్చిన మగువతనము
లెచట నేర్చితివే! సుధా హిండితాంగి! 242

క. అని వెన్నంటెడు ధవునకుఁ
గనుచాటయి, కొంతతడవు గాసిపఱచి, మా
వనితామణి, యవిదితగుణి
ఘన బాహాబంధమందుఁ గన్నులు ప్రాల్చెన్. 243

ఆ. చిక్కెఁ జిక్కెననఁగఁ జిక్కిన యా లేమ
చెక్కిలందు, ఫాలసీమ యందు
కనులయందుఁ బెదవి, కచకుచంబులయందు,
వేడ్కఁ మెఱసి, ముద్దు వెట్టె శౌరి. 244

వ. ఇట్లు పరమపురుష నాహోపురుషికయైన యబ్ధికన్యకామణి, తదాలింగ నానంద కందళిత హృదయారవిందయై, కన్నుగవ మొగిచిన, యోగీశ్వరుండు, గుణాధీశుండునగు నయ్యాదిపురుషుండు. మాయామందహాసవిని గూహన మధుర తల కపోలుండగుచుఁ గార్యం బెచ్చరించి'పదపద' మని తఱిమి నడచిన, 245

సీ. కడు నెట్టనైన పాగడపుఁ బాదంబుల
మెఱుఁగులు మెట్ట దామరల నీన
పొలపంబు మెఱయు చూపులు నల్లగల్వల
సరపూవుబెత్తులు సవదరింప
మృగమద ద్విగుణమిశ్రిత చంద్ర ఖండ తాం
బూల రక్తిమ, మోవిఁ బొలసియాడ
'తల! తల!'మని జనంబుల నెచ్చరించు కై
వడి, నీగుఁజన్నులు గడునటింప.

గీ. నింపు గులికెడు నంగదట్టంపు కాంతి
చెందిరము జిమ్మ, పట్టు కంచెల రహింప
జంగమమ్మౌ శృంగార రసమ్ము వోలె,
కౌను 'కిటకిట'గా నబ్ధికన్య నడచె. 246

సీ. ఎదురైన కొమ్మల నెల్లవంచి, సుమమ్ము
లర్మిలి, చికురంబులందుఁ జెఱువు
మగసేఁతఁ బ్రిదిలిన మానినీ చికుర భా
రమువంటి బర్హిభారములు సూపు
సెలయేటి రొద విని, చెలువ! నీ మణితంపు
తులయౌనె! యిదియని చిలికినవ్వు
కాదంబరీ గంధ గర్భంబుగాఁగ, గో
ర్వెచ్చని ముద్దు సారెకును వెట్టు.

గీ. నఖిల జీవులఁ ద్రిగుణంబు లందు ముంచి
చెప్పఁగారాని వేడ్కలు సేయు శౌరి
తాన, కాముకుఁడైన విధమ్ము సూపె
హరి; హరీ! హరిలీలలా హరికె యెఱుక. 247

శా. ఆ పణ్యాంగనయైన లక్ష్మియును వ్యాఖ్యానమ్ము సేసెన్, స్మిత
వ్యాపారమ్ములతో, శిరశ్చలన శోభాధారతో, కామశా
స్త్రోపాధ్యాయినిఁబోలెఁ దత్కృతులకున్ రోచిష్మదాకేకర
శ్రీపాత్రీకృత చక్షురబ్జములతో, చిందాడఁగా నందముల్. 248

క. విటవేశ్యా భూమికలను
నటియించినదానఁ జెల్లినవిగాక, భువిన్
కటకట! యా సరసంబులు
ఘటియించునె గేస్తులకు; వికారాశ్రయముల్. 249

ఆ. ఇట్లు సేసికొనుచు నిర్వురు, శృంగార
రసము రూపుగొన్న రసికహృదులు
వేదవేద్యులైన యాదిదంపతులు, ఋ
ష్యాశ్రమంబు లంతనంత దరిసి. 250

వ. ఆ సమీపంబున సడ్డాడుచున్న వారలంగాంచి మహర్షులు మసిపాత మాని కంబులకై పడి శోభింపకయు, గుండెలకు బరుపగుచున్నవారి రూప విశేషంబులుపలక్షించి, యాభిజాత్యంబు లూహించి, యిట్లనిరి. 251

మధ్యాక్కర. ఎవరయ్య మీరలు; భువికి నీగతి నేతెంచి మాయ
లఘుళింపఁగఁజేయువార, లీరూప మన్యులకరిది
భవుఁడవో నీవు; నీపొత్తి, యిది హైమకపి గాఁగఁనొప్పు
ధ్రువముగాఁగను గిరాందేవి యీనారి, ద్రుహిణుండవగుదో ! 252

మధ్యాక్కర. త్రయ్యంతశయ్యాఽవహితుఁడు, వచ్చునో, దళదబ్జ నేత్రుఁ
డియ్యలఁతి తపంబులకును, విష్ణుండు, హితకరుండగుచు
తొయ్యలి, రతిదేవిఁబోలె, మామదిఁ దోచుచున్నదియుఁ
జయ్యన నెఱిఁగింపవోయి ! యగుదేమొ; శతపత్రశరుఁడు. 253

క. దళితేంద్రియంబుగా, ని
చ్చలు, మధుసూదనుని గుఱిచి, సలిపెడుయాగం
బులలో నీయాగడముల
నలయించిన మిమ్ము, నేమి యనఁగలదింకన్. 254

వ. తృణపర్ణాశనులమై, హరిసేవనంబకాని యొండొల్లక, కాననంబులఁ గాలంబు గడుపుచున్న మాతోడ మీకేమి పరియాచకంబు; కర్మమార్గంబు రక్షింపఁదగు కర్తలు, యిట్లు కర్మల దూషింపఁ దొడంగిన నికఁదెరువెయ్యది; మీరు దేవజాతులు గారయేని, మనుష్యులగుదురయేని, భావభవ సుఖంబులనుభవింప వేఱు పట్టులు లేవె ! యింతకును మీదెవ్వరన్న, నీషదంకురిత స్మితమ్ముగా, హస్తయుగ్మమ్ములు మొగిచి, విటకైతవ విశ్వంభరుండిట్లనియె. 255

సీ. ఏ నెవ్వఁడని మీకు నెబ్భంగి వివరింతు
నే నీతి జాతియు లేనివాఁడ
నిది నా ప్రదేశమం చెట్లుఁ జెప్పుదు; సర్వ
ధరణిఁ గుమ్మరెడి ద్రిమ్మరిని నేను
కరమర్థి, కమల సంగతినున్న, కువలయా
నందంబు గూర్చెడి నడత మాది
నే నియమంబునకేని చిక్కక, సర్వ
నియమముల్ నడపించు నేర్పు మాది

గీ. యాశ్రితులఁ బ్రోచునది వ్రతమైన మాకు
నాశ్రయింపఁగఁ దగిన దీ యవనిలేదు
మావిడంబనములలోని మర్మములకు
దెలియ ననువారు, లవమైనఁ దెలియలేరు. 256

ఆ. ఉన్నరూప వలుక నోపిన దెవ్వరు
కల్ల నిజము లెనసి కలుగు జగతి !
నొంటివాఁడ, వచ్చెనువిధ యియ్యాపి వెంట
సౌఖ్యరసపునిట్టు, సదమలాంగి. 257

క. మా యిర్వుర ఖేలనములు
మాయామయములు, జగమ్ము మముఁ బొగడిన, రో
షాయితమతులై, తెగడిన
నీయుద్యల్లీల, నిలువ కెప్పుడు సాఁగున్. 258

మ. అదియట్లుండె, నవద్యదూరులు, శ్రుతివ్యాఖ్యానతత్త్వజ్ఞు, లే
మిది, మీరందరు, కర్మలోపమునకే యీకొన్నయట్లుండె, ని
య్యదనన్, వృద్ధజనోపసేవనము లేదైనట్లు భాసించె, ఖే
ద్రదమే! జన్నము లిట్లొనర్చుట, క్రియాతాత్పర్యలోపంబుగన్. 259

ఆ. శాస్త్రమెఱుఁగకునికి జన్నంబొనర్చుట
కత్తిమఱచి, పోరఁగడఁగినట్లు
క్రొత్త పాపములను నెత్తిపైకెత్తికొ
న్నట్లు గాక, శుభము లందఁగలదె! 260

సీ. ఔదుంబర స్తంభమంతయు శార్దూల
చర్మావృతంబుగా సలిపి, తాకి
యుద్గాన మొనరించుచుంటిరి యిదియౌనె !
శాస్త్ర సమ్మతమా, శ్రీబాలలీలా !

స్తంభంబుదాకి, యుద్గానం బొనర్పంగ
విధిసెప్ప, సర్పంబువేష్టితంబు
సలుపఁగారాదు, మీ సప్తతంతువు దేప
యోగ్యంబు గాదన్న యూహవొడమె.

గీ. నిప్పుడేమంచురీ యజ్ఞమెవరి కొఱకు
తెలుపుఁడనిపల్క, మునులు కొందలము నంది
యితఁడు విటమాత్రుడేయైన నెట్లుఁ దెలియు
శాస్త్ర తత్వంబున్న సంశయము గలిగి. 261

మ. సకలప్రత్యభిధేయ రూపుఁడు, మహాస్వాదివ్యహాసాంకుర
ప్రకరోత్తంభిత భక్తలోకుఁడు, మహః ప్రస్యందికారుణ్య, త
త్యకలంకుండు, నిరామయుం డవిదితవ్యాపారి, దా కైతవాఽ
భికుఁడై వచ్చెనటం చెఱింగిరి మునుల్, విజ్ఞాన సాహ్యంబునన్. 262

క. ఎఱిఁగి మునులు, కరయుగ్మము
కరమర్థిని జేర్చి, పలుకఁగడఁగిరిటుల, నా
సురవనదహనా! వేదో
ద్ధరణా! దాక్షిణ్య ధర్మధామాచరణా! 263

చ. శిశువు లొనర్చు చేతలను, చిందిలి పాటులుగాక, లగ్గులిం
పెసగునె! దొడ్డవారలవి యెచ్చరికింపక మార్గమున్నదె!
ప్రశమిత సర్వదోష భువనావన! పావన! నీదుపాలికిన్
శిశువులగామె మేము! దయసేయుము, సాత్వికభక్త రక్షణా! 264

ఉ. ఏ పరమేష్ఠికుంచె, రచియించును లోకమనూహ్య సుందరం
బా పరమేష్ఠి సర్వనిగమౌఘవిధిజ్ఞుఁడు, నీదుపాల ని
ర్వాసితపాప! తాపృథుకభావమువాఁడట! యెవ్వరింక, దే
వా! పరిపక్వబుద్ధులు! ఖగాంక! జగజ్జనజన్మతారణా! 265

ఉ. చేసితిమన్న తృప్తి కయిసేయుటగాక, జగన్నియంత! మా
చేసిన జన్నమే కొలంది! శీర్షములన్ భవదీయ పాదవి
న్యాస మొనర్చి, యొక్క మృదుహాసము, మాతపమర్థవంతమై
భాసిలగా నొనర్పుము, భవమ్ముల వెన్నెల వాకలుబ్బగన్. 266

వ. అని, వినయవినమితవదనులై ప్రార్థించిన, మహర్షులం గరుణించి, మహ
నీయ మందహాస మాధురీధురీణంబుగా, సదాతనుండైన భగవంతుండు.
వపాహోమకాలం బధిగమించుచున్నది. త్వరపడుండని హెచ్చరించి,
వారు వపనువేల్చి, పుణ్యగంధం బాఘ్రాణించు నాలోనన. 267

సీ. సోమసుత్యామ నాస్తుంకారమగు వపా
ముదితమైనట్టి కెమ్మోమితోడ
శ్రీవత్సలాంఛనాంచిత చారువక్షస్థ
లస్నిగ్ధ పులకజాలములతోడ
కరికరాకార భాస్వర బాహుదండ సం
ధానిత దివ్యాయుధములతోడ
రామణీయకతా పరాకాష్ఠ నందిన
కౌశేయపరిధానకమ్ముతోడ.

గీ. తరుణపాథోరుహాభ పాదములతోడ
జగము లేలెడు నభయహస్తంబుతోడ
ధన్యసద్భక్త గణశివతాతిమూర్తి
శివమనోవర్తి లోచనోత్సవ మొనర్చె. 268

సీ. సనకాది దివిజమస్కరులు భోగించెడు
కైవల్యములు, రూపుకట్టినట్లు
జలధిజాప్రేమ తుందిల మానసములోని
కలలు నిక్కలలుగా నిలిచినట్లు
చతురాస్యగత వికస్వరచతుశ్రుతిమర్మ
ములు, దైవతమ్ముగా వెలసినట్లు
చంద్రసూర్యాది తేజోరాసులన్నియు
సముదితంబుగ మేన నిమిడినట్లు

గీ. ప్రసరదానందమూర్తి, దివ్యానురాగ
సారపూర్తి, సదాతన స్వచ్ఛకీర్తి
కమలనేత్రుఁడు, సర్వజగన్నియంత
మునితపోమహమౌచు దర్శనము నొసఁగె. 269

చ. ఒక పదివేల యర్కులు మహోజ్వలమూర్తులు దోచినట్లుగా
నికటమునందు నిల్చిన ఫణిప్రభుతల్పగుఁగాంచి, భ్రాంతితో
వికలము లైన బుద్ధులును, బిమ్మిటినందిన కన్నులౌచు నూ
రక నిలుచుండిరా మునులు, భద్రదుముందట, బొమ్మలోయనన్. 270

మ. పరమాత్ముండపుడల్ల నవ్వి కరుణావారాశి, రాకాసుధా
కర గౌరాంగము, పాంచజన్యమున దాకన్, మూర్తవేదంబు, త
త్కరుణాసాదిత సంవిదాత్ములయి, ప్రీతిన్ జూచి రాస్వామి, భా
స్వర నేత్రంబులు పానపాత్రములుగాఁ బానంబు గావించుచున్. 271

ఆ. అంతశౌరి, మునుల యాశలుబండ, ల
క్ష్మీ పరిగ్రహమ్ము కేలుసాచి
పరమ పుణ్యమైన వప గ్రహించి, భుజించె
నెడఁద మెచ్చి, చవుల నెన్నికొనుచు. 272

క. హరి విశ్వాత్ముఁడు వప నా
దరమున గ్రహియించి కుడువఁ దనిసె జగమ్ముల్
హరి విశ్వంభరుఁ డగుటను
హరి పూజ, సమస్త పూజయగుట, ధరంబే!. 273

వ. ఇట్లు మహామునుల ననుగ్రహించి, శాశ్వత లక్ష్మీనివాసుండగు శ్రీని వాసుండు, కరకలిత కమల ముకుళయు, నీషదంకురితస్మిత చంద్రికా చంద్రకిత వదనయునయి, మూర్తంబగు కారుణ్యంబు వోలిన జగజ్జనని వెంటరా నిజదివ్యధామంబునకు వేంచేసెనని పల్కి, మఱియు నిట్లనియె. వాచంయములారా ! విష్ణు కథాశ్రవణంబు, విష్ణుపదీజలంబు భంగి,

నాంతరిక బాహ్యమలంబులు దొలంచుట శ్రుతి ప్రసిద్ధంబు; యజ్ఞంబుల జపయజ్ఞంబు పరాత్పరుండని విందుర కాదె! అయ్యజ్ఞ సర్వస్వంబగు సర్వేశ్వర పదయుగానురాగంబు, తత్కథా శ్రవణంబునన సిద్ధించు; వామలూరు తనయ కథితం బై సుధానిర్విశేషంబగు కథాంతరంబు గలదు, వినుండని యిట్లనియె. 274

శా. శ్రీరమ్యంబగు చంద్రవంశమున రాశీభూత పుణ్యంబు, వి
ద్యా రాజీవభవుండు, విష్ణు పదపద్మాఽధీనచేతస్కుఁ డా
రారాజద్గుణశాలి, యొప్పు, జగతీప్రత్యగ్రహారాయిత
స్ఫారోదారయశుండు, శంఖణ మహీపాలుం డలోలుండుగన్. 275

సీ. అతఁడు జైవాతృకుం డతఁడు రేఖాశాలి
ప్రకటతమోఘ్న సత్పథవిహారి
యతఁడు హంసాశ్రయుం డాతండు కవి చక్ర
వరవృద్ధి బొదలు నాచరణ శీలి
యతఁడు కళానిధి యతఁడు సద్ద్విజ రాజు
నక్షాంతసఘనాంబుజాసనుండు
నాతండు వసురాజు, నతఁడు హరివ్యాజ
తేజోఽభిరామ విభ్రాజితుండు

గీ. నతఁడు నిష్కళంకుఁ డతఁడదోషాకరుం
డతఁడు గుణము లందు నన్వయమున
కాదియైన కువలయానందకరుఁ బోలి
యనగుణముల మనసు నదుపు వెట్టి. 276

మ. అతఁడుర్వీన్ దగఁ బోవ గోష్ఠములయందాసీన దేహమ్ములై
సతత ప్రస్నవదూథసమ్ములయి, వత్సవ్రాతరమ్యంబు లై
క్షితిదేవోత్తమ సమ్యగర్పితములై శృంగారథామమ్ము లై
క్రతురూపమ్ములు ధేనువుల్ చెలఁగె వీక్షాలేహ్యలావణ్యముల్. 277

సీ. మనుమార్గుడగు రాజమౌళి, బ్రహ్మోత్తరం
బుగ, ధర్మయుక్తుఁడై నెగడి ధరణి
బాలించుచుండగ వాసవాదులు ధరా
దేవప్రదత్తాజ్య తృప్తమతులు
పరఁగుచు గురిసి, రవ్వరముల జేసి భూ
దేవి, తత్తద్భృతు దీప్యమాన
కమనీయ దేహయై కల భూతసంతతి
జనయిత్రిపోల్కి, రక్షణ మొనర్చె
గీ. వరపుర గ్రామపక్కణావళులయందు
వెండియునుఁ బైడి తడఁబడుచుండె, జనము
లమర, నాబాలగోపాల, మఖిల వస్తు
జాతములు గల్గి, సంతోష జలధిఁదోఁగె. 278

క. ఆజానేయంబులు, వి
భ్రాజత్కరి సంతతులును, రథములు, కనులు
త్తేజిత మొనర్ప, నా కాం
భోజమ్ములు, సకల సౌఖ్యమూలములయ్యెన్. 279

సీ. పదములుగల గార్హపత్యాగ్నులను బోలు
యాయజూకులగు బ్రాహ్మణుల తోడ
మగసిరి తమ మేని మండనమ్ముగఁ బోరఁ
బలిమిజూపెడి వీరవరులతోడ
నిధిపతికిని సంచి మొదలిచ్చి, తీర్తుపొ,
మ్మని సాగనంపు వైశ్యాళితోడ
హలముఖాత్తవిభూతి, నవనినంతయు విల్చు
వైకుంఠ పదపద్మ భవుల తోడ
గీ. నఖిల సౌఖ్య పరాంకోటి నధివసించి
నలువు మెఱసెడు నాకఖండమ్మువోలు
నా రసాప్రజలమరులు గార యేమి!
యక్షు లనిమేషములుగామి యసదెగాక. 280

శా. ఆ రాజ్యమ్మున సంగినాములు మిథ్యామధ్య లూర్జస్వల
స్ఫారోరోజలు, చంద్రవక్త్రి, లళినీ సంఘాత కైశ్యల్, స్ఫుర
త్తారుణ్యల్, జఘనస్థలా రచితనృత్యన్మేఖలల్, కామసం
చారారామము, లార్ద్రసుస్మిత కలాచంచద్వచః పేటికల్. 281

సీ. శాక్తికేయములైన మౌక్తికాభరణంబు
లుండిన, శీలంబు దండి తొడవు
చతురలంకార సంగతియున్న మధుర ల
జ్జామంథరత మెచ్చులోము సొగసు
అన్యవ్రతంబు లెంతయిమున్న, పతిపాద
సౌగంధ్యసేవ. నిచ్చలపువ్రతము
రేతౌలిజామున, బ్రాఁతులన్నియు నున్న
హితమితస్మితమె సౌరత విభూతి
గీ. యా మదద్విపయానల, కా విలోల
కర్ణజాహనేత్రలకు, చక్రాంగ కాంస్య
కలరవ వితీర్ణ పారిహార్యలకు, గౌత
మాంగనాతుల్య రుచి దేహయష్టికలకు. 282

సీ. అనుభవింతురు రేయికాసన్నమైన ప
ల్లవుఁడె దైవంబంచు చవులు మఱపి
కైసేసికొనెద రంగమ్మ కాఁపము పరా
త్పరుడుండు గుడియన్న భావమూని
జీవింత్రు, మనుగడ, శ్రీవాసున కొనర్చు
నర్చనం బన్న నిత్యానుభూతి
అభ్యసించెదరు నాట్యాది విద్యలు రసా
త్ముని బొందనివి యోగమనెడి చెలివి
గీ. బాసఁగృతి సెప్ప, విటుఁడెత్తుపడిన వేద
వీణెవాయింప, తంబూర విడిచిపాడ,
తమకుఁగలదాన, కౌలీనతలు ఘటింప
వలఁతులగు వారలచ్చటి వారసతులు. 283

శా. ఏవంకన్ మణిభర్మ సౌధతతులున్, హేవాకసౌఖ్యంబులున్
దేవాగారము లార్ద్రభాగవతసన్నిష్ఠా పరిస్ఫీతముల్
తావుల్జల్లెడు పూవు దోటలు, లసత్తాంబూలపూగంబులున్
మావుల్, శంఖణభూభృదంసధనురమ్లానప్రదేశంబులన్. 284

గీ. అతఁడు హరి భాగవతుఁడు, శమాదియోగ
రతుఁడు, సత్కర్మనిరతుఁడుర్వర భజించె
నిది యనూచానమగు ధర్మ, మది పరేశు
నాజ్ఞయను భావ, మహరహంబ త్తమిల్లి. 285

సీ. ప్రాతర్ముఖంబుల, పరమేశు భజియించు
నవల దినంపు కార్యములు వినెడు
నాపైని దా నవృష్యముదిను, సద్భక్త
విమలాస్య విష్ణు నివేదితంబు
బారసి పోనీడు, భాగవతాది స
ద్గ్రంథశ్రవణభక్తి దప్పఁద్రోవఁ
డన్య రాజన్యుల కవమతి సేయండు
దనకుఁ జేసిననైనఁ దప్పు దలఁపఁ
గీ. డనుపమ ద్వయమంత్ర చింతానురక్తి
నఖిల జీవులు నారాయణాంశమనుచు
రమ్య సాత్త్విక భక్తి మార్గమ్ము వట్టి
సరసిజాక్షుని దాసుండు శంఖణుండు. 286

సీ. చిత్తంబు హరి పరాయత్తమై శుద్ధాంత
ములతోడ నేకాంతములు భజించు
అంతస్సపత్నుల నణచియు, సక్తుఁడై
నట్లుగా, రాజకార్యములు నడపు
నెప్పుడు లోఁజూపు లెసఁగించి బాహ్యా కాం
క్షలు గల్గినట్లు లోకమ్ముఁజూచు
ధనము దంధనమన్న తలఁపు గల్గియుఁబ్రజా
ధనమన్న బుద్ధి, తత్పరత నెఱపు

గీ. సత్యము, నహింస, ధర్మంబు, చారులగుచుఁ
దనకుఁగైవారములుసేయ, ధవళకీర్తి
నవ్యకర్పూరమై దిగంతములు నిండ
సాత్వికగుణాతపత్రుండు శంఖుండు. 287

ఉ. ఆతని ధర్మపత్ని, పతికన్నివిధంబుల ప్రాపు, రమ్యచం
ద్రాతపసాత్వికాశయ, హృదంతరనిష్ఠితపత్యుపాసనా
ప్రీత సమస్త దైవత, వివేక విధాననిధాన మాత్మభూ
నూతన సృష్టి తాదృశ మనోహరరూప విలాససంపదన్. 288

చ. అతిశయితామరేభ్యుఁడగు నాతనిభూమి నిరీతి బాధలన్
నితతసుఖంబులన్, యజనవిశ్రుత విప్రులతోడ-సర్వస
మ్మతముగనుండ, తద్యశ ముమావరభూషణ, పాకహృత్కరి
ప్రతిమము, నాల్గు దిక్కులకుఁ బంచిన చిక్కని గంధసారముల్. 289

ఉ. ఆ యశముల్ శ్రవోయుగళికామయముల్గలిగింప మధ్యమేం
ద్రాయితుఁడైనవాని వసుధాభరమేలఁగఁ బూని, శత్రుభూ
నాయకు లొక్కపెట్టున ననాగసుపైఁబడి, రౌపనీవిక
స్ఫాయదుదగ్రఖడ్గులు, విసారి చమూచలితార్ణవంబుగన్. 290

క. వారల దుస్సాహసములఁ
బ్రేరితుఁడై శంఖుండు విధి కృతమని, శ్రీ
నారాయణ పదయుగళీ
పారాయణుఁ డెదురు నడచె బవరంబునకున్. 291

మ. అమితౌద్ధత్య పరీత వీరవర సాహంకార హుంకారసం
తతి సంఛిన్నదిశావకాశమయి, ప్రోద్దామేభరాట్ప్రావృషే
ణ్యతటి త్వన్మదపంకిలంబయి, సముద్యద్వాజిహేషాస్వనా
తతమై, పోరు చెలంగె, భూతహృదయోత్కంపాధికాతంకమై. 292

సీ. నొగ నొగతోఁ దాకి నెగడివెట్టెడునట్లు
మంటలు రేగ, దుర్మానవృత్తి
వీర ప్రాణాభీలవిక్రుతాక్షులాకృష్ట
ధనువులు, శ్రవణావతంసములుగ,
పగవాని యేయు దివ్యశరంబులకుఁ బ్రతి
యేయుచు కాయముల్గాయములకు
నాకరంబులుగాఁగ వీఁకఁబోరెడు వీక
ధారుణీశ్వరుల క్రుధాప్రహాస
గీ. ములకు, దెసలు బీటలు వాఱ, కలనినేల
గైరికా తామ్రములు రక్త ధారలుగ్గ
డువుగఁ బాఱఁగ, వేతాళ వికటనృత్య
జాలమై, క్రమభయద కంకాళ మయ్యె. 293

వ. ఇట్టి భయంకర సమరంబున దానును, దన సామంత పరివారంబులును, ప్రతిపరాజన్య పరాస్త విభవులైన, శంఖణ ధరామండలాఖండలుండు:

సీ. అతివేల సౌశీల్య మాభరణంబుగాఁ
దనతోడిదే లోకమనెడుదాని
నాభిజాత్యమ్మున కనురూపమగు, రూప
విభవాతిశయమున వెలయు దాని
కష్టమ్ము సుఖమును కావడి కుండలం
చను తెల్వి, తన నీడయైన దాని
చారు పతివ్రతాచార సంగతిఁ జేసి
యమరుల కతి ప్రియంబైన దాని
ఆ. తనకు నూర్పు వంటి దాని, నుత్పలకర్ణ
పట్టమహిషి, ఫుల్ల పద్మగంధి
తోడు దీసికొని, యధోక్షజనామ పా
రాయణంబె దివ్యరక్ష యగుచు; 295

చ. జన పదముల్దొలంగి, మురశాసను భక్తుఁడు, శంఖణుండు, దా
నసుపద వన్య జంతు భయదారవ ఘూర్ణితముల్ చిరంతన
ద్రుమనివహ చిక్కణంబులు. ఘరువ్రజ కారణ కాంతవాః కణ
ప్రణిహిత దుర్దినంబులు, నరణ్యము లాశ్రయమై చరింపఁగన్. 296

మ. గమి కర్మీ కృత కాననుండయిన, యా కంజాక్ష భక్తి స్పృహా
శమితక్షుల్లక లౌల్యు, శాంతగుణభాస్వద్రూపు, చంద్రాన్వయో
త్తము రక్షించె రమాధవుండు, కరుణాధామంబు, శశ్వత్పరో
క్షముగా-నమ్మిన వారి కేల్వదలునే కంజాక్షుఁడెప్పట్టునన్. 297

వ. ఇట్లు హరి కరుణాపార దుగ్ధకూపార ముహుర్ముహురవగాహ విస్మృత
విపత్పరంపరుఁడైన శంఖణుండు, బాహ్యాబాహ్య మలంబులన్దొలం
చు నారాయణ నామానుసంధానంబు దనకు సర్వ రక్షగా నడచుచు: 298

సీ. ధరణి రాజ్యంబుతో ధనములు శత్రు భూ
పాల వశంబులై, ప్రాభవంబు
దొరఁగియు, హరిభక్తి దొలఁగనిదాస ను
దారదీప్తులను, భూతముల నెడల
ననుపమ ప్రీతివర్ధనుఁడైన యారాజు
వనదేవతలు గారవమునఁ జూడ
నాదిగర్భేశ్వరియైనట్టి ప్రియపత్ని
ననుపద మాదరమ్మున విలోక

గీ. నమ్మొనర్చుచు, నలసిన నగనికాయ
శీతలచ్ఛాయ విశ్రమించియు, రసాక
రమ్ములగు భాషణములఁ దాపమ్ము దొలఁచి
యును మనమ్మున కాహ్లాదమును ఘటించె. 299

క. ఆకలి దప్పుల నికటా
నోకహ ఫలసంతతుల, మనోహర శతప
త్రాకర సరసీజలములఁ
జోకార్చుచు వారు, ముందుఁ బోవన్ బోవన్. 300

చ. అతుల గుహావిహార త్రిదశాబ్జము బీకర కంకణస్వన
వ్యతికరవల్లకీ నినదవాసిత కందరమై, మహర్షి సం
హతి నియమాభిరామ విమలాశ్రమ మండన తుంగశృంగ సం
గతమగు వింధ్య భూధరము కన్నుల పండువు సేసె ముందటన్. 301

క. ఆ వింధ్య ధరాధరమును
సేవించి శివాత్మకముగ, సిద్ధులు హర్ష
శ్రీవికసిత వదనమ్ముల
దీవెనలిడఁ దలలు వంచి, తృప్తిగఁ గొనుచున్. 302

క. ఇది దక్షిణాపథంబున
కిది పూర్వాబ్ధికిని త్రోవ, యిది కోసల కం
చుదితములగు శబర సతీ
మృదు భాషలు, దమకు గమన వృత్తిని దెలుపన్. 303

శా. ఆ రాజన్యుఁడు దక్షిణాపథపు త్రోవై పోవఁగా, వింధ్య కాం
తారాకల్పము దోచెఁ గట్టెదుట నేత్ర ప్రేయమై, యచ్ఛవాః
పూరంబై, ఖగబృంద రమ్య రవముల్ బొల్పార, మాహేశ్వరా
చార ప్రాణము, నర్మదాతటిని, వాచాలోర్మి సాహస్రమై. 304

గీ. ఆ నదిని గ్రుంకి, దేవేరి యనుసరింప
శంభునకుఁ బూజలొనరించె శంఖణుండు
పరమ మాహేశ్వరాచార పద్ధతులను
హరిహరుల కేకతా సిద్ధి నాత్మనెంచి. 305

మధ్యాక్కర. హరినామ సుధ గ్రోలి నిరత మానందమాచిన యెడఁద
మఱచెను, దన యాపదలను మదిలోన మానవేంద్రుండు
మఱుపలేదయ్యెఁ దన్ననిశమత్యంత మహితానురాగ
పరవశతను గొల్చినట్టి ప్రజలను. బహుతరాఽఽర్దితుల. 306

సీ. తరతరంబులు గాగ నరివెట్టి, తమ వంశ
మున యందు, ననురాగమును ఘటించి
కార్య ఖడ్గములందుఁ గల వారలై, గొల్చి
నట్టి కాంభోజ దేశైకమతుల
నిజభుజాపోషిత ప్రజల, ద్వేషన్నృప
సేవాఽతి కృచ్ఛ్రి జిజీవిషులుగ
వితతదారిద్ర్యాస్తమితహర్షులుగఁజేసె
మాయవిధాత, యింకేయుపాయ

గీ. మునను రక్షింపఁ గలనని మనుజపతి, క
దుష్టధారాత్ముఁడైన నత్తోయజాక్షి
యతని నూరార్పఁబోయి, యత్యంతవివశ
భావయై, దాను నేడ్చు నప్పుజలఁదలఁచి. 307

వ. ఇవ్విధంబున ధర్మ శరీరులైన యాదంపతులు, హృదయాంతరాళ నిక్షిప్త దావదహనంబు నార్పుచున్న కారునుంబోలె, నిరంతర బాష్ప ధారాస్నపితవక్షస్కులగుచు, ననోకహంబుల క్రిందల నిద్రించుచు, నడవి దుంపల భుజించుచు, ననునిమేషంబు వికృతంబులగు మృత్యు వక్త్రింబులునోఁని భయంకరసత్వంబులసేఁగి నారాయణ స్మరణంబున నివర్తించికొనుచు, ధరాసుందరీ హీర రశనాదామంబగు నాంధ్రదేశంబు దరియం జొచ్చిన— 308

మ. పవమాన ప్లవమానవీచికృతశైవస్రోత్ర గోదావరీ
స్రవదర్ణః పరిపూత సస్యములు నేత్రప్రీతి గల్పించె, త
త్సవిధామ్రద్రుమ ధృష్ట కోకిల గళత్పంచేషు గీతంబులన్
నవనిష్యంది మధుద్రవాకుల నళిన్యాపూర్ణకూలంబులన్. 309

ఆ. వానిఁ జూచికొనుచు, వనరుహేక్షణపాద
భక్తులైన ఋషులవలనఁజేసి
హృదయతాపభరము ప్రిదులగా, శంఖుఖుం
డడవి తెరువులందు నడచి నడచి. 310

క. కుంతల ధరణీ కదళీ
కాంతారముబందుఁబోవగా, వరపంపా
కాంతజటారగ్వధసే
కాంతరపవనములు దోచె నభినవములుగన్. 311

సీ. అట, తుంగభద్రలో నవగాహన మొనర్చి
విధుఖండశేఖరు, విశ్వజనకు
కంతుహవ్యాద్వ్యఘనకుండనిటలాక్షు
సకల దైవతశిరో మకుటఘటిత
రత్న నీరాజిత రమణీయ పదతట
వేదాంత రాహస్యవిత్తవిశదు
దాక్షాయణీ చిరంతన గృహమేధి, దు
ష్కర్మ పంకవ్రాతకతకఫలము

గీ. లలిత పంపాసతీదృగంచలనిపీత
చారుమూర్తిని సేవించె శంఖణుండు
రిపు మహీపాలకైతవావృతుఁడు, కుంచుఁ
డింతకున్యాయవలెనన్నచింతద్రట్టి. 312

మ. అవనీంద్రుండటనుండి పశ్చిమముత్రోవై, సుందరీలాలితా
ప్లవమానంబులు వాయువుల్ గొలిచిరా, పాపచ్యమాణాఘుఁడై
శ్రవణప్రాహుణికీ కృతాంచితగుణున్, జాయార్ధదేహున్, జటా
గ్రవసచ్చంద్ర సుధాకరంచితుని, గోకర్ణేశు దర్శించుచున్. 313

క. అటఁగదలి, పశ్చిమార్ణవ
తటములఁ బయనించుచును, సదాతనములు, సం
కట విఘటన చిరశుభసం
పుటములు, హరిహర నివాసములు గనుగొంచున్. 314

గీ. శంఖుఁడండేగుదెంచె, విశ్వ ప్రసిద్ధ
రామచంద్రుని కీర్తి మార్గమ్మువోలి
చిత్తమోహకమగు రామసేతువునకు
నర్ణవాధీశ చారుసీమంతమునకు. 315

క. తానమొనర్చెను ధరణిపు
డేనోహరమైన వార్ధి, నిమ్మల సీతా
జాని హృదంతర సౌధా
సీనుండై, వెలఁది నగవు చిత్తడి గురియన్. 316

వ. ఇట్లు సహభార్యుండుగఁ దానంబు నిర్వర్తించి, తత్థ్సలాధీశ్వరుండైన, పంచాక్షరీ పరదైవతంబు, పంక్తిరథ తనయ కరకిసలయాఽఽపచాయితు, త్రిపుర వనదావదహను, దాక్షాయణీకమను, నుక్షధ్వజు, వశక్ష దేహు, నేత్రకటాహనిరస్త కందర్పదర్పు, సకల విబుధోపసర్పు, వాసుకాంగదు, వలయు తెఱంగున నభినుతించి, కతిపయ ప్రయాణంబుల శ్రీరంగ దివ్యదేశంబున కరుగుదెంచిన.. 317

మ. అరవిందోపమసుందరాక్షము, కటాక్షా కల్పకారుణ్యా, మం
కురితార్ద్రస్మిత గండమండలము, రక్షోనాథదోశ్శక్తిఘ
స్మర కృత్తాంసము, చారునాసికము, భాస్వద్రంగనాథాఖ్య మ
చ్చెరువై దోచిన దొక్కవెల్గు. సుజనక్షేమంకరాకారమై. 318

శా. ఆ మూర్తిన్ దరిసించి, చిత్తమునయందానందముత్తాలమై
భూమీశుం డపుడోన్నమో భగవతే, పుణ్యద్రుమాయాసుర
స్వామి ప్రక్రమ నిగ్రహాయ, కృపణ వ్రాతాఽవనానంత దీ
క్షామంజూషిత విగ్రహాయ యనుచున్ గావించె సాష్టాంగమున్. 319

గీ. ఇట్లు సాష్టాంగ పడి, మేన నిరవుకొనిన
పులకజాలమ్ము తోడుత, మూలమంత్ర
మునన, మానసికమ్ములు మొగిని దీర్చి
యర్చనమ్ములు తోమాలు నఱుత వేసి. 320

ఆ. కన్నులందు నోడికలుగట్టి దిగఁజాఱు
బాష్పవారి విష్ణు పదములంట
జాయతోడఁగూడ శరణాగతుండైన
శంఖణుండు పలికె స్వామి గుఱిచి. 321

వ. భగవంతుండైన నారాయణున కభిమతంబులు, ననురూపంబులు, ననవధికాతిశయంబులను స్వరూపరూపగుణ విభవైశ్వర్య శీలాద్యసంఖ్యేయ కల్యాణ గుణ గణాంచితయు, భగవన్నిత్యానపాయినియు, నిరవద్యయు, నిఖిల జగన్మాతయు, ననన్యశరణ్యాయు, నస్మన్మాతయు, నంబుజవనాలయయునగు శ్రీదేవికిఁ కల్ప సాహస్ర పర్యంతంబునగు నమస్కారంబు; ఆదేవికి మేము శరణాగతులమయ్యెదము. పారమార్థికభగవచ్చరణారవింద యుగళైకాంతి కాత్యంతిక, పరభక్తి పరజ్ఞాన పరమ భక్తి కృత పరిపూర్ణాఽనవరత నిత్య విశదతమానన్య ప్రయోజన అనవధికాఽతిశయాతి ప్రీతి భగవదనుభవజనితాఽనవధికాఽతిశయ ప్రీతి కారితాఽశేషాఽవస్థోచితాఽశేషశేషతైకరతిరూప నిత్యకైంకర్య ప్రాప్త్యపేక్షంజేసి, పారమార్థికంబగు భగవచ్చరణారవిందశరణాగతి, యథావస్థితంబుగ, నవిరతంబుగనుండ నన్నుగ్రహింపవలయు; వికసితాతపత్రాయిత శేష ఫణిఫణామండలి ప్రత్నరత్న దీపారాధిత! రంగనాథా! నీ కనంత కోటికల్ప పర్యంతంబు సాష్టాంగంబు; నిఖిల హేయప్రత్యనీక కల్యాణైకతార! స్వేతర సమస్తవస్తువిలక్షణంబులగు జ్ఞానానందంబులే నీస్వరూపంబు; స్వాభిమతానురూపైక రూపాచింత్య దివ్యాద్భుతనిత్య నిరవద్యనిరతిశయౌజ్జ్వల్య సౌందర్య సౌగంధ్యసౌకుమార్యలావణ్య యౌవనాద్యనంత గుణనిధిదివ్యరూప, భవదీయంబగు రూపంబు, మన్నేత్రంబుల హృదయంబున నిరంతరంబధివసింపఁగటాక్షింపుము. స్వాభావికాఽనవధికాఽతిశయజ్ఞాన బలైశ్వర్య వీర్య శక్తి తేజస్సౌశీల్య వాత్సల్యమార్దవార్జవ సౌహార్ద సౌమ్యకారుణ్య మాధుర్య గాంభీర్యౌదార్యచాతుర్య స్థైర్య ధైర్య శౌర్య పరాక్రమ! సత్యకామ! సత్య సంకల్ప! కృతిత్వ కృతజ్ఞతాద్యసంఖ్యేయ కల్యాణగుణగుణౌఘమహార్ణవ, స్వోచితవివిధ విచిత్రానంతాశ్చర్యనిత్యనిరవద్యనిరతిశయ సుగంధ, నిరతిశయ సుఖస్పర్శ, నిరతిశయౌజ్జ్వల్యకిరీట మకుట

చూడావతంస మకరకుండలగ్రైవేయక హారకేయూర కటక శ్రీవత్స కౌస్తుభ ముక్తాదాముదరబంధన పీతాంబర కాంచీగుణ నూపురాద్యపరిమిత దివ్యభూషణ, స్వానురూపాచింత్యశక్తి శంఖ చక్రగదాశార్ఙ్గాద్యసంఖ్యేయ నిత్యనిరవద్య నిరతిశయ కల్యాణదివ్యాయుధ! స్వాభిమత నిత్యనిరవద్యానురూప స్వరూపరూపగుణ విభవైశ్వర్య శీలాద్యనవధికాతిశయాసంఖ్యేయ కల్యాణ గుణగణ శ్రీవల్లభ! ఏవం భూత భూమినీళానాయక! స్వచ్ఛందానువృత్తి స్వరూప స్థితి ప్రవృత్తిభేదాశేషశేషత్రైకరతిరూప! నిత్యనిరవద్యనిరతిశయజ్ఞాన క్రియైశ్వర్యాద్యనంత కల్యాణ గుణగణ, పరమయోగిమాఙ్మనసాపరిచ్ఛేద్యంబులగు నీ స్వరూప స్వభావంబులనంతంబులు. స్వాభిమతంబులు, వివిధ విచిత్రానంతంబులగు భోగ్యభోగోపకరణ భోగ స్థానంబుల సమృద్ధంబును, అనంతాశ్చర్యానంత మహావిభవ, అనంత పరిమాణ నిత్యనిరవద్య నిరతిశయంబగు వైకుంఠంబు నీ నివాసంబు; స్వసంకల్పానువిధాయి స్వరూప స్థితి ప్రవృత్తి విశేషాస్వధైరస్వభావ ప్రకృతి పురుష కాలాత్మక వివిధ విచిత్రానంత భోగ్య, భోక్తృవర్గ, భోగోప కరణ భోగ స్థానరూప! నిఖిల జగదుదయ విభవలయంబులు నీ నిత్యలీలా విశేషంబులు. సత్య సంకల్ప; పరబ్రహ్మభూత! ప్రణతార్తిహర! పురుషోత్తమ! శ్రీమన్నారాయణ! మహా విభూతివగు నీకు సప్రశ్రయ ప్రణామంబు. అపార కారుణ్య సౌశీల్యవాత్సల్యౌదార్యైశ్వర్య సౌందర్య మహార్ణవ, అనాలోచిత విశేషాశేషలోక శరణ్య! అనవరతవిదితనిఖిల భూతజాల యాథాత్మ్య, అశేషచరాచరనియమననిరత, అశేషచిదచిద్వస్తుశేషభూత! నిఖిల జగదాధార! అఖిలస్వామియు, నస్మత్స్వామియు, సకలేతర విలక్షణుండును, అశరణ శరణ్యుండును నగు నిన్ను సన్న్యాసిస్త్రీ ప్రతిని పర్ణగవిభు పన్నగాశన, ప్రముఖనానా విధానంత పరిజన పరిచారికా పరిచరితంబులగు నీ చరణయుగళంబులు శరణంబు గా నేను నమ్మియుందును. 322

24)

సీ. తలిదండ్రులను, బంధుతతి, సుతులను, దార
లను గురువుల మిత్రగణము వదలి
విడువంగ రానట్టి వివిధ ధనంబులు,
ధాన్యము ల్వదలి, రత్నములు వదలి
యిమ్ములు వదలి, క్షేత్రమ్ములు వదలి, సా
క్షరములు, సకలేష్ట కామములను
వదలి, ధర్మమ్ములు వదలి నీలోకవి
క్రాంతమ్ములగు పాదకమల యుగము
గీ. నాశ్రయించితి దేవ! దివ్యానుభావ
నిత్య! నిరవద్య! సద్భక్త నికరవేద్య!
మిత్ర విధునేత్ర! సతత లక్ష్మీ నికళత్ర!
రమ్యగుణ ధామనామ! శ్రీరంగధామ! 323

సీ. నీవె నా జనయిత్రి, నీవె నా జనకుండ
నీవె బాంధవుఁడవు, నీవె సఖుఁడ
వాద్యంత రహిత! విద్యా ద్రవిణమ్ములు
నీవ, నా సర్వమ్ము నీవె దేవ!
యీ చరాచర మైన యెల్ల విశ్వమునకు
జనికర్త వీవ, నిస్వార్థ భావ!
నిరవద్యుఁడగు నిన్ను, నిఖిలమ్మునకు గురుం
డందురు, సంవిదాకారమతులు
గీ. స్వామి! నీకు సుముండైన వాఁడె, లేడ
టన్నచో, నిక నరయ నభ్యధికుఁడెవఁడు?
ప్రతి యెఱుంగని నీదు ప్రభావమునకు
ప్రణుతి, సంసారపోత! శ్రీరంగనాథ! 324

సీ. సర్వ శరణ్య! తచ్ఛాష్టాంగధూళీ ప
రాధూత మలిన సంహనన మగుచు
నీశుండ వాద్యుండ వింద్రి యాధిష్ఠాత
వైన నిన్నర్థింతు ననవరతము

తండ్రి గారవుసుతు, దయతోడ మన్నించి
బోధించునట్లు హృత్పూర్వకముగ
ప్రాణ మిత్రుఁడు నీతి పలికి వాదించి యై
నను, దెర్వుసూపెడు ననువుదోప

గీ. ప్రియుఁడు జవరాలి గరిమఁ జుంబించి, హితము
సెప్పు వితమున, నాలోన తప్పుదిద్ది
యేలికొనవోయి! సైంధవీకృత పతంగ!
పరమ కరుణా తరంగితా పాంగ! రంగ! 325

వ. సనక సనందనాది సద్భక్త సమ్మోద బాష్ప ధారాధౌత చరణయుగళ! అర్చావతార! ఆద్యంత రహిత! మనో వాక్కాయంబుల ననాది కాల ప్రవర్తంబులైన యనంతాకృత్య కరణంబులను, భగవదపచార, భాగవతాపచార రూప నానా విధానంతాపచారంబుల నారబ్ధంబుల, ననారబ్ధంబుల, కృతంబుల, క్రియా మాణంబుల, కరిష్యమాణంబుల నశేషంబుగ క్షమింపుము. మదీయానాది కర్మ ప్రవాహ ప్రవృత్తంబైన భగవత్స్వరూప తిరోధానం బొనర్చు విపరీత జ్ఞానంబును, విషయంబుల భోగ్య బుద్ధి గలిగించి, దేహేంద్రియ రూపంబున భోగ్యంబై, సూక్ష్మరూపంబున నన్నాశ్రయించి, యొకప్పుడు న్దొలఁగని దైవియు, గుణమయియు నగు మాయను దొలంగించి, 'దాస భూతశ్శరణాగతో ఽస్మి' 'తవాఽస్మి దాస' యని మొఱలిడు నన్నుద్ధరింపఁ జేయుము. అనితరానంద! యనేక జన్మంబులు ధరియించి, కర్మ మార్గంబు నిస్తరించి, సర్వంబు వాసుదేవ మయంబన్న భావంబు గలిగి, మహాత్ములైన జ్ఞానులు, భవదీయ దయావశంబున నిన్నుబొందెదరు; వారునిత్యయుక్తులు; ఏకభక్తి విశిష్టులు; భవదత్యంత ప్రియులు; భవదాత్మ స్వరూపులు; అనుత్తమంబగు గతి వారికిఁ గర బదరంబు. జ్ఞానిగా నన్నాశీర్వదింపుము. పరభక్తి, పరజ్ఞాన, పరమభక్త్యైక స్వభావు నొనర్పుము. ఏ నీకు నిత్యకింకరుండ నగుదును గాక! నిరంజనా! ధర్మరంజనా! దేవా! నమస్తే, నమస్తే, నమః! 326

మ. అని శ్రీరంగని సంస్తుతించి వినతుండై యాజ్ఞ సేకొంచు, శం
ఖణ భూజాని, మమద్వ్రృథా సలిల భంగవ్రాత సంగీతముల్
వినుచున్, ముందునకేగె, కానల బడిన్, విద్యావివేకాశ్రయుల్
మును లంతంతల, దీవెనల్ గురిసి, సమ్మోదమ్ము జేకూర్పఁగన్. 327

సీ. శబర కాంతా తనూచ్ఛవిఁబోలు, నీలకం
ఠములు, నట్టువలాడు దారులందు
శంఖ కీటములు, విశ్రాంతి గైకొనుచున్న
నిడిదమ్మి చెఱువుల తెరువులందు
కైవర్త కాంతలు, కవుచుడుల్లగ ముత్తె
ముల నారఁ బరచిన నెలవులందు
మలయజ కాష్ఠము ల్మండించి, నంజుళ్ళు
వండు చెంచెతలుండు పథములందు

గీ. ద్రావిడీ స్తన సోదర క్రముక, లాంగ
లీనశంబులనైనను భావమందు
మధు మథను లేశ మేనియు మఱువ కవని
నాయకుఁడు, జాగరూకుడై నడచి నడచి 328

గీ. కాళహస్తీశ్వరుని పాద కమలములకు
శిరము వంచి, నమస్కరించెను నృపుండు
సర్వలోక గురుండైన శంకరుండు
వైష్ణవాఽధ్వమ్ములకుఁ దొలివాఁడు గాఁడె! 329

క. హరమౌళి హీర మగు, సుర
సరిత్తునకుఁ గడకుగాని సకల గుణశ్రీ
పరివృత సువర్ణముఖరీ
తరంగిణీ కూలు భూమి దాను దిరుఁగుచున్. 330

సీ. అపవాద వశమున నిపతితంబగు కీర్తి
కైవడి, రాజభోగములు లేని
దాని, నాఁటి ప్రియదర్శన మయ్యును
ప్రకృతి సిద్ధము గుణావళినిఁ జేసి
రమణీయమగు దాని, రమణీలలామంబు
తన యూర్పు నెత్తమ్మి తావిగంధ
వహునకు సార్థకత్వము ఘటించెడు దాని
వనజాక్షి, నల్లన బలుకరించి

గీ. ప్రజల దుఃఖము లెడఁదఁ బారాడఁ బొలఁతి
కురువుపైఁ దలనుంచి, శ్రీహరి పదబ్జ
భృశమరందము లాత్మలోన నసలు సల
కన్ను గూర్కె, భూమండలాఖండలుండు. 331

గీ. అర్క పుత్రుని తీవ్ర రుషాగ్ని గ్రాగి
వనటఁ గ్రుంగిన యట్టి భూవరుని బ్రదుకు
తప్త హాటక మట్టులితోఁ అధికములు
దార కాంతులతో భూతతతినిఁ దనిపె. 332

సీ. రాజీవ మృదు వివర్తన రమ్యవీక్ష. కాం
చన విడంబిత రోచమాన కంఠ
చక్ర వల్గూరోజ, శత పత్రనాళ భు
జాతి లాలిత్య, కల్హార గంధి
సరస సైకత సార జఘన, సారస బృంద
కలకల స్వాన నిక్వణితరశన
భృంగ కదంబకా రేచితాపాంగ, భా
స్వర దర్శనీయ ప్రవాళ రదన

గీ. హంస హంసక, మృదు తరంగాంతరీయ
యబ్జినీ నమ్ర సఖి, పావనాఽభిజాత్యై
యైందవాన్వయుపై దయ యవఘళించి
స్వప్నమున నిల్చెనంత సువర్ణ ముఖరి. 333

ఆ. ఇట్లు దరిసెనంబు నెలమినిఁ గరుణించి
నాథు సతికి దీవెనలు ఘటించి
పలికె జగము తల్లి, వలమాన మీన కాం
తాఽల కాంత లోచనాంత, లలిత. 334

ఉ. ఓయి సుధాకరాన్వయ! మహోన్నత విష్ణు పదాబ్జ భక్తి భా
గ్యాయిత మూర్తి! యర్కజుని కట్టడి కోపము చిల్లగింజయై
నీయసమాన జీవనము నిర్మలముం బొనరించె, నింక భో
నాయతి గాచికొన్నది, నయాఽవన చక్రి కటాక్ష హృద్యమై! 335

వ. తమకుఁ దామ బండించుకొన్న కర్మ ఫలంబులు, కాలాంతరంబున గట్టికుడుపున్గాని, భగవన్నారాయణు నంశభూతంబులగు గ్రహంబులకు రాగ ద్వేషాదులెక్కడి యవి? ఆ దుష్ట కాలంబును చేరువ చేరువలు గడచె, నింక నదీ జలంబున దాన మొనర్చి శుద్ధుండవై పరిమితాఽహంకార భాసురుండును, రుద్రాత్మకుండు నగు శని స్తోత్రంబు గావింపుము. 336

సీ. ఇట నుత్తరంబున నెసగు క్రోశము నందు
వేంకటాచల మన్న విశదరూఢి
పర్వతాగ్రియ మభ్రంలేహ శిఖరంబు
కష్టశ్రితుల పాలి కల్పతరువు
దారిద్ర్య దళన చింతామణి, పన్నగ
ప్రభుఁడు సేకొన్న యర్చావతరము
అది తపంబుల మూల, మది యజ్ఞ పారమ్య
మది, సాధువైష్ణవాఽభ్యర్హితంబు

గీ. అది వికుంఠమ్ము, భార్గవీ మృదు పదాబ్జ
లలిత లాక్షారుణిత వనీతలము, విష్ణు
విప్రయోగాఽనభిజ్ఞ సాధ్వీమ తల్లి
తులసి, కయి సేసికొని వేడ్క వెలయు నెలవు. 337

సీ. అనధిగతాఽనచిత్యవకాశ చతురాస్య
దూర కల్పిత నమస్కారుఁ డగుచు
ద్వయ మంత్ర చింతనాదర సనాతన సనం
దన ముఖ వేష్టిత ద్వారుఁ డగుచు
విప్రకృష్టస్థిత విబుధ నితంబినీ
పరవశాపాంగ నేపథ్యుఁ డగుచు
దేవ కర్మంది వీణా వరకీర్తి గా
నామృత ధౌత దివ్యాంఘ్రి యగుచు

గీ. నెల్ల భక్తుల యందు నిర్హేతుకముగఁ
బొడము దయ, రెండు కన్నులఁ బొలప మొసఁగ
శ్రీనివాసుండు, జగదేక సేవ్యమూర్తి
వెలయు చున్నాఁడు, వేదాంత నిలయపదుఁడు. 338

వ. స్వామి పుష్కరిణి యను పేర నచటఁ గమలాకరం బొండు గలదు. దానికి బశ్చిమంబున మహా వాల్మీకి భూధరంబయ్యెడఁ గుటి నొండు నిర్మించికొని, త్రిసంధ్యంబు స్నానశుద్ధుండవై, మాసషట్కంబు వేంకటేశ్వరు నారాధించిన, రాజ్యప్రాప్తియుఁ గైవల్య రాజ్యాధిపత్యం బును సిద్ధించుఁ బొమ్మనిన శంఖణుండు నిదుర దొఱంగి, సువర్ణ ముఖరీ పవిత్ర జలంబులఁ దోఁగి, కృతాచమనుండై, పిప్పలాదకృతమైన శనిస్తోత్రంబు ననుసంధించికొని, తదనంతరంబ, సర్వపీడా ఖనిత్రం బును, దశరథ కృతంబును నగు స్తోత్రమార్గంబున నిట్లు నుతియించె-

దండకము: నమ స్సూర్య పుత్రాయ, విజ్ఞాన సూత్రాయ, విజ్ఞాన దాత్రీ, మహాకాల కాలాగ్ని రూపాయ, కాలాంతకాయ, స్ఫురచ్చక్ర నీల ప్రభా గుచ్ఛ సచ్ఛాయ కాయత్విషే, ఘోరనేత్ర ద్వయ ప్రజ్వల త్కీలికీలా సమాలీఢలోకాయ, కాకౌనవాహాయ, దంష్ట్రాద్వయ ధ్వస్త రాత్రిం చరాఽనీక దర్పాయ, కర్పూర ధూళీ సదృగ్భూతి రుద్రాక్షమాలా పరి ష్వంగ దేహాయ, నిత్యక్షుధాపూర్ణ తుండాయ, నిత్యాత్మనే, సర్వభక్షాయ, నిర్ద్వంద్వ చిత్తాయ, నిర్భిద్ర నిర్వేల సాంసారికానంద హాలా మదోన్మత్త మానుష్య నేత్రాంజనాయ, క్రుధాశాలినే, వానరాకార వక్త్రాయ, యోగా

త్మనే, కాశ్యపాయ, జ్వలన్మూర్తయే, భోగ దూరాయ, పారాఽతిగ జ్ఞాన సారాయ, భవ్యాయ, దివ్యాయ, ఛాయా సతీసూనవే, నూన సేతుభ్యు మార్చాదికం కుర్మహే, మాలఖాదిన్; నమస్తే, నమస్తే, నమః! 340

ఉ. అంతట భూమిజాని కటకాంచిత కుంద చారు చామరా
క్రాంత సమర్పితార్ఘము, విశాల లతాఽఽవ సధస్వరంగనా
కాంత కరాంతరాదృత వికాసి విపంచి మణీ పణాయిలో
దంతము- కొల్వు సేసికొనె తాపస సాలము శేషశైలమున్. 341

గీ. దూరమున నుండి మ్రొక్కి మేదురపు భక్తి
దండ శూకేశు నర్చాఽవతారమునకు
తన మహా పాపఫలము తత్తఱము జెంది
మాయునిక నంచు నృపుఁడు సమ్మదము జెంది. 342

వ. ఇవ్విధంబున మహామునీంద్ర కుపిత కుటి లాక్ష పదాదూత సుర రాజ్య విభవుండగు నముచి సూదను కైవడి, నర్కజ దుర్దశావిద్రావిత విపుల విపులాఽనుభవుండగు శంఖణుండు నారాయణ చరణ స్మరణామృతంబున జీవించువాఁడు, నభస్సంబాధ కృత్ఫణా కుండలంబులు విస్తరించికొని యాత్రామ గైరిక ధాతునేత్రంబుల, కటక చరదానీల వారి వాహ్రనజీయ ఘృష్టినికర ఫూత్కార రుచిరించోళికల, భయంకరుండయ్యు, భక్తులకు బ్రసన్నుండగు ననంతు, నఖిలలోక శరణ్యు నాశ్రయించి, 'యేను నీవాఁడ' నని వినయంబున నమస్కరించి, యారోహణంబొనర్చి, వనదేవతా నిశ్వాస నిబిడంబులగుట న్బలె, పరమ సుగంధిలమ్ములగుచు, తచ్చరణాలక్తకరస రంజితంబులగుట న్బలె, కిసాల విసరంబుల నలరించు కానలబడి, మృగరాజ నఖముఖోజ్ఝిత ముక్తాదంతురిత మార్గంబుల నడచుచు, సంఫుల్ల కువలయ శ్యామాయమాన పక్షయుగళ చక్రమిథున చక్రంబులను, శబర సీమంతినీ సమర్పిత పిష్టాతకధవళిత తరంగంబులను, కలహంస కామినీ కంఠ క్రేంకారంబులను, మనంబు సొగయించుచు, వనదేవతా తలా ముకురంబులనొప్పుని కమలాకరంబులు గనుంగొనుచు, బొందు తోమాలల విధంబున నేల జీరాడు

గెలలతోడి, శుకహరితంబులగు కదళీవనంబులు, మధుగంధులగు నేలాచ
యంబులు, పథికజన పరికల్పితంబులగు లవంగ కిసల సంస్తరంబులు,
కరికలభ కరదళిత తమాలంబులు గని, ముదం బందుచు నెడ నెడ
వైకుంఠ పదానురక్త చిత్తులతోడి సల్లాపంబులం జేసి, యధ్వశ్రమం
బపనయించికొనుచు, రసిక భక్త గానామృత సంవర్ధిత తులసీ వనం
బులు, భగవదుద్దిష్ట మల్లికా మతల్లికా మరువక మాలతీ మందార సుంద
రంబులగు నారామంబులు వీక్షించుచు, జలద సుందరీ లలిత నర్మాలాప
సుఖితంబులగు తుంగ శృంగంబుల నధిరోహించి. 343

మ. దరిసించెన్ ధరణీ విభుండు కరిదంతచ్ఛిన్న తుంగోర్మి భా
సుర సీధుద్రవ గంధిలమ్ము, శఫరీ శోభా కరోద్వేల్ల నం
బర నిందోదర తల్ప నిర్వృత రథాంగాకీర్ణమున్ స్వామి పు
ష్కరిణీ రత్నము భృంగ మల్ల కృత షడ్జస్వాన సౌగంధ్యమున్. 344

క. ఆ సరసికి నిడు గన్నుల
మోసల, పరభక్తి దొలుక, ముకుళించెఁ గరం
బా సకల పులకితాంగుఁడు
భాసురమతి శంఖణుండు వనితామణితోన్. 345

గీ. ఇట్లుఁ బ్రణమిల్లి కుటినొండు నిరవుకొల్పి
తత్పరుండు వాల్మీకి భూధరమునందు
నలుని దమయంతి వోని యన్నెలఁత దనకు
వినయ వివిధోపచారంబులను ఘటింప. 346

క. వ్రతియై, నియమిత సాత్త్విక
మతియై, ముని నికరపాద మంగళసేవా
ధృతియై, వైష్ణవ నిగమా
కృతియై, యాశంఖణుండు కేశవు గొలిచెన్. 347

సీ. ఉత్సుకుండయి, తాన మొనరించు ముప్పూట
స్వామి పుష్కరిణి నిచ్చలపు భక్తి
జపియించు, పులకితాఽచలగాత్రయష్టి, య
ష్టాక్షరీమంత్రమ్ము ననుపమమ్ము
చరణ సూచ్యతుల సుందరకర శ్రీనివా
సుని రూపునెడఁదలో జొనుపరక్తి
నహముల నియమితాహారిమై, రేలపా
నీయ మాత్రం బొచు నిట్టుగడపు
గీ. పరిసరంబులనున్న తాపసులఁ గొలిచి
యాదరంబున హరికథ లాలపించు
నముచి దమనయలీయు గారం బొనర్చు
చంద్రవంశ కలాపంబు, శంఖణుండు. 348

సీ. జపమొనర్చెడు వేళ సరసిజాక్షుఁడు, నవ్వు
జిలికి, బొమ్మలమధ్య నిలచినట్లు
తానమాడెడు వేళ, తరుణేందుధరుదైవ
మార్ద్రి హృద్భృంగమై యాడినట్లు
విశ్రమించిన వేళ, విధుగిరాంభూమి, కం
ఠమునంటి, చదురులు నడపినట్లు
నిదురించు వేళ, సన్నిహితుడై, శౌరి, నా
సాగ్ర మందాస్థానమైన యట్లు
గీ. గానమొనరించు వేళ శ్రీకాంతుమూర్తి
మూర్ధశతపత్రమున నిల్చి, ముసరుకొన్న
ప్రేమలై, పల్కరించిన విధములైన
సారెఁ జెమరించు, నృపమౌళి శంఖణుండు. 348

క, ఈ కరణి, దైవచింతా
శ్రీకత, పెఱదుఃఖములను జింతింపని హృ
త్పాకైక ఖనికి, నృపునకు
సాకల్యముగాఁగ, మాస షట్కము గడచెన్. 350

క. ఒకనాఁడు హృదయమైకాం
తికమగు శాంతిన్, నివాత దీపము వోలెన్
వికసిత తామరసేక్షణు
ప్రకృష్ట పదయుగములంటి వర్తించునెడన్. 351

ఆ. శతసహస్ర సూర్య సంకాశకాంతుల
మానితంబు, నవ విమాన మొకటి
సర్వశోభమైన స్వామి పుష్కరిణి మ
ధ్యమున నుండి లేచె ననఘమూర్తి. 352

గీ. అవ్విధంపు విమానంబునందు, నైగ
మాబ్జ సౌగంధ్యములు, చూపులైనవాఁడు
అన్ని పొడవులకునుఁ బొడవైనవాఁడు
వరదహస్తుండు వేంకటేశ్వరుఁడు దోచె, 353

సీ. సకిలా మరేభ్యవీషా భృంగ సంగి, భ
క్త ప్రాణపదయుగమ్మువాఁడు
పద్మా కుచస్థలీ భాస్వర దీపాయి
త నఖాగ్రరోచిరుత్సవము వాఁడు
వైజయంతీదామ వాసిత దిగిభకుం
డాయత బాహుదండముల వాఁడు
సూర్యచంద్ర సదృక్షణోశుభ్యమాన వ
జ్రకలాప మకర కర్ణికలవాఁడు

ఆ. శంఖచక్రధారి, సదయవీక్షణ పరి
ప్లావితాశుఁడా సురావళీ ని
బర్హణుండు, శ్రీనివాసుండు, లోకపు
ణ్యములు, మూర్తమైన యట్లు దోచె. 354

గీ. అట్లు దోచిన వేదమయాత్మ జూచి
యతివతోఁ గూడ నేల సాష్టాంగ పడుచు
తద్దయాచాంత విమల చిత్తమ్ము తోడ
శంసన మొనర్చె, నీరీతి శంఖుండు. 355

సీ. జననంబు, రూపంబు, సదసత్క్రియలు లేక
యెక్కటియై యుండు యీశుఁడెవఁడొ
జగముల గలిగించి నెగడించి సమయించు
కొఱకు, ముత్తెరువులఁ దిరుగు నెవఁడొ
సతతమ్మనంతమ్ము శక్తి, కన్నన్నల
మెలఁగ వేడ్కలు సేయు నలఘుడెవఁడొ
యెవ్వానికేనియు నిట్టట్టనఁగరాని
వింత తలంపుల వెలయు నెవఁడొ

ఆ. యా పరాత్పరునకు, నవిదిత మూర్తికి
నార్త భక్త సంచయాపనమున
కవయవములు దాల్చినట్టి నిత్యానంద
మునకు నేటికోట్ల ముక్తినిధికి. 356

సీ. వాఙ్మానసముల నెవ్వని పోక దెలియఁగా
నేరక, సనకాది నిభృతమతులు
పరపద్యుదాసంబు వలన నేర్తురు, జగ
ద్భుజనీయుఁడైన పితామహుండు
కమల నాళంబునఁ గడగానలేక, మో
ఘీభూతుఁడై, దన క్రించుదనము
దలఁచి, భావంబునఁ దలఁచి పాదయుగమ్ము
నణుమాత్ర మెఱిఁగె నెవ్వని తెఱంగు

గీ. నట్టి సత్త్వైకరూపి, కనన్య భక్తి
మాత్ర సంవేద్యునకు, నిరామయ శుచిత్వ
గాత్రునకు, లచ్చికినిఁ గూడఁ గానబడని
తత్వమున వెల్గునట్టి బోద్ధను నుతించు. 357

సీ. ముక్తసంగుల వెంటఁ బోవునా ! యఖిల సం
గులు, భక్తజనులతోఁ గలిసి తిరుగు
వ్రతములఁ జిక్కునా ! బహుశాఖులైన యా
భీర పుళిందుల వెంటనంటు
తపముల దొఱకునా ! తపసులంతఃకర
ణములు కూర్చియును గానంగ లేరు
తన వెంటనున్న వారిని బ్రోచునా ! దూర
దూరంబు లందున్న వారి వెదకు

గీ. నప్రధృష్య ప్రభావున, కఖిలవేది,
కాత్మ గుహునకు, ప్రేమ భక్త్య ధ్వనీన
సాధ్యరాహస్యునకు, జగచ్చక్షువునకు
కాంతికవచితునకు నమస్కార శతకము. 358

సీ. ధర్మాఽభిమానంబు, కర్మసంగతియును
వదలి, మోక్షాసక్తి మదిని దొలఁచి
సర్వవేళల, నామ సంస్మరణమ్ము నే
కైక సాధనముగా నధివసించి
శరణాగతిని బొంది, చవులెంచి, శ్రీమతే
నారాయణాయ యథా మంత్రమూర్తి
నధ్యవసించి, భూతాత్మకంబీ ప్రపం
చము, శేష భూతమన్ సరణి దెలిసి

గీ. సర్వభూత హితుండుగా సంచరించి
కడకు, లక్ష్మి జగన్మాతృ కరుణఁ జేసి
భక్తుఁ డెవ్వని పాద సౌభాగ్యసదము
నర్థుఁడై చెందు, నామూర్తి కంజలింతు. 359

చ. వరదాకరాఽతిరమ్య! భవ కారణ వారణ బాహుదండ! భా
సుర మణికాంతి చంద్రకిత సుందరవక్ష! వళక్షనేత్ర ని
ర్భర కరుణాకటాక్ష! సురవందిత నైగమపాద! చేతనా
నిరత విలాస వార్ధుషిక! వేంగడకా! శరణంబు వేడెదన్. 360

ఉ. కాననివాని నూతగొని కానని వాఁడు చరించు భంగి, నా
నానియమంబు లంటి భువనస్తుత! నిన్నెరుగంగఁబూనితిన్
వాని దొలంగి నీ చరణ భక్తిని బట్టిన నాఁడు, మౌని హృ
త్ప్రీణిత! నీవు చిక్కితిని, వేంగడకా! శరణంబు వేడెదన్. 361

ఉ. స్వామి! భవత్పదాబ్జముల సంగతిఁ బాయక, ప్రేమభక్తి వీ
క్షా మధురంబుగా, నుపనిషన్మయ మౌ, శతకోటి మన్మథ
శ్రీ మహితంబు గాత్రము నిరీక్షణ సేయుచు, మాల్యసేవలో
వేమఱు సొక్కనిమ్ము, తిరువేంగడనా! శరణంబు వేడెదన్. 362

ఉ. ఎన్ని భవంబు లీ సుఖము, లీ తరుణీసుతరూప సంసృతిన్
కన్నులు గప్పినావొ! త్రిజగద్గృహకేతన పాద! నేఁడు, లో
గన్నులు విచ్చికొన్నవి, ప్రకామము నీ దయచేత, దిద్దుకో
విన్నను వొప్పనన్ను, తిరువేంగడకా! శరణంబు వేడెదన్. 363

క. ఎక్కడి కాంభోజంబులు!
యెక్కడి తిరువేంకటాద్రి! యిక్కడ నాకున్
దక్కితివి నీవు, పున్నెము
ముక్కారున్ బండి, నిగమ మూల గుణనిధీ! 364

వ. స్వామీ! యనవరత భోగాఽఽభోగాఽనుభవిక స్వైర దివారాత్రంబగు కాంభోజాధిపత్యంబు నాకు వలవదు; భవత్కరుణా పూరవారి ధారా తరంగితంబగు స్వామి పుష్కరిణి నొక్క మండూక జన్మంబు గృప సేయుము; పచేళిమ హృదయ సత్కవి రచనాపాకలీలాపహ సుర విలాసినీ మేఖలా రణరణిత దిగంతంబులగు నాక భూసౌఖ్యంబులు వరాటకంబులు. సతత పరిస్రవన్మధు భరిత పరీవాహ విటపి వాటికా విలసితంబులగు భవత్తీర్థంబులనొక్క మీనుపుట్టువు నొసంగుము; గగన గంగా శీతల శీకరాసారా సేచిత జటాపల్లవ పరిణాహుండగు శంకరుండును, తక్కు బ్రహ్మాదులును, భవద్దర్శనోత్సవంబున కహమిహ మికాయత్తులై, పరస్పర విజిగీషా మనీషన్ ద్రొక్కుడు వడుదురటె!

అట్టి నీ వైకుంఠ ద్వారంబున నిలిచి, భవదీయ తాంబూల కరండంబు మోయు భాగ్యంబనుగ్రహింపుము. ఇంద్రనీలాచలోదంచిత చంద్రికా పర భాగహాసాంకూరవితథీకృత, క్షీరోదన్వదభంగ భంగ వళక్షవర్ణ! కర్ణాంతాయతంబులగు లోచనలబులఁ గృపాదృష్టి సారించి, నన్ను, మాసర మధుకర మధుర మంగళగాన మందిరంబులగు నీ యారామంబుల, నీకుఁ దోమాల సేవ యొనర్చు చంపకంబుగఁ బుట్టింపుము. నీ కొండలో నొక్క శుష్క కాష్ఠ జన్మంబిమ్ము. మిన్ను నడుము, నన్నున నవ్వులు, ప్రేమానుబంధంబుల పట్టువిడుపులున్గల బిబ్బోకవతీ ప్రచుర మన్మథంబులగు సంగడంబుల దూరంబొనర్చి, శేషశైలంబున సతతంబు భవదీయ యశోగానంబొనర్చు నొక కాల్వగా నొనర్పుము. త్వద్దాస దాసానుదాస పదధూళీ పవిత్రితాంగంబుల, భవద్గర్భగృహ ద్వారంబున దేహళిగ జన్మింపఁ జేసి, నిరంతరంబుపహిత ముక్తాఫలంబగు ప్రవాళంబునోఁని, త్వద్విస్మేర వికసితాఽధరంబు దర్శించు, కైవల్యానందంబునకుఁ బాత్రునిగ నొనర్పుము. అది యిది యననేల? శేష శైలంబున నేదేని జన్మంబిమ్ము. సత్యకామ! సత్యసంకల్ప! సర్వాతిశాయీ! అస్మత్స్వామీ! నమస్తే! నమస్తే! నమః! 365

మ. అని ప్రార్థించిన శంఖున్నని దృగంతాలీన కారుణ్యుఁడై
వనజాక్షుఁడు వల్కె, తీరినవి తీవ్రంబైన ప్రాగ్జన్మ సం
జనితాఽఘంబులు, మేలువచ్చునిక వత్సా! సద్గురుండౌచు, నా
శని గల్పించెను నీకు, మామకము సాక్షాత్కార సౌభాగ్యమున్. 366

ఆ. అఖిలమైన యెఱుక కధిపతి, యోగ వి
ద్యా రహస్యవేది, యర్కజుండు
వాని చూపువడిన మానవుండధ్యాత్మ
తత్త్వపథమునుండి దలఁగలేడు. 367

గీ. కాఱియలవెట్టి, సుతదార కనకములను
బంధములు కూల్చి, సజ్జన ప్రతతిఁ గూర్చి
భక్తినర్థించి కైవల్య పథము జూపు
నరుణసూనుండు, ధరణి సద్గురుఁడు గాడె! 368

సీ. లేమి నలంగినఁ గామముల్దమయంత
విడిపోవు, గర్వాంధ వికృత మతికిఁ
జక్షువుల్దెఱచు నంజనము దారిద్ర్యమ్ము
శమదమంబులు వాని సరసనుండు
నఖిల భూత హితుండునై, వాసుదేవమ
యంబుగాఁ జూచువాఁడన్ని కడలు
గ్రహసంతతులను నారాయణాంశము లంచుఁ
దలపోయువాఁడు బాధలను గ్రుంగ

గీ. డింక వేబొమ్ము, రాజ్యమ్ము నేలికొనుము
గొన్ని వర్షమ్ము, లాపైని సన్నుతమతి
భార్యతోఁ గూడ నందెదు పరమ పదము
శంఖణాధిప! చంద్రవంశ ప్రదీప! 369

ఆ. పరమ పురుషుఁ డిట్లు బలికి తిరోహితుం
డైన, భూమిజాని యాదిశకును
ప్రమద పులకితుండు, ప్రణమిల్లి, కొన్నివా
సరములందయుండి, శ్రమము దీఱి; 370

సీ. కమలాక్షి వెంటరాఁ గాంభోజమార్గమ్ము
వట్టిపోవుచు, శివవ్రతుల, మునుల
దరిసించి, రమ్యగోదావరీ కూల ప
థమ్ముల నరుగ, వార్తలరుదెంచె
పరనృపాలురు, తమ భాగముల్ గుదురక
కోపించి, తమలోనఁ గ్రుమ్ములాడి
యెల్లలు వదలిపోయిరటంచు, పరమసా
త్వికుడైన యారాజు, దీనినెల్ల

ఆ. హరి కృపావిశేషమని యెంచి, ప్రజల దుః
ఖములు వేగిరింప, గట్టునాక
గహన మనక వచ్చెఁ గడువడి కాంభోజ
ములకు శ్రీశ భజన మోదయుతుఁడు. 371

క. ఆ రాజుఁజూచి, ప్రజలు
తూర్పారంబై సంతసంబు, బొరలాడిరి, త
చ్చారు పదాబ్జములందు, ర
మారమణుని కరుణ కిదియె, మందలయనుచున్ 372

క. ఉల్లాసంబునఁ గన్నులు
పల్లవితముగాఁగ, నృపుఁడు వచ్చె నటంచున్
మొల్లపు గోవులు, పొదుగులు
జల్లించెన్ పాలు, నవ్యచంద్రాతపముల్. 373

ఆ. ఆ శంఖణ రాజేంద్రుఁడు
శ్రీశ పరధ్యానయోగ శిథిలిత మాయా
పాశుండై, కృతకర్మవి
నాశుండై, మోక్ష సౌఖ్యనందితుఁడయ్యెన్. 374

మ. శని బాధా పరిదూనుఁడెవ్వఁ డయినన్ సద్భక్తితో శంఖణా
వని భృచ్చారు చరిత్రమున్ జదివినన్, భాస్వత్తనూజుండు, దా
ననుకంపామతిఁ బ్రోచువారలను నిత్యానంద సంధాయి, మా
వనితామానస పశ్యలోహితుఁడు, నాశ్వాసించు, నత్యంతమున్. 375

మధ్యాక్కర. అనిన సూతుని తోడ, మౌనులనిరి, యిట్లను రాగమొనర
గణుతింపనాడితి నీదు కరుణ, యిక్కరణి వేంచేసి
వినిపించితివ మాకు, విశ్వవినుతహా వెంకటేశ్వరుని
ఘన యశమ్మను, మానవాళి, హృదయ పంకనిరాసకమ్ము. 376

క. వినఁగ వినఁగ జవులూరెడు
వినతాసుతవాహు కథలు, వివరింపుము, మా
ధమనములకుఁ దనివి లేదిం
కను, నీద్రాక్షాగుళుచ్ఛ క్రమ ఫణితులన్. 377

ఉ. ఎన్నఁడు వచ్చునో, మరణ మేక్రియ వచ్చునొ, రేపు చూతమం
చన్నది గాలిమూట, తన యాలియు బంధు సుహృజ్జనంబులా
సన్న ఋణానుబంధములు, చాలిన దెవ్వరి కెవ్వ, రిట్లుగా
మున్న యెఱింగి, మర్త్యుడు విముక్తికి సాధన సేయుటొప్పగున్. 378

చ. ధనములు గూడఁదెచ్చికొని, దారలఁ దన్పి, నయానువర్తనన్
తనయుల నూలు కొల్పి, యదనన్పరమేశుని గొల్తునంచు, జీ
వనమొక యన్యథాత్వమయి, బన్నమునందు నసంవిదుండు, మే
ల్కొను మునుమున్న విజ్ఞుఁడది గానిదిగా మది నిశ్చయింపుచున్. 379

గీ. భిన్న సంస్కారములఁ జేసి, భిన్నమార్గ
ములనుఁ గొలుతురు విధు పదమ్ములను జనులు
ప్రతి పదమ్మున నానంద బహుళమైన
భక్తి యోగమ్ము, సౌలభ్య భద్రపేటి. 380

మ. హరినామ స్మరణం బొనర్చుచుఁ దదాఖ్యానంబులన్ వించు, త
త్పరుఁడై గాన మొనర్చుచున్, సదయ భక్తవ్రాత పన్నీర జ
ర్జరితాభ్యంతర కల్మషుండగుచు, శశ్వత్కీర్తిఁడయునొప్పలి, దు
స్తరమౌ సంసృతి దాటు మానవుఁడు, శ్రద్ధామాత్రపాథేయుఁడై. 381

సీ. మదనారి తలఁపు తామరపైని యెలదేటి
శ్రుతి సతీ హృదయ సమ్మతము ధనము
శ్రీధరాలలిత దక్షిణ నాయకుఁడు, పన్న
గాధీశతలిమ విహారహారి
ముని మనోనిధ్యానమున వెల్గు చిఱుదివ్వె
ముప్పోఁకలనుఁ గన్ను మొఱఁగు పిన్న
భక్తి కల్మాషినాసక్తి నంటిన నంది
నుడులకునెన్న నేర్పడని మూర్తి

గీ. శ్రీనివాసుండు, లలిత శిరీష పేశ
లాంఘ్రులను, హృదయమ్మున నత్తమిల్లు
నప్రయత్నమ్ముగాఁ దదాఖ్యానములను
చవిలి వినుచుండె నేని సతమ్ము నరుఁడు. 382

ఉ. పాశవికమ్ములాశలు భవమ్మున గ్రమ్మి, యవాచ్యపాపము
ల్జేసియు నెవ్వఁడే నరుఁడు సిగ్గునమ్రగ్గి యదీయ నామచిం
తాసమవేతచిత్తుఁడయి, తత్పదమంటునొ! యట్టి శౌరిగా
థాసుధలాను భాగ్యములు, ధన్యులు గందురు పుణ్యభాక్కులై. 383

గీ. అట్టి పున్నెంబునేఁడు మాకిట్టలంబు
గలిగె, నీదయఁజేసి, విజ్ఞానధామ
ధామములు, ఓ సదుక్తులఁదనువు, మనువు
నర్థవంతము జేయవయ్యా! మనస్వి! 384

వ. అని వినయంబున బ్రార్థించిన సత్ర యాగదీక్షితులైన వీక్షామాత్ర పునీత
లోకులగు మహామునుల న్జూచి, 'మహాప్రసాదం' బని శిరంబు వంచి,
సాత్యవతేయ కరుణానివేశుండును, నిరంతర నారాయణ చరణ
స్మరణాఽమృత పానవిధూతవివిధక్లేశుండును, భక్తియోగ భాసుండును,
సంచిత పరమార్థ తత్త్వ జాతుండగు సూతుండు పరమ పురుష నను
రాగంబునంబోలె రక్తంబైన యధర మధు పేటిక,కైతక శిఖాలీలాయి
తంబగు నలతి నగవు దులకింప, పరమ సంతుష్టుండై - 385

మ. పరమప్రాప్య పదాబ్జ! సక్తజన పాపగ్రంథి నిర్మోచనా
దర! కారుణ్యరసస్రుతి స్నపిత గాథాగూఢ తత్త్వజ్ఞ శం
కర జూటాగ్ర విభాసి సజ్జలజ! లంకానాథ సంపత్సతీ
దరహాసేందు మయూఖ కర్షి బలవద్రాహూయ మాంగోదయా! 386

క. నీ పదనిర్ణేజన జల
మై పోవును గాక బ్రదు, కహస్కరవంశ
శ్రీపుణ్య పరీపాక
ప్రాపితజని! జానకీశ! రామనృపాలా! 387

మాలిని. సరసగుణ విహారా! సక్త దుష్కృత్య చోరా!
ధరణిధర గభీరా! ధర్మ మాత్రైక వీరా!
సరసిజ భవముఖ్య స్వర్గి సంసేవ్యసారా!
ధరణిధర కుమారీధ్యాన చాంద్రీచకోరా! 388

ఇది
శ్రీ పరమ భాగవత పాదరజ పుంజ విమలీకృత మనోదర్పణ,
పితృభూత శ్రీనివాస హృదయ తర్పణ, లక్ష్మీదేవీ గర్భ
శుక్తి ముక్తాఫల, నిరంతర నిరంతరా యాష్టాక్షరీ
మంత్ర మనన స్నాత గంగాజల, భక్తి
రసైక జీవన, శఠమర్షణ గోత్ర
పావన, నారాయణ దాస
ప్రణీతంబైన శ్రీనివాస
ప్రబంధంబున
తృతీయాశ్వాసము
సంపూర్ణము.